

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 306

శనివారం 27-1-2018

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | WARANGAL | KHAMMAM | MAHABOOBNAGAR | KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



ఫైనల్లో ఫెడరర్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఏడోసారి టైటిల్ పోరుకు చేరిన స్విస్ స్టార్ –స్పోర్ట్స్‌లో



మూడో టెస్టు భారత్ వైపే...

దక్షిణాఫ్రికా విజయ లక్ష్యం 241. ప్రస్తుతం 17/1 –స్పోర్ట్స్‌లో



శుక్రవారం ఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద 69వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో టీ-90 యుద్ధ ట్యాంకులు, బ్రహ్మోస్ క్షిపణుల ప్రదర్శన



వేడుకలు ముగిశాక ప్రజలకు ప్రధాని మోదీ అభివాదం



పరేడ్‌లో తొలిసారిగా బీఎస్ఎఫ్ మహిళా బృందం 'సీమా భవానీ' మోటారు సైకిళ్లపై విన్యాసం

బెగ్గింగ్ మాఫియా@100 కోట్లు

రాష్ట్ర రాజధానిలో విజృంభణ

- ఏటా రూ.100 కోట్ల నుంచి 120 కోట్ల వరకు 'వసూళ్లు'
- హైదరాబాద్‌లో 14 వేల మందికిపైగా యాచకులు..
- వారిలో నిజమైనవారు నాలుగైదు వందల మందే
- మిగతావారంతా యాచక 'కూలీ'లే
- అప్పులిచ్చి తీర్చేందుకు భిక్షాటనలోకి దింపుతున్న మాఫియా
- రోజూ వసూళ్ల టార్గెట్లు.. రాకపోతే దాడులు
- అధిక 'రాబడి' కోసం రెండేళ్లలోపు చిన్నారుల వినియోగం
- నకిలీ బెగ్గర్లతో 'సుపారీ' దాడులు, సెటిల్‌మెంట్లు కూడా..
- 'ఫెడరేషన్ ఆఫ్ బెగ్గర్‌ఫ్రీ సొసైటీ' సర్వేలో సంచలన అంశాలు

బాబ్బాబ్బాబు..
చేతులు చాస్తూ ఓ ముదుసలి!
అమ్మా.. అయ్యా.. ఒక్క రూపాయి..
చుట్టూరా తిరుగుతూ ఓ కుర్రాడు..!
చంటిదానికి తిండి లేదయ్యా..
చంకన పిల్లతో దీనంగా ఓ మహిళ!!

..భాగ్యనగరంలో ఏ కూడలి వద్ద చూసినా ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణం. కానీ ఇలా అడుక్కునే వారిలో చాలామంది 'నకిలీ'లే అన్న సంగతి మీకు తెలుసా? వీరిని ముందుంచి 'బిచ్చం' పేరుతో బిజినెస్ చేస్తున్న మాఫియా గురించి విన్నారా? ఈ బెగ్గింగ్ మాఫియా టర్నోవర్ ఏటా ఏకంగా రూ.100 కోట్లపైనే ఉందంటే నమ్ముతారా? నమ్మలేని ఈ వాస్తవాలే కాదు.. వీరిలో కాస్త ఒడ్డూపొడుగు ఉన్న యువకులను సెటిల్‌మెంట్లు, దందాలకు వాడుకుంటున్న ఫైనాన్షియర్ల ఆగడాలు సైతం వెలుగులోకి వచ్చాయి. బెగ్గర్స్ ఫ్రీ ఫెడరేషన్ సర్వే ఈ సంచలన అంశాలను వెల్లడించింది. చివరికి బిచ్చమెత్తుకునే మహిళల చేతుల్లో కనిపిస్తున్న పసిపాపలు కూడా వారి పిల్లలు కాదని తేలింది. అందుకు సాక్ష్యమే ఇదిగో ఈ పక్క చిత్రం. ఈ మహిళ ఒడిలో కనిపిస్తున్న చిన్నారితో ఈమెకు ఎలాంటి సంబంధం లేదు. 'ఈ చిన్నారి మీ పాపేనా? ఏం పేరు? ఎందుకు పడుకుంది' అని సాక్షి ఆమెను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పింది. పాప వయసు వాస్తవానికి రెండేళ్లయితే మూడేళ్లని ఓసారి, నాలుగేళ్లని ఓసారి చెప్పుకొచ్చింది. చివరికి చిన్నారి తమ పాప కాదని, ఉదయం 7 గంటలకు బెగ్గర్ లీడర్ పాపను తెచ్చిస్తాడని, సాయంత్రం 4 గంటలకు మళ్లీ తీసు కెళ్తాడని చెప్పింది. పాప నిద్రమత్తులోనే ఉండేందుకు చిన్న డ్రాప్స్ బాటిల్ ఇస్తారని, ఆ మందు చుక్కలు గంట కోసారి ఇస్తే ఆకలి లేకుండా పడుకుంటుందని తెలిపింది. - వివరాలు 2లో



బెగ్గింగ్ మాఫియా టార్గెట్!
(రోజుకు..)

ప్యాట్నీ, ప్యారడైజ్	జేబీఎస్, ఎంజీబీఎస్
24 మంది	42 మంది
రూ. 15 వేలు	రూ. 32 వేలు

పంజాగుట్ట, అమీర్‌పేట్: 52 మంది — రూ. 48,000

చార్మినార్ : 60 మంది — రూ. 58,000

నాంపల్లి, సికింద్రాబాద్ స్టేషన్లు: 60 మంది — రూ. 60,000

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, థియేటర్లు	22 మంది	14 వేలు
ఖైరతాబాద్, కంట్రోల్ రూమ్	26 మంది	16 వేలు
బాలానగర్, జేఎన్టీయూ	30 మంది	20 వేలు
మెహిదీపట్నం, అబిడ్స్	25 మంది	12 వేలు
ఇతర కూడళ్లు	50 మంది	45 వేలు

'నీట్'లో ఒకటే సెట్!

సుప్రీంకోర్టుకు తెలిపిన సీబీఎస్ఈ

- వివరాలు 5లో



శుక్రవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ నరసింహన్

ప్రజల ఆశలకన్నా మిన్నగా తెలంగాణ పురోగతి

గణతంత్ర వేడుకల ప్రసంగంలో గవర్నర్

- త్వరలోనే బంగారు తెలంగాణ సాకారం
- 2018–19 నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా వేడుకలు - వివరాలు 2లో

'గుడుంబా' సొమ్ము గుటుక్కు

- పునరావాస పథకంలో అధికారుల చేతివాటం
- లబ్ధిదారులకు అందాల్సిన సొమ్ము పక్కదారి
- రూ.2 లక్షల్లో అందుతోంది సగమే..
- ఇదేంటని అడిగితే 'జాబితా నుంచి తొలగిస్తాం' అంటూ బెదిరింపులు.. 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు



- వివరాలు 12లో

అందని 'పద్మ'ం.. కనిపించని శకటం!

గణతంత్ర వేడుకల్లో రాష్ట్రానికి నిరాశ

సాక్షి, హైదరాబాద్

ఈసారి గణతంత్ర వేడుకలు తెలంగాణకు నిరాశనే మిగిల్చాయి. కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో రాష్ట్రానికి ఆశాభంగం కలగగా.. ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల ప్రదర్శనలో రాష్ట్ర శకటానికి అవకాశం లభించలేదు.

అవార్డుల్లో నిరాశ

వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పద్మ అవార్డుల కోసం ఈసారి రాష్ట్ర ప్రభుత్వం 24 మందితో కూడిన జాబితాను పంపింది. అయితే కేంద్రం ఈసారి పద్మ అవార్డుల నామినేషన్ల విధానంలో పలు మార్పులు చేసింది. అర్హులైన వారు సొంతంగా కూడా నామినేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దీంతో రాష్ట్రం నుంచి మరో 15 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. మొత్తంగా రాష్ట్రం నుంచి 39 ప్రతిపాదనలు వెళ్లినా.. ఒక్కరికి కూడా అవార్డు లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారి. రాష్ట్రం నుంచి 2015లో ముగ్గురికి, 2016లో ఆరుగురికి, 2017లో ఆరుగురికి పద్మ పురస్కారాలు దక్కాయి. ఇక ఈసారి 85 మందికి పద్మ



అవార్డులు ఇచ్చినా.. రాష్ట్రం నుంచి ఒక్కరికీ చోటు లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసినవారిలో చాలా మంది ప్రముఖులు ఉన్నారు. ప్రభుత్వం మాజీ ప్రధాని పీవీ నరసింహారావును దేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డుకు సిఫారసు చేసింది. తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్, ఆర్థికవేత్త చెన్నమనేని హనుమంతరావు, నవలా రచయిత, కవి శివ కె.కుమార్‌ల పేర్లను పద్మ విభూషణ్‌కు నామినేట్ చేసింది. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధును పద్మభూషణ్‌కు, గాయకులు గోరటి వెంకన్న, అందెశ్రీ, విద్యావేత్త చుక్కా రామయ్య, సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజలతో పాటు మరికొందరి పేర్లను పద్మశ్రీ పురస్కారాలకు పంపించింది.

వేడుకల్లోనూ ఆశాభంగమే..

రిపబ్లిక్‌డే పరేడ్‌లో ప్రదర్శించే శకటాల్లోనూ తెలంగాణకు ప్రాతినిధ్యం లభించలేదు. ఆసియాలోనే పెద్దదిగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ గిరిజన జాతర ఇతివృత్తంతో శకటపు నమూనాను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కేంద్రానికి పంపింది. కానీ ఎంపిక కమిటీ రెండో దశలోనే దీనిని తిరస్కరించింది. గతేడాది బతుకమ్మ శకటం నాలుగో దశలో అర్హత కోల్పోయి.. ప్రదర్శనకు నోచుకోలేదు. అంతకు ముందు 2016లో రాష్ట్రానికి చెందిన బోనాల శకటానికి పరేడ్‌లో అవకాశం దక్కింది.



ఓ మాట నాతో చెపితే బావుండేది కదా బావ!
నేను హాజరయ్యేవాడిని!!

ఘనంగా గణతంత్రం

ప్రగతి భవన్‌లో జెండా ఎగురవేసిన సీఎం కేసీఆర్ ● పరేడ్ గ్రౌండ్స్‌లో అమర జవాన్ల స్తూపానికి నివాళులు ● గురుకులాల సొసైటీ విద్యార్థులకు అవార్డు



శుక్రవారం ప్రగతిభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర వేడుకలు పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగాయి. సీఎం కె.చంద్రశేఖర రావు ప్రగతిభవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుని అమర జవాన్ల స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. అక్కడి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. తర్వాత గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు స్వాగతం పలికారు. ముందుగా ఎవరికి కేటాయించిన స్థానాల్లో వారు కూర్చున్నారు. సీఎం కొందరిని పిలిపించి తన పక్కన కూర్చోవాలని సూచించారు. శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, స్పీకర్ మధుసూదనాచారి, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీలు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, సలహాదారు వివేక్‌ను పిలిపించారు. ఎమ్మెల్యే కొండా సురేఖ తన మనవరాలిని సీఎం వద్దకు తీసుకురాగా, త్రివర్ణాలతో కూడిన చీరను ధరించిన ఆ చిన్నారిని ఆయన ఒడిలో కూర్చోబెట్టుకున్నారు. వేడుకల్లో ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సైనిక దళాల కవాతు అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమం చివరలో అగ్నిమాపకశాఖ మూడు రంగుల బెలూన్లను గాల్లోకి ఎగరేయడం ఆకర్షించింది.

అధికారులకు అవార్డులు..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అధికారులకు అవార్డులను గవర్నర్ నరసింహన్ ప్రదానం చేశారు. అనితా రామచంద్రన్ (ఐఏఎస్), శశాంక్ (ఐఏఎస్), రాజేశ్‌కుమార్ (ఐపీఎస్), స్వాతి లక్రా (ఐపీఎస్), ఆర్.శోభ (ఐఎఫ్ఎస్), స్వర్గం శ్రీనివాస్ (ఐఎఫ్ఎస్) అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ పూర్వాపరాలను సేకరించి పుస్తకం రూపొందించడంలో కృషిచేసిన నుపూర్ కుమార్, డి.రవీందర్‌రెడ్డి (ఫొటోగ్రాఫర్)లకు ప్రత్యేక అవార్డులిచ్చారు. టీఎస్–ఐపాస్ అమలులో సమర్థంగా పనిచేసిన 8 మంది అధికారులను ప్రభుత్వం టీఎస్ఐపాస్ అవార్డులకు ఎంపిక చేసింది. ఎ.గోపాల్‌రావు (టీఎస్ ఎస్పీడీసీఎల్–సీఎండీ), ఎ.జి.రమణప్రసాద్ (సీఈఐజీ), జి.రఘుమారెడ్డి(టీఎస్ఎస్పీడీసీఎల్–సీఎండీ), చంద్రమోహన్ (ఫ్యాక్టరీస్ డైరెక్టర్), సత్య నారాయణరెడ్డి(పీసీబీ–ఎంఎస్), సంగ సురేశ్ (పరిశ్రమలు–జేడీ), కె.చంద్రశేఖర్‌బాబు (పరిశ్రమలు–ఏడీ)లు అవార్డులు అందుకున్నారు.

కాంటింజెంట్ అవార్డులు..

గణతంత్ర వేడుకల్లో సైనిక, పోలీసు, ఎన్‌సీసీ బృందాలు నిర్వహించిన పరేడ్ ఆకట్టుకుంది. ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన బృందాలు గవర్నర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నాయి. 4 జాక్ లీ (47 బ్రిగేడ్) తరపున వినీత్ బోరా ప్రథమ బహుమతి అందుకున్నారు. 16 డోగ్రా రెజిమెంట్ (76 బ్రిగేడ్) రెండో బహుమతికి ఎంపికైంది. జూనియర్ల విభాగంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యా సంస్థ విద్యార్థుల బృందం మొదటి బహుమతి పొందింది. ఎన్‌సీసీ బాలికల బృందం ద్వితీయ బహుమతికి ఎంపికైంది. ఈ బృందం తరపున అవార్డును పీవీ కుమారీ అందుకున్నారు. మహారాష్ట్ర రిజర్వ్ పోలీసుల కవాతు బృందం ప్రత్యేక అవార్డుకు ఎంపికైంది.



పరేడ్ గ్రౌండ్స్‌లో అమరుల స్తూపం వద్ద సీఎం

ప్రజల ఆశలకన్నా మిన్నగా పురోగతి

త్వరలోనే బంగారు తెలంగాణ సాకారం ● గణతంత్ర వేడుకల ప్రసంగంలో గవర్నర్ నరసింహన్

సాక్షి, హైదరాబాద్

అన్ని వర్గాల ప్రజల ఆశలను నెరవేరుస్తూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందని గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా మానవీయ విలువలతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్ శుక్రవారం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ''ఎందరివో ఆశయాలు, ఆకాంక్షల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. మూడున్నరేళ్ల కిందట ఇదే వేదిక నుంచి గణతంత్ర దినోత్సవ సందేశం ఇచ్చాను. ప్రగతి పయనంలో తెలంగాణ రాష్ట్రం సవాళ్లను, అడ్డంకులను అధిగమిస్తుందని చెప్పాను. ఇప్పుడు సంతోషంగా, గర్వంగా ప్రకటిస్తున్నాను. ప్రజలు ఆశించినదానికంటే మిన్నగా తెలంగాణ రాష్ట్రం పురోగతి సాధించింది. మనం గమ్యంగా భావిస్తున్న బంగారు తెలంగాణ సాధన త్వరలోనే సాకారమవుతుంది'' అని నరసింహన్ తెలిపారు. ప్రజల సంక్షేమం విషయంలో రాజీలేని విధంగా తన ప్రభుత్వం వ్యవహరిస్తోందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి కోసం బృహత్తరమైన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రభుత్వం ఏటా రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తిలో అనూహ్య పురోగతి...

కరెంటు సరఫరా విషయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని గవర్నర్ నరసింహన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 6,574 మెగా వాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 14,845 మెగావాట్లకు చేరిందని, 28 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. ''నా ప్రభుత్వ సరైన విధానం, వ్యూహం, ఉద్యోగుల అంకితభావమైన విధి నిర్వహణతో రాష్ట్రం ఏర్పడిన ఆరు నెలల్లోనే కరెంటు కోతలు లేకుండా చేశాం. 2018 జనవరి ఒకటి నుంచి నాణ్యమైన కరెంటును వ్యవసాయానికి ఉచితంగా నిరంతరం సరఫరా చేస్తున్నామని గర్వంగా చెబుతున్నాం.'' అని గవర్నర్ చెప్పారు.



గణతంత్ర వేడుకల వేదికపై సీఎం కేసీఆర్, పక్కన ఎంపీ జితేందర్‌రెడ్డి, స్పీకర్ మధుసూదనాచారి, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, హోం మంత్రి నాయిని, వివేక్, మండలి చైర్మన్ స్వామిగౌడ్

బీసీలకు తోడ్పాటు...

మానవ వనరులను పూర్తిస్థాయిలో, సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, రూ.5వేల కోట్లతో 75% సబ్సిడీపై యాదవ, కురుమలకు మేకలు, గొర్రెల పంపిణీ చేయాలని నిర్ణయించామని గవర్నర్ తెలిపారు. 1.50 కోట్ల గొర్రెలను 7.61 లక్షల మంది యాదవ, కుర్మలకు పంపిణీ చేయనున్నామని, ఇప్పటికే 40 లక్షల గొర్రెలను పంపిణీ చేశామన్నారు. మత్స్య కారులు, చేనేత కార్మికులు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, గీత కార్మికులు, విశ్వబ్రాహ్మణుల కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

కేజీ టు పీజీకి అడుగులు

కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించే దిశగా ఇప్పటికే అడుగులు పడ్డాయని గవర్నర్ నరసింహన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి 542 రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభమయ్యాయన్నారు. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా కొత్త జిల్లాలు, మండలాలు, పోలీస్ స్టేషన్ల ఏర్పాటు చేసిన ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా గిరిజన తండాల మార్పిడికి చర్యలు తీసుకుంటోందని గవర్నర్ వివరించారు. ప్రభుత్వ ప్రణాళికతో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పన పెరిగిందని, టీఎస్ ఐపాస్‌తో ఇప్పటికే 6,070 పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులు వచ్చాయని, కొత్త పరిశ్రమలతో ఇప్పటికే 1.18 లక్షల కోట్ల పెట్టుబడులు, రెండు లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ వేడుకల్లో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, సంప్రదాయ వృత్తులను లాభసాటిగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని, సాగును లాభసాటిగా మార్చేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టిందని

లాభసాటి వ్యవసాయానికి చర్యలు..

గవర్నర్ నరసింహన్ తెలిపారు. 2018–19 నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని చెప్పారు. రైతులకు పెట్టుబడి ఖర్చుల కోసం రెండు సీజన్లలో కలిపి ఎకరానికి రూ. 8 వేల చొప్పున ఇవ్వనున్నామన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని, సాగునీటిశాఖకు ప్రతి ఏటా రూ. 25 వేల కోట్లను కేటాయిస్తోందని గవర్నర్ తెలిపారు. అసలైన భూ యజమానులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టింది. మొదటి దశ కింది గ్రామీణ ప్రాంతాల్లోని భూరికార్డుల ప్రక్షాళన పూర్తయ్యిందన్నారు.



శుక్రవారం పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న గవర్నర్ నరసింహన్

బెగ్గింగ్ మాఫియా @ 100 కోట్లు

రాష్ట్ర రాజధానిలో ఏటా రూ.100 కోట్ల నుంచి రూ..120 కోట్ల వరకు 'వసూళ్లు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బెగ్గింగ్ మాఫియా విజృంభిస్తోంది. అవసరాల్లో ఉన్నవారిని, ఆపదల్లో ఉన్నవారిని పట్టుకొచ్చి యాచక 'కూలీ'లుగా మార్చుతోంది. కొంత సొమ్ము అప్పుగా ఇచ్చి.. తీర్చేందుకు భిక్షాటన చేయిస్తోంది. రోజూ ఇంత 'వసూలు' చేయాలంటూ టార్గెట్లు పెడుతూ.. వచ్చిన దాంట్లో ఎంతో కొంత చేతిలో పెడుతోంది. టార్గెట్ మేరకు డబ్బులు తేకపోతే తిట్టి, కొట్టి హింసిస్తోంది. హైదరాబాద్‌లో సుమారు 14 వేల మంది యాచకులు ఉన్నారని.. అందులో 90 శాతం ఇలాంటి నకిలీ బెగ్గర్లేనని 'ఫెడరేషన్ ఆఫ్ ఎన్జీవోస్ ఫర్ బెగ్గర్‌ఫ్రీ సొసైటీ'సర్వేలో వెల్లడైంది. ఏ దిక్కూ లేకనో, కుటుంబాన్ని పోషించుకునేందుకో అడుక్కునేవారు నాలుగైదు వందల మందే ఉంటారని గుర్తించింది. ఇక యాచకులుగా 'పని'చేస్తున్నవారిని బెగ్గింగ్ మాఫియా అసాంఘిక కార్యకలాపాలకూ వినియోగిస్తోందని... 'సుపారీ' దాడుల దగ్గరి నుంచి గంజాయి, డ్రగ్స్ విక్రయించడం దాకా చాలా పనులకు వినియోగిస్తోందని తేలింది.

14 వేల మందికిపైనే..

హైదరాబాద్‌లోని కూడళ్లు, పార్కులు, థియేటర్లు, దుకాణాల సముదాయాలు ఇలా ఎక్కడ చూసినా యాచకులు కనిపిస్తుంటారు. ఇలాంటివారి సంఖ్య 14 వేలకుపైనే. కానీ ఇందులో నిజమైన యాచకులు నాలుగైదు వందల మంది మాత్రమే. మిగతా వారంతా బెగ్గింగ్ మాఫియాలో 'రోజు కూలీలు'. బెగ్గింగ్ ముఠాను నిర్వహించేవారి దగ్గర వీరంతా 'పని'చేస్తారు. వారికి అప్పగించిన ప్రాంతాన్ని బట్టి రోజూ రూ. 400 నుంచి రూ.600 వరకు 'వసూలు'చేస్తారు. ముఠా లీడర్లు ఆ సొమ్మును తీసుకుని.. రోజూ రూ.100 నుంచి రూ.200 వరకు యాచకులకు ఇస్తారు. ఈ 'వసూళ్ల'టార్గెట్లు, 'కూలీ'మొత్తం కూడా ఒక్కో కూడలికి, పార్కులు, బస్టాండ్లను బట్టి మారుతుంది. మొత్తంగా బెగ్గింగ్ మాఫియాకు హైదరాబాద్‌వ్యాప్తంగా ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు 'చిల్లర' సమకూరుతోందని స్వచ్ఛంద సంస్థల ఫెడరేషన్ సర్వేలో వెల్లడైంది. సుమారు 10 వేల మంది యాచకులు రోజూ రూ.400 చొప్పున వసూలుచేసి ఇస్తున్నారని.. అంటే రోజూ రూ.40 లక్షలకుపైగా మాఫియాకు ఆదాయం వస్తోందని తమ అధ్యయనంలో గుర్తించింది.



చంచల్‌గూడ సెంట్రల్ జైలులో యాచకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులు

అప్పులిచ్చి.. భిక్షాటన చేయించి..

బెగ్గింగ్ మాఫియా లీడర్లు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు కొంత సొమ్మును అప్పుగా ఇస్తున్నారు. ఆ అప్పు తీర్చేందుకు 'యాచక కూలీ'లుగా పెట్టుకుంటున్నారు. కొంతకాలం తర్వాత అప్పు తీర్చాలని ఒత్తిడి చేస్తూ.. ఆ కుటుంబాల్లోని మహిళలను, ఆడపిల్లలను బలవంతంగా వ్యభిచార రొంపిలోకి దింపుతున్నట్లుగా గుర్తించినట్టు జీహెచ్ఎంసీకి ఇచ్చిన సర్వేలో స్వచ్ఛంద సంస్థల ఫెడరేషన్ పేర్కొంది.

- హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తున్న సుమారు 14 వేల మందిలో కేవలం నాలుగైదు వందల మంది మాత్రమే మొదటి, రెండో రకం యాచకులు కాగా.. మిగతా వారంతా నకిలీ యాచకులేనని గుర్తించారు.
- బెగ్గింగ్ మాఫియా లీడర్లు, ఫైనాన్షియర్ల వేధింపులు, ఒత్తిళ్లతో చాలా మంది యాచకులుగా మారుతున్నారని తేల్చారు.

'భిక్షం'కోసం దుకాణాలతో ఒప్పందాలు!


సికింద్రాబాద్ జనరల్ బజార్‌లో జరిగిన వ్యవహారం.. బెగ్గింగ్ మాఫియా విశ్వరూపానికి ఓ మచ్చుతునక. కొద్దినెలల కింద ఇక్కడ యాచకులంతా కలసి దుకాణాల వద్ద చేరి యాచిస్తూ, ఇవ్వకపోతే గొడవపడుతూ హంగామా సృష్టించారు. దీంతో బెగ్గింగ్ మాఫియాకు, దుకాణాల యజమానులకు 'ఒప్పందం'కుదిరింది. సోమవారం కొన్ని దుకాణాలు, మంగళవారం కొన్ని దుకాణాలు.. ఒక్కో దుకాణం వారు ఒక్కో రోజు భిక్షం 'వేసేలా'ఒప్పందాలు చేసుకున్నారు. ఆ రోజు రూ.5 నుంచి రూ.10 వరకు భిక్షంగా ఇవ్వాల్సిందే! బెగ్గింగ్ మాఫియా టర్నోవర్ భారీగా పెరగడానికి ఇలాంటి ఒప్పందాలూ కారణమే.

అప్పుల వసూళ్లు.. సెటిల్‌మెంట్ దందాలు..

గతేడాది హైదరాబాద్‌లోని బండ్లగూడ ప్రాంతంలో ఓ వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు చితకబాదారు. కాలు, చెయ్యి విరిచి వెళ్లిపోయారు. విచారణలో ఆ పనికి పాల్పడింది బెగ్గింగ్ మాఫియా అని తేలింది. అప్పు తీసుకుని ఎగ్గొట్టినందుకు ఓ ఫైనాన్షియర్ ఇలా యాచకులతో కొట్టించినట్లుగా గుర్తించారు.

- ఇక రాజేంద్రనగర్‌లో ఏడాది కింద ఓ అపార్ట్‌మెంట్ ఖాళీ చేసే విషయంలో యజమానికి, అద్దెకున్నవారికి వివాదం తలెత్తింది. దాంతో యజమాని యాచకులకు రూ.వెయ్యి రూపాయలు ఇచ్చి.. అద్దెకుండేవారిపై దాడి చేయించాడు.
- ఇలా బెగ్గింగ్ మాఫియా లీడర్లు డబ్బు తీసుకుని తమ వద్ద ఉన్న యాచకులతో ఇలా దందాలు చేస్తున్నట్లుగా స్వచ్ఛంద సంస్థలు, పోలీసు శాఖల పరిశీలనలో వెల్లడైంది. ఫైనాన్షియర్లు, చిట్టీల నిర్వాహకులైతే బెగ్గింగ్ మాఫియాను సెటిల్‌మెంట్ల కోసం, దాడుల కోసం వాడుకుంటున్నట్టు తేలింది.
- ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి యాచిస్తున్న వారిని ఇలాంటి పనులకు వినియోగించుకుంటున్నట్లు గుర్తించారు.

ఇంట్లోకి వెళ్లాలంటే.. అడుక్కోవాల్సిందే..!



గురువారం ఉదయం 8 గంటలు.. హైదరాబాద్ శివారులోని సుచిత్ర చౌరస్తాలో ఓ 55 ఏళ్ల వ్యక్తి భిక్షాటన చేస్తున్నాడు. ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆయన దగ్గరికి వెళ్లి.. తమ ఆశ్రమానికి తీసుకెళ్తాం రమ్మని అడిగారు. కానీ రానని, రావడం తనకిష్టం లేదని వాదించాడు. ఎందుకు రావని సంస్థ ప్రతినిధులు పదే పదే అడగడంతో.. తన బాధను వెల్లగక్కాడు. తాను ఒకప్పుడు హెచ్ఎంటీ సంస్థలో పనిచేసేవాడినని, సొంత ఇల్లు, కొడుకు, కోడలు అంతా ఉన్నారని చెప్పాడు. తాను డబ్బులు తీసుకెళితేగానీ వారు ఇంట్లోకి రానివ్వరని, తిండి పెట్టరని ఆవేదన వ్యక్తం చేశాడు. రోజూ యాచిస్తే నాలుగైదు వందల వరకు వస్తాయని.. ఆ సొమ్మంతా బెగ్గర్స్ లీడర్ తీసుకుని తనకు రూ.100 ఇస్తాడని.. ఈ సొమ్ము తీసుకెళ్లి ఇంట్లో ఇస్తానని చెప్పాడు.

మేమే బాధ్యత తీసుకుంటాం

''హైదరాబాద్‌లో నిజమైన యాచకులు 400 మంది వరకు మాత్రమే ఉంటారు. ఉపాధి చూపిస్తే కొంతమంది సెటిలవుతారు. మిగతా వారిని మా స్వచ్ఛంద సంస్థలో పెట్టి బాగుచేస్తాం. 60 వారాల పాటు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులతో కలసి బెగ్గింగ్ నిర్మూలనకు పనిచేశాం. కానీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఫలితం రాలేదు. అందువల్ల ప్రభుత్వం ప్రత్యేకంగా బెగ్గర్ రిహాబిలిటేషన్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయాలి. జీహెచ్ఎంసీ, పోలీసు, జైలు అధికారులు, మీడియా, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసి నకిలీ యాచకులను ఏరివేయవచ్చు. ప్రస్తుతం నకిలీ బెగ్గర్లు డ్రగ్స్, గంజాయి వంటివి విక్రయించే స్థాయికి వెళ్లారు. ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారిస్తే.. సహకరించడానికి 100కుపైగా ఎన్జీవోలు సిద్ధంగా ఉన్నాయి..''

– శంకర్‌నారాయణ్, ఫెడరేషన్ ఆఫ్ బెగ్గర్‌ఫ్రీ సొసైటీ ప్రతినిధి

వీరిది అవసరం.. వారిది వ్యాపారం

ఈ ఫెడరేషన్‌కు చెందిన 300 మంది ప్రతినిధులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒకేసారి విస్తృతంగా సర్వే నిర్వహించారు. అసలు యాచకులు ఎంతమంది, వారిలో ఎన్ని రకాల వారున్నారు, ఎందుకు భిక్షాటన చేస్తున్నారు, దీని వెనుక ఎవరున్నారు, ఏ మేరకు దందా సాగుతోందన్న అంశాలను పరిశీలించారు. మూడు రకాల యాచకులు ఉన్నట్లు సర్వేలో గుర్తించారు.

1 ఏ దిక్కూ లేనివారు..

మానసిక స్థితి సరిగా లేకపోవడం, ఆరోగ్యం దెబ్బతిని ఏ పనీ చేయలేకపోవడం వంటి దుస్థితిలో ఉన్నవారు మొదటి రకం యాచకులు. తమ వారెవరూ లేకపోవడం లేదా కుటుంబాలు ఉన్నా వీరిని పట్టించుకోకపోవడంతో భిక్షమెత్తుతున్నారు. ఇలాంటి వారిని శిబిరానికి తరలించి సహాయం చేయాల్సి ఉంటుందని స్వచ్ఛంద సంస్థల ఫెడరేషన్ గుర్తించింది.

2 అవసరానికి యాచించేవారు

కుటుంబంలో వివాదాలు, వ్యవసాయం, వ్యాపారంలో తీవ్ర నష్టాల పాలై గతిలేని స్థితిలో భిక్షాటన చేస్తున్నవారు రెండో రకం. వీరికి తగిన కౌన్సెలింగ్ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తే.. తిరిగి సాధారణ జీవితం గడపగలరని ఫెడరేషన్ తేల్చింది.

3 భిక్షాటనే వ్యాపారంగా..

కుటుంబం, ఆస్తులు అన్నీ ఉన్నా.. భిక్షాటననే వ్యాపారంగా మలుచుకునేవారు మూడోరకం. వీరు కష్టపడకుండా డబ్బు సంపాదించేందుకు బెగ్గింగ్ మాఫియాగా అవతరించారు. ముఠాలు ఏర్పాటు చేసి భిక్షాటన చేయించడం, ఆ డబ్బుతో వడ్డీ వ్యాపారం చేయడంతో పాటు గంజాయి/డ్రగ్స్ విక్రయించడం, ఫైనాన్స్ సంస్థలకు సెటిల్‌మెంట్లు చేసిపెట్టడం వంటివీ వీరు చేస్తున్నట్లు గుర్తించారు.

పసిపిల్లలకు 'నరక'యాచన!

అన్నెం పున్నెం ఎరుగని పసి పిల్లలను బెగ్గింగ్ మాఫియా నరక యాతనకు గురి చేస్తోంది. చిన్న పిల్లలు ఉంటే ఎక్కువగా భిక్షమేస్తారన్న ఉద్దేశంతో రెండేళ్లలోపు చిన్నారులను దీనికి వినియోగిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌కు వలస వచ్చే నిరుపేద కుటుంబాలకు వల వేసి వారి పిల్లలను భిక్షాటన కోసం వినియోగించుకుంటున్నారు. రోజుకు రూ.100 నుంచి రూ.150 చొప్పున ఇస్తున్నారు. ఇలా రెండు మూడు వందల మంది చిన్నారులను తీసుకు వచ్చి.. మహిళా యాచకులకు అప్పగించి, భిక్షాటన చేయిస్తున్నారు.

- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, థియేటర్లు, ఆలయాలు, ఫంక్షన్లు, పెళ్లిళ్ల వంటి శుభకార్యాలు జరిగే ప్రాంతాలకు ఈ మహిళా యాచకులను పంపుతున్నారు.
- పిల్లలు ఏడవకుండా, ఏడెనిమిది గంటల పాటు నిద్రలోనే ఉండేలా వారికి నల్లమందు చుక్కలు వేస్తున్నారు. మహిళా యాచకులు ఆ పిల్లలను చూపుతూ అడుగుతుండటంతో.. చాలా మంది డబ్బులు వేస్తుంటారు.
- కొందరు బెగ్గింగ్ లీడర్లు చిన్నారులు నిద్రలోనే ఉండేలా రెండు, మూడు గంటలకోసారి ప్రమాదకరమైన డ్రగ్స్ వేస్తున్నట్టు స్వచ్ఛంద సంస్థలు గుర్తించాయి. ఆ డ్రగ్స్ వల్ల చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల అస్తవ్యస్తమవుతుందని నిర్ధారించాయి. ముఖ్యంగా ఆడపిల్లలు పది పన్నెండేళ్లలోపే రజస్వల కావడం, శారీరకంగా ఇబ్బందులు వంటివి తలెత్తుతాయని గుర్తించారు.



నకిలీ బెగ్గర్ల గురించి అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు


శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు


బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఆ పార్టీ సీనియర్ నేతలు బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు


విద్యుత్ సౌధలో జెండాకు వందనం చేస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తదితరులు


శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అసెంబ్లీలో జెండా ఆవిష్కరిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు


లోటస్‌పాండ్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు. చిత్రంలో విజయసాయిరెడ్డి, బొత్స సత్యనారాయణ, వైఎస్ వివేకానందరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు


సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు


టీజేఏసీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న టీజేఏసీ చైర్మన్ కోదండరాం తదితరులు


గాంధీ భవన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య, సర్వే సత్యనారాయణ, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం

- వ్యతిరేకంగా మాట్లాడితే జైలుకు పంపే చట్టంపై మండిపడ్డ కిషన్‌రెడ్డి
- మిషన్ కాకతీయ, భగీరథలు కుంభకోణాలే:దత్తాత్రేయ

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం అమల్లోకి వచ్చిన గణతంత్ర దినోత్సవం నాడే ప్రజా హక్కులు కాలరాసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి ఆరోపించారు. పరుషంగా మాట్లాడితే పోలీసులే జోక్యం చేసుకుని జైలుకు తరలించే చట్టాన్ని తేవటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సర్కారుకు వ్యతిరేకంగా మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినా, మీడియా చర్చల్లో పరుష వ్యాఖ్యలు చేసినా అరెస్టులు చేసేలా ప్రభుత్వం చట్టం చేస్తుందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్రంలో నియంత పాలన జరుగుతోందని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ కొత్త చట్టంతో నియంతృత్వం మరింత పెరుగుతుందని, ప్రజలు దీన్ని గుర్తించి టీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ, భగీరథ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం, పురపాలక శాఖలోని కొన్ని పథకాలు.. ఇవన్నీ పెద్ద కుంభకోణాలని ఆరోపించారు. రాష్ట్రంలో కనీస వేతనాలు అమలు కావటం లేదని, బంగారు తెలంగాణ బదులుగా ఆత్మహత్యల తెలంగాణ ఏర్పడిందన్నారు. ఎస్సీ,ఎస్టీల విషయంలో దాష్టీకం అమలవుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచంద్రరావు, సీనియర్ నేతలు శేషగిరిరావు, మేచినేని కిషన్‌రావు, ఇంద్రసేనారెడ్డి, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విద్యుత్ వాహనాల ప్రణాళిక!

ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధన కోసం త్వరలో ప్రభుత్వం విద్యుత్ వాహనాల ప్రణాళికను తీసుకురానుందని రాష్ట్ర ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యుత్ సౌధలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. విద్యుత్ వాహనాల చార్జింగ్ ఏజెన్సీలతో పాటు రిటైల్ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను విక్రయించేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. టీఎస్‌ఈఆర్సీతో సంప్రదింపులు జరిపి ఎలక్ట్రిక్ వాహనాలకు విద్యుత్ సరఫరా కోసం రిటైల్ టారీఫ్ పట్టికలో ప్రత్యేక కేటగిరీని ఏర్పాటు చేశామన్నారు.

ఆ న్యాయమూర్తుల నుంచి స్ఫూర్తి పొందుదాం

నైతికత అనే పునాదిపై న్యాయ వ్యవస్థ నిర్మితమైంది

- న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడేందుకు అంతా కృషి చేయాలి
- గణతంత్ర దిన వేడుకల్లో హైకోర్టు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్

సాక్షి, హైదరాబాద్: స్వీయ ప్రయోజనాలకు కాక వ్యవస్థ విలువలను కాపాడేందుకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన న్యాయమూర్తుల నుంచి న్యాయవ్యవస్థలో ఉన్న వారందరూ స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ అన్నారు. న్యాయమూర్తుల నైతికత అన్న పునాదిపైనే స్వతంత్ర న్యాయవ్యవస్థ నిర్మితమైందని తెలిపారు. ఇటువంటి వ్యవస్థ స్వతంత్రతను కాపాడేందుకు ప్రతీ న్యాయమూర్తి, న్యాయవాది శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు ప్రాంగణంలో శుక్రవారం 69వ గణతంత్ర దిన వేడుకలు జరిగాయి. జాతీయ జెండాను ఎగురవేసిన ఏసీజే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెహ్రూ కాలంలో జరిగిన ఓ ఉదంతాన్ని వివరించారు. '1954లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పతంజలి శాస్త్రి పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆ పదవిని స్వీకరించాలని జస్టిస్ బిజోన్ కుమార్ ముఖర్జీని ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కోరారు. అయితే ఈ వినతిని జస్టిస్ ముఖర్జీ సున్నితంగా తిరస్కరించారు. తనకన్నా సీనియర్ ఉండగా, తాను ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్ట లేనని తేల్చి చెప్పారు. నెహ్రూ ఒత్తిడి చేయగా, న్యాయమూర్తి పదవికి రాజీనామా చేస్తానే తప్ప, తనకన్నా సీనియర్‌గా ఉండగా, తాను ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టడం సాధ్యం కాదన్నారు. జస్టిస్ ఎం.సి.మహాజన్ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తరువాత తనే జస్టిస్ ముఖర్జీ ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించారు. స్వీయ ప్రయోజనాల కన్నా వ్యవస్థ ప్రయోజనాలను ఉన్నత స్థితిలో నిలిపిన ఇటువంటి న్యాయమూర్తులను అనుసరించి, వారి నుంచి మనం అందరం స్ఫూర్తి పొందాలి'అని జస్టిస్ రమేశ్ రంగనాథన్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగ రచన ఎలా జరిగింది.. అందుకు కారకులెవరు.. తరువాత పరిణామాలను వివరించారు.


హైకోర్టు ప్రాంగణంలో జెండాకు వందనం చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్

తాత్కాలిక భవనంలో హైకోర్టు తగదు

అంతకు ముందు ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చల్లా ధనంజయ మాట్లాడుతూ తాత్కాలిక భవనంలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఏపీలో హైకోర్టును తాము వ్యతిరేకించడం లేదని, తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేయడంపైనే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ విషయంలో అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం న్యాయవాదుల సంఘానికి ఇవ్వాలని ఆయన ఏసీజేను కోరారు. కాగా గణతంత్ర వేడుకల్లో హైకోర్టు విభజన అంశాన్ని లేవనెత్తడంపై ఏసీజే ఒకింత అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్స్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, దమ్మాలపాటి శ్రీనివాస్, తెలంగాణ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జల్లి కనకయ్య కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు, రిజిస్ట్రార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు

గణతంత్ర వేడుకల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉత్తమ్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవహక్కులను ఉల్లంఘిస్తూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం 69వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నేతలు కె.జానారెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు భట్టివిక్రమార్క, నర్సారెడ్డి, వి.హన్మంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధు యాష్కీ, సర్వే సత్యనారాయణ, దానం నాగేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఇక్కడి పాలకులు అవమానపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేడ్కర్ పేరు మీద ఉన్న ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పేరు మార్చి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా చేశారని విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు కేవలం పేరు మార్చడం ద్వారా రూ.50 వేలకోట్లు అంచనా వ్యయాన్ని పెంచి, ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నారని ఆరోపించారు. దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందన్నారు. చట్టాలు అమలు కావడం లేదని, ఇసుక మాఫియాను ప్రశ్నించిన దళితులపై పోలీసులు అమానవీయంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. అలాగే పంటలకు మద్దతు ధర అడిగిన రైతులను అరెస్టు చేసి, చేతులకు బేడీలు వేసి జైళ్లలో వేశారని మండిపడ్డారు. సమస్యలపై నిరసన వ్యక్తం చేసే హక్కు లేకుండా చేస్తూ, కోదండరాం, మంద కృష్ణ వంటివారిని జైళ్లలో పెడుతున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోను కాంగ్రెస్ ప్రభుత్వాలు కచ్చితంగా వస్తాయని ఉత్తమ్ అన్నారు.

ఐదేళ్లలో భారీగా సింగరేణి విస్తరణ

గణతంత్ర వేడుకల్లో సంస్థ సీఎండీ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: రానున్న ఐదేళ్లలో సింగరేణిని భారీ ఎత్తున విస్తరించనున్నట్టు సంస్థ సీఎండీ ఎస్.శ్రీధర్ తెలిపారు. 2022 నాటికి 850 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయనున్నామని వెల్లడించారు. ఐదేళ్లలో మరో 13 కొత్త గనులను ప్రారంభిస్తామని చెప్పారు. పనిసామర్థ్యం పెరిగితే లాభాలు పెరుగుతాయనీ, లాభాలతో కంపెనీ విస్తరణ, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో రూ.8,250 కోట్లతో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పామని, దీని ద్వారా ఏటా రూ.3,500 కోట్ల అమ్మకాలు జరుగుతున్నాయని చెప్పారు. తద్వారా ఈ ఏడాది రూ.350 కోట్ల లాభం సాధించామన్నారు. ఇక్కడే మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటును నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మూడేళ్ల కాలంలో సంస్థ 25 శాతం వృద్ధిని సాధించిందన్నారు. ఈ ఏడాది కంపెనీ లాభాలు రూ.1,000 కోట్లను దాటే అవకాశముందని ఆయన తెలిపారు

మన పథకాలు దేశానికే ఆదర్శం

తెలంగాణ భవన్ ఆర్సీ అశోక్ కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ (ఆర్సీ) అశోక్ కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నూతన సంస్కరణలు, సరికొత్త ఆలోచనలతో దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో ముందు వరుసలో ఉందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులు ఇప్పటికే కేంద్రం మన్ననలు పొందాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకురానున్న మరిన్ని సంస్కరణలతో తెలంగాణ ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపును సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవన్ ఏఆర్సీ వేదాంతం గిరి, సహాయ కమిషనర్ రామ్మోహన్, భవన్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి

శనివారం, జనవరి, 27

నీళ్లు-నిప్పులు

అంతా సవ్యంగా ఉందనుకుంటుండగా మళ్లీ నదీ జలాల్లో నిప్పు రాజుకుంది. కర్ణాటకలో మహాదాయిగా, గోవాలో మాండోవిగా పారుతున్న నది తాజా వివాదానికి కేంద్ర బిందువు. ఆ నది నీళ్లు విడుదల చేయాలంటూ కర్ణాటక రైతాంగం, వివిధ కన్నడ సంస్థలు దాదాపు నెలరోజులుగా ఆందోళన చేస్తున్నాయి. గురువారం రాష్ట్ర వ్యాప్త బంద్ జరిగింది. బెంగళూరుకు ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెల 4న వస్తున్నందున ఆ రోజు నగర బంద్‌కు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి పోటీగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వచ్చే రోజైన ఫిబ్రవరి 10న బీజేపీ బంద్ పాటించబోతోంది. పడమటి కనుమల్లో పుట్టి గోవాలో అరేబియా సముద్రంలో కలిసే మహాదాయి కర్ణాటక కన్నా గోవాలోనే ఎక్కువ మేర పారుతుంది. దాని నిడివి 77 కిలోమీటర్లు కాగా అందులో కర్ణాటకలో ప్రవహించేది 29 కిలోమీటర్ల మేర మాత్రమే. జలాలను కృష్ణా ఉపనది మలప్రభ బేసిన్‌కు మళ్లించి నాలుగు జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించాలన్నది కర్ణాటక ప్రతిపాదన. ఇందు కోసం మహాదాయిపై ఆనకట్టలు, కాలువలు నిర్మించాలని 80వ దశకంలో నిర్ణయించింది. ఇందువల్ల తమకున్న ఏకైక మంచినీటి నది ఎండిపోతుందని, భారీమొత్తంలో అడవి నాశనమవుతుందని, పర్యావరణం దెబ్బతింటుందని 2002లో గోవా సుప్రీంకోర్టుకెళ్లింది. పర్యవసానంగా ఆ నిర్మాణాలను న్యాయస్థానం ఆపేసింది. అప్పటినుంచీ ప్రతి సీజన్‌లోనూ మలప్రభ ప్రాంతానికి నీరివ్వాలని ఆందోళనలు రేగడం, ఏదో మేరకు అంగీకారం కుదిరి వాటిని చల్లార్చడం రివాజు. ఈ వివాదంపై 2010లో ట్రిబ్యునల్ నియమించినా అది ఇంతవరకూ అవార్డు ప్రకటించలేదు. రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయ పక్షాల జోక్యంతో ఉద్రిక్తతలు పెరగడం, అశాంతి రగలడం తప్పడం లేదు.

నదీజలాల వివాదంపై మన రాజ్యాంగంలోని 262వ అధికరణ మాట్లాడుతోంది. ఈ అధికరణ ప్రకారం నదీజలాల వినియోగం, పంపిణీ, నియంత్రణ వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినా, ఫిర్యాదులు వచ్చినా పరిష్కారం కోసం తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 1956లో నదీ జలాల బోర్డు చట్టం, అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టం తీసుకొచ్చింది. బోర్డు ఇంతవరకూ సాకారం కాలేదుగానీ, అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టం కింద దేశంలో ఏడు ట్రిబ్యునళ్లు ఏర్పడ్డాయి. ఇందులో కృష్ణా నదికి సంబంధించి రెండు ట్రిబ్యునళ్లుండగా... రావి-బియాస్, గోదావరి, నర్మద, కావేరి, మహాదాయి, వంశధార వివాదాలపై ఇతర ట్రిబ్యునళ్లు ఏర్పడ్డాయి. అసలు ట్రిబ్యునళ్ల ఏర్పాటులోనే అంతులేని జాప్యం చోటుచేసుకోగా, వాటిల్లో కొన్ని సుదీర్ఘ సమయం వెచ్చించి ప్రకటించిన నిర్ణయాలకు సైతం దిక్కూ మొక్కూ లేకుండా పోతోంది. దేశంలో ఇంతవరకూ కృష్ణా ట్రిబ్యునల్-1, గోదావరి ట్రిబ్యునల్, నర్మద ట్రిబ్యునల్ మాత్రమే అవార్డులు ప్రకటించాయి. మిగిలినవి ప్రకటించినా వివిధ దశల్లో ఆగిపోయాయి. కొన్ని అవార్డులపై వివాదాలు సుప్రీంకోర్టుకెళ్లాయి. ఇవిగాక మహారాష్ట్రలోని బాభలీ ప్రాజెక్టుపై 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు, ముల్ల పెరియార్ డ్యామ్ వివాదం విషయంలో అదే కోర్టు 2014లో ఇచ్చిన ఆదేశాల అమలుకు కేంద్రం ముగ్గురు సభ్యులతో పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది.

ప్రపంచ పునరుత్పాదక జల వనరుల్లో మన దేశంలో ఉన్నవి కేవలం 4 శాతం మాత్రమే. ప్రకృతి సహకరిస్తే సమృద్ధిగా వానలు పడతాయి. నదులు, సరస్సులు, చెరువులు, కుంటలు నిండుతాయి. అది పగబడితే చుక్క నీటికి దిక్కుండదు. భూగర్భ జలాలు కూడా అడుగంటుతాయి. వాతావరణంలో పెనుమార్పుల పర్యవసానంగా రుతువులు గతి తప్పుతున్నాయి. అయితే అతివృష్టి...లేకపోతే అనావృష్టి తప్ప సవ్యంగా వర్షాలు పడటం అరుదుగా మారింది. కనుక ఉన్నకొద్దీ జలవివాదాలు పెరుగుతాయే తప్ప తగ్గవు. అయితే కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ఈ సమస్యపై నిర్ణయాత్మకంగా వ్యవహరించడానికి, శాశ్వత పరిష్కారం కనుగొనడానికి ముందుకు రావడం లేదు. సమస్య తలెత్తినప్పుడు తాత్కాలికంగా సర్దుబాటు చేసి, గండం గట్టెక్కితే చాలనుకుంటున్నారు. ట్రిబ్యునళ్లు అవార్డులివ్వడంలో జాప్యం చేసినా, ఇచ్చిన అవార్డుల అమలు అసాధ్యమవుతున్నా పట్టించుకునే దిక్కులేదు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, డిక్రీలు సైతం బేఖాతరైన సందర్భాలున్నాయి. ప్రతి అవార్డుపైనా, ఆదేశాలపైనా తిరిగి న్యాయస్థానాలను ఆశ్రయించడం పరిపాటి. ఇతరత్రా సమయాల్లో జాతి గురించి, జాతి ప్రయోజనాల గురించి గుండెలు బాదుకునేవారు నదీజలాల వివాదం వచ్చేసరికి 'ప్రాంతీయ పూనకం'లో అన్నీ మరిచిపోతారు. చర్చలకంటే, పరిష్కారాలకంటే స్థానికుల్ని రెచ్చగొట్టడమే పార్టీలకు ప్రధానమైపోతుంది. వివాద పరిష్కారంలో జాప్యం జరిగితే అది మరింత ఉగ్రరూపం దాలుస్తుంది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల మధ్య ఉన్న రావి-బియాస్ వివాదం మొదలై 31 ఏళ్లవుతోంది.

ఇప్పుడున్న ట్రిబ్యునళ్లను రద్దు చేసి వాటిస్థానంలో బహుళ బెంచ్‌లు ఉండే ఒక శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని రెండేళ్లక్రితం కేంద్రం నిర్ణయించింది. అందుకోసం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల(సవరణ)బిల్లు రూపొందించింది. నిరుడు మార్చిలో లోక్‌సభలో ఆ బిల్లు ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ఏ వివాదాన్నయినా ముందు నిపుణుల కమిటీ పరిశీలించి ఏడాదిలోగా ఒక పరిష్కారాన్ని సూచిస్తుంది. అప్పటికీ వివాదం సమసిపోనట్టయితే అది ట్రిబ్యునల్ ముందుకొస్తుంది. అలాగే నిరంతరం వివిధ నదుల్లోని జల పరిమాణానికి సంబంధించిన డేటా సేకరణకు ఒక ప్రత్యేక సంస్థను నెలకొల్పుతారు. ఈ బిల్లులో ఇతర అంశాలేమిటి, వాటిలోని లోటుపాట్లేమిటన్న సంగతలా ఉంచి దానిపై ఇంకా చర్చే మొదలుకాలేదు. కనీసం వచ్చే సమావేశాల్లోనైనా దానిపై లోతుగా చర్చించి వీలైనంత త్వరలో చట్టం చేసి పనులు మొదలు పెడితే మహాదాయిలాంటి అనేక వివాదాల పరిష్కా రంవైపు తొలి అడుగు పడుతుంది. అందుకోసం అందరూ చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.



ఇచ్చిపుచ్చుకోవడం ఎలా అని గ్రహించడమే ఎలాంటి సమస్యకైనా ఉత్తమ పరిష్కారం. అన్ని ఎత్తుగడలు ఇక్కడే విఫలమవుతుంటాయి

– సాల్ అలిన్‌స్కీ
అమెరికన్ రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.దశమి ఉ.7.12 వరకు, తదుపరి ఏకాదశి తె.5.01 వరకు (తెల్లవారితే ఆదివారం), నక్షత్రం రోహిణి రా.1.02 వరకు, తదుపరి మృగశిర వర్జ్యం సా.5.30 నుంచి 7.00 వరకు, దుర్ముహూర్తం ఉ.6.34 నుంచి 8.04 వరకు, అమృతఘడియలు ఉ.10.01 నుంచి 11.31 వరకు, భీష్మ ఏకాదశి.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.48
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.34
జొహర్ : 12.29
అసర్ : 4.33
మగ్రీబ్ : 6.09
ఇషా : 7.24

దావోస్‌లో దక్కిందేమిటి?



శేఖర్ గుప్తా

ప్రధానమంత్రి, పలువురు కీలక కేంద్ర మంత్రులు, సీఎంల హాజరుతో ఇంత కృషి జరిగినా దావోస్ సమావేశ ఫలితాలు పరిమితమనే చెప్పాలి. ప్రధాని మోదీ సహా భారత ప్రతినిధులు ఎంతటి చక్కటి సందేశాలిచ్చినాగానీ చివరికి వారు ప్రపంచ వ్యాపార సంస్థలకు ఇవ్వజూపేది ఏంటనేదే కీలకమవుతుంది. ఇండియాలో వృద్ధి రేటు ఏడు శాతం ఉంటే మంచిదే. కాని, చైనా జనాభాకు సరిసమానమైన జనం, దానిలో ఐదో వంతు మాత్రమే ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పుడు ప్రయోజనాలు పరిమితంగానే ఉంటాయి.

జాతిహితం



దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశానికి భారత్ హాజరుకావడం ఇది మూడోసారి. 2006లో 'అన్ని చోట్లా ఇండియా' అనే నినాదంతో, 2011లో 'సమ్మిళిత భారత్' పేరిట దావోస్‌లో పాల్గొనడానికి ఇప్పటికీ చాలా తేడా ఉంది. ఈ రెండు సందర్భాలకు భిన్నంగా ఇప్పుడు భారత ప్రధాని దావోస్ వెళ్లారు. ఇంతకు ముందు దావోస్ సదస్సుకు హాజరైన చివరి ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ. 1997 నాటి ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ విషయ పరిజ్ఞానంతోపాటు తనకంటూ సొంత శైలి ఉన్న నేత. ఆయన సర్కారుకు పార్లమెంటులో భారీ మెజారిటీ ఉంది. బీజేపీ, దాని మిత్రపక్షాలు 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి. ఇందిరాగాంధీ తర్వాత పార్టీపై మోదీకి ఉన్నంత పట్టు మరే ప్రధానికీ లేదు. నేడు మరే ఇతర పెద్ద ప్రజాస్వామ్య దేశంలోనూ ఏ ఒక్క నాయకునికీ ఇంతటి నియంత్రణ లేదనేది మనం గుర్తుంచుకోవాలి. విదేశీ ప్రయాణం హుషారుగా చేసే అలవాటు ఉన్న మోదీకి ప్రపంచనేతలతో మంచి సంబంధాలున్నాయి. ప్రపంచదేశాల నేతల శిఖరాగ్రసభల్లో వారిని సుదీర్ఘ గాఢాలింగనం చేసుకోవడం మోదీ ప్రత్యేక ముద్రగా మారింది. దావోస్‌లో ఆయన పాల్గొనడం డబ్ల్యూఈఎఫ్‌కు, దాని స్థాపకుడు క్లాజ్ ష్వాబ్‌కు నిజంగా ఘనవిజయం. ఆర్థిక వేదిక సదస్సులో మోదీ ఏం చేశారనే విషయం అలా ఉంచితే, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయనకు దావోస్‌తో మంచి అనుభవం, అనుబంధమే ఉంది. ముఖ్యమంత్రి అయిన తొలి రోజుల్లోనే ఆయన డబ్ల్యూఈఎఫ్ సమావేశాలకు హాజరవడంతోపాటు 2007లో దాలియన్‌లో జరిగిన వేసవి దావోస్ సదస్సులో పాల్గొన్నారు. అక్కడ జరిగిన ఓ చర్చకు నేను సమన్వయకర్తగా వ్యవహరించాను. భారత రాజకీయాలపై అనేక ప్రశ్నలడిగినా, ఆయన మాత్రం తాను రాజకీయనేతగా ఇక్కడికి రాలేదనీ, దేశ సమ స్యలను చర్చించనని మోదీ తెగేసి చెప్పారు.

మోదీకి ఆహ్వానం గిట్టని యూపీఏ సర్కారు!

భారత పారిశ్రామికవేత్తలకు మోదీపై మోజు పెరిగేకొద్దీ దావోస్ సదస్సులో దేశ రాజకీయాల ప్రస్తావన, వాటిపై చర్చ తప్పలేదు. మోదీకి ఆహ్వానం పంపడం తమకు ఇష్టంలేదనే విషయాన్ని కూడా ప్రపంచ ఆర్థిక వేదిక నిర్వాహకులకు అప్పటి యూపీఏ సర్కారు తెలిపింది. రాజకీయ ఒత్తిడి కారణంగానే తనకు ఆహ్వానం రాలేదని మోదీ నమ్మడంలో తప్పేమీ లేదు. అందుకే గత మూడేళ్లలో దావోస్ శిఖరాగ్ర సదస్సుపై ఆయన సర్కారు ఆసక్తి చూపలేదు. తర్వాత పరిస్థితిని చక్కదిద్దడానికి డబ్ల్యూఈఎఫ్ చేయాల్సిందంతా చేసింది. ప్రారంభ ప్లీనరీ సమావేశంలో ప్రసంగించే అవకాశం మోదీకి ఇచ్చారు. అగ్రదేశాల నేతలకు లభించే ఈ అవకాశం కిందటేడాది చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు దక్కింది. ఈ ఏడాది దీనికి గట్టి పోటీ ఏర్పడింది. డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు డొనాల్డ్ ట్రంప్, ఇమాన్యుయేల్ మాక్రాన్, జస్టిన్ ట్రూడో, థెరిజా మే, బెంజిమిన్ నెతన్యాహూ, ఏంజెలా మెర్కెల్ వంటి హేమాహేమీలు హాజరయ్యారు.

కిటకిటలాడిన మోదీ సభ!

మోదీ ప్రసంగించిన సభా ప్రాంగణం నేతలతో కిక్కిరిసింది. ట్రంప్ పాలనలోని అమెరికాపైనా, జిన్‌పింగ్ నాయకత్వాన నడుస్తున్న చైనాపైనా మోదీ కొన్ని చెప్పుకోదగ్గ వ్యాఖ్యలు చేశారు. ప్రాచీన భారత సంస్కృతి, జ్ఞానం ఆధారంగా ఆయన ప్రపంచ దేశాల నేతలకు ఎన్నో సలహాలు, సూచనలు అందించారు. మోదీ ఉపన్యాసం సదస్సు అంతటా చర్చనీయాంశమైంది. ఆయన ప్రారంభ ప్రసంగం చేసిన నాలుగు రోజుల వరకూ నాకు ఎదురైన ప్రతి భారతీయుడూ, 'ప్రధాని ఉపన్యాసంపై మీరేమనుకుంటున్నారు?' అని ప్రశ్నించాడు. దీనికి జవాబివ్వడానికి ముందే, తన అభిప్రాయం చెప్పాడు. పొగడ్తల వర్షం కురిపించాడు. ఇక్కడే ఓ విశేషముంది. భారతీయుడు కాని ఏ వ్యక్తీ ఈ ప్రశ్న అడగలేదు. అలాగే, అంతర్జాతీయ వార్తా ప్రచారసాధనాలు మోదీ ప్రసంగాన్ని పెద్దగా పట్టించుకోలేదు. చైనాతో పాశ్చాత్య దేశాలతోపాటు, బడా అంతర్జాతీయ వ్యాపార సంస్థలు విసిగిపోయి ఉన్నాయి. చైనా అంటే వాటికి చికాకు. చైనాకు ప్రత్యామ్నాయంగా ఇండియా విజయవంతమైన పాత్ర పోషించాలని, తమ పెట్టుబడులకు మంచి కేంద్రంగా మారాలని అవి కోరుకుంటున్నాయి. చైనాలో వ్యతిరేక ఫలితాలతో నష్టపోయే అంతర్జాతీయ కంపెనీల సంఖ్య పెరిగేకొద్దీ గత కొన్నేళ్లుగా ఇండియాపై వాటికి అభిమానం పెరుగుతూ వస్తోంది. ఇండియా ఆర్థికశక్తిగా విజయం సాధించాలని అవి కోరుకుంటున్నాయి. అయితే, నేడు ఇండియా ఈ విషయంలో వాగ్దానం చేసేది ఎక్కువ- సాధించేది తక్కువ అనే పరిస్థితి ఉంది. మోదీ ప్రధాని పదవి చేపట్టాక దేశంలో మరిన్ని భారీ సంస్కరణలు వస్తాయని, అదే స్థాయిలో ఆర్థిక, వ్యూహాత్మక సుస్థిరత నెలకొంటుందని అంచనాలు సాగాయి. భారత్‌కు సంబంధించి దావోస్‌లో ఇలాంటి చర్చలు, ఊహాగానాలు ఇటీవల పెరిగాయి. ప్రపంచ ఆర్థికాభివృద్ధి రేటు మరోసారి భారీగా అంటే 3.9 శాతానికి పెరగడంతో ఇండియాపై ఆశలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. వాస్తవానికి లాభసాటి ఒప్పందాలు చేసుకోడానికి సరైన వేదిక దావోస్. పైకి ప్రపంచ పరిస్థితులు మెరుగుపరచాల్సిన అవసరం గురించి నేతలందరూ మాట్లాడుతున్నా, తెర వెనుక జరిగేది వేరు.

పోటీపడిన రాష్ట్రాలు

దావోస్‌లో ఇండియాకు సంబంధించిన వ్యవహారాలు బాగానే నడిచాయి. భారత ప్రభుత్వం-సీఐఐ, చంద్రబాబు నాయుడి ఆంధ్ర, దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో-ఇలా పలు రాష్ట్ర ప్రభుత్వాలు బడా కంపెనీలు తమ బృందాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అన్ని చోట్లా గట్టి ప్రయత్నాలే చేశాయి. ప్రధానమంత్రి, పలువురు కీలక కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రుల హాజరుతో ఇంత కృషి జరిగినా ఫలితాలు పరిమితమనే చెప్పాలి. ప్రధాని మోదీ సహా భారత ప్రతినిధులు ఎంతటి చక్కటి సందేశాలిచ్చినాగానీ చివరికి వారు ప్రపంచ వ్యాపార సంస్థలకు ఇవ్వజూపేది ఏంటనేదే కీలకమవుతుంది. ఇండియాలో వృద్ధి రేటు ఏడు శాతం ఉంటే మంచిదే. కాని, చైనా జనాభాకు సరిసమానమైన జనం, దానిలో ఐదో వంతు మాత్రమే ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పుడు ప్రయోజనాలు పరిమితంగానే ఉంటాయి. ఇది వాస్తవానికి క్రూర ప్రపంచమని చెప్పాలి. ఇది ఇబ్బందికర ప్రశ్నలనే అడుగుతుంది. ఇప్పుడు మీది నిజంగా బలమైన ప్రభుత్వమే అయితే వోడాఫోన్ కంపెనీని వెనుకటి కాలానికి పన్ను చెల్లించమని చేసిన చట్టసవరణను ఇంకా ఎందుకు రద్దు చేయలేదు? వంటి ప్రశ్నలు ఈ వేదికపై తలెత్తాయి. దశాబ్దం క్రితం ఇండియా దావోస్‌లో ఆర్భాటంగా తన బలం ప్రదర్శించినపుడు అప్పట్లో దేశంలో వృద్ధి రేటు 9 శాతం (పాత సూత్రం ప్రకారం) దాటుతోంది. టెక్నాలజీ కంపెనీలు పరుగులు పెడుతున్నాయి. ఐటీ సేవల ఔట్‌సోర్సింగ్ కారణంగా బెంగళూరు కొత్త సిలికాన్ వ్యాలీగా అవతరించింది. ఈ పరిస్థితుల్లో మన్మోహన్‌సింగ్ వంటి నియమితుడైన ప్రధాని సైతం దావోస్ వచ్చి ప్రసంగిస్తే కొంత ప్రభావం చూపించేవారు. వాగ్ధాటిలో మోదీకి పోటీ శక్తి ఆయనకు ఏ మాత్రం లేదనే విషయం పక్కనబెట్టినా డాక్టర్ సింగ్ మంచి ఫలితాలే సాధించేవారని భావించవచ్చు. మన్మోహన్ దావోస్ వెళ్లాలనుకున్నారు. కాని, ప్రపంచీకరణను వ్యతిరేకించే వామపక్షాలు ఆయనను వెళ్లనీయలేదు. దావోస్ సదస్సుకు సింగ్ హాజరైతే మద్దతు ఉపసంహరిస్తామని అవి బెదిరించాయి. ఈ విషయం రాహుల్ బజాజ్ ఇక్కడి మీడియాకు వెల్లడించారు.

నాయకుడు బలవంతుడేగాని పరిస్థితి అనుకూలంగా లేదు!

ఏ సందేశం ఎలా ఇవ్వాలో తెలిసిన ప్రపంచస్థాయి బలమైన నాయకుడు భారత్‌ను పరిపాలిస్తున్నాడు. అయితే, పరిస్థితులు ఉత్సాహపూరితంగా లేవు. 2006 నుంచి 2011 వరకూ, మళ్లీ అప్పటి నుంచి 2018 వరకూ ఆహార పదార్థాలు, వంటకాలు (ఆంధ్ర సహా దేశంలో చాలా ఎక్కువ) బాలీవుడ్ సినిమాలు, ఆధ్యాత్మికత, (ఇప్పుడు) యోగా- రంగాల్లో తన ప్రత్యే కతలు, విజయాల గురించే ఇండియా గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. కాని ఈ రంగాల్లో ఒకదేశానికి ఉన్న శక్తియుక్తులు దాన్ని ఉన్నత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి చాలా పరిమితులున్నాయి. ఇలాంటి కొన్ని ప్రత్యేక అంశాల్లో సాధించిన ప్రగతి థాయిలాండ్ వంటి చిన్న దేశానికి ప్రయోజనకరం కావచ్చు. కిందటేడాది ఈ దేశానికి మూడు కోట్ల 60 లక్షల మంది పర్యాటకులు రాగా, ఇండియాను కోటీ రెండు లక్షల మంది టూరిస్టులు సందర్శించారు.

భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కోరుకుంటున్న ఇండియా ఓ సైనిక శక్తిలా గట్టిగా మాట్లాడాలని ప్రపంచదేశాలు కోరుకుంటున్నాయి. ప్రపంచ రక్షణ, భద్రత, వ్యూహాత్మక విషయాలపై ఇండియా ఎందుకు మాట్లాడదని ప్రపంచ నేతలు అడుగుతున్నారు. ఈ అంశాలపై కొన్ని ప్రకటనలు చేస్తే ఇండియాకు, మోదీకి గొప్ప ప్రచారం లభించేది.

దావోస్‌లో భారత్ కొన్ని ప్రత్యేక రంగాల్లో తన శక్తియుక్తుల గురించి ప్రచారం చేసుకుంది. రిపబ్లిక్ దినోత్సం రోజున పది మంది ఆగ్నేయాసియా నేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి తన సైనికపాటవాన్ని ఢిల్లీలో ప్రదర్శించింది. సముద్రయానంలో నిబంధనల ప్రకారం నడుచుకోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం వంటి అంశాలపై ఇండియా గట్టి సందేశమిచ్చి ఉంటే బాగుండేది. దావోస్ సందేశానికి రిపబ్లిక్ డే దౌత్యం తోడైతే గొప్ప ఫలితాలు అందేవి. ఈ అవకాశాన్ని జారవిడుచుకుంది. గత పదేళ్లలో ఇండియా చెప్పింది ఎక్కువ-చేసింది తక్కువ అనే భావన ఇతర దేశాల్లో కనిపిస్తోంది. అయితే, ఈసారి కూడా తన స్వభావానికి భిన్నమైన ప్రదర్శనకు దిగింది. తన శక్తిసామర్థ్యాలను తగినంతగా ప్రపంచానికి అర్థమయ్యేలా చూపించలేకపోయింది. దావోస్‌లో పదేళ్ల క్రితం కనిపించిన భారతీయ ప్రముఖులే ఈసారి కనిపించారు. ఇండియా తరఫున జరిపిన భేటీలకు వివిధదేశాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరైతే తప్ప ప్రపంచపటంలో భారత్‌కు తగిన గుర్తింపు, ప్రయోజనం ఉండదు. మన గురించి ఎంత గొప్పగా మనం చెప్పుకున్నా జరిగేది ఇంతే.

వ్యాసకర్త దప్రింట్ చైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్
Twitter@ShekarGupta

పదవీ విరమణ.. పదవులు

కేంద్ర మాజీ ఆర్థిక కార్యదర్శి ఒక ప్రైవేట్ ఆటోమొబైల్ సంస్థలో భారీ ప్యాకేజీతో చేరినప్పుడు అంత పెద్ద చెల్లింపులు వారి నైపుణ్యాల కోసం కాకుండా వారి పలుకుబడి కారణంగా దక్కాయన్న సందేహాలు తలెత్తాయి. ఇక్కడే పరస్పర ప్రయోజనాల మధ్య వైరుధ్యం తలెత్తడానికి ప్రాతిపదిక ఉంది.

విశ్లేషణ



వరుణ్ గాంధీ

పూర్వ ప్రధానమంత్రి చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి బీజీ దేశ్‌ముఖ్ రిటైర్మెంట్ తర్వాత ఒక పెద్ద ప్రైవేట్ సంస్థలో చేరవచ్చా అని 1990లో నాటి ప్రధానిని అడిగారు. దశాబ్దాలపాటు ప్రభుత్వంలో సేవలందించిన ఆయన తనను అనుమతిస్తే పదవీ విరమణ తర్వాత కార్పొరేట్ రంగానికి వెళ్లాలని ఆకాంక్షించారు. నోటిమాటతో ఆమోదించడం నుంచి రాతపూర్వకంగా నిరాకరించడం వరకు ఆయన అభ్యర్థనకు ఆమోదం తెలిపే ప్రక్రియను ఉదాసీనత దెబ్బ తీసింది. దీనికి కారణాలు ఏవైనా కావచ్చు, కానీ రాజీనామా లేదా పదవీ విరమణ తర్వాత ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు కార్పొరేట్ ఉద్యోగాలపై చేరడానికి సంబంధించిన ఉదాసీనతను తొలగించి, ప్రయోజనాల మధ్య వైరుధ్యాన్ని-కాన్‌ఫ్లిక్టింగ్ ఆఫ్ ఇంటరెస్ట్-క్రోడీకరించవలసిన అవసరాన్ని ఇలాంటి ఘటనలు నొక్కి చెబుతాయి.

పాశ్చాత్య దేశాల్లో సొంత ప్రయోజనాల కోసం ప్రభుత్వ అధికారులు అధికార దుర్వినియోగం చేయడానికి మూలం ఈ ప్రయోజనాల మధ్య వైరుధ్యమే. చాలావరకు బ్రిటన్ చరిత్రలో పాలకులు, వారి అధికారుల మధ్య ఈ ప్రయోజనాల వైరుధ్యం విస్తృతంగా ఉండేది. 1660లో రాయల్ నేవీలో గొప్ప సంస్కర్త శామ్యూల్ పెపీస్ సైతం స్మగ్లింగ్‌లో పాత్ర పోషించాడని ఆరోపణలు వచ్చాయి. కానీ కాలానుగుణంగా పాలక సంస్కృతిలో మార్పు వచ్చింది. చక్రవర్తి కింద పనిచేసే మంత్రులు ఉన్నతోద్యోగ వర్గంలో సమర్థతను పెంచేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. అప్పట్లో బ్రిటన్ అనేక యుద్ధాల్లో మునిగి ఉన్నందున ప్రత్యేకించి పన్నుల సేకరణలో సమర్థ పాలన అత్యవసరమైంది.

స్వతంత్ర న్యాయవ్యవస్థతోపాటు వికసిస్తున్న ప్రెస్ వల్ల కార్యనిర్వాహక వర్గానికి, దాని అధికార దుర్వినియోగానికి పరిమితులు విధించాయి. విద్యా వ్యాప్తి వల్ల, ప్రజల్లో తమ హక్కుల పట్ల అప్రమత్తత పెరిగింది. ఇక జాతీయ ఆడిటర్ ఆఫీసు ఏర్పాటుతో పాలనా వ్యవహారాల్లో అవినీతిని తగ్గించడానికి దారితీసింది. 20వ శతాబ్ది నాటికి బ్రిటన్‌లో అవినీతి గణనీయంగా బలహీనపడింది.

కొంతమంది ఉన్నతోద్యోగులు పబ్లిక్ సర్వీసులోని సుగుణాలను, రిటైర్మెంట్ సమయంలో ప్రైవేట్ లాభంతో కలిపేశారు. తమ చర్యలు, వైఖరుల కారణంగా వీరు ప్రయోజనాల మధ్య వైరుధ్యం బారిన పడ్డారు. దీనికి బదులుగా సామాజిక చైతన్యపరులు, నేతలు వీటిపై ప్రశ్నలు సంధించినప్పుడు వారి వాదనలు వృద్ధికి, పెట్టుబడికి వ్యతిరేకం అని ఆరోపిస్తూ ప్రశ్నించినవారినే లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తూ వచ్చారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడమే కాకుండా ప్రయోజనాల మధ్య వైరుధ్యం విషయంలో మన ఉదాసీన సంస్కృతిని మార్చే వైపుగా సరైన న్యాయ యంత్రాంగాన్ని కూడా నెలకొల్పాల్సి ఉంది.

ఇకపోతే, ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికారక సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏ) ఉదాహరణను తీసుకుంటే, వ్యవస్థలోని రెగ్యులేటరీ బోర్డులను స్వార్థ ప్రయోజనాలు క్రమేణా కమ్మేస్తూ వచ్చాయి. ఆహారభద్రతను పర్యవేక్షించడంలో ఈ రెగ్యులేటర్ సూత్రరీత్యా స్వతంత్రంగా ఉండాలని భావించారు కానీ, 2014 వరకు ఆహార పరిశ్రమ ప్రతినిధులే దీనికి సంబంధించిన శాస్త్రీయ కమిటీలలో నియమితులవుతూ వచ్చారు. పురుగు మందులు, ఆహారాన్ని లేబుల్ చేయడం, వేడి చేసి మళ్లీ కావలసిన రూపంలో చల్లబర్చడం వంటి అంశాల్లో ప్రమాణాల కల్పనలో అధికారులను అనుసంధానించేవారు. ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక సైన్స్ విభాగాల్లో పలు పరిశోధన ప్యానెళ్లకు కార్పొరేట్ ప్రాజెక్టులలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలను నియమిస్తూ వచ్చారు. ఉదాహరణకు, మానవులపై



జరిపే క్లినికల్ పరీక్షలకు చెందిన ఒక ప్యానెల్‌లో నియమితుడైన నిపుణుడు అతిపెద్ద కార్పొరేట్ ఆసుపత్రికి చెందిన క్లినికల్ పరీక్షల విభాగాధిపతిగా ఉండటం గమనార్హం.

ప్రభుత్వ నియమావళిలో ఎలాంటి విధానాలు లేకపోవడం వల్ల ఇలా జరుగుతోందనుకోవద్దు. భారత ఉద్యోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో దీనికి సంబంధించి ఓ అధికారిక విధానం ఉంది. దీని ప్రకారం సీనియర్ ప్రభుత్వోద్యోగులు తమ రిటైర్మెంట్ తర్వాత వాణిజ్య రంగంలో ఉపాధి పొందాలంటే తప్పకుండా అనుమతి తీసుకోవలసిందే. కానీ, ఇలాంటి పరిమితిని మంజూరు చేయడం ప్రభుత్వ విచక్షణపై ఆధారపడి ఉండేది కానీ దీనిపై ఎలాంటి క్రోడీకరణ యంత్రాంగం ఉండేది కాదు. చిట్టచివరకు అలాంటి అభ్యర్థనలపై ప్రభుత్వాలు ఒక ఉదార వైఖరిని చేపట్టాయి. ఉదాహరణకు, ఒక రెవెన్యూ కార్యదర్శి ఒకటి కాకుండా అయిదు సంస్థల్లో పలుహోదాల్లో చేరడానికి అనుమతించారు. ట్రాయ్ మాజీ అధిపతి రిటైరైన కొద్ది నెలల్లోపే అపఖ్యాతి చెందిన ఒక కార్పొరేట్ లాబీయిస్ట్ ప్రమోట్ చేసిన సంస్థలో పనిచేయడానికి అనుమతించారు. ఇకపోతే, కేంద్ర మాజీ ఆర్థిక కార్యదర్శి ఒక ప్రైవేట్ ఆటోమొబైల్ సంస్థలో భారీ ప్యాకేజీతో చేరినప్పుడు అంత పెద్ద చెల్లింపులు వారి నైపుణ్యాల కోసం కాకుండా వారి పలుకుబడి కారణంగా దక్కాయన్న సందేహాలు తలెత్తాయి. ప్రయోజనాల మధ్య వైరుధ్యాన్ని తొలగిస్తూ నిబంధనలను అమలుచేస్తే అలాంటి బ్యూరోక్రాట్లు ప్రైవేట్ రంగంలో తమ అనుభవాన్ని ఉపయోగిస్తే తప్పులేదు.

ప్రయోజనాల మధ్య వైరుధ్యంలో తమ పాత్రను బహిర్గతం చేయని వారిని శిక్షించేలా మనం చట్టం చేయవలసిన అవసరం ఉంది. ఇఎమ్ఎస్ నాచియప్పన్ ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్ 2012 ప్రకారం, ఇలాంటి చట్టం న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ వంటి పాలనా రంగాలన్నింటికీ వర్తించాల్సి ఉంది. రిటైరయ్యాక ప్రైవేట్ రంగంలో చేరాలని ఆసక్తి ఉన్నవారు ముందస్తుగా రిటైర్ అయ్యేలా నిబంధనలను మార్చాలని, కనీసం అయిదేళ్ల పాటు ప్రవేట్ రంగంలో పనిచేయకుండా వారిపై ఆంక్షలు విధించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రతిపాదించింది కూడా. అప్పుడే రిటైరైన ఉన్నతాధికారి ప్రభుత్వంలో తనకున్న పలుకుబడిని తాను చేరే ప్రైవేట్ సంస్థకు ఉపయోగించలేడు. అదే సమయంలో అలాంటి సంస్థలలో చేరతామని రిటైర్డ్ అధికారులు చేసిన అభ్యర్థనలను తోసిపుచ్చడానికి కారణాలను కూడా స్పష్టంగా ఈ చట్టంలో పొందుపర్చాలి.

అంతిమంగా పారదర్శకతా సంస్కృతిని పెంపొందించాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు ప్రైవేట్ వ్యవహారాల్లో పాలు పంచుకోలేదని స్పష్టం చేయడమే కాకుండా ఉన్నతాధికారులు కూడా తమ రిటైర్మెంట్ అనంతర ప్రణాళికల గురించి ముందే బహిరంగ పర్చడం చాలా అవసరం. ఇలాంటి పారదర్శకత లేనిదే భారతీయ సమాజం, పాలనా వ్యవస్థ, దాని ప్రైవేట్ రంగం ఇన్ సైడర్ ట్రేడింగుతో ఘర్షిస్తూనే ఉంటుంది.

వ్యాసకర్త పార్లమెంటు సభ్యులు I fvg001@gmail.com

ద్వి శతమానం భవతి!

మనిషి తాబేలులాగా పెంకులు కట్టిన మూపులతో వందల ఏళ్లు బతకచ్చు. కానీ మనిషి మనిషిలా హృదయవాదిగా జీవిస్తేనే సార్థకత.



శ్రీరమణ

మనిషి ఆయుర్దాయం 140 సంవత్సరాలకి పెంచగల అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు నిండు సభలో హామీ ఇచ్చారు. తథాస్తు! మనిషికి ఎన్నేళ్లు బతికినా తనివి తీరదు. ఐశ్వర్యవంతులే కాదు దరిద్రులు కూడా సెంచరీ కొట్టాలని కోరుకుంటారు. ఇప్పటివరకూ 'శతమానం భవతి' అన్నది సర్వామోదం పొందిన దీవెనగా నిలబడింది. ఇకపై ఇలా అంటే 'ఆయుష్మాన్ భవ' అనే అర్థం స్ఫురిస్తుంది. ఇప్పుడన్ని జీవిత కొలమానాల్ని సరితూచి మళ్లీ నిర్ధారించాల్సి ఉంది. ఈమధ్య కాలంలో యనభై దాటడం అవలీలగా మారిన సందర్భంలోనే బోలెడు తేడాలు, సమస్యలు తలెత్తుతున్నాయ్. ఒకప్పుడు అరవై, నిండగానే, హమ్మయ్య ఒక చక్రం తిరిగిందని దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకునేవారు. యాభై దాటిందగ్గర్నించి 'పెద్దాయన'గా అరవై దాటాక 'ముసలాయన' అనీ సంబోధించేవారు. ఇప్పుడవి అమర్యాదలయినాయ్. ఇప్పుడు ఈ కొత్త భరోసా నేపథ్యంలో మన రాజ్యాంగాన్ని తిరగరాసుకోవలసి ఉంటుంది. భారతీయ శిక్షాస్మృతిని సవరించాలి.

యావజ్జీవమంటేనే కనీసం యాభై ఏళ్లుగా నిర్ణయించాలి. జీవిత బీమా పరిమితిని నూటయాభైకి పెంచుకోవాలి. ఇప్పుడే ఉద్యోగ పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వాలు గింగిరాలు తిరుగుతున్నాయ్. ముప్ఫై మూడేళ్లు ఉద్యోగం చేసి ముప్ఫై నాలుగేళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న ఆయురారోగ్యవంతులున్నారు. అందుకే ఒక దశలో 'గోల్డెన్ హ్యాండ్ షేక్' ఆశపెట్టింది ప్రభుత్వం. కానీ ఈ గడుసు పిండాలు బంగారు కరచాలనానికి ససేమిరా అన్నారు. ఇప్పుడైతే రిటైర్మెంట్ వయసు వందకి పెంచేసి, ఇహ దణ్ణం పెట్టెయ్యడం మంచిది. రాజకీయాల్లో కటాఫ్ రెండు ఆవృతాలకు అంటే నూట ఇరవైకి పెట్టుకోవచ్చు. ఎముకలు కలిగిన వయస్సు మళ్లిన సోమరులారా చావండి అన్నాడు శ్రీశ్రీ. ఇప్పుడేమనేవారో తెలియదు. ఇదే సత్యమై నిత్యమై కార్యరూపం ధరిస్తే మొట్టమొదట బాగుపడేది కార్పొరేట్ ఆస్పత్రులు. ఎందరో వయస్సు మళ్లిన జాంబవంతులు, భీష్మాచార్యులు దొరుకుతారు. ఎన్నో కొత్త రోగాలు పుట్టుకొస్తాయ్. అందరూ వైద్యబీమాకి అలవాటుపడతారు. ఇక దున్నుకోవడమే పని.

అక్షర తూణీరం



ఈ జీవితం క్షణికం, బుద్బుదప్రాయం, మూన్నాళ్ల ముచ్చటే చిలకా లాంటి తత్వాలకు కాలం చెల్లినట్టే. మనిషికి ఇంకా ఆశ పెరుగుతుంది. దోచుకోవడం, దాచుకోవడం తప్పనిసరి అవుతుంది. ఇకపై 140 ఏళ్ల సంసారికి ఆరో తరం వారసుణ్ణి చూసే అవకాశం వస్తుంది.

పొందు కుదురులోనే నాలుగొందల పిలకలు లేచే అవకాశం ఉంది. ఎందుకొచ్చిందోగానీ 'పాపి చిరాయువు' అని నానుడి ఉంది. అధిక కాలం బతికితే అనర్థాలేనని అనుభవజ్ఞులు అంటారు. నిజమే, జీవితంలో ఏది శాపమో, ఏది వరమో తెలిసీ తెలియని అయోమయంలో బతికేస్తూ ఉంటాం. శాస్త్ర విజ్ఞానం పెరిగింది. దేనివల్ల మనిషి ఆయుర్దాయం పెరుగుతుందో తెలుసుకుంటే చాలు. ఎన్ని వందల ఏళ్లయినా బతికించగలరు. మనిషి తాబేలులాగా పెంకులు కట్టిన మూపులతో వందల ఏళ్లు బతకచ్చు. కానీ మనిషి మనిషిలా హృదయవాదిగా జీవిస్తేనే సార్థకత.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)





శుక్రవారం ఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ, ఆసియాన్ దేశాధినేతలు. పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఆసియాన్ దేశాల శకటం. రాజ్‌పథ్ పరేడ్‌లో పాల్గొన్న సైనిక వాహనాలు

జయహో జెండా పండుగ

కన్నుల పండువగా 69వ రిపబ్లిక్ డే వేడుకలు

- పతాకావిష్కరణ చేసిన రాష్ట్రపతి.. అనంతరం సైనిక వందనం స్వీకరణ
- తొలిసారి ముఖ్య అతిథులుగా ఆసియాన్ దేశాధినేతలు
- వివిధ దేశాల దౌత్య కార్యాలయాల్లో ఘనంగా వేడుకలు

న్యూఢిల్లీ: భారత దేశభక్తిని, అస్త్ర శక్తిని ప్రతిబింబించేలా 69వ గణతంత్ర వేడుకలు ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఆసియాన్ దేశాధినేతల సమక్షంలో భారత సంప్రదాయాలు, సైనిక పాటవ ప్రదర్శనల నడుమ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. రాజ్‌పథ్ రోడ్డులో జరిగిన ఈ కార్యక్రమానికి వేలమంది ప్రజలు, ప్రముఖులు హాజరయ్యారు. త్రివర్ణపతాక ఆవిష్కరణ అనంతరం భారత త్రివిధ దళాల అధిపతి, రాష్ట్రపతి రామ్‌నాథ్ పరేడ్‌లో సైనిక వందనం స్వీకరించారు. రాష్ట్రపతిగా కోవింద్‌కు ఇదే తొలి గణతంత్ర దినోత్సవ వేడుక.

చీఫ్ గెస్ట్‌లుగా..

ఆసియాన్ దేశాల వ్యూహాత్మక సంబంధాలతో బలమైన కూటమిగా ఎదిగే క్రమంలో భారత్‌లో జరుగుతున్న జాతీయ వేడుకలకు ఈ 10 దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరవటం ఇదే తొలిసారి. మయన్మార్ కౌన్సెలర్ ఆంగ్‌సాన్ సూచీ, వియత్నాం ప్రధాని ఎన్‌గెయెన్ జువాన్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రొడ్రిగో డ్యుటర్టె, థాయలాండ్ ప్రధాని ప్రయుత్ చనోచా, సింగపూర్ చీఫ్ సీన్ లూంగ్, బ్రూనై సుల్తాన్ హాజీ బోల్‌కయా, ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో, మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, లావోస్ పీఎం థాంగ్‌లౌన్ సిసోలిత్, కంబోడియన్ అధ్యక్షుడు హున్‌సేన్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల ప్రారంభానికి ముందు ప్రధాని.. రక్షణ మంత్రి, త్రివిధ దళాల అధిపతులతో కలిసి ఇండియా గేట్ వద్ద అమర జవాన్ జ్యోతి వద్ద నివాళులర్పించారు. గణతంత్ర వేడుకల్లో.. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, జైట్లీ, జేపీ నడ్డా, రవిశంకర్ ప్రసాద్ సహా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, మాజీ ప్రధాని మన్మోహన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 61 మంది గిరిజన ప్రముఖులు ఈ వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు.

కళ్లన్నీ ఆకాశంలోనే..

పరేడ్ చివర్లో ఎమ్ఐ–17 యుద్ధ విమానాలు, రుద్ర హెలికాప్టర్లు, ఐఏఎఫ్ విమానాలతో వైమానికదళం చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఎల్‌హెచ్, ఎంకే–4, డబ్ల్యూఎస్ఐ హెలికాప్టర్లు, సీ–130జే సూపర్ హెర్క్యులస్ యుద్ధ విమానం చేసిన విన్యాసాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి.

21 గన్ సెల్యూట్

సంప్రదాయం ప్రకారం త్రివర్ణ పతాకావిష్కరణ తర్వాత జాతీయగీతం ఆలాపనతోపాటు 52 సెకన్లపాటు 21 గన్ సెల్యూట్ నిర్వహించారు. 2281 రెజిమెంట్‌కు చెందిన ఏడు ఫిరంగుల ద్వారా ఈ గన్ సెల్యూట్ నిర్వహించారు. గణతంత్ర దినోత్సవంతోపాటు, ఆగస్టు 15, ఆర్మీడే (జనవరి 15), అమరవీరుల దినం (జనవరి 30)న ఈ రకమైన గన్‌సెల్యూట్ చేస్తారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా 13 రాష్ట్రాలు, పలు మంత్రిత్వ శాఖలు తమ శకటాలను ప్రదర్శించాయి. డీఆర్‌డీవో సంస్థ.. నిర్భయ్ క్షిపణిని, అశ్విని రాడార్ వ్యవస్థతో కూడిన శకటంతో పరేడ్‌లో పాల్గొంది.

'జగమంత' వేడుకలు

ఢిల్లీతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. ప్రజలు ప్రాథమిక హక్కులను పొందటంతోపాటు తమ బాధ్యతలు గుర్తెరిగి మసలుకోవాలని ప్రజలకు సూచించారు. రాజస్తాన్‌లోని పోఖ్రాన్‌లో ఓ భారతీయుడు, ఇద్దరు సౌదీ జాతీయులు శాటిలైట్ ఫోన్లతో సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చైనా, రష్యా, యూకే, ఈజిప్ట్, ఇండోనేసియా, సింగపూర్, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాల్లోని దౌత్యకార్యాలయాల్లోనూ పతాకావిష్కరణ ఘనంగా జరిగింది.

భద్రతను పక్కనపెట్టి..

గణతంత్ర దినోత్సవ సంబరాల అనంతరం ప్రధాని మోదీ భద్రతను పక్కనపెట్టి వేడుకలను చూసేందుకు రాజ్‌పథ్‌కు వచ్చిన ప్రేక్షకులకు బారికేడ్ల వద్దకెళ్లి అభివాదం చేశారు. తలపై కాషాయం, ఎరుపు, ఆకుపచ్చని సంప్రదాయ తలపాగాతో ప్రత్యేకంగా కనిపించిన మోదీ.. తమ వద్దకు వస్తుండటంతో ప్రేక్షకుల్లో హర్షం వ్యక్తమైంది. మోదీ, మోదీ నినాదాలతో వాతావరణాన్ని వారంతా మరింత హుషారుగా మార్చారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం అనంతరం కూడా ప్రజల వద్దకెళ్లి వారితో కరచాలనం చేశారు. ఆసియాన్ దేశాల అధినేతలు పాల్గొన్న ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 60వేల మంది ఢిల్లీ పోలీసు, ఆర్మీ బలగాలు, షార్ప్ షూటర్లతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

కన్నుల పండువగా పరేడ్

మార్చ్‌పాస్ట్‌లో ఆసియాన్ జెండాతోపాటుగా 10 దేశాల జాతీయజెండాలనూ ప్రదర్శించారు. బీఎస్ఎఫ్ మహిళా సైనికుల 'సీమా భవానీ' బృందం చేసిన మోటార్ సైకిల్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారత ఆర్మీ యుద్ధ ట్యాంకు టీ–90 (భీష్మ), బ్రహ్మోస్ మిసైల్ వ్యవస్థ, శత్రువుల ఆయుధాలను పసిగట్టే రాడార్, బ్రిడ్జ్ లేయింగ్ ట్యాంక్ టీ–72, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ సహా తదితర భారత మిలటరీ సామర్థ్యాలను పరేడ్‌లో ప్రదర్శించారు. ఆర్మీ అశ్వికదళం, పంజాబ్ రెజిమెంట్, మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీ, డోగ్రా రెజిమెంట్, నౌక, వైమానిక దళాలూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. ఢిల్లీ, నాగ్‌పూర్‌లోని పాఠశాలల విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



నిరాలా కుటుంబానికి అశోకచక్రను ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి కోవింద్

రాష్ట్రపతి ఉద్వేగం

ఈ వేడుకల్లో భారత అత్యుత్తమ మిలటరీ సేవా పురస్కారం (శాంతి సమయాల్లో ఇచ్చే) అశోకచక్రను ఐఏఎఫ్ గరుడ్ కమాండో కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలా (మరణానంతరం)కు అందజేశారు. ఈ అవార్డు ఇస్తున్న సమయంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్వేగానికి గురయ్యారు. గతేడాది నవంబర్‌లో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ అమరుడైన ఎయిర్‌ఫోర్స్ గరుడ్ కమాండో, కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలా ఈ ఏడాది అశోకచక్ర అవార్డుకు ఎంపికయ్యారు. నిరాలా భార్య సుష్మానంద్, ఆయన తల్లి మాలతీ దేవీ ఈ అవార్డును అందుకున్నారు. అశోక చక్ర అందిస్తున్న సందర్భంగా రాష్ట్రపతి ఉద్వేగానికి గురయ్యారు. తన సీట్లో తిరిగి కూర్చోగానే చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ కనిపించారు.

10 దేశాల్లోని 27 పత్రికల్లో మోదీ వ్యాసం



ఆసియాన్ దేశాల పత్రికల్లో మోదీ వ్యాసం

సింగపూర్: భారత్, ఆసియాన్ దేశాల సంబంధాలు వివాదాలు, విమర్శలకు అతీతమైనవని మోదీ అన్నారు. గణతంత్ర దినోత్సవాన 10 ఆసియాన్ దేశాల అధినేతలు భారత్‌కు అతిథులుగా వచ్చిన సందర్భంగా ప్రధాని మోదీ రాసిన వ్యాసం 10 భాషల్లో, 27 పత్రికల్లో ప్రచురితమైంది. 10 ఆసియాన్ దేశాల్లోని పత్రికలు ఒకే రోజున మోదీ వ్యాసాన్ని ప్రచురించడం విశేషం. ఆసియాన్ దేశాలతో భారత భాగస్వామ్యం, భవిష్యత్తు గురించి మోదీ ఈ వ్యాసంలో రాశారు. ఆసియాన్ దేశాలతో వాణిజ్యాన్ని మరింత పెంపొందించుకునేందుకు భారత్ ఎంతో ఆసక్తిగా ఉందని మోదీ వ్యాసంలో పేర్కొన్నారు. థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, మలేసియా, సింగపూర్, మయన్మార్, కాంబోడియా, లావోస్, బ్రూనై దేశాల్లో మోదీ వ్యాసం ప్రచురితమైంది. భారత్–ఆసియాన్ 25 ఏళ్ల సంబంధాలను గుర్తుచేసుకుంటూ ఆ దేశాధినేతలందరినీ 69వ గణతంత్ర దినోత్సవాన భారత్‌లో కలుసుకోవడం తనకు గౌరవంగా ఉందని మోదీ వ్యాసంలో రాశారు. ఆగ్నేయాసియా దేశాలతో భారత్‌కు రెండు వేల ఏళ్లకు పైగానే సత్సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు.

ఆసియాన్ నేతలతో మోదీ భేటీ

ప్రధాని మోదీ శుక్రవారం మలేసియా, లావోస్ ప్రధానులతోపాటు ఇండోనేసియా అధ్యక్షుడితో భేటీ అయ్యారు. ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి వచ్చిన వీరంతా శుక్రవారం గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ప్రధాని మోదీ మలేసియా ప్రధాని నజీబ్ రజాక్‌తో సమావేశమయ్యారు. ఉగ్రవాదంపై పోరు, రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో సహకారం, సంబంధాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. తర్వాత ప్రధాని లావోస్ ప్రధాని సిసోలిత్‌తో సమావేశం సందర్భంగా ఎంతోకాలంగా రెండు దేశాల మధ్య కొనసాగుతున్న స్నేహభావం, సహకారాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడోతో ప్రధాని మోదీ జరిపిన చర్చల్లో ఆర్థిక సహకారం బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను గుర్తించారు. చైనాకు దీటుగా భారత్ కూడా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని వారు కోరినట్లు విదేశంగా శాఖ తూర్పు విభాగం కార్యదర్శి ప్రీతి సరణ్ వెల్లడించారు.

పాక్ స్వీట్లకు బీఎస్‌ఎఫ్ నో

అమృత్‌సర్: 69వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అట్టారి–వాఘా బోర్డర్‌లో పాక్ రేంజర్ల నుంచి స్వీట్లు అందుకునేందుకు సరిహద్దు భద్రత దళం(బీఎస్ఎఫ్) నిరాకరించింది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ)తోపాటు నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వెంట పాక్ రేంజర్ల కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు నిరసనగా బీఎస్ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు కొన్ని కారణాల వల్లే ఈసారి అట్టారి–వాఘా సరిహద్దులో స్వీట్లు పంచుకోలేదని బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కేకే శర్మ మీడియాకు తెలిపారు. మంచి కారణాలుంటేనే భవిష్యత్‌లో స్వీట్లు పంచుకోవాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. తాము స్వీట్లు స్వీకరించబోమని గురువారమే పాక్‌కు తెలియజేశామన్నారు. సాధారణంగా దీపావళి, రంజాన్ లాంటి పర్వదినాలతో పాటు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఇరుదేశాల సైనికులు స్వీట్లు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

'ఉపాధి' పనులపై 76శాతం మందికి సంతృప్తి



న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులతో ఎంతో మంచి జరిగిందని ప్రజలు అనుకుంటున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఉపాధి పథకం పనుల నాణ్యతపై 76శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. తమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ ఇటీవల చేపట్టిన సర్వేలో కేవలం 0.5శాతం మంది మాత్రం ఉపాధి పనుల్లో నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొంది. గ్రామాల్లో ఉపాధి వనరులను కల్పించటం ద్వారా స్థిరమైన అభివృద్ధికి అవసరమైన వనరులను సృష్టించటమే ఉపాధి హామీ పథకం ఉద్దేశం. దీనికోసం గత మూడేళ్లుగా చేపట్టిన అనేక పనులను పూర్తి చేసి, నాణ్యతను పెంచినట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో 2016–17 కాలంలో దాదాపు 1.02 కోట్ల పనులను పూర్తి చేసినట్లు పేర్కొంది.

30 మంది వలసదారుల జలసమాధి

అడెన్: యెమెన్ తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో 30 మంది ఆఫ్రికా వలసదారులు మృతిచెందారు. ఎడెన్ నుంచి బయల్దేరిన ఆ పడవలో కనీసం 152 మంది సోమాలియా, ఇథియోపియా దేశాల పౌరులు ఉన్నట్లు తెలిసింది. స్మగ్లర్లు వలసదారులను అక్రమంగా జిబౌతీకి తీసుకెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు ఐరాస శరణార్థులు, వలసదారుల సంస్థ తెలిపింది. ప్రయాణికులపై గుర్తు తెలియన వ్యక్తులు కాల్పులకు దిగడంతో పడవ అదుపు తప్పి మునిగిపోయినట్లు వార్తలొచ్చాయి. ప్రమా యెమెన్‌లో కొనసాగుతున్న ఘర్షణలు శరణార్థులకు ముప్పుగా మారాయి.

బెంగాలీ నటి సుప్రియా దేవి కన్నుమూత



కోల్‌కతా: బెంగాలీ ప్రముఖ నటి సుప్రియా దేవి(85) కన్నుమూశారు. గుండెపోటుతో ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రిత్విక్ ఘటక్ దర్శకత్వం వహించిన 'మేఘే ఢాకా తారా' చిత్రంలో నీతా అనే పాత్ర ఆమెకు మంచి పేరు తెచ్చింది. 1933లో మిచ్కినాలో జన్మించిన సుప్రియా దేవి 1952లో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 55 ఏళ్ల ఎన్నో చిత్రాల్లో నటించారు. అందులో చౌరింగీ, బాగ్ బందీ ఖేలా, సన్యాసి రాజ్, దేబ్‌దాస్ లాంటి క్లాసిక్ చిత్రాలున్నాయి. 2007లో విడుదలైన నేమ్‌సేక్ చిత్రంలో చివరిసారి నటించారు. దేవికి పద్మశ్రీ అవార్డుతో పాటు బెంగాల్ ప్రభుత్వ పౌర పురస్కారం బంగా విభూషణ్ లభించాయి. శుక్రవారమే అధికారిక లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

కశ్మీర్‌పై అంతర్జాతీయ చర్చ!

దావోస్‌లో పాక్ విదేశాంగ మంత్రి వ్యాఖ్య



దావోస్: కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ స్థాయిలో చర్చించాల్సిన అవసరం ఉందని పాక్ విదేశాంగ మంత్రి ఖ్వాజా మహ్మద్ అసిఫ్ దావోస్‌లో అన్నారు. ప్రస్తుత ప్రపంచంలోని వివిధ విభేదాలకు కశ్మీర్ వివాదం, రోహింగ్యాల అంశం కూడా కారణాలేనని ఆయన పేర్కొన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సుకు పాకిస్తాన్ ప్రధాని షాహిద్ ఖాక్కన్ అబ్బాసీతోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. అసిఫ్ మాట్లాడుతూ 'ప్రపంచం ముక్కలుగా విడిపోవడానికి కశ్మీర్ వివాదం, రోహింగ్యాల అంశం కూడా కారణమే' అని అన్నారు. ఈ ఏడాది డబ్ల్యూఈఎఫ్ సమిట్ నినాదమైన 'ముక్కలైన ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్తు నిర్మాణం'ను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఇటు చైనా, అటు అమెరికాతో తమ ద్వైపాక్షిక బంధాలు ఎంతో దృఢంగా ఉన్నాయని పాక్ ప్రధాని షాహిద్ ఖాక్కన్ అబ్బాసీ అన్నారు. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ), చైనా–పాక్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ) తదితర ప్రాజెక్టులతో గత కొన్నేళ్లలో చైనాతో పాక్ బంధం మరింత బలపడిందని అబ్బాసీ చెప్పారు.

ఆరో వరసలో రాహుల్!

బీజేపీ దురహంకారానికి నిదర్శనం: కాంగ్రెస్



వెనుక కూర్చున్న కాంగ్రెస్ చీఫ్ రాహుల్, ఆజాద్

న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకలకు హాజరైన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌కు ఆరో వరసలో సీటును కేటాయించారు. దీంతో రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఆజాద్‌తో కలసి ఆయన తనకు కేటాయించిన సీటులోనే కూర్చున్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అధికార బీజేపీపై విరుచుకుపడింది. సంప్రదాయాలను విస్మరించి ప్రవర్తిస్తున్న బీజేపీ నాయకుల దురహంకారానికి ఈ ఘటన ఓ నిదర్శనమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా దుయ్యబట్టారు. ఇటీవలే పార్టీ అధ్యక్షురాలి పదవి నుంచి తప్పుకున్న సోనియా సహా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులందరూ గణతంత్ర వేడుకల్లో ముందు వరసలోనే కూర్చొనేవారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. 'సంప్రదాయాన్ని విస్మరించి ఉద్దేశపూర్వకంగానే, రాహుల్‌ను అవమానించాలని కాంగ్రెస్ అధ్యక్షుడికి ఆరో వరసలో సీటును కేటాయించారు. అయినా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడమే మాకు అన్నింటికన్నా ముఖ్యం' అని రణ్‌దీప్ ట్వీట్ చేశారు. కాగా, మాజీ ప్రధానులు దేవెగౌడ, మన్మోహన్ సింగ్, ప్రస్తుత మంత్రులు స్మృతీ ఇరానీ, థావర్ చంద్ గెహ్లాట్ తదితరులు తొలి వరసలో కూర్చున్నారు.

'నీట్'లో ఒకటే సెట్!



న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)కు ఈ ఏడాది నుంచి సీబీఎస్‌ఈ ఒకే సెట్ ప్రశ్నపత్రం రూపొందించనుంది. సుప్రీంకోర్టుకు సీబీఎస్‌ఈ ఈ విషయం తెలిపింది. ఇప్పటివరకు హిందీ, ఇంగ్లిష్ సహా 10 భాషల్లో పరీక్ష రాసేందుకు విద్యార్థులకు అనుమతి ఉండేదని కోర్టుకు చెప్పింది. వేర్వేరు భాషల్లో ప్రశ్నపత్రం రూపొందిస్తే వాటిని దిద్దడం కష్టమని, పైగా ప్రశ్నలు వేర్వేరుగా ఉన్నప్పుడు విద్యార్థుల సామర్థ్యాన్ని ఎలా అంచనా వేయగలుగుతారని ఉన్నత న్యాయస్థానం గతంలో పేర్కొంది. అన్ని పేపర్లలో కఠినత్వం ఒకే స్థాయిలో ఉంటుందని, అలాంటప్పుడు వేర్వేరు సెట్ల ప్రశ్న పత్రం రూపొందించడంలో తప్పు లేదన్న సీబీఎస్‌ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. అయితే కోర్టు సలహాలు విన్న సీబీఎస్‌ఈ.. ఈ ఏడాది నుంచి ఒకే సెట్ ప్రశ్నపత్రం రూపొందించి వాటిని ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేస్తామని వెల్లడించింది. ఒకే సెట్ ప్రశ్నపత్రం రూపొందించేలా సీబీఎస్‌ఈని ఆదేశించాలంటూ 'సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు' పిటిషన్ దాఖలు చేసింది.

'అమెరికా ఫస్ట్' అంటే..!

'అమెరికా మాత్రమే అని అర్థం కాదు

- న్యాయబద్ధ స్వేచ్ఛావాణిజ్యానికి నా మద్దతుంటుంది
- ప్రొటెక్షనిజంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివరణ
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ప్రసంగం



దావోస్‌లో ప్రసంగిస్తున్న ట్రంప్

దావోస్: 'అమెరికా ఫస్ట్(తొలుత అమెరికా)' అనే తన నినాదాన్ని 'అమెరికా మాత్రమే' అనే అర్థంలో చూడకూడదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. అమెరికా సాధించిన అభివృద్ధి ద్వారా ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాకంగా ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. అయితే, తన తొలి ప్రాధాన్యత అమెరికానేనని పునరుద్ఘాటించారు. 'అమెరికా ఫస్ట్ అంటే అమెరికా మాత్రమే అని కాదు. అమెరికా అభివృద్ధి చెందితే ప్రపంచమూ వృద్ధి చెందుతుంది' అని అన్నారు. దావోస్ వేదికగా వరల్డ్ ఎకనమిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన దావోస్‌లో కీలక ఉపన్యాసం ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదంపై అమెరికా పోరు కొనసాగిస్తుందని, అఫ్గానిస్తాన్‌ను ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారనివ్వబోమన్నారు.

పెట్టుబడుల్ని ఆహ్వానిస్తున్నాం..

ఏడాది కాలంగా తాను తీసుకున్న నిర్ణయాల్ని ట్రంప్ ప్రస్తావించారు. 'వరుసగా స్టాక్ మార్కెట్ రికార్డులు బద్దలవుతున్నాయి. నేను అధ్యక్షుడైనప్పటి నుంచి ఇంతవరకూ అదనంగా 7 ట్రిలియన్ డాలర్లు మార్కెట్లలోకి వచ్చి చేరాయి. స్వేచ్ఛా వాణిజ్యానికి అమెరికా మరోసారి సిద్ధమని చెప్పేందుకు నేనిక్కడి వచ్చా. అమెరికాలో వ్యాపారానికి, ఉద్యోగాలకు, పెట్టుబడులకు ఇదే మంచి సమయం. నేనెప్పుడూ అమెరికా ఫస్ట్ విధానాన్ని నమ్ముతాను. ప్రపంచ నేతలు కూడా వారి దేశం విషయంలో అలాగే భావించాలి. అధ్యక్షుడిగా దేశం, ఉద్యోగులు, కంపెనీల ప్రయోజనాల్ని ఎల్లప్పుడూ పరిరక్షించాల్సి ఉందన్నారు. ఏదైనా ఒక దేశం నిబంధనల్ని ఉల్లంఘిస్తే స్వేచ్ఛా వాణిజ్య విధానం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

మీడియా రూపం అప్పుడు తెలిసింది

ఉగ్రవాదం విషయంలో అమెరికా పౌరుల్ని, సరిహద్దుల్ని కాపాడుకునేందుకు అవసరమైన చర్యలకు వెనకాడమని ట్రంప్ స్పష్టం చేశారు. 'దుర్మార్గపు పాలన, ఉగ్రవాదం నుంచి ప్రపంచాన్ని కాపాడేందుకు మిత్రదేశాలు తమ భద్రతను పటిష్టం చేసుకోవాలి' అని సూచించారు. అమెరికాలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చిన ప్రతీ సందర్భంలో రెండు పాత చట్టాల్ని తొలగించాలని నిర్ణయించామని చెప్పారు. 'అమెరికాలోని మధ్య తరగతి ప్రజల కోసం భారీగా పన్నులు తగ్గించాం. కార్పొరేట్ వర్గాలకు కూడా ఊరట కల్పించాం. పన్ను తగ్గింపుతో ఒక కుటుంబ వార్షిక ఆదాయం 4 వేల డాలర్లు పెరుగుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. విద్యుత్ స్వయం సమృద్ధి, ఇంధన భద్రత కోసం ఇంధన ఉత్పత్తిపై విధించిన కట్టుబాట్లను ఎత్తివేస్తున్నామని అన్నారు. వ్యాపారవేత్తగా ఉన్నప్పుడూ మీడియా ఎప్పుడూ తనను ప్రేమించేదని, అయితే మీడియా ఎంత మోసపూరితమే రాజకీయాల్లోకి వచ్చాక, అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాకే తెలుసుకోగలిగానని ట్రంప్ పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో బిల్ క్లింటన్ అనంతరం దావోస్‌కు హాజరైన అమెరికా అధ్యక్షుడు ట్రంపే కావడం గమనార్హం.

సెనెట్‌లో హెచ్–1బీ వీసాల పెంపు బిల్లు

వాషింగ్టన్: ప్రతిభావంతులకు అమెరికాలో ఉద్యోగం చేసేందుకు అవకాశం కల్పించేలా హెచ్–1బీ వీసా వార్షిక కేటాయింపుల్ని పెంచాలని ప్రతిపాదిస్తూ అమెరికన్ సెనెట్‌లో ఇద్దరు రిపబ్లికన్ల సభ్యులు బిల్లును ప్రవేశపెట్టారు. హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, పిల్లలకు వర్క్ పర్మిట్లు ఇవ్వాలని, హెచ్1–బీ వీసాదారులు ఉద్యోగాలు మారేందుకు సమయం కేటాయించాలని ప్రతిపాదించారు. వీసాల వార్షిక పరిమితిని 85 వేలకు పెంచాలని, అవసరమైతే 1.95 లక్షలకు పెంచాలని సూచించారు. కాగా, నిపుణులైన ఉద్యోగుల కొరతను అధిగమించేందుకు వీసా లాటరీ విధానానికి ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు. ప్రస్తుతం అమలు చేస్తోన్న డైవర్సిటీ ఇమ్మిగ్రెంట్ వీసా పథకంలో ఏడాదికి 50 వేల మందికి గ్రీన్‌కార్డులు ఇస్తున్నారు. ఈ విధానం అమెరికా భవిష్యత్తుకు లాభదాయకం కాదని ట్రంప్ వాదిస్తున్నారు.

కల్తీ పాలపై హైకోర్టు విచారణ

- ‘పాలు కాదు.. పచ్చి విషం’ కథనంపై పాఠకుడి లేఖ
- ప్రజాహిత వ్యాజ్యంగా విచారణకు స్వీకరణ • 30న విచారణ

సాక్షి, హైదరాబాద్: కల్తీ పాలపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ఉమ్మడి హైకోర్టు స్పందించింది. ‘పాలు కాదు.. పచ్చి విషం’శీర్షికతో సాక్షి పత్రికలో గత ఏడాది డిసెంబర్ 12న ప్రచురితమైన కథనాన్ని హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా (పిల్) పరిగణనలోకి తీసుకుంది. సాక్షి కథనాన్ని చదివిన నల్లగొండకు చెందిన పాఠకుడు కె.నర్సింహారావు లేఖ రూపంలో కల్తీ విషయాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా, ఈ వ్యా జ్యంలో పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి, డెయిరీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ ఎండీ, ఫుడ్ సేఫ్టీ లేబొరేటరీ చీఫ్ పబ్లిక్ అనలిస్ట్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ఈ నెల 30న ధర్మాసనం విచారణ జరపనుంది.

✦ చివరి ఆయకట్టుకూ నీరందాలి: హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులైన ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్, నిజాంసాగర్‌ల కింద ప్రస్తుత యాసంగిలో చివరి ఆయకట్టుకు సైతం నీరందేలా చర్యలు తీసుకోవాలని నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. యాసంగి పంటలకు సాగునీటి సరఫరాను క్రమబద్ధం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం జలసౌధలో ఈ మూడు ప్రాజెక్టుల ఆయకట్టుకు సాగు నీటి సరఫరాపై మంత్రి సమీక్షించారు. కాల్వల వెంట చీఫ్ ఇంజనీర్ సహా ఇతర సిబ్బంది నిరంతరం తిరగాలని, సాగు నీటి సరఫరా తీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఇందుకుగాను జిల్లా కలెక్టర్ల సహకారంతో పాటు రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. చుక్క నీరు వృథా కాకుండా, అత్యంత పొదుపుగా వాడాలని చెప్పారు.

✦ బెటాలియన్స్‌లో ప్రక్షాళన

సెలవు పేరున దోపిడీదారులపై బదిలీ వేటు

సాక్షి, హైదరాబాద్: సెలవుల చాటున సిబ్బందిపై దోపిడీకి పాల్పడుతున్న వారిపై చర్యలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధంచేశారు. ఇటీవల సాక్షి ప్రచురించిన కథనంతో ఈ వ్యవహారంపై బెటాలియన్స్ ఐజీ అభిలాష బిస్త్ సమావేశం నిర్వహించారు. డబ్బులిస్తేనే సిబ్బందికి సెలవులు మంజూరు చేస్తున్నారన్న వ్యవహారంపై బెటాలియన్లలో కమాండెంట్లు, అసిస్టెంట్ కమాండెంట్లతో విచారణ జరిపించారు. విచారణ నివేదికలో ఆరోపణలు వచ్చిన నలుగురు రిజర్వ్ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)లను బదిలీ చేసినట్లు సమాచారం. మరో నలుగురు ఆర్ఐలపై విచారణకు ఆదేశించారు. ఇక నుంచి బెటాలియన్లలో ప్రతీ నెలా ఏయే అధికారి ఎన్ని సెలవులు మంజూరు చేశారు? సెలవులు పొందిన, పొందని సిబ్బంది వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు తనకు పంపించాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది.

✦ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త హత్యపై జాజుల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ మున్సిపల్ చైర్మన్ భర్త శ్రీనివాస్ హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దోషులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి ఎదిగిన నేత శ్రీనివాస్‌ను చూసి ఓర్వలేక కొందరు ఈ ఘోరానికి ఒడిగట్టారన్నారు.

✦ సగరుల అభివృద్ధికి ప్రభుత్వం బాసట



ఈటల రాజేందర్

హైదరాబాద్: సగర(ఉప్పర) కులస్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో సగర సంఘం క్యాలెండర్‌ను ఈటలతోపాటు మంత్రి జోగు రామన్న ఆవిష్కరించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ఈటల చెప్పారు. జీవో 29ఆధారంగా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో రూ.50 లక్షల నుండి రూ.కోటి విలువైన పనులను సగరులకు కేటాయిస్తామని చెప్పారు. బడ్జెట్లో బీసీలకు పెద్దపీట వేయనున్నట్లు జోగు రామన్న తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీసీ నేత బండ ప్రకాశ్, సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బంగారు నర్సింహ్మ సగర, ఉప్పరి శేఖర్ సాగర్, ఉపాధ్యక్షులు ఉప్పరి రమేశ్ సాగర్, చీర్ల రామచంద్రయ్య సగర తదితరులు పాల్గొన్నారు.

✦ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు అస్వస్థత

జహీరాబాద్ పర్యటనలో ఫుడ్ పాయిజనింగ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్ పాయిజన్ కారణంగా తీవ్ర జ్వరం, విరేచనాలతో బాధపడుతుండటంతో ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. కొన్ని రోజులుగా జిల్లాల్లో పర్యటిస్తున్న ఆయన గురువారం జహీరాబాద్‌లో పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యారు. అక్కడే ఆయన భోజనం చేశారు. కొద్దిసేపటికే లక్ష్మణ్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం కోలుకుంటున్నారు.

✦ ప్రమోషన్లలో రిజర్వేషన్లు: ఆర్ కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: బీసీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అనుభవించే ఏ వర్గానికీ లేని క్రీమీలేయర్ బీసీ వర్గానికి పెట్టి బీసీలను అణచివేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 28న క్రీమీలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీసీ టీచర్ల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. బీసీ ఉపాధ్యాయులు పాల్గొనాలని సంఘం నేత సత్యనారాయణ పిలుపునిచ్చారు.

పరిశోధనలతోనే పరిష్కారం

దావోస్‌లో మంత్రి కేటీఆర్

- పరిశోధనల ప్రోత్సాహానికే టీ–హబ్, టీ–వర్క్స్
- టీ–ఫైబర్‌తో ఇంటింటికీ నెట్ • పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ

సాక్షి, హైదరాబాద్: దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు అరుదైన గౌరవం లభించింది. ‘సమాజ ఉన్నతికి డిజిటల్ పరిజ్ఞాన ప్రయోజనాల ఉపయోగం’ అనే అంశంపై శుక్రవారం జరిగిన చర్చాగోష్టిలో ఆయన ప్రసంగించారు. ఈ గోష్టిలో కేటీఆర్ ఒక్కరే ఒక రాష్ట్ర మంత్రిగా ప్రాతినిథ్యం వహించే అవకాశం లభించింది. బెల్జియం, బ్రెజిల్, డెన్మార్క్, పోర్చుగల్, మయన్మార్, ఇండొనేసియా, నైజీరియా, లెబనాన్, బంగ్లాదేశ్, ఖతార్, పాకిస్తాన్ దేశాల కేంద్ర మంత్రులు ఇందులో పాల్గొన్నారు. డిజిటల్ తెలంగాణ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ) అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. ఇంటింటికీ తాగునీరందించేందుకు చేపట్టిన భగీరథ పథకంలో భాగంగానే ఇంటింటికీ ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు టీ–ఫైబర్ ప్రాజెక్టు కింద ఫైబర్‌గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

పరిశోధనలకు మరింత ప్రాధాన్యం

దేశంలో పరిశోధనలకు మరింత ప్రాధాన్యం పెరగాల్సిన అవసరముందని, ఇందుకు దేశంలోని పరిశోధన సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు మరింత చొరవ చూపాలని మంత్రి కోరారు. ఇన్వెస్ట్ ఇండియా అధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన ‘భారత్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్’అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రైవేట్ రంగంలో పెద్దసంస్థలు చేస్తున్న పరిశోధనలతో దేశంలోని విద్యా సంస్థల పరిశోధనలను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలొస్తాయని సూచించారు. హైదరాబాద్‌లోని 50 పరిశోధన సంస్థలను అనుసంధానం చేస్తూ రీసెర్చ్ అండ్ ఇన్నొవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) ఏర్పాటు చేశామన్నారు. ఇస్రో లాంటి భారతీయ సంస్థలు తమ పరిశోధనల పటిమ, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటాయని, అతి తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలు సాధించొచ్చని ఇస్రో విజయాలు నిరూపించాయన్నారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో ఆసక్తి ఉన్న కంపెనీలు టీ–హబ్, టీ–వర్క్స్, రిచ్‌లతో భాగస్వాములు అయ్యేందుకు ముందుకు రావాలన్నారు. హార్డ్‌వేర్ రంగంలో స్టార్టప్‌ల ద్వారా పరిశోధనలు ప్రోత్సహించేందుకు టీ–వర్క్స్ ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సుజ్లాన్ చైర్మన్‌తో..

సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం ముందు వరుసలో ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రముఖ పవన విద్యుత్ కంపెనీ సుజ్లాన్ చైర్మన్ తులసి తంతితో కేటీఆర్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో పవన విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సుజ్లాన్ ఆసక్తిగా ఉన్నదని తులసి తంతి తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం బలోపేతం కోసం చేస్తున్న చర్యల వల్ల భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని పేర్కొన్నారు.



దావోస్‌లో శుక్రవారం ఇన్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ‘భారత్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్’ అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి కేటీఆర్

పరిశోధన ఫలితాలు, మేధో సంపత్తిని కాపాడేందుకు తెలంగాణ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ క్రైమ్ యూనిట్ (టిప్కు)ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కేటీఆర్ కేంద్ర మంత్రి సురేశ్‌ప్రభుతో సమావేశమయ్యారు. సేల్స్ ఫోర్స్ కంపెనీ సీఈవో మార్క్ బేనియఫ్ దావోస్‌లో కేటీఆర్ కోసం విందు ఏర్పాటు చేశారు.

దావోస్‌లో గణతంత్ర వేడుకల్లో కేటీఆర్

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు ప్రాంగణంలోని ఇన్వెస్ట్ ఇండియా పెవిలియన్ వద్ద గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో పాటు ఏపీ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

కథ మళ్లీ మొదటికి..!

‘కృష్ణా’లో వివాదాల పరిష్కారం లేకుండానే ముగుస్తున్న బోర్డు చైర్మన్ పదవి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ జలాల వివాదాలకు ఇప్పట్లో తెరపడేలా లేదు. చాలా అంశాలు కొలిక్కి వచ్చినట్లే వచ్చి మళ్లీ మొదటికి వస్తున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అనేక వివాదాస్పద అంశాలకు పరిష్కారం దిశగా కృష్ణా బోర్డు కసరత్తు చేస్తున్న తరుణంలో ప్రస్తుత చైర్మన్ ఎస్కే శ్రీవాత్సవ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల పరిధిలో వివాదాలన్నీ ఎక్కడవక్కడే ఉన్నాయి. ఈ ఏడాది బేసిన్‌లో ఉన్న నీటిని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 66:34 నిష్పత్తిన వాడుకునేలా ఒప్పందం కుదిరింది. అయితే ఈ వాటాల మేరకు కాకుండా నీటి వినియోగ లెక్కల్లో వ్యత్యాసాలున్నాయి. సాగర్ ఎడమ కాల్వ కింద ప్రతిసారీ నీటి కేటాయింపులు, వినియోగానికి మధ్య వ్యత్యాసం ఏర్పడుతోంది. దీంతో వాస్తవ సరఫరా నష్టాలు ఎలా ఉంటాయన్నది తేల్చేందుకు కృష్ణా బోర్డు రెండు నెలల కిందట కమిటీ వేసినా అది ఇంతవరకు ఏమీ తేల్చలేదు. ఇక శ్రీశైలం నుంచి సాగర్‌కు విడుదల చేసిన నీటిలో 44 టీఎంసీల మేర వ్యత్యాసాలు వచ్చాయి. ఈ అంశం ఇంకా నానుతూనే ఉంది. గత బోర్డు సమావేశంలో ఇరు రాష్ట్రాలు వర్కింగ్ మ్యాన్యువల్‌కు ఓకే చెప్పినా మళ్లీ దానిపై సమావేశం జరగక దానికి ఆమోదం లభించలేదు. అయితే రిటైర్ కానున్న నేపథ్యంలో ఈ నెల 30న సమావేశమై మ్యాన్యువల్‌కు ఆమోదం తెలుపుదామని బోర్డు చైర్మన్ తెలుగు రాష్ట్రాలకు తాజాగా సమాచారం పంపారు. ఇదే సమయంలో మైనర్ ఇరిగేషన్ లెక్కలపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో చర్చించి లెక్కలు తేలుస్తామన్నారు. అయితే ఈ భేటీకి రావడం తమకు కుదరదని తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం బోర్డుకు లేఖ రాసింది. నెలాఖరునే చైర్మన్ పదవీ విరమణ చేస్తుండటం, మళ్లీ కొత్తగా వచ్చే చైర్మన్‌కు అన్ని అంశాలపై అవగాహనకు సమయం పట్టనుండటంతో జల వివాదాలన్నీ మళ్లీ మొదటికి రానున్నాయి.

బీసీ బడ్జెట్ రూ.7,500 కోట్లే!

బడ్జెట్ రూపకల్పనలో బీసీ సంక్షేమశాఖ బిజీ

- ప్రత్యేక అభివృద్ధినిధి, బీసీ నివేదికపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- గతం కంటే అదనంగా 2,500 కోట్ల పెంపునకు ఆర్థికశాఖ సుముఖత



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల బడ్జెట్ గతం కంటే పెరగనుంది. తాజాగా 2018–19 బడ్జెట్ అంచనాల రూపకల్పన ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్థికశాఖ రెండ్రోజుల క్రితం బీసీ సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించింది. గతేడాది బడ్జెట్ కంటే పెంచి అంచనాలు రూపొందించుకోవాలని ఆర్థికశాఖ సూచించింది. బీసీ సంక్షేమ శాఖకు 2017–18లో రూ.5070.76 కోట్లు కేటాయించగా ఈసారి అదనంగా రూ.2,500 కోట్ల మేర పెంచే అవకాశముంది. ఇందులో ప్రగతిపద్దు కింద రూ.4,764.60 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.305.76 కోట్లు కేటాయించింది. దీనిలోనే అత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీ) కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించింది. మిగతా మొత్తాన్ని కల్యాణలక్ష్మి, ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యానిధి పథకాలకు కేటాయించింది. తాజాగా బీసీ బడ్జెట్‌ను రూ.7,500 కోట్ల మేర అంచనాలు రూపొందిస్తోంది. ఈసారి బీసీ కార్పొరేషన్‌కు సంతృప్తికర స్థాయిలో కేటాయింపులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బడ్జెట్‌తో సంబంధం లేకుండా గత ఏడాది రజక, నాయిబ్రాహ్మణ ఫెడరేషన్లకు రూ.500 కోట్లు కేటాయించింది. విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్‌కు సైతం రూ.200 కోట్లు కేటాయించే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది.

ప్రత్యేక అభివృద్ధినిధి మాటేంటి..?

వెనుకబడిన కులాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా కేబినెట్ సబ్ కమిటీ బీసీ నివేదిక రూపొందించింది. నివేదిక రూపకల్పన తొలిరోజు సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ‘బీసీల అభ్యున్నతికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం. ఏకాభిప్రాయంతో ప్రాధాన్యతాక్రమంలో నివేదిక ఇస్తే వెంటనే మంజూరు చేస్తా’అని హామీ ఇచ్చారు. ఆ మేరకు కమిటీ సభ్యులు నివేదిక తయారు చేశారు. కానీ, తాజా బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభమైనా బీసీ నివేదికపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ‘బీసీ నివేదికపై అసెంబ్లీలో చర్చించాల్సి ఉంది. ఆ తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశముంది. అందుకే నివేదికను సీఎంకు ఇవ్వలేదు. సీఎం ఆదేశం వచ్చిన వెంటనే నివేదిక సమర్పిస్తాం. అసెంబ్లీలో చర్చిస్తాం.’అని మంత్రి రామన్న ‘సాక్షి’తో అన్నారు.

20 లక్షల మంది భక్తులు!

తరలించేలా మేడారం జాతరకు ఆర్టీసీ ఏర్పాట్లు

- 4 వేల బస్సులు.. విధుల్లో 11 వేల మంది సిబ్బంది
- సీసీ కెమెరాలు.. ఉపగ్రహ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షణ
- నార్లాపూర్, జంపన్నవాగు నుంచి జాతర వద్దకు ఉచిత బస్సులు

సాక్షి, హైదరాబాద్: నాలుగు వేల బస్సులు.. 11 వేల మంది సిబ్బంది.. 20 లక్షల మంది ప్రయాణికుల తరలింపు లక్ష్యం.. సీసీ కెమెరాలు, ఉపగ్రహం ద్వారా ట్రాకింగ్‌తో పర్యవేక్షణ.. గిరిజన కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు ఆర్టీసీ ప్రణాళిక ఇది. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. అప్పటికప్పుడు సిద్ధంగా ఉన్న ప్రయాణికులెందరు, వారికి ఎన్ని బస్సులు అవసరమన్నది క్షణాల మీద గుర్తించి.. అంతే వేగంగా బస్సులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తుండటం ఈసారి ప్రత్యేకత. గత జాతర కంటే ఈసారి భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నందున ఎన్నడూ లేనంతగా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కనీసం 20 లక్షల మంది భక్తులను గమ్యస్థానాలకు చేర్చటం లక్ష్యంగా పెట్టుకున్నందున 4 వేల బస్సులను సిద్ధం చేసింది. మరో ఐదారు వందల బస్సులను స్పేర్‌లో పెట్టుకుంది. హైదరాబాద్ నుంచి మేడారం వద్దకు బస్సును తరలించే వరకు మొత్తం 11 వేల మంది సిబ్బందిని ఇందుకోసం వినియోగిస్తున్నారు. మేడారంలో పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. జాతర మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు ఆర్టీసీ ఎండీ రమణారావు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించనున్నారు.

20 సీసీ కెమెరాలు ఏర్పాటు

జాతర జరిగే ప్రాంతంలో ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు 20 సీసీ కెమెరాలను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఆర్టీసీ ప్రాంగణంవైపు వస్తున్న భక్తులు, బస్సుల కోసం క్యూ లైన్లలో వేచి ఉండే ప్రయాణికుల సంఖ్యను క్షణక్షణం పర్యవేక్షిస్తూ బస్సులను సమాయత్తం చేయనుంది. ఏ బస్సు ఎక్కడుందో ట్రాక్ చేసేందుకు వీలుగా జాతరకు ఏర్పాటు చేసిన బస్సులన్నింటినీ ఉపగ్రహం ద్వారా ట్రాక్ చేసే విధానంతో అనుసంధానం చేస్తున్నారు. దీనివల్ల బస్సులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తారు. సిబ్బంది వద్ద వాకీటాకీలు ఉంటాయి. అనవసర రద్దీ పెరగటం, బస్సులు ఖాళీగా ఉండటం వంటి సమస్యలు ఎదురుకావు.

జంపన్నవాగు నుంచి ఉచిత బస్సులు

జాతరకు వచ్చే వారు తమ వాహనాలను సమీపంలో ఉండే నార్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ యార్డులో నిలపాలి. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో జాతర వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ బస్సుల్లో రూ.10 చొప్పున వసూలు చేసేవారు. ఈసారి ఉచితంగా తరలించనున్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే జంపన్న వాగుకు కూడా మినీ బస్సులను ఏర్పాటు చేశారు. వీటిలోనూ ప్రయాణికులను ఉచితంగా తరలించనున్నారు. ఇందుకోసం 25 మినీ బస్సులు సహా 50 బస్సులు సిద్ధం చేశారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం



ఈ సారి జాతరలో ఆర్టీసీ కీలక సేవలందించనుంది. దాదాపు 20 లక్షల మందిని వారి గమ్యస్థానాలకు తరలించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేశాం. మేడారంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాంకేతికతను వాడుకుంటున్నాం. ఇందుకోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. నేను జాతర పూర్తయ్యే వరకు అక్కడే ఉండి పర్యవేక్షిస్తాను.

– ఆర్టీసీ ఎండీ రమణారావు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఓజిలి మండలం సగుటూరు గ్రామంలో శుక్రవారం ప్రజాసంకల్పయాత్ర క్యాంపులో జెండా వందనం చేస్తున్న ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ నేతలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సంజీవయ్య, కాకాని గోవర్ధనరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

‘హోదా’తోనే ఉద్యోగాల విప్లవం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: దేవుడి ఆశీస్సులతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల కోసం ఒక ఉద్యోగాల విప్లవాన్ని తీసుకొస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమలను ఆకర్షించడానికి పారదర్శక పారిశ్రామిక విధానాన్ని తెస్తామని, గ్రామ సచివాలయాల ద్వారా 1.5 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి ‘జగన్ స్పీక్స్’ పేరుతో విడుదల చేసిన వీడియోను ‘ఫేస్‌బుక్’లో ఉంచారు. వివరాలు ఆయన మాటల్లో...

‘‘మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఉద్యోగాల విప్లవం సృష్టించాలని కృత నిశ్చయంతో ఉన్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే దాదాపు 22 సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారు. వెళ్లిన ప్రతిసారీ ఆయన పరిశ్రమలు, ఉద్యోగాల కోసం వెళుతున్నానని చెబుతున్నారు. ప్రతి సంవత్సరం ఆయన దావోస్‌కు వెళ్తున్నారు. వాస్తవానికి ఆయన తన నల్లధనాన్ని దాచుకోవడానికే పోతున్నారు తప్ప నిజంగా పిల్లల ఉద్యోగాల కోసం మాత్రం కాదు. అసలు ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయని ప్రశ్నిస్తున్నా. ఆయన నోరు తెరిస్తే అబద్ధం, మోసాలే.

ఏపీలో అనువైన పరిస్థితులేవీ?

ఆంధ్రప్రదేశ్‌కు ఏ పరిశ్రమ అయినా రావాలి అంటే... చంద్రబాబు మొహం చూసో, జగన్ మొహం చూసో పారిశ్రామికవేత్తలు రారు. చంద్రబాబు విదేశీ పర్యటనలు చేస్తున్నారని రారు. తాము ఆంధ్రప్రదేశ్‌లో పెట్టే హోటల్, ఆసుపత్రి, పరిశ్రమకు పరిస్థితులు అనువుగా ఉన్నాయా లేదా అని చూస్తారు. అసలు మన రాష్ట్రంలో ఇలాంటివి పెట్టడానికి అనువైన పరిస్థితులు ఎక్కడున్నాయి? విజయవాడ, గుంటూరు ప్రాంతానికి ఏ పారిశ్రామికవేత్తలైనా ఎందుకు వస్తారు? పెట్టుబడులు పెట్టేటప్పుడు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో నెలకొన్న అనువైన పరిస్థితులతో బేరీజు వేసుకుంటారు. ఆ నగరాల్లో 60 ఏళ్లుగా మౌలిక సదుపాయాలు బాగా అభివృద్ధి చెందాయి. అనువైన పరిస్థితులూ ఉన్నాయి. మరి అక్కడ కాకుండా మన దగ్గర పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడతారా? ఆ నగరాలన్నీ ఇప్పటికే ఒక దశ వరకూ అభివృద్ధి చెంది ఉన్నాయి. సహజంగానే అక్కడున్న పరిస్థితులను చూసి పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెడతారు గానీ, మన దగ్గరకు ఎవరూ పెట్టుబడులతో రానే రారు.

రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయా?

అసలు చంద్రబాబు ప్రధానిని కలవనే కలవడు, అక్కడికి వెళ్లి అడగనే అడుగడు. ఇటీవల ఆయన మోదీని కలిసి ఏం అడిగారోనని ఆసక్తితో చూశాం. చంద్రబాబు మోదీకి రాసిన లేఖ, అంతకు రెండు



రోజుల ముందు వారి పార్టీ ఎంపీలు రాసిన లేఖను కూడా చూశాం. కానీ ఎక్కడా ఆయన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనే విషయంపై ఒక్క వాక్యమైనా ప్రస్తావించలేదు. రాష్ట్రాన్ని విభజించడానికి ముందుగా రాజ్యసభలో మనకు ప్రత్యేక హోదా ఇస్తామని ఇచ్చిన హామీ అది. కానీ ఈ హామీ అమలు కోసం చంద్రబాబు పది శాతం కూడా ప్రయత్నం చేయలేదు. చంద్రబాబు గట్టి ప్రయత్నం చేసి ఉండి, ఆయన ప్రయత్నం వల్ల మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే చంద్రబాబు విదేశాలకు వెళ్లాల్సిన పనే లేదు. విదేశాల్లో ఉండే పరిశ్రమలే మన రాష్ట్రానికి వచ్చేవి. చంద్రబాబు సచివాలయంలో కూర్చుని ఉంటే విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు వాళ్లంతట వాళ్లే వచ్చేవారు. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది పరిశ్రమలు వచ్చి ఉండేవి. ఈ పాటికే మన రాష్ట్రానికి లక్షలాది ఉద్యోగాలు వచ్చేవి. కానీ రాష్ట్రంలో ఇవాళ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయంటే...

విశాఖపట్నంలో జరిగిన రెండు భాగస్వామ్య సదస్సుల్లో ఒకసారి రూ.5 లక్షల కోట్లు, మరోసారి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు చెప్పారు. రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నపుడు నిజంగా ఎన్ని పరిశ్రమలు వచ్చాయని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ‘డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ అండ్ పాలసీ’వద్ద ఎన్ని పరిశ్రమలు రిజిస్టర్ అయ్యాయి అని చూస్తే... చంద్రబాబు పాలనలో ఈ మూడేళ్లలో సంవత్సరానికి సగటున రూ.5,000 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు రాలేదని స్పష్టం అయింది. 2015లో రూ.4,500 కోట్లు, 2016లో రూ.9,500 కోట్లు, 2017లో రూ.4,450 కోట్లు పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ లెక్కలే ఇలా ఉంటే ఎక్కడ మన రాష్ట్రానికి 15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి? ఎక్కడి నుంచి వేల పరిశ్రమలు వచ్చాయి?

1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీ

రాష్ట్రం విడిపోయేటపుడు ఏపీలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తేల్చారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. కొన్ని పరీక్షలు పెట్టించారు. కానీ, అవి పోస్టింగ్‌ల వరకూ రాలేదు. కోర్టు కేసులనో... మరొకటనో ఆపేశారు. అసలు చంద్రబాబుకు ఉద్యోగాలు ఇవ్వాలన్న ఉద్దేశం, ఆలోచన లేవు. ఖాళీగా ఉన్న 1.42 లక్షల ఉద్యోగాలను రేపు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భర్తీ చేస్తాం. ప్రతి సంవత్సరం ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. ఎంపికైన వారిని ఖాళీల్లో నియమిస్తాం. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ఒక విప్లవాత్మకమైన కార్యక్రమం చేపట్టాలని ఉంది. ఇవాళ గ్రామాల్లో జన్మభూమి కమిటీల పేరుతో మాఫియా కమిటీలు పెత్తనం చెలాయిస్తున్నాయి. గ్రామ సర్పంచ్‌లకు విలువే లేకుండా పోయింది. ఇల్లు, పింఛను నుంచి మరుగుదొడ్డి మంజూరు కావాలన్నా జన్మభూమి కమిటీలు లంచాలు తీసుకుంటున్నాయి. రాజధాని భూములు, గుడి భూములు మొదలు అన్నింటా పై స్థాయిలో చంద్రబాబు లంచాలు తీసుకుంటుంటే కింది స్థాయిలో ఈ కమిటీలు దోచేస్తున్నాయి. అందుకే ఈ వ్యవస్థను మార్చేస్తూ ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేస్తాం. ఆ సచివాలయంలో ప్రతి గ్రామం నుంచి పది మంది పిల్లలను తీసుకుని వారి ద్వారా ప్రజలకు కావాల్సిన పథకాలను దరఖాస్తు చేసిన 72 గంటల్లో మంజూరయ్యేటట్లు చేస్తాం. అర్హత గల వారు ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేకుండా చేస్తాం. 13,000 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ప్రాంతాలు అన్నీ కలిపి సుమారు 15,000 వరకూ ఉంటాయి. వీటిలో 10 మందికి చొప్పున అవకాశం కల్పిస్తాం కనుక దాదాపు లక్షన్నర ఉద్యోగాలు ఈ గ్రామ సచివాలయాల్లోనే వస్తాయి. ఉదాహరణకు నెల్లూరు జిల్లా తడలో ఒక ఎస్ఈజెడ్ ఉంది. కానీ, మన పిల్లలకు విద్యార్హతలున్నా అందులో ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఎక్కడో గుజరాత్‌లోనో మరొక చోటో ఉండే వారికి ఉద్యోగాలు ఇస్తున్నారు. స్థానికులకు సెక్యూరిటీ గార్డు, ఇతర చిన్న ఉద్యోగాలు మాత్రమే ఇస్తున్నారు. మన ప్రభుత్వం వచ్చాక మన వద్ద పెట్టే పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు వచ్చేలా శాసన సభలో చట్టం తెస్తాం. చట్టం చేసి అన్ని పరిశ్రమలకూ సర్క్యులర్ పంపుతాం. మన పిల్లలకు 75 శాతం, స్థానికేతరులకు 25 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చెబుతాం. నిజంగా దేవుడు నా చేతులతో ఈ పనులు చేయిస్తాడని ఆశిస్తూ... నా చేతుల మీదుగా ఈ మంచి పనులు చేయాలని తపిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

మన వద్దకు ఎవరైనా పెట్టుబడులతో రావాలంటే అది రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే సాధ్యమవుతుంది. ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు ఆదాయపు పన్ను, జీఎస్టీలో మినహాయింపులు లభిస్తాయి. ఓ పదేళ్లపాటు ఆదాయపు పన్ను, జీఎస్టీలో మినహాయింపులు ఉన్నాయంటేనే ఎవరైనా వచ్చి ఆ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడతారు. చంద్రబాబు ఇప్పటికి 22 సార్లు విదేశాలకు పర్యటనలకు వెళ్లారు. అది కూడా ప్రత్యేక విమానాల్లో తన మందీ మార్బలంతో వెళ్లి సుమారు రూ.250 కోట్ల ప్రజాధనాన్ని నీటి పాలు చేశారు. విదేశాలకు వెళ్లడంలో చూపిన శ్రద్ధ, ఆసక్తి, చిత్తశుద్ధి, ప్రయత్నాల్లో కనీసం పది శాతం కనుక చంద్రబాబు ఇక్కడే ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లి చేసి ఉంటే మన రాష్ట్రానికి ఎంతో మేలు జరిగేది.

స్పెషల్ బర్త్‌డే
సినిమా పేజీలో...



కలిసి పోరాడితే..!



● ‘టైగర్ జిందా హై’ సినిమాలో కత్రీన్ కైఫ్, సల్మాన్ ఖాన్ : ప్రతీకాత్మక చిత్రం

మాటల్లేవ్. మాట్లాడుకోవడాల్లేవ్.
ఆటల్లేవ్. ఆట్లాడుకోవడాల్లేవ్.
పాటల్లేవ్. పాడుకోవడాల్లేవ్.
అటువైపు కవ్వా ఇటువైపు, ఇటువైపు కాకి అటువైపు.. ‘వాఘా’ బోర్డర్ దాటి వాలిపోవడానికి లేదు.
దారి తప్పి వాలిందా?
దాహమయ్యి వాలిందా?
దేహం తూలి వాలిందా?
దేశ బంధమే పట్టి లాగిందా?
ఎవరిక్కావాలి?
మన పగ మనక్కావాలి. మన ప్రతీకారం మనక్కావాలి.
ఎవరి సావరినిటీ వారిది.
ఎవరి శతఘ్నులు వారివి.
ఎవరి ఎమోషన్స్ వారివి.
ఉమ్మడిగా ఉన్నది... ఎవర్‌గ్రీన్ నేషనల్ సాంగ్ ఒకటే.
‘‘సమరమే.. నా కనులను సూటిగ చూస్తే. నా ఎదుటకు నేరుగ వస్తే. నా పిడికిలి వాడిగ వేస్తే.. యేయ్యే...’’
బోర్డర్ దగ్గర ఇదే సాంగ్. బోర్డ్ ఆఫ్ క్రికెట్ కంట్రోల్‌లో ఇదే సాంగ్. ‘రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్’లో ఇదే సాంగ్. ‘ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్’లో ఇదే సాంగ్. యునైటెడ్ నేషన్స్‌లోనూ ఇదే సాంగ్!
‘పుట్టినిల్లు–మెట్టినిల్లు’ సినిమాలో శోభన్‌బాబు.. స్టేజెక్కి పాడుతుంటాడు.
‘ఇదే పాట.. ప్రతీచోటా.. ఇలాగే పాడకుంటానూ..’ అని.
అలా పాడుకుంటున్నాం.
పలుకలేని వలపులన్నీ ఆ పాటలో దాచుకుంటాడు శోభన్‌బాబు.
మనమూ అంతేనా!
మనసుల్లో ప్రేమను దాచుకుని దేశం కోసం లేని ద్వేషాన్ని పాడుకుంటూ తిరుగుతున్నామా?

> భారత్, పాకిస్తాన్
> ఒక ఇంటి పిల్లలు.
> తర్వాత వేర్వేరు ఇళ్లు కట్టుకున్నారు.
> అంతటితో ‘వేరు వారు’ అయిపోతారా?
> అందుకని ఇద్దరి కుటుంబాల్లో
> వైరం కాపురం చెయ్యాలా?!
> దశాబ్దాలుగా ఈ వైరాన్ని
> ఇతరులు వాడుకుంటున్నారు.
> కలిసి పోరాడితే రెండిళ్లూ
> చల్లగా ఉంటాయి.

కట్లిప్పితే, గేట్లు తెరిస్తే, పహారా కాస్తున్న తుపాకుల్ని తిరగదిప్పి భూమిలోకి పాతేస్తే.. పరుగున వెళ్లి మనిషిని హత్తుకుంటామా? గట్టిగా ఆలింగనం చేసుకుంటామా? జ్ఞాపకాల మూటను విప్పి ఒక్కో బంగారు వరహా తీసి ‘మిఠాయి కొనుక్కోపో’ అని మురిపెంగా పిల్లల చేతిలో పెట్టి పంపించి, విభజనకు ముందునాటి స్నేహితుడి చేతిని గబుక్కున లాక్కుని.. మట్టిలో ఆడుకోవడానికి పిల్లల్లా పరుగెత్తి వెళ్లిపోతామా? ‘అల్లాయే దిగివచ్చి, ఆవ్ మియా.. ఏమి కావాలంటే..’ ఒకే దేశమై నిలిచే నిప్పులాంటి మనిషిగా మార్చమంటామా?
అవును! కచ్చితంగా అవును.
రెండు దేశాలు కావు మనవి.
రెండు ఇళ్లు. ఇరుగిళ్లు కావు.
పొరుగిళ్లు కావు. పుట్టినిల్లు.
మెట్టినిల్లు. రెండూ మన సొంతం.
రెండూ మన బంధం.
మాటలు బంద్ అయినంత మాత్రాన, మనసులు బంద్ అయిపోతాయా?!
మ్యాచిలు బంద్ అయినంత మాత్రాన, మమతలే లేకుండా పోతాయా?!
చర్చలు బంద్ అయినంత మాత్రాన, ‘రీయూనియన్’ సమాధి అయిపోతుందా?
మమకారపు మెమరీలు మంచులా గడ్డకట్టి అలా ఏళ్లకు ఏళ్లు ఉండిపోతే పోవచ్చు. వాటికి కొద్దిపాటి వెచ్చదనం చాలు. కరిగి కన్నీళ్లవడానికి.

● ❖ ●

రెండు దేశాల మధ్య నాలుగు యుద్ధాలు జరిగాయి.
అవెవరికీ గుర్తు లేవు.

● ❖ ●

‘రీయూనియన్’ యాడ్‌లో.. ఇండియాలో ఉన్న బలదేవ్‌మెహ్రా అనే ఆయన మనవరాలు, గూగుల్‌లో సెర్చ్ చేసి, లాహోర్‌లో ఉన్న తన తాతగారి చిన్ననాటి స్నేహితుడు యూసుఫ్‌ను వెదికిపట్టి, అక్కడ ఆ స్నేహితుడి మనవడి సహాయంతో యూసుఫ్‌ని బలదేవ్ బర్త్‌డేకి ఢిల్లీ రప్పిస్తుంది. వస్తూ వస్తూ ఆ స్నేహితుడు బలదేవ్‌కి చిన్నప్పుడు ఇష్టమైన స్వీట్స్‌ని తెస్తాడు. బలదేవ్ ఫీలింగ్స్ చూడాలి అప్పుడు! ఇద్దరూ హత్తుకుంటారు. మనం కళ్లొత్తుకుంటాం. అంత ఎమోషన్ కురుస్తుంది ఆ బాండింగ్‌లో. ఈ యాడ్ తర్వాత రెండు దేశాల మధ్య దూరం కొద్దిగానైనా తగ్గి ఉంటుంది అని ‘వాషింగ్టన్ పోస్ట్’ రాసింది!
‘ఏక్ థా టైగర్’, ‘టైగర్ జిందా హై’ లు కూడా అంతే! సీక్వెల్స్ ఇవి. సల్మాన్, కత్రీనా హీరో హీరోయిన్‌లు. సల్మాన్‌ది ఈ దేశం. కత్రీనాది ఆ దేశం. సల్మాన్ ‘రీసెర్చ్ అండ్ ఎనాలిస్ వింగ్’లో (రా) స్పై. కత్రీనా ఐ.ఎస్.ఐ. ఏజెంట్. ముఖ్యమైన టాస్క్‌లో వేరే దేశంలో కలుస్తారు. లవ్‌లో పడతారు. ఆ తర్వాత రెండు దేశాలను లవ్‌లో పడేసే పనిలోనూ పడిపోతారు! అపనమ్మకాలతో, అనుమానాలతో, అర్థంలేని ఆధిక్యభావనలతో.. రక్షణ కోసం, ఆయుధాల కోసం ఈ రెండు దేశాలు చేస్తున్న లక్షల కోట్ల రూపాయల ఖర్చును పిల్లల కోసం, మహిళల కోసం, విద్యకోసం, అభివృద్ధి కోసం వినియోగిస్తే.. ‘రా’లతో, ‘ఐ.ఎస్.ఐ’ లతో పనేముంది అంటారు హీరోహీరోయిన్‌లు. ఆ రెండింటితోనూ అవసరం రోజు మాత్రమే తిరిగి వస్తామని వాళ్ల వాళ్ల దేశాలకు చెప్తారు.
ఆ రోజు ఎప్పుడొస్తుంది? బయటి శత్రువులతో కలిసి పోరాడితే వస్తుంది.

● ❖ ●

దేశాలన్నాక సరిహద్దులు ఉండకపోవు. చట్టాలు ఉండకపోవు. ప్రభుత్వాలు ఉండకపోవు. పాత మనస్తాపాలు ఉండకపోవు. అలాగని విడిపోయిన దేశాల్లోని మనుషుల మధ్య బంధాలు, బాంధవ్యాలు లేకుండాపోవు.
కలిసి పోరాడితే అవి మరింత బలపడతాయి. ఇరుదేశాల్లో స్నేహ కుసుమాలు వికసిస్తాయి. శాంతి విప్లవించి, సుస్థిరత పరిఢవిల్లుతుంది. ఉగ్రవాదాలు, అగ్రరాజ్య స్వార్థ ప్రయోజనాలు బొరియల్లోకి వెళ్లిపోతాయి.



● గూగుల్ ‘రీయూనియన్’ యాడ్ లోని ఒక సన్నివేశం



● సోను నిగమ్, అతీఫ్ అస్లాం



● సర్ఫ్రాజ్ కొడుకుతో ధోనీ



● చికిత్స కోసం వచ్చిన కరాచీ అమ్మాయి

2013లో ‘రీయూనియన్’ గూగుల్ యాడ్ వచ్చింది. అది గుర్తుంది. అంతకుముందు 2012లో ‘ఏక్ థా టైగర్’ రిలీజ్ అయింది. అది గుర్తుంది. 2017లో ‘టైగర్ జిందా హై’ గాండ్రించింది. అదీ గుర్తుండిపోయేలా ఉంది.
రెండు దేశాల మధ్య రోజూ ఓ మాటల యుద్ధం జరుగుతోంది.
అవేవీ గుర్తుండేవి కావు.
మోదీ సడన్‌గా లాహోర్‌లో ల్యాండ్ అయి, అక్కడి నుంచి నేరుగా పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికెళ్లి ఆయనకు బర్త్‌డే విషెస్ చెప్పాడు.
అది గుర్తుంది.
ఎం.ఎస్.ధోనీ.. కెప్టెన్ సర్ఫ్రాజ్ అహ్మద్ కొడుకుని ముద్దుగా చేతుల్లోకి ఎత్తుకున్నాడు.
అది గుర్తుంది.
అతీఫ్ అస్లాం, సోనూ నిగమ్ కలిసి సరిగమలకు సరిహద్దులు లేవని, రాగాలకు రాజకీయాలు తెలియవని కచేరీ ఇచ్చారు.
అది గుర్తుంది.
పొరపాటున బోర్డర్ దాటిన గీత అనే అమ్మాయిని తిరిగి ఇండియా చేర్చడం కోసం రెండు దేశాలూ కలిసి పనిచేశాయి.
అది గుర్తుంది.
కరాచీ నుంచి ట్రీట్‌మెంట్ కోసం వచ్చిన ఒక అమ్మాయి కోసం ముంబై ప్రజలు నాలుగున్నర లక్షల రూపాయాలు విరాళాలు సేకరించారు.
అది గుర్తుంది.
అంటే.. ప్రేమ బతికే ఉంది!
ప్యార్ జిందా హై.
మరెందుకు మనం కలిసి పోరాడకూడదు? ●

కళ్లల్లో నీళ్లు తిరిగాయి



● స్వరాభాస్కర్

“ఫస్ట్‌టైమ్ నేను పాకిస్తాన్‌కు వెళ్లింది 2005, కాలేజ్‌డేస్‌లో. నేను, నా ఫ్రెండ్ ఇద్దరం ప్లాన్ చేసుకున్నాం పాకిస్తాన్ వెళ్లిరావాలని. మా ఇంట్లో వాళ్లు భయపడ్డారు. శత్రుదేశం వెళతారా? అని వారించారు. వెళితేనే కదా తెలిసేది వాళ్లు శత్రువులు కాదు మిత్రులు అని. అందుకే వెళ్లాం. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో బయలుదేరాం. బస్‌లో మా పక్కన కూర్చున్న పాకిస్తానీయులు.. మేమిద్దరమే లాహోర్‌కు వెళ్తున్నామని, అదీ ఫస్ట్ టైమ్ అని తెలిసీ వాళ్లింట్లో ఉండమని కోరారు. బస్ దిగాక కూడా మా ఇంటికి రండి అంటూ చాలాసేపు అడిగారు. సున్నితంగా తిరస్కరించి హోటల్‌లో ఉన్నాం. ఎక్కడా ఏ ఇబ్బంది ఎదురు కాలేదు. లాహోర్‌లోని అనార్కలీ మార్కెట్‌లో మేం తిరుగుతుంటే.. అక్కడున్న చాయ్, సమోసా హోటళ్లు వాళ్లు మేం ఇండియా నుంచి వచ్చామని తెలుసుకొని “అరే హిందుస్తాన్ నుంచి మా చెల్లెళ్లు వచ్చారు గరంగరం సమోసా, చిక్కటి చాయ్ తెండి” అంటూ బాయ్స్‌కు ఆర్డర్ వేశారు. అక్కడున్న మూడు రోజులు మాకు ఫ్రీ సమోసా, ఫ్రీ చాయ్ ఇచ్చారు. ఎంతో మంది స్నేహితులయ్యారు. అందరూ వాళ్లింట్లో ఉండమని ఆతిథ్యమిస్తుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ తర్వాత పదేళ్లకు 2015లో మళ్లీ పాకిస్తాన్ వెళ్లాల్సి వచ్చింది ఓ సినిమా వర్క్ మీద. పదేళ్ల కింద ఫ్రెండ్స్ అయిన వాళ్లంతా అదే ఆప్యాయతతో పలకరించారు, ఇంటికి రమ్మని ఇన్వైట్ చేశారు. ఈసారి అందరి ఇళ్లకూ వెళ్లాను. పాకిస్తాన్‌లో ఉన్నవాళ్లంతా శత్రువులు కాదు. ఆ దేశమూ మిగిలిన దేశాల్లాంటిదే. మన దేశంలో మంచివాళ్లు, చెడ్డవాళ్లూ ఉన్నట్టే అక్కడా ఉంటారు. నన్నైతే సాదరంగా ఆహ్వానించారు. ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చారు. అందుకే అనిపిస్తుంది నాకు దేశం పాలసీల కన్నా ప్రజలే మిన్న అని. పాకిస్తాన్ వెళితేనే తెలిసింది నాకు.. ఊహాగానాలు వేరు వాస్తవం వేరు అని. పీపుల్ ఫస్ట్ నేషన్ నెక్ట్స్”

– **స్వరాభాస్కర్**, బాలీవుడ్ నటి (తను వెడ్స్ మను, లిజన్ అమాయా, నిల్ బట్టి సన్నాటా ఫేం)

విశేషం

స్వచ్ఛ జన్నత్



● జన్నత్

జమ్మూకశ్మీర్ పర్యటనలో శ్రీనగర్‌లోని దాల్ లేక్ విహారం ఓ మధురానుభూతి. దాల్ లేక్‌లో శికార్ రైడ్ చేసి ఓ సెల్ఫీ తీసుకుని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసుకునే వాళ్లు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. ఆ ఫొటోలకు వస్తున్న లైక్‌లకూ లెక్కే ఉండటం లేదు. ఫొటో తీసుకుని, లైక్ చూసుకుని మురిసిపోతే చాలా? సరస్సు శుభ్రంగా ఉండొద్దా? అనుకుందో ఐదేళ్ల పాపాయి. తండ్రితోపాటు పడవ ఎక్కి పొడవాటి కర్రకు వల కట్టి సరస్సులో తేలుతున్న ఖాళీ కూల్‌డ్రింక్ బాటిళ్లు, స్నాక్స్ తిని పారేసిన అల్యూమినియం రేపర్లు, పాలిథిన్ కవర్లు... ఒకటేమిటి పర్యాటక ప్రియులు బాధ్యతారహితంగా సరస్సులోకి విసిరేసిన చెత్తను అందిన వరకు పడవలోకి చేర్చింది. ఒడ్డుకు కొట్టుకుపోయి మట్టిలో కూరుకుపోయిన చెత్తను మడమల వరకు కూరుకుపోతున్న బురదలో దిగి మరీ ఏరి పారేసింది. ఆ తర్వాత పెద్దవాళ్లందరికీ ఓ మెసేజ్ కూడా ఇచ్చింది. నిజానికి ఆ పాపాయి ఇచ్చిన సందేశం పిల్లలకే. కానీ పెద్దవాళ్లకూ అందే సందేశం.
‘‘ఫ్రెండ్స్! దాల్ సరస్సు చాలా అందమైన సరస్సు. చెత్త లేకపోతే ఇంకా అందంగా ఉంటుంది. అందుకే మన సరస్సును మనం శుభ్రంగా ఉంచుకుందాం. మీరు కూడా మీ పడవల్లో వచ్చి దాల్ సరస్సులో చేరుతున్న చెత్త తొలగించండి. మీ ఇంటిని కూడా శుభ్రంగా ఉంచుకోండి’’ అని చెప్పింది. ఇదంతా ఆమె తండ్రి స్మార్ట్ ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది దేశాన్ని చుట్టే లోపే ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టిలో పడింది. స్వచ్ఛభారత్‌కు ఓ బుల్లి అంబాసిడర్ దొరికిందని మురిసిపోయారు. ‘ఈ పాపాయి మన సూర్యోదయాలను మరింత అందంగా మారుస్తోంది. స్వచ్ఛత మీద ఆమెకున్న అభిరుచి చాలా గొప్పది’ అని ట్వీట్ చేశారు.




● దాల్ సరస్సులో తేలియాడుతున్న చెత్తను తొలగిస్తున్న జన్నత్


ఇంతకీ ఈ స్వచ్ఛ భారత్ అంబాసిడర్ పేరేంటో తెలుసా? జన్నత్... అంటే స్వర్గం. కశ్మీర్ భూతల స్వర్గం అంటారు. అలాంటి స్వర్గంలో పుట్టిన తన బిడ్డ అంతకంటే అపురూపమైన స్వర్గాన్ని ఆవిష్కరించాలని ఆ తండ్రి ఆమె పుట్టినప్పుడే అనుకున్నాడేమో! ఆమెకు అంత స్వచ్ఛమైన ఆలోచన రావడానికి ఆ పేరు కూడా కారణమేనేమో!
ఆమె పేరు కారణం అయినా కాకపోయినా జన్నత్ సందేశాన్ని మాత్రం అందరం పాటించాల్సిందే. మనం ఒక సమస్యను సృష్టించడంలో భాగస్వాములం కావద్దు, పరిష్కారం వెతకడంలో భాగస్వాములవుదాం.

– మంజీర

సెటైర్

పుజారా బచన్





విజయమో, వీర విహారమో అని బుధవారం వాండరర్స్ స్టేడియంలో దక్షిణాఫ్రికా పైకి బ్యాటింగ్‌కి దిగింది ఇండియన్ టీమ్. ఫస్ట్ ఫస్టే దక్షిణాఫ్రికా ఫట్ ఫట్‌మని రెండు వికెట్లు పడగొట్టేసింది. చేతేశ్వర్ పుజారా బ్యాటు పట్టుకుని వచ్చాడు. ప్రతి బంతినీ ఇలా టచ్ చేసి అలా వదిలేస్తున్నాడు. యాభై బాల్స్‌కి ఒక్క రన్ను కూడా తీయలేకపోయాడు! 54వ బంతి దగ్గర పుజారా ఫస్ట్ రన్ రికార్డ్ అయింది. ఆ ఒక్క రన్నుకే ఇండియన్ ఫ్యాన్స్ పెద్ద రిలీఫ్ ఫీలయ్యారు! ఆ వెంటనే ట్విట్టర్ పరుగులు తీసింది. రకరకాలుగా అతడిపై సెటైర్లు వేసింది. ఒకరైతే.. యంగ్ అమితాబ్, ఓల్డ్ అమితాబ్ ఫొటోలను పక్కపక్కన ఉంచి కింద కాప్షన్ పెట్టారు. ‘పుజారా బ్యాటింగ్‌కి వచ్చినప్పుడు’ అని యంగ్ ఫొటోకి, ‘పుజారా ఫస్ట్ రన్ కొట్టినప్పుడు’ అని ఓల్డ్ ఫొటోకి క్యాప్షన్ పెట్టి పోస్ట్ చేశారు. సిరీస్ పోయిన మ్యాచ్‌ని సీరియస్‌గా ఆడి సాధించేదేముంది అనుకున్నాడో ఏమో పుజారా! ట్విట్టర్ మాత్రం.. పుజారాను సాధించి సాధించి వదిలింది.


చెట్టు నీడ

చూపునకు ఉండవలసిన కళ్లెం

> పరిమితంగా బతకడం అంటే
> జీవితంలో ఎదగలేకపోవడం కాదు.
> ఎలా బతికితే అర్థవంతమో
> తెలుసుకోవడం!

‘**అ**పొకలిప్టో’ సినిమాలో తన జాతి జనానికి ఒక కురువృద్ధుడు ఈ కథ చెబుతాడు.
ఒక రోజు ఒక అడవిలో ఒక మనిషి దిగులుగా కూర్చునివున్నాడు. జంతువులన్నీ వచ్చాయి. ఏం కావాలని ఓదార్చడం మొదలుపెట్టాయి.
‘నాకు మంచి కంటిచూపు కావాలి’ చెప్పాడు మనిషి.
‘నాది తీసుకో’ అంది రాబందు.
‘నాకు చాలా బలం కావాలి.’
‘నా శక్తి ఇస్తాను’ చెప్పింది చిరుత.
‘ఈ భూమి రహస్యాలన్నీ తెలుసుకోవాలనుంది.’
‘అవన్నీ నేను చూపిస్తా’ హామీ ఇచ్చింది సర్పం.
అట్లా ప్రతి జంతువూ ఏదో ఒక గుణాన్ని వరంగా ఇచ్చాక, ఆ మనిషి వెళ్లిపోయాడు.
‘మనిషికి ఇప్పుడు చాలా తెలుసు. పైగా ఎన్నో పనులు చేయగలడు. కానీ ఎందుకో అతడిని తలుచుకుంటే నాకు భయంగా వుంది’ అన్నది గుడ్లగూబ.
‘అతడికి కావాల్సినవన్నీ ఉన్నాయికదా; ఇక అతడి దుఃఖం సమాప్తమవుతుంది’ బదులిచ్చింది జింక.
‘కాదు’ స్థిరంగా చెప్పింది గుడ్లగూబ. ‘ఆ మనిషి ముఖానికి రెండు రంధ్రాలున్నాయి, ఎప్పటికీ తీరని ఆకలి అంత లోతుగా. అవే అతడికి ప్రతిదీ కావాలనిపిస్తాయి, అన్నింటికీ దుఃఖం కలిగిస్తాయి. అతడికి అన్నీ కావాలి, కావాలి. ఇంక నా దగ్గర ఇవ్వడానికి ఏమీ మిగలలేదని ప్రపంచం ఏదో రోజు చెప్పేదాకా!’
మనిషి మితంగా బతకాల్సిన అవసరాన్నీ, ఏది కొరతగిందీ ఎంత కొరతగిందీ అని అలవర్చుకోవాల్సిన విచక్షణనూ వెల్లడించే కథ ఇది. చూపు పోయినంత మేరా మనసు పోగూడదని చెప్పిన పెద్దల మాట. పరిమితంగా బతకడం అంటే జీవితంలో ఎదగలేకపోవడం కాదు. ఎలా బతికితే అర్థవంతమో తెలుసుకోవడం!

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నా, నేను ఇప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ అన్నా. నేను కార్తీక్ అనే అబ్బాయిని ఇష్టపడుతున్నాను. తనకి కూడా నేనంటే చాలా ఇష్టం. మాది చిన్నప్పటి నుండి లవ్. నాకు చిన్నప్పుడు ఇలాంటివి నచ్చేవి కావు. ఎందుకో తను నాకు ప్రపోజ్ చేసినా, నేను రిజెక్ట్ చేశా. నాకోసం చాలా వెయిట్ చేసి, డిగ్రీలో నేను చదివే కాలేజ్‌లోనే చదువుతున్నాడు. కానీ తన బిహేవియర్ ఫైనల్ ఇయర్‌లో చాలా ఛేంజ్ అయింది. అలా అని నన్ను కాదని ఎవరినీ లవ్ చేయడు. అసలు అలాంటి క్యారెక్టర్ కాదు తనది. ఇంతకు ముందు గొడవపడ్డ తనే మాట్లాడేవాడు, ఇప్పుడు అలా కాదు. నేను మాట్లాడిస్తేనే మాట్లాడుతున్నాడు. చిన్నవాటికే కోప్పడుతున్నాడు. అసలు కోపం వచ్చినప్పుడు మనసు బాధపడేలా మాట్లాడతాడు. అంతకు ముందు తప్పుగా తిట్టినా.. ఆ తరువాత ఫీల్ అయ్యేవాడు. కానీ ఇప్పుడు అలా కాదు. నువ్వు కాకపోతే ఇంకొకరు అంటున్నాడు. నాకు చాలా కన్ఫ్యూజన్‌గా ఉంది అన్నా. అలా అని ఒకరిని వదిలి ఒకరం ఉండలేము అన్నా. నేను తనని ఎంత ఇష్టపడతానో.. అంతకంటే ఎక్కువే ఇష్టపడతాడు. నా మీద ఇష్టంతో అరుస్తున్నాడా లేక నేనంటే కోపమా... మీరే చెప్పండన్నా నా కన్ఫ్యూజన్‌కి ఆన్సర్ ప్లీజ్.
– శిరీష

శిరీషా బంగారం... కన్ఫ్యూజన్ ఏమీ లేదు.
అమ్మాయి బుట్టలో పడిందా... ఒక టైప్.
పడ్డాక ఇంకో టైప్.
ఘరేకీ ముర్గీ.. దాల్ బరాబర్..
'సార్..! మీ తెలుగే అర్థం కాక..
ప్రేమికులు బట్టలు చించుకుంటున్నారు.
ఇక ఈ పరాయి భాషలో పెంట కవిత్వం..
ఏం అర్థం అవ్వట్లే సార్.. ఏంటది?
ఘరేకీ ముర్గీ.. దాల్ బరాబర్ అంటే..?!!'
ఇంట్లో చేసిన కోడికూర... సుద్దపప్పులా అనిపిస్తుందని..
అమ్మాయి పడేదాకా కోడికూరే..
పడ్డాక సుద్దపప్పు అని చెబుతున్నా..!
'అవును సార్, క్యాండిడేట్‌తో వ్యవహారం శిరీషకు నాట్ గుడ్!'
కరెక్ట్. వెంటనే ఈ ప్రేమవంటోడికి... మన దగ్గర వాడి పప్పులు ఉడకవని చెప్పి...
'రిలేషన్‌షిప్ నుంచి తప్పుకోవడం మంచిది సార్!'

lovedoctorram@sakshi.com

నాని ఈజ్ సేఫ్


నాని

ఐయామ్ ఓకే అంటున్నారు హీరో నాని. ఇంతకీ ఏం జరిగిందంటే... 'కృష్ణార్జున యుద్ధం' షూటింగ్ కంప్లీట్ చేసుకుని శుక్రవారం ఉదయం డ్రైవర్ శ్రీనివాస్‌తో కలిసి ఇంటికి వెళ్తున్నారు హీరో నాని. ఎర్లీ మార్నింగ్ నాలుగున్నర గంటల సమయంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. నానికి పెద్ద గాయాలేం కాలేదు. అయితే... ముందు కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారన్న వార్తలు వచ్చాయి. పోలీసులు నాని తండ్రి రాంబాబుకు ఫోన్ చేయగా ఆ సమయంలో నాని కారులోనే ఉన్నట్లు ఆయన చెప్పారు. ఈ విషయంపై నాని స్పందించారు. ''ఐయామ్ ఓకే. అక్కడక్కడా చిన్నగా గీసుకుపోయింది. అంతే. యుద్ధానికి (షూటింగ్‌కు) స్మాల్ బ్రేక్. నెక్ట్స్ వీక్‌లో మళ్లీ యాక్షన్‌లోకి దిగుతాను'' అన్నారు నాని. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతోన్న 'కృష్ణార్జున యుద్ధం' ఫస్ట్ లుక్స్‌తోపాటు ఓ సాంగ్‌ను కూడా ఇటీవల రిలీజ్ చేశారు. సినిమాను ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

భరత్ అనే నేను


మహేశ్‌బాబు

... శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని...'' అంటూ ఆంధ్రప్రదేశ్ సీఎంగా శుక్రవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు మహేశ్‌బాబు. కొరటాల శివ దర్శకత్వంలో డి. పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. ఇందులో కియారా అద్వానీ కథానాయిక. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు మహేశ్‌బాబు వాయిస్ ఫస్ట్ ఓత్, ఎనిమిది గంటలకు లోగో, తొమ్మిది గంటలకు ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు చిత్రబృందం. కాగా, మహేశ్ ప్రమాణ స్వీకారం విన్నవాళ్లు అచ్చు ఆయన తండ్రి సూపర్ స్టార్ కృష్ణ గొంతులానే ఉందంటున్నారు. ''ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత జరిగే పొలిటికల్ డ్రామా ఇది. సినిమా ప్రమోషన్‌కు రిపబ్లిక్ డే మంచి సందర్భమని భావించి ప్రమోషన్‌ను స్టార్ట్ చేశాం'' అన్నారు కొరటాల శివ. ''ఫస్ట్ లుక్‌కి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించి రామ్–లక్ష్మణ్ నేతృత్వంలో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ కాంబినేషన్‌లో సినిమా చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు దానయ్య. ప్రకాశ్‌రాజ్, శరత్‌కుమార్ కీలక పాత్రలు చేస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఏప్రిల్‌లో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

సిక్స్ ప్యాక్ ఎన్టీఆర్


ఎన్టీఆర్

ఎన్టీఆర్ మొదటిసారి ఆన్ స్క్రీన్ చొక్కా విప్పింది ఎప్పుడు? 'టెంపర్'లో. ఆరు పలకల దేహంతో ఆ సినిమాలో కనిపించి, ఆకట్టుకున్నారు. మళ్లీ ఎన్టీఆర్ సిక్స్ ప్యాక్‌తో కనిపించనున్నారు. దీనికోసం కసరత్తులు చేస్తున్నారు. మరి.. ఈసారీ చొక్కా విప్పుతారా? అంటే సమాధానం తెలియడానికి చాన్నాళ్లు పడుతుంది. ఇంతకీ ఏ సినిమా కోసం సిక్స్ ప్యాక్ అంటే.. త్రివిక్రమ్ డైరెక్షన్‌లో చేయబోతున్న మూవీకే. ఇందులో ఎన్టీఆర్ స్లిమ్ లుక్‌లో కనిపించనున్నారన్న సంగతి తెలిసిందే. దాని కోసం ట్రైనర్ 'స్టీవెన్ లాయిడ్స్' పర్యవేక్షణలో ట్రైనింగ్ ప్రాసెస్‌లో ఉన్నారు. సిక్స్ ప్యాక్ లుక్ కోసం ఎన్టీఆర్ సుమారు 18 కిలోలు బరువు తగ్గనున్నారు. స్క్రిప్ట్ వర్క్ దాదాపుగా ఫినిష్ చేసి, ప్రస్తుతం ఫైనల్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారట దర్శకుడు త్రివిక్రమ్. పూర్తి స్థాయి లవ్ స్టోరీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చి మొదటి వారంలో ప్రారంభం కానుందని సమాచారం. హారికా హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రాధాకృష్ణ నిర్మించనున్నారు.

అవుటాఫ్ కవరేజ్


కంగనా

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్‌ను ఇప్పుడు పర్సనల్‌గా మీట్ అవ్వాలంటే కష్టం. పోనీ ఫోన్ చేద్దామన్నా ఉపయోగం లేదు. ఎందుకంటే 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' అని వస్తుందట. ఎవరికీ అందుబాటులో లేకుండా కంగనా ఎక్కడికి వెళ్లారు? ఏం చేస్తున్నారు? అంటే.. 'మణికర్ణిక' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. వీర వనిత రాణీ ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవితం ఆధారంగా క్రిష్ దర్శకత్వంలో కంగనా లీడ్ రోల్‌లో ఈ సినిమా రూపొందుతోంది. రాజస్తాన్‌లోని ఓ రిమోట్ ఏరియాలో చిత్రీకరణ జరుగుతోంది. వార్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్నారట. అక్కడ సెల్‌ఫోన్స్‌కు సిగ్నల్స్ ఉండవట. అది మాత్రమే కాదు.. షూటింగ్ స్పాట్‌కి చేరుకోవాలంటే నడచుకుంటూ వెళ్లాల్సిందే. వాహనాలు వెళ్లే దారి లేదు. ఒక్కసారి యూనిట్ సభ్యులు లొకేషన్‌కి చేరుకుంటే... వేరేవాళ్లు వాళ్లను కాంటాక్ట్ చేయడం అసాధ్యమేమో. 'నో కాంటాక్ట్స్' కాబట్టి షూటింగ్ స్పీడుగా సాగుతోందట. శంకర్–ఇషాన్–లాయ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

అందమైన ప్రేమకథ


ప్రియాంక, విశ్వదేవ్

'పిట్టగోడ' సినిమా ఫేమ్ విశ్వదేవ్ రాచకొండ, ప్రియాంక జైన్ జంటగా తెరకెక్కిన చిత్రం 'చల్తే చల్తే'. ప్రదీప్ కేకే దర్శకత్వంలో అమేజింగ్ ఆర్ట్స్ పతాకంపై శ్రీనివాసరావు పొట్లూరి, ప్రదీప్‌కుమార్ కోనేరు నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ప్రదీప్ కేకే మాట్లాడుతూ– ''అందమైన ప్రేమకథగా తెరకెక్కిన చిత్రమిది. ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి ప్రశంసలు వచ్చాయి. విశ్వదేవ్ రాచకొండకు హీరోగా మంచి గుర్తింపు తెచ్చేలా ఉంటుంది. త్వరలోనే టీజర్, ప్రీ–రిలీజ్ వేడుక నిర్వహించనున్నాం. యువతరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా రూపొందిన ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. రావు రమేశ్, షాయాజీ షిండే, వి.కె.నరేష్, రాజశ్రీ నాయర్, ప్రగతి, ఉత్తేజ్, దువ్వాసి మోహన్, సూర్య, గౌతమ్ రాజు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: డి.ఆర్.వెంకట్, సంగీతం–దర్శకత్వం: ప్రదీప్ కేకే.

జాన్వీ @ టెంపర్


రణ్‌వీర్


జాన్వీ

అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ 'ధడక్' చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. శషాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో షాహిద్ కపూర్ సోదరుడు ఇషాన్ కట్టర్‌తో జోడీ కట్టారు జాన్వీ. ఈ సినిమా చిత్రీకరణలో ఉండగానే మరో క్రేజీ ఆఫర్ జాన్వీని వరించిందని బీ టౌన్ టాక్. ఎన్టీఆర్, కాజల్ జంటగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'టెంపర్' సినిమా ఎంత హిట్ అయిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ చిత్రాన్ని 'శింబా' పేరుతో హిందీలో రీమేక్ చేయనున్నారు. రణ్‌వీర్ సింగ్ హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో కరణ్ జోహార్ ఈ చిత్రం నిర్మించనున్నారట. ఇందులో జాన్వీ కపూర్‌ని కథానాయికగా తీసుకున్నారని బాలీవుడ్‌లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తెలుగులో కాజల్ చేసిన పాత్రకంటే 'శింబా'లో జాన్వీ పాత్రను మరింత క్యూట్‌గా మలచనున్నారని సమాచారం. ఇదిలా ఉంటే.. జాన్వీ ఫస్ట్ మూవీ 'ధడక్'ని కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. 'టెంపర్' రీమేక్‌కి కూడా ఆయనే నిర్మాత. ఒకవేళ జాన్వీ నటన నచ్చి, 'టెంపర్'కి కూడా తీసుకోవాలనుకున్నారేమో? అని బాలీవుడ్ వర్గాలు అనుకుంటున్నాయి.

కాసుకో సుడోకు

	3				9			
	6	7	3			9		2
							1	6
1		5				6	3	4
	9	3				1	2	
4	8	2			1	7		5
8	5							
3		6			7	2	8	
			9				6	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	8	7	1	9	5	2	4	6
5	2	9	4	6	3	1	7	8
4	1	6	2	7	8	5	3	9
9	5	2	7	8	1	3	6	4
7	3	1	5	4	6	8	9	2
6	4	8	9	3	2	7	1	5
2	9	3	8	1	4	6	5	7
8	6	4	3	5	7	9	2	1
1	7	5	6	2	9	4	8	3

రాశి ఫలాలు (సౌరమానం)

జన్మనక్షత్రం తెలియదా?
నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (జనవరి 20 నుంచి 26 వరకు) మీ రాశి ఫలితాలు



డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)



'ఏమిటో ఏమీ కలిసి రావడం లేదు. చేతిలో చిల్లిగవ్వ నిలవ ఉండడం లేదు' అని వాపోతూ ఉంటారు కొందరు. ఇదీ ఒక అదృష్టమే – అంటుంది జ్యోతిష శాస్త్రం. అంత ఖర్చు నెత్తి మీద క్రమక్రమంగా పడుతున్నప్పుడు – చేతిలో నిలవ ఉండడం లేదంటే – ఎప్పటికి సరిపడే ఆదాయం అప్పుడప్పుడు వస్తున్నట్లే కదా! ఇది అదృష్టం కాక మరేమిటి? ఇలా ఆదాయం లేకుంటే అప్పుల్లో పడాల్సి వస్తుందిగా! ప్రస్తుతం మీ పరిస్థితీ ఇదే. ఎంత వస్తుందో అంతకీ ఖర్చు సిద్ధంగా ఉంటుంది. ధైర్యంగా ఉండండి.

మీ గురించి కంటె మీ సంతానపు భావిని గూర్చిన మంచి మంచి ఆలోచనలని చేస్తారు. చదువులకీ, వారి ఉన్నతికీ కావలసిన అన్ని నిర్ణయాలనీ ఇప్పుడు చేయడాన్ని ప్రారంభిస్తారు. చాలా మంచి పని! అవసరమైన పని! పిల్లల్ని కనడాన్ని హేయమైన జంతువులు కూడ చేస్తాయి గాని, వాళ్లని తీర్చిదిద్దే ప్రణాళికలను సిద్ధం చేయడం, అమలు చేయడమనేది ఉత్తమ పితరులు (తల్లిదండ్రులు) చేసే పని. కొనసాగించండి.

ప్రస్తుత దశ స్థితిలో ఏ పనిని చేయబోయినా మీ కంటె దాదాపు ఒకటిన్నర రెండు రెట్లు వయసున్న అనుభవజ్ఞుణ్ని, విశ్వసించదగినవారు అనిపించిన వారితో సంప్రదించి మాత్రమే చేయండి. ధర్మరాజు అన్నిటినీ కృష్ణుణ్ని సంప్రదించే చేశాడు. విజయాన్ని సాధించగలిగాడు. సంప్రదించకుండా చేసింది జూదమాడడమే – యుద్ధాన్ని తెచ్చుకున్నది కూడ దాని వల్లనే. పెద్దల్ని సంప్రదించడమనేది మనకి స్వాతంత్ర్యం లేనితనానికీ అమాయక విధానానికీ సాక్ష్యం కాదు. మనని మనం సరిదిద్దుకోడానికి చేసుకునే ఓ ప్రయత్నం మాత్రమే.

విజయాన్ని సాధించినవారితో, ఉత్సాహంతో ఉన్నవారితో స్నేహాన్ని పెంపొందించుకుంటూ ఉంటే మంచి మంచి ఆలోచనలు వస్తాయి. అలాంటి వారి కోసం వెతుక్కోండి.

లౌకిక పరిష్కారం: తమ దుఃఖపూరిత నిరాశాపూరిత చరిత్రని చెప్పేవారితో స్నేహాన్ని చేయకండి. రాకపోకలని మానండి.

అలౌకిక పరిష్కారం: వారమంతా ఆంజనేయుని ద్వాదశనామాలనీ చదువుతూ ఉండండి .

మిథునం
(మే 21 - జూన్ 20)



మాట పడడం, మాట అనడం దాదాపుగా మీ మనస్తత్వం కాని కారణంగా మీ ముక్కుసూటితనం, నిజాయితీ ధోరణి కొందరికి గొంతులో పచ్చి వెలక్కాయ చందంగా ఉంటుంది. ఆ కారణంగా కొన్ని సందర్భాల్లో మిమ్మల్ని ప్రలోభ పెట్టేందుకు మీ ఆత్మీయుల ద్వారా ప్రయత్నించే అవకాశం ఉంది. ఏ మాత్రం ఆ తోవకి పోవద్దు. మీ పేరునీ ప్రతిష్ఠనీ భంగపరచుకోవద్దు.

మీకు వృత్తిఉద్యోగాల పట్ల ఉన్న అంకితభావం కారణంగా మీ పైఅధికారులు మీ చేత ఎక్కువ పనిని తక్కువ కాలంలో చేయవలసిందిగా ఒత్తిడి చేసే అవకాశం ఉంది. కొంత లౌక్యం అవసరమని గమనించండి. ఇతరుల పనిని కూడ మీ నెత్తిన వేస్తున్నారని అనిపిస్తే, తగిన విధంగా తప్పించుకోండి. పైవాళ్లకి అర్థమవుతుంది – పని ఎగగొట్టేవారికి భుజాన బరువు పడుతుంది కూడ. ఒక సమస్య తీరిందనుకుంటూంటే మరో సమస్య వచ్చి పడుతోందేమిటి? అనుకుంటూ నిరాశకి గురికాకండి. మీకొస్తూన్న ప్రతి సమస్యనీ పరిష్కరించుకోగలుగుతున్నారా? లేదా? అంటే ఏమన్నమాట? సమస్యల నుండి బయటపడగల నేర్పుని భగవంతుడు మీకు పరోక్షంగా అలవాటయ్యేలా చేస్తున్నాడనేగా అర్థం. ఈ నేర్పు మీకు రాబోయే జీవితంలో ఎంత ఉపయోగిస్తుంది! గమనించండి! మీ ఊహలకి తగినంత ఆదాయం వస్తూ ఉండగా మీకెందుకు నిరాశ? మీరు ఆలోచించాల్సిన అంశం – దాంపత్య విషయం. మీ భార్య/భర్త కొంత అహంకారి – తనని తాను పొగుడుకుంటూ ఉండే స్వభావం కలవారు – దాంతో పాటు ఇతరుల్ని తక్కువ చేసి మాట్లాడుతూండేవారు... ఇలా అనుకోండి. కాదనుకుంటే జీవితంలో సాధించగలిగేదేముంటుంది? 'ఆ ఇద్దరూ ఒకచోట ఉండరు...' అని ఈ తీరుగానే కదా చెవులు కొరుక్కుంటారు! ఆ కొరుక్కునే వాళ్ల ఇళ్లలో మాత్రం ఈ అన్యోన్యత గొప్పగా ఉందా?... విడివిడిగా జీవించడం గొప్ప కాదు.. కలిసిమెలిసి సమన్వయపడుతూ ఉండడమే గొప్ప. వయసులో ఉండగా తెలియదు గాని, పిల్లల పెళ్లిళ్లనాటికి ఈ విడివిడిగా జీవించడమనేది గొప్ప ప్రభావాన్ని చూపించి మీ పిల్లల భవిష్యత్తుని దెబ్బ తీస్తుంది.

లౌకిక పరిష్కారం: దాంపత్య ఆనుకూల్యం కోసం ప్రయత్నిస్తూ ఉండండి. ఒకమాట అంటే దులిపేసుకోండి. పట్టించుకోకండి.

అలౌకిక పరిష్కారం: అర్ధనారీశ్వర స్తోత్రమని ఒకటుంది. దాన్ని పఠిస్తూ ఉండండి.

సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)



చక్కగా చదువుకుంటూ మంచి ఉన్నతిలోకి వస్తున్న సంతానానికి 'వివాహ'మంటూ ఒక కొత్త ఆలోచనని తేవద్దు. అది మంచి ఆలోచనం కా(బో)దు. అలాగే మీ దగ్గరే ఉంటూ చదువుకుంటున్న మరీ వయసు తక్కువ సంతానాన్ని మంచి నాణ్యమైన చదువు మరి! అంటూ తల్లిపెట్టే తిండికీ, అనురాగానికీ దూరం చేస్తూ ఎక్కడో చేర్చకండి. పిల్లలకి చదువుతోపాటు బాల్యంలో తల్లి చేతివంట ఆరోగ్యాన్ని శరీరానికీ, మనసుకీ బుద్ధికీ కూడా ఇస్తుందని గమనించండి. ఈ వాక్యాన్ని హేతువాదపు రంపంతో కోయడం మొదలెట్టకండి– మిగిలేది కాలక్షేపమే. కొన్ని మాటలకి ఉదాహరణ 'అనుభవం' మాత్రమే.

సంస్కృతంలో 'ప్రత్యుత్పన్న మతిత్వం' అనే ఓ మాట ఉంది. ఎప్పుడు ఏ సమస్య వచ్చేసిందో నెత్తిమీదికి, అలాంటి సందర్భంలో అప్పటికి సరిపోయిన ఏదో సమాధానాన్నిచ్చేసి తప్పించుకుని అప్పటికి 'అమ్మయ్య! గండం గడిచింది!' అనుకోవడం ఈ మాటకి అర్థం. ఈ విధానం మీకు మరింత ఎక్కువ. వ్యాధిని లోలోపలే ఉండిపోయేలా అణచివేత వైద్యాన్ని చేస్తే తాత్కాలికంగా వ్యాధి బాధించలేనట్టుగా ఉంటుంది కాని– ఒక్కరోజున లాకులు తెరిస్తే ప్రవాహం ఉధృతంగా వచ్చేసేటట్లు సమస్య మరింత మరింత బలపడి పరిష్కారానికి అందనంత పెద్దదై కూచుంటుంది! దూరదృష్టితో ఆలోచించుకోండి! గోటితో పోగొట్టుకోండి సమస్యని.

ఒక ముఖ్యమైన ప్రయత్నాన్ని చేయవలసిన సందర్భంలో నిర్ణయించుకున్న ఓ ప్రయాణం వాయిదాపడవచ్చు. అంతమాత్రాన నిరుత్సాహపడకండి. ఆ ప్రయాణం వాయిదా పడిందంటే దానర్థం– ఇప్పుడు కాదని తప్ప అసలు లేదనేది కాదుగదా! ఆలోచనలో భేదాన్ని గమనించండి! ధైర్యంగా ఉండండి.

లౌకిక పరిష్కారం: సంతానానికి బాల్యంలో ఇంటిపట్టున ఉండడం, తల్లి చేతి వంట తినడం వల్ల ప్రవర్తన, ఆరోగ్యం బాగుంటాయి.

అలౌకిక పరిష్కారం: దక్షిణామూర్తి స్తోత్రం గాని లింగాష్టకం గాని పఠిస్తూ ఉండండి.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)



ఓ నడి ఒడ్డున రెండు కర్రలని పాతి, వాటి మధ్యలో తాడు కట్టి ఆ దండెం మీద కొన్ని బట్టలనీ, ఒడ్డున కొన్ని బట్టల్నీ ఆరేసాడుట ఓ రజకుడు. పెద్దగా గాలి రాగానే ఇటు ఒడ్డు మీద బట్టల కోసం, అటు దండెం మీది బట్టల కోసం పరుగెడుతూ రెంటినీ పోగొట్టుకున్నాడని (రెంటికీ చెడ్డ రేవడి) పెద్దలు చెప్తుండేవారు. ప్రస్తుతం మీది ఇదే పరిస్థితి కావచ్చు. ఓసారి ఓ నిర్ణయం, అంతలో మరో నిర్ణయం చేస్తూ వెళ్తే ఆ చాంచల్యం కారణంగా దేంట్లోనూ పరిపూర్ణులు కా(లే)రు. స్థిరమైన ఆలోచనతో ఉండండి.

ప్రస్తుత దశ నడుస్తున్న స్థితిలో – లౌక్యం, వ్యంగ్యం... వంటివి పనికి రావు. స్పష్టమైన అవగాహనతో నిర్ద్వంద్వంగా ఎదుటి వ్యక్తితో మాట్లాడాలి తప్ప... ఎదుటివాని అభిప్రాయం ఇదే అయ్యుంటుందనుకుని అపార్థపడడం సరికాదు. మొగమాటం అయినట్లయితే మరింత స్పష్టతతో మరొకరి సమక్షంలో మాట్లాడుకోవాలి. అతి – అంటే – ఎక్కువ తెలివిని చూపించడం, గడుసుగా మాట్లాడాలనుకోవడం, మరింత చనువుని ఇయ్యడం, మరింతగా రాకపోకలు సాగించడమనేవి వద్దే వద్దు. ఎవరితో ఎంతలో ఉండాలో, ఎవరిని ఎంతలో ఉంచాలో నిర్ణయించుకుని – కుటుంబం కుటుంబమంతా ఒకే తాటి మీద ఉండి అలాగే ప్రవర్తించండి. లేని పక్షంలో చిక్కుల్లో పడే (సే) అవకాశముంది. జాగ్రత్త!

మీరు మాట్లాడే మాట ఎదుటివారికి అపార్థమీయని తీరుగా ఈ వారానికి ఆచితూచి మితంగా మాట్లాడండి. ఒకవేళ మీరంటే గిట్టని వ్యక్తి మీరు మాట్లాడిన మాటలలో తప్పు పట్టినట్లయితే – మీ అభిప్రాయాన్ని స్పష్టంగా విడమరిచి చెప్పి తొలగిపొండి తప్ప, వాగ్వివాదానికి దిగద్దు. మీ శత్రువు ఒక మాట తూలినా పట్టించుకోకండి. గాలికి దుమ్ము మీదికి వస్తుంటే వెనక్కి తిరిగి వీపుని చూపిస్తాం గాని దుమ్ముని పీల్చం కదా!

లౌకిక పరిష్కారం: మన ఆలోచనలన్నీ బయటపడిపోవాలంటే ఎక్కువ మాట్లాడితే సరి! ఈ వారానికి ఆ పని మానండి.

అలౌకిక పరిష్కారం: యథాశక్తి సాయి చరిత్రని పారాయణం చేసుకోండి.

కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)



దేవతలంతటివాళ్లు సముద్రాన్ని చిలకబోతేనే మహావిషం వచ్చిందని పురాణం చెబుతుంది. ఒక పనిని చేస్తుంటే కొన్ని విఘ్నాలు లేదా మనమనుకో(లే)ని పరిస్థితులూ మనలాంటి వాళ్లకి వచ్చాయంటే అదో చెప్పుకోదగిన విషయమా? విఘ్నం వస్తే ఎదుర్కోగల మనఃస్థితీ ధైర్యంగా పరిష్కరించుకోగల ఉపాయం మీకు తెలుసు. దృఢంగా విఘ్నాన్ని ఎదుర్కోండి. ఇలా అనడానిక్కారణం మీకు విజయమే లభిస్తుంది గనుక.

నదిలో ఈదుతున్న వాడు భయంతో ఆయాసంతో –అటుపక్క ఇటుపక్క నీటిపాములు ఒక్కసారి తలెత్తి నీళ్లలో మునుగుతూ కనిపిస్తుంటే, వణికిపోతూ ఎలాగో ఈదుకుంటూ ఒడ్డుకొస్తుంటే, ఒడ్డున ఉండి 'ఈదేవిధానాలను తీరుబడిగా చెప్పినట్లు'– ఈ కష్టాలని మీరు పడుతూ ఉంటే ఎవరెవరో వచ్చి ఏమేమో సలహాలని ఈయబోతే మొగమాటం లేకుండా వద్దని చెప్పండి. అలా ఖండించని పక్షంలో మీ జీవితం మొత్తం ఇలాంటివారి మాటల్ని వినడంతోనే ముగిసిపోతుంది.


తప్పనిసరి పరిస్థితిని సృష్టించి మీ భార్య/భర్త గాని ఇతరుల సమస్యని మీ ముందుంచి, ఆ సమస్యా పరిష్కారానికి మీ విలువైన సమయాన్ని వెచ్చించవలసిందని కోరితే– కుదరదని నిర్ద్వంద్వంగా చెప్పండి. ఇది మీకు అనుకూలమైన కాలం అవుతుంటే, ఈ సమయంలో మీ పనిని మానుకుని మరొకరికి కృషి చేయడమా? ధనాన్ని విరాళంగా ఇయ్యగలమేమోగాని, సమయాన్ని విరాళంగా దానం చేయడంలో పొందే నష్టం– ఇప్పుడు తెలియదు. తర్వాత తెలిసి కూడా ప్రయోజనం ఉండదు.

మొగమాటం లేకుండా మాట్లాడుతూ, ఎవరికీ సహాయపడకుండా ఉండవలసిందనేది దీని అభిప్రాయం కాదు. తన్నుమాలిన ధర్మం వద్దనేది భావం. అర్థమై ఉంటుంది.

లౌకిక పరిష్కారం: విఘ్నానికి భయపడకండి. పరిష్కారం ఎందుకుండదనుకుంటూ ప్రయత్నించండి. విజయం మీదే!

అలౌకిక పరిష్కారం: విష్ణుసహస్ర నామాలని ఒకే ఆసనంలో కూర్చుని ముమ్మారు పఠించండి!

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)



జ్యోతిషం ప్రకారం దశ బాగా ఉన్నప్పుడు ధర్మబద్ధంలగా గనక మెలుగుతుంటే– వర్షం వచ్చే సమయానికి ఇల్లు చేరినట్టు – సర్వసుఖాలూ వాటంతట అవే వెతుక్కుంటూ మనవద్దకొస్తాయి. ప్రస్తుతం అనుకూల కాలం కాబట్టి– ఇతర ద్రవ్య ఆలోచనలు, అసూయ, ద్వేషం, చాడీలు వంటివి మానండి. వ్యాధి ఉన్నవానికి ఔషధం కంటే ఇష్టమైనవి తినడం, వ్యాధిని పెంచే తినుబండారాలని మానడం ఎలా అవసరమో, అలా పైన అనుకున్న దుర్లక్షణాలని మానండి. ఎంతో బాగుంటుంది.

అలాగని మీ రాశివారికి మాత్రమ దుర్లక్షణాలుంటాయనేది దీని భావం కాదు. అందరి పరిస్థితీ అంతే. మీరుగాని సరిగా ఉంటే కలిసొచ్చే కాలమని చెప్పడం దీనిభావం.

ఓ కొంతకాలం నుండీ వస్తుంది వస్తుందనుకున్న భూలాభం లేదా గృహలాభం తప్పక తలుపు తడుతుంది. ఈ దశలో కొంత అనుష్ఠానాన్ని (దైవజపం మొదలైనవి) చేసుకుంటూ మరింత శీఘ్రంగానూ మరింత అనువైన తీరులోనే భూ/గృహలాభం కలిగే అవకాశం ఉంటుంది.

దాంపత్యం సుఖకరంగా ఉండే కారణంగా ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఇతరులకి సహాయపడగలుగుతారు. పదిమందిలో మంచి పేరు తెచ్చుకుంటారు. వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో మీదైన ఓ శైలిని ఏర్పాటు చేసుకుంటారు. అధికారుల ప్రశంసలని పొందగలుగుతారు. మానసిక ఆరోగ్య ఎంత ముఖ్యమో శారీరక ఆరోగ్యం కూడా అంత ముఖ్యం కాబట్టి మీ జీర్ణక్రియాశక్తి గురించి ఓసారి పరీక్షించుకోండి. ఈ దశలో ఇది అవసరం.

సంతానానికి సంబంధించిన జీవితపు ఎదుగుదలకోసం భవిష్య ప్రణాళికలవైపు దృష్టి సారించి సరైన పథకాల్లో పెట్టుబడుల్ని పెడతారు. మంచి పని చేయగలిగాననే ఆనందంతో ఉంటారు.


లౌకిక పరిష్కారం: తేలికపాటి ఆరోగ్యపరీక్షలు అవసరం– ముఖ్యంగా జీర్ణక్రియల గురించి.

అలౌకిక పరిష్కారం: శివునికి పంచామృతాభిషేకాన్ని చేయించుకోండి లేదా చేసుకోండి.

పరి పరిశోధన

వెంట్రుక మందం సూది...

మెదడులోని వేర్వేరు భాగాలకు అతి కచ్చితత్వంతో మందులు చేర్చేందుకు మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన సూదిని అభివృద్ధి చేశారు. మనిషి వెంట్రుక మందం మాత్రమే ఉండే ఈ సూదితో కేవలం ఒకే ఒక ఘనపు మిల్లీలీటర్ మోతాదు మందులను కూడా పంపవచ్చు. ఎలుకలపై పరిశోధనలు జరపడం ద్వారా



తాము వాటిలోని కదలిక సమస్యలను పరిష్కరించగలిగామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త కానన్ డాగ్‌డెవిరెన్ తెలిపారు. ఈ సూదిలో కొన్ని అతి సూక్ష్మమైన గొట్టాలు ఉంటాయి.. వాటిద్వారా వేర్వేరు మందులను ఏకకాలంలో మెదడులోకి పంపగలగడం దీని ప్రత్యేకతని వివరించారు. పది సెంటీమీటర్ల పొడవు, 30 మైక్రోమీటర్ల వెడల్పు ఉండే గొట్టాలను ఒక్కటిగా తయారైన సూదిలోపల ఉంటాయని ప్రత్యేకమైన పంపులు, వ్యవస్థ ద్వారా మందుల మోతాదులను నియంత్రించవచ్చునని వివరించారు. సంప్రదాయ పద్ధతుల్లో ఏ మందైనా మెదడు మొత్తం వ్యాపించిన తరువాత పనిచేస్తుందని.. ఫలితంగా కొన్ని దుష్ప్రభావాలు కనిపిస్తాయని.. కొత్త సూదితో ఈ సమస్యలు ఉండవని చెప్పారు. సమస్యకు అనుగుణంగా మెదడులోని ఏ భాగానికి మందు చేరాలో నిర్ణయించుకోగలగడం ద్వారా వేగంగా ఫలితాలను పొందవచ్చునని తెలిపారు.

పసుపుతో జ్ఞాపకశక్తికీ మేలే!

పసుపులోని కర్కుమిన్ పదార్థం జ్ఞాపకశక్తిని పెంచేందుకు మాత్రమే కాకుండా మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు దోహదపడుతుందని అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు. మతిమరుపు లేని... ఈ లక్షణాలతో కూడిన వ్యాధి అయిన అల్జీమర్స్ రోగులపై జరిపిన పరిశోధనల ద్వారా తాము ఈ అంచనాకు రాగలిగామని శాస్త్రవేత్తలు చెప్పారు. భారతీయుల్లో అల్జీమర్స్ వ్యాధిగ్రస్తులు తక్కువగా



ఉండేందుకు పసుపు వాడకం ఒక కారణం కావచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ గారీ స్మాల్ తెలిపారు. పరిశోధనల్లో భాగంగా తాము 50 –90 ఏళ్ల మధ్య వయసువారికి రోజూ 90 మిల్లీగ్రాముల కర్కుమిన్ రెండు సార్లు ఇచ్చామని.. కొందరికి ఉత్తుత్తి మాత్రలు ఇచ్చామని చెప్పారు. దాదాపు 18 నెలలపాటు కర్కుమిన్ అందించిన తరువాత వారి మెదడు పనితీరుకు సంబంధించిన పరీక్షలు నిర్వహించామని.. ఆ తరువాత ఆరు నెలలకు ఒకసారి ఇవే పరీక్షలు నిర్వహించామని వివరించారు. ఫలితాలను పరిశీలించినప్పుడు కర్కుమిన్ తీసుకున్న వారి జ్ఞాపకశక్తి పెరిగినట్లు.. ఉత్తుత్తి మాత్రలు తీసుకున్న వారిలో లేనట్లు తెలిసిందని అన్నారు. అంతేకాకుండా కర్కుమిన్ తీసుకున్న వారి మూడ్‌లోనూ ఎన్నో సానుకూల మార్పులు కనిపించాయని చెప్పారు. మరింత విస్తృత స్థాయి పరిశోధనలు నిర్వహించడం ద్వారా ఈ ఫలితాలను ధ్రువీకరించుకుంటే.. జ్ఞాపకశక్తిని పెంచేందుకు పసుపు ఓ మంచి ఆయుధం కాగలదన్నమాట!

ఆ రెండు గ్రహాలు.. ఆవాసయోగ్యాలే!

ట్రాపిస్ట్–1... ఈమధ్యే సౌర కుటుంబానికి ఆవల గుర్తించిన గ్రహ వ్యవస్థ పేరు ఇది. ఏడు గ్రహాలతో కూడిన ట్రాపిస్ట్ –1లో కనీసం రెండు గ్రహాలపై ఆవాసయోగ్యమైన పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు అమీ బార్ అనే శాస్త్రవేత్త. మొత్తం ఏడు గ్రహాలు కూడా కొంచెం అటు ఇటుగా



భూమి సైజులోనే ఉండటం వల్ల ట్రాపిస్ట్ –1 పై శాస్త్రవేత్తలు అమితాసక్తిని చూపుతున్నారు. మిగిలిన గ్రహ వ్యవస్థలతో పోలిస్తే ట్రాపిస్ట్–1 చాలా పాతది. అంతేకాకుండా సాపేక్షంగా సగటు ఉష్ణోగ్రతలూ తక్కువే. అందుకే ఈ గ్రహ వ్యవస్థలో ఆవాసయోగ్యమైనవి ఉండే అవకాశాలు ఎక్కువన్న అంచనాతో శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టారు. మొత్తం గ్రహాలను బి, సి, డి, ఇ, ఎఫ్, జి. హెచ్... అనుకుంటే డి, ఇ లు రెండూ ఆవాసయోగ్యంగా ఉన్నట్లు తెలుస్తోందని బార్ చెబుతున్నారు.

పండుగకు తరచూ చేసుకునేది మిఠాయిలే
కానీ ఇప్పుడు మార్కెట్‌లో పండుమిరపకాయలు
బోలెడు దొరుకుతున్నాయి.
అందుకే సరదాగా కారం పండుగ చేసుకుందాం

కారం పండుగ



పండు మిర్చి – గోంగూర కారం

కావలసినవి: **పండు మిర్చి** – 500 గ్రా.; **గోంగూర** – 10 కట్టలు; **వెల్లుల్లి రేకలు** – 5; **ధనియాలు** – టేబుల్ స్పూను; **చింతపండు** – కొద్దిగా; **ఎండు మిర్చి** – 10; **సెనగ పప్పు** – టీ స్పూను; **మినప్పప్పు** – టీ స్పూను; **ఇంగువ** – టీ స్పూను; **కరివేపాకు** – రెండు రెమ్మలు; **ఉప్పు** – తగినంత; **నూనె** – 150 గ్రా.; **ఆవాలు** – టీ స్పూను; **జీలకర్ర** – టీ స్పూను

తయారి: ● ముందుగా గోంగూరను శుభ్రం చేసి బాగా కడిగి తడిపోయేవరకు ఆరబెట్టాలి ● పండు మిర్చి తొడిమలు తీసి శుభ్రంగా కడిగి ఆరిన తరవాత, చిన్న చిన్న ముక్కలుగా చేసి పక్కన ఉంచుకోవాలి ● బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక గోంగూర వేసి పచ్చి పోయేవరకు వేయించి, తీసి పక్కన పెట్టాలి ● అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి పండు మిర్చి ముక్కలు, చింతపండు వేసి వేయించి తీసేయాలి ● అదే బాణలిలో నూనె కాగాక ఇంగువ, సెనగ పప్పు, మినప్పప్పు, ధనియాలు, ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, వెల్లుల్లి రేకలు, కరివేపాకు ఒక దాని తరవాత ఒకటి వేసి వేయించాలి ● మిక్సీలో ముందుగా గోంగూర, చింతపండు వేసి మెత్తగా చేయాలి ● పండు మిరప ముక్కలు వేసి మరోమారు తిప్పాలి ● తగినంత ఉప్పు జత చేసి మరో మారు మిక్సీ తిప్పి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● వేయించి ఉంచుకున్న పోపు జత చేసి బాగా కలిపి సీసాలోకి తీసుకుని నిల్వ చేసుకోవాలి.

పండు మిర్చి పచ్చడి

కావలసినవి: **పండు మిర్చి** – 500 గ్రా.; **చింతపండు** – 150 గ్రా; **ఉప్పు** – తగినంత; **పసుపు** – టేబుల్ స్పూను; **మెంతులు** – టేబుల్ స్పూను (వేయించి మిక్సీలో వేసి పొడి చేయాలి) **వెల్లుల్లి రేకలు** – 50 గ్రా.; **పోపు కోసం... నూనె** – 4 టేబుల్ స్పూన్లు; **ఆవాలు** – అర టీ స్పూను; **జీలకర్ర** – అర టీ స్పూను; **సెనగ పప్పు** – టీ స్పూను; **మినప్పప్పు** – టీ స్పూను; **ఎండు మిర్చి** – 3; **కరివేపాకు** – 2 రెమ్మలు

తయారి: ● ముందుగా పండు మిర్చిని శుభ్రంగా కడిగి తడి పోయేవరకు ఆరబెట్టాలి ● చింతపండులోని గింజలు, ఈనెలు తీసి పక్కన ఉంచాలి ● తొడిమలు తీసి, పండు మిర్చిని రెండు ముక్కలుగా కట్ చేసి, ఉప్పు, పసుపు జత చేసి, మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా చేయాలి ● ఒక పాత్రలో ముందుగా చింతపండు వేసి, ఆ పైన మిక్సీ పట్టిన పండు మిర్చి ముద్ద వేసి మూత పెట్టి మూడు రోజులు అలానే ఉంచాలి ● మూడు రోజుల తరవాత మిశ్రమం అంతా బయటకు తీసి, మరోమారు మిక్సీలో వేసి అన్నీ కలిసేలా ఒకసారి మిక్సీ పట్టి తీసేయాలి ● బాణలిలో నూనె కాగాక ఆవాలు, జీలకర్ర, సెనగ పప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు వరసగా వేసి దోరగా వేగాక తీసేయాలి ● తయారుచేసి ఉంచుకున్న పచ్చడిలో పోపు వేసి కలియబెట్టాలి ● మెంతి పొడి, వెల్లుల్లి రేకలు వేసి మరోమారు కలిపి, వేడి వేడి అన్నంలో తింటే రుచిగా ఉంటుంది.





పండు మిర్చి - చికెన్ కుర్మా

కావలసినవి: **గ్రేవీ కోసం... పండు మిర్చి** – 6 (శుభ్రంగా కడిగి తొడిమలు తీసి ముక్కలు చేయాలి); **ఉల్లిపాయలు** – 2 (సన్నగా తరగాలి); **టొమాటోలు** – 2 (చిన్న చిన్న ముక్కలు చేయాలి)

కూర కోసం... చికెన్ – అర కేజీ; **పసుపు** – పావు టీ స్పూను; **నూనె** – 4 టేబుల్ స్పూన్లు; **లవంగాలు** – 3; **దాల్చిన చెక్క** – చిన్న ముక్క; **ఏలకులు** – 3; **ఉల్లిపాయ** – 1 (సన్నగా తరగాలి); **కరివేపాకు** – 2 రెమ్మలు; **అల్లం వెల్లుల్లి ముద్ద** – టీ స్పూను; **ధనియాల పొడి** – టీ స్పూను; **చిక్కగా గిలకొట్టిన మజ్జిగ** – అర కప్పు ; **నీళ్లు** – కప్పు; **గరం మసాలా** – అర టీ స్పూను; **పచ్చి మిర్చి** – 3 (సన్నగా తరగాలి); **ఉప్పు** – తగినంత; **కొత్తిమీర** – పావు కప్పు (సన్నగా తరగాలి)

గ్రేవీ తయారీ... మిక్సీలో పండు మిర్చి ముక్కలు, ఉల్లి తరుగు, టొమాటో తరుగు వేసి మెత్తగా చేసి పక్కన ఉంచాలి.

కూర తయారి ● చికెన్, పసుపు జత చేసి బాగా కలిపి సుమారు 20 నిమిషాలు మూత పెట్టి ఉంచాలి ● బాణలి వేడయ్యాక నూనె పోసి కాగనివ్వాలి ● లవంగాలు, ఏలకులు, దాల్చిన చెక్క వేసి కొద్దిగా వేయించాలి ● ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు, కరివేపాకు వేసి మెత్తగా అయ్యేవరకు కలియబెట్టాలి ● అల్లం వెల్లుల్లి ముద్ద వేసి వాసన పోయేవరకు రెండు నిమిషాలు ఉడికించాలి ● చికెన్ వేసి కలిపి, పైన ధనియాల పొడి, చిక్కటి మజ్జిగ, ఉప్పు జత చేసి మరో రెండు నిమిషాలు ఉడికించాలి ● గ్రేవీ జత చేసి, కప్పుడు నీళ్లు, గరం మసాలా వేసి బాగా కలపాలి ● గ్రేవీ చిక్కగా అయ్యేవరకు ఉడికించాలి ● కొత్తిమీర జత చేసి దింపేయాలి.



పండు మిర్చి - టొమాటో - కొత్తిమీర చట్నీ

కావలసినవి: **పండు మిర్చి** – 10; **కొత్తిమీర** – కప్పు; **టొమాటో ముక్కలు** – కప్పు; **పచ్చి సెనగపప్పు** – టీ స్పూను; **ధనియాలు** – టీ స్పూను; **వెల్లుల్లి రేకలు** – 4; **నూనె** – 2 టేబుల్ స్పూన్లు; **ఆవాలు** – టీ స్పూను; **జీలకర్ర** – టీ స్పూను; **ఉప్పు** – తగినంత

తయారి: ● ముందుగా బాణలిలో టేబుల్ స్పూను నూనె వేసి కాగాక, పచ్చి సెనగ పప్పు, ధనియాలు వేసి వేయించాలి ● వెల్లుల్లి రేకలు జత చేసి మరోమారు వేయించాలి ● పండు మిర్చి, టొమాటో ముక్కలు జత చేసి బాగా కలపాలి ● పదార్థాలన్నీ బాగా వేగిన తరవాత కొత్తిమీర జత చేసి మరోమారు కలిపి దింపేయాలి ● తగినంత ఉప్పు జత చేసి, బాగా కలపాలి ● చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక ఆవాలు, జీలకర్ర, సెనగ పప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి వేసి వేయించాలి ● మిక్సీ పట్టిన పచ్చడిని పోపులో వేసి కలిపి స్టౌ మీద నుంచి దింపాలి.

పండు మిర్చి స్పైసీ ఫిష్ కర్రీ



కావలసినవి: **చేపలు** – 500 గ్రా.; **నూనె** – 4 టేబుల్ స్పూన్లు; **ఉల్లిపాయ** – 1 (సన్నగా తరగాలి); **టొమాటోలు** – 2 (చిన్న చిన్న ముక్కలుగా తరగాలి); **వెల్లుల్లి తరుగు** – టేబుల్ స్పూను; **అల్లం తరుగు** – టేబుల్ స్పూను; **పచ్చి మిర్చి తరుగు** – టేబుల్ స్పూను; **కరివేపాకు** – 7 రెమ్మలు; **పండు మిర్చి పేస్ట్** – 3 టేబుల్ స్పూన్లు; **చింతపండు రసం** – అర కప్పు; **సన్నగా తరిగిన కొత్తిమీర** – అర కప్పు; **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – కప్పుడు

పండు మిర్చి పేస్ట్ కోసం... పండు మిర్చి – 10; **వేయించిన జీలకర్ర** – టీ స్పూను; **వేయించిన మెంతులు** – పావు టీ స్పూను; **కరివేపాకు** – రెండు రెమ్మలు; **వెల్లుల్లి రెబ్బలు** – 3; **ఉప్పు** – అర టీ స్పూను; **నీళ్లు** – మిక్సీలో గ్రైండ్ చేయడానికి సరిపడా; ఈ పదార్థాలన్నిటినీ మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్ చేయాలి.

తయారి: ● చేపల మీద కొద్దిగా ఉప్పు రుద్ది, శుభ్రంగా కడగాలి ● పెద్ద బాణలిలో నూనె వేసి కాగాక, ఉల్లి తరుగు, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు, కరివేపాకు వేసి వేయించాలి ● టొమాటో ముక్కలు వేసి బాగా మెత్తగా అయ్యేవరకు వేయించాలి ● పండు మిర్చి పేస్ట్ జత చేసి రెండు నిమిషాలు వేయించాలి ● చింతపండు రసం, ఉప్పు, కప్పుడు నీళ్లు వేసి మరోమారు బాగా కలపాలి ● గ్రేవీ బాగా ఉడుకుతుండగా చేప ముక్కలు, కొత్తిమీర తరుగు, మూడు టేబుల్ స్పూన్ల నూనె వేసి కలపాలి ● మంట బాగా తగ్గించి సుమారు పది నిమిషాలు ఉడికించి దింపేయాలి ● మూత పెట్టి గంట తరవాత వడ్డించాలి.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)



ఇప్పటివరకూ – మీకెప్పటికప్పుడు చేతికొస్తున్న ఆదాయంతోనే నెట్టుకు రాగలుగుతున్నారు గాని, ఇప్పుడు మాత్రం మీరు దాచుకున్న సొమ్ముని వాడవలసిన పరిస్థితికి వస్తారు. ద్రవ్యాన్ని తీస్తున్నందుకు బాధనీ ఆందోళననీ పడకండి గాని – ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నది ఎందుకు? – అనే దిశగా మాత్రం ఒక్కసారి ఆలోచించుకోవడం తప్పనిసరి. పట్టుదల, కోపం అనేవాటి నేపథ్యంలో ఈ సొమ్ముని ఖర్చు చేస్తున్నామా? అని మాత్రం ప్రశ్నించుకోండి! ఒక తోవన పోతున్నప్పుడు ఆ తోవ రెండు వైపులకి చీలి ఉన్న సందర్భంలో అటుగా వచ్చేవారిని అడిగి మాత్రమే – మనం వెళ్లాల్సిన ఊరి తోవని ఎంచుకుంటాం కదా! అలాగే మీ జీవిత గమనంలో మీరు నడుస్తున్న తీరులో ఏదైనా విఘ్నం, సంశయం తలెత్తితే, మీకు మీరే ఓ నిర్ణయాన్ని తీ(సే)సుకుని వెళ్లిపోవడం కాకుండా, పెద్దల్నీ అనుభవజ్ఞుల్నీ సంప్రదించి ఆ మీదట నడవడం సరైన పని. కొందరు అధికారులు అధర్మబద్ధంగానూ అన్యాయ మార్గంలోనూ మీకు సహాయపడతామంటూ వచ్చే అవకాశముంది. కల్పవృక్ష పుష్పాలు సుమా! అంటూ కాగితపు పూలని మీకు అంటగట్టినట్టు ఈ వక్ర మార్గాలూ ధోరణులూ తాత్కాలికంగా మీకు ఆనందదాయకాలౌతాయి గాని, తప్పక కారాగారం దాకా పరిస్థితుల్ని నెట్టెయ్యవచ్చు. ఏ మాత్రమూ ఆ వైపుకి బుద్ధిని పోనియ్యకండి! సంతానానికి సంబంధించిన చదువులూ, సంపాదించుకున్న ఆస్తుల మీది ఆదాయాలూ, రావలసిన బకాయిలూ... ఇవన్నీ సక్రమంగా వస్తున్నప్పటికీ మానసిక ఆందోళన ఉంటూనే ఉంటుంది. ఈ ఆదాయాలు ఏవో పనులకి వ్యయమైపోతూనే ఉంటాయి. దోసిలిలో పట్టిన నీళ్లలాగా కొంత సమయమయ్యేసరికి... హుళక్కిగానే కన్పిస్తుంది ఆర్థిక స్థితి.

చికాకు కలిగించే పనుల్ని మీద వేసుకోవడం, చికాకు సమస్యల్లో కలిగే సంఘర్షణ వాతావరణంలో జీవించడం మీకు ఆనందకరంగానూ లేదా తప్పనిసరిగానూ కావచ్చునేమో గాని, సంతానానికి మాత్రం ఈ వాతావరణం ఏ మాత్రమూ సరికాదు భవిష్యత్తులో.

లౌకిక పరిష్కారం: పట్టుదల, కోపం, ఆందోళన, మానసిక సంఘర్షణలకి దూరంగా ఉండండి.

అలౌకిక పరిష్కారం: ఆంజనేయస్వామికి మన్యు సూక్తంతో అభిషేకాన్ని చేయించుకుంటూ ఉండండి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)



పల్లెటూళ్లలో ఒకప్పుడు చిత్రమైన పందేలు ఉండేవి. 'వాడి నెత్తిమీద కొడితే కొబ్బరికాయ పగులుతుందా? లేదా?' అని. ఆ టెంకాయ పగిలినా పగలకున్నా పందెం కాసేవాళ్లు ఇద్దరికీ దిగుల్లేదు. వచ్చిన బాధల్లా ఎవడి తలమీద కొడతారో వాడికి మాత్రమే కదా! సరిగ్గా దీనికి సరిపోయే తీరులో – ఉద్యోగంలో ఇంత కష్టమైన పనిని ఫలానివానికి (మీకు) అప్పజెప్తితే ఎలా ఉంటుంది పర్యవసానం? – అనుకుంటూ అసాధ్యమైన పనిని మీకు అంటగట్టబోతారు. నిర్భయంగా వ్యతిరేకించండి.

వ్యాపారంలో భాగస్వాములతో వచ్చిన పేచీ తనంతట తానే తొలగిపోతుంది. ఉద్యోగంలో కలిగిన ప్రతికూలత పూర్తిగా సమసిపోయి అనుకూల వాతావరణమేర్పడుతుంది. మిత్రుల్లో కొందరు మిమ్మల్ని అప్రతిష్ఠ పాలు చేయాలనుకుని వాళ్లకి వాళ్లే భంగపడి, ఓ దశలో ఆ అప్రతిష్ఠని చేయదలచినవాళ్లు తామే అనే విషయాన్ని సాక్ష్యంగా చెప్పుకునేలా బయటపడతారు.

అంత పెద్ద ఏనుగూ ఒక చిన్నతాడు కడితే చాలు మావటివాని చేతిలో కుక్కపిల్లలా వెంటబడి వస్తుందో, అలాగే ఎందరో శత్రువులు తమంత తామే మిమ్మల్ని కలుసుకోవాలంటూ మీ వద్దకొస్తారు. 'ఒకసారి తెలియక దెబ్బతినబోయి నిలదొక్కుకున్న మీరు మళ్లీ అదే గోతిలో పడటం ఎంతవరకు న్యాయం?' అనే దిశగా ఆలోచించి జాగ్రత్తపడండి!

మీరు చేసిన శ్రమకి తగిన ప్రతిఫలం వస్తుందని నిర్భయంగా ఎదురు చూడండి! ఏదో తీరుగా రాజీ పడాల్సిన అవసరం అసలు లేదా కాబట్టి దేని విషయంలోనూ మెత్తదనాన్ని చూపకండి! మీకు మీరుగా నడుచుకోండి.

ఉద్యోగంలో బాధ్యతల్ని అదనంగా మీకియ్యచ్చు. అలా కొత్త పనిని చేయడం మంచిదే మీకు!

లౌకిక పరిష్కారం: ఎవరు నమ్మదగినవారో? అలాగే దేవుణ్ని ఎవరు వ్యతిరేకిస్తున్నారో గమనించి వాళ్ల జతని మానడం మంచిది.

అలౌకిక పరిష్కారం: శ్రీ విష్ణుసహస్ర నామాలని గొంతు నిండుగా పఠించేలా చేయండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)



ఎంతగా మనుష్యుల అండ ఉన్నా, ఎంత సంపద ఉన్నా, కీర్తి ప్రతిష్ఠలున్నా... దైవబలం లేనిదే ఏ పనీ మనకి సానుకూలంగా ముగియదు. ప్రస్తుతం మీకు దైవానుగ్రహం పరిపూర్ణంగా ఉంది కాబట్టి ధర్మబద్ధంగా తలపెట్టిన అన్ని పనులూ నెరవేరుతాయి. పరిగెత్తబోతున్న మన కాళ్లకి మనమే బంధం వేసుకుంటున్నట్టుగా మీరుగాని ఇతరుల మీద ద్వేష భావంతో ప్రతీకార బుద్ధితో ముందుకు నడిస్తే, తప్పక ఆ దైవానుగ్రహం వెనుదిరిగి దైవ ఆగ్రహానికి గురి అవుతారు.

సంతానానికి ఉద్యోగం లభించే అవకాశం ఉంది. విదేశంలో ఉంటున్నవారు తల్లిదండ్రుల్ని చూడ్డానికో లేక వివాహాదులకి రావడం నిమిత్తమో స్వదేశానికి వచ్చే అవకాశముంది. పైఅధికారులతోనూ కింది ఉద్యోగులతోనూ తగు మాత్రంగా ప్రవర్తించాలి తప్ప పైవారితో అతి వినయం, కిందివారి మీద అధికార దర్పం చూపడం సరికాదు. ఆ ఆలోచనల్ని విరమించండి.

రుణాన్ని చేయాల్సిన బలమైన అవసరం రావచ్చు. వీలయినంతవరకూ వ్యయానికి సంబంధించిన పథకాన్ని మరోమారు పరిశీలించుకుని ఖర్చుని తగ్గించుకోండి తప్ప, రుణానికి వెళ్లకండి. ఈ కాలంలో చేసిన రుణం తీరేందుకు కొంత ఎక్కువ కాలమే పట్టచ్చు. దానికి – తీర్చగలం కదా! అనే ఉదాసీన భావం కూడా ఒక కారణం కావచ్చు.కుటుంబంలో పేరుకున్న సమస్యల పరిష్కారం కంటే ఇతరుల సమస్యల మీద దృష్టిని పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న కారణంగా కుటుంబంలో కొన్ని ఒడిదుడుకులు రావచ్చు. ముఖ్యంగా కుటుంబ భాగస్వామితో పొరపొచ్చెం ఏర్పడవచ్చు. లౌక్యంగా ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోవడాన్ని మానండి.

లౌకిక పరిష్కారం: సొంత దాంపత్యంలో రాబోయే కలతలని దాటి ఇతరులకి సహాయపడవలసిన అవసరం లేదు.

అలౌకిక పరిష్కారం: భార్య/ భర్త పుత్రులతో వినోద/ విహార యాత్రని చేస్తూ దైవ దర్శనం చేయండి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)



ఏం జరుగుతుందో? ఏమై పోతానో? అని ఎంత మానసికంగా ఆందోళనపడుతూ ఉంటారో అదంతా ఓ కలలాగా అయిపోయి, అమితానందకరమైన పరిస్థితులు మీకు లభిస్తాయి. గోతిలో పడి దాన్నుండి పైకొచ్చాక ఆ గోతిని చూసుకని – ఇంత లోతు గోతిలో తగు జాగ్రత్త తీసుకోకుండా పడ్డానా? ఎంత బుద్ధిమాలిన తనం! అని ఎలా అనుకుంటామో, అలా జరుగుతున్న సంఘటన నుండి చక్కగా బయటపడి ఓ క్షణం పాటు వెనక్కి ఆలోచనలని మళ్లించి కొద్దిగా బాధపడతారు – ఎందుకిలా అయ్యాను అప్పుడు? – అని. శనిగ్రహమనగానే అందరూ అదోలా భయపడుతూ ఆలోచిస్తారు గాని శని గ్రహం – వ్యక్తికి జీవిత పాఠాన్ని నేర్పుతాడు. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో, ఎవరు కష్టంలో సహాయానికి నిస్వార్థంగా వచ్చి పక్కన అండగా నిలుస్తారో, ఎవరు మొసలి కన్నీటిని విడుస్తారో... ఇలా మనకి అర్థమయ్యేలా జీవితమనే తరగతిలో అవగాహనతో చెప్పే మంచి ఉపాధ్యాయుడు శని. జీవితంలో నాలుగు తలుపులూ వేసుకుని తాను పట్టిన వ్యక్తిని ఒక్క మారైనా కంటి నిండుగా ఏడ్చేలా చేసే గ్రహం శని. ఆ మీదట హానిని చెయ్యడు. కుబుసం విడిచిన మీదట పాము ఎలా నిగనిగలాడుతూ చరచరా పాకుతూ వెళ్లిపోతుందో అలా ఏదో కష్టాన్ని తెచ్చి ఆ మీదట కష్టాన్ని తొలగించి ఆనందపెట్టేవాడు శని. ఆ దశ మీకు దాదాపు అయిపోయింది కాబట్టి ధైర్యంగా ఉండండి.

ఈ మీదట ఏదైనా విఘ్నం కష్టం గాని వస్తే నవ్వుకోండి. దానిక్కారణం మీకొచ్చిన కష్టం ముందు ఈ కష్టం ఓ కష్టం కా(బో)దు కాబట్టీ, కష్టాన్ని దాటే ఉపాయశక్తిని శని గ్రహమే మీకు నేర్పాడు కాబట్టీను.

ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా, ఉద్యోగ పరంగా ఆనందంగా ఉంటారు.

లౌకిక పరిష్కారం: ధర్మబద్ధంగానే వ్యవహరించండి. అంతా జయం జయం జయమే.

అలౌకిక పరిష్కారం: శని ప్రదక్షిణలని (19) చేస్తూ శని శ్లోకాన్ని చదవండి. వీలయితే ప్రతిరోజూ ఆదిత్య హృదయ స్తోత్రాన్ని కూడా పఠించండి ప్రతిరోజూ.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)



మీ పైఅధికారులు కావాలని ఉద్యోగంలో మీకు శ్రమని కలగజేసే తీరులో ప్రవర్తిస్తారు. వ్యాపారంలో ఉన్నవారిని కావాలని ప్రభుత్వాధికారులు పీడించవచ్చు. వృత్తిలో ఉన్నవారికి కూడా చిక్కులు తప్పక రావచ్చు. భయం, ఆందోళన అవసరం లేదు. మీరు ఈ పరిస్థితుల్ని గమనించి ఎంత మౌనంగా ఉంటే అంతగా ఈ సమస్య పూర్తిగా తొలగిపోయి ఆ శత్రువుల్లా ఉన్నవారే ఆప్తమిత్రుల్లా వ్యవహరించే కాలం ఇది. అనుకూల కాలం. తగు ప్రయత్నాలని గాని చేస్తే పాత బకాయిలు వసూలు కావడమే కాక, వసూలు చేసుకునే తీరు తెన్నుల్నీ – మరికొందరి విషయంలో ఎలా ప్రవర్తించాలో ఆ పద్ధతుల్నీ కూడా బకాయిదారులే చెప్పే అవకాశముంది. దూర ప్రయాణాలు చేయవలసి వస్తే ఆ ప్రయాణం మీకెంతవరకు ప్రయోజనపడుతుందో లెక్కించుకుని మాత్రమే ప్రయాణానికి వెళ్లండి. ఇలా ఆలోచించుకోవడం మీకు అవసరం. ఎప్పటినుండో ఓ పెద్ద చికాకుగా అన్పిస్తున్న ఓ భూ ఆక్రమణ సమస్య గాని, ఉద్యోగంలో ఏర్పడిన ప్రతిష్ఠంభన (సస్పెన్షన్) సమస్య గాని, మీ సంతానానికి చెందిన దాంపత్య సమస్య గాని... మీకు అనుకూలమైన తీరులో ముగింపుకొచ్చి సంతోషాన్ని కలుగజేస్తుంది. ఈ ప్రయత్నంలో కొద్ది ఎక్కువ మొత్తంలో వ్యయమైనప్పటికీ చింతించకండి. మీ మాటకి విలువ పెరిగి మీరు చెప్పగానే ఇతరులకి పనులన్నీ సుఖంగా పూర్తి అవుతాయి. అంత మాత్రాన అయినదానికీ కానిదానికీ మీ మాట విలువని వ్యయం చేసుకోకండి. ఇది అతి ముఖ్యం. వివాహాది శుభకార్యాలు వెంటనే ఫలిస్తాయని చెప్పే వీలులేదు కాని, ప్రయత్నిస్తూ ఉండడం మానరాదని గమనించాలి. ఆర్థికంగా కొద్ది లోటులో ఉండచ్చు. ప్రణాళికాబద్ధంగా వ్యయం చేసుకోండి.

లౌకిక పరిష్కారం: అడిగిన అందరికీ సహాయపడడం అనేది సరికాదు. ఉచిత అనుచితాలని గమనించి సాయం చేయండి.

అలౌకిక పరిష్కారం: లలితా సహస్రనామాలని సామూహికంగా పారాయణ చేయించుకోండి వారంలో ఓ రోజున.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)



ఆధ్యాత్మికంగా దృష్టి బాగా మరలిన కారణంగా తీర్థయాత్రలూ పుణ్య నదీ స్నానాలూ క్షేత్ర దర్శనాలూ... అంటూ కొంతకాలం గడుపుతారు. దేనికయినా 'అతి' మంచిది కాదని గమనించుకుంటూ సాగండి. దాన ధర్మాల విషయంలో కూడా దానం స్వీకరించేవానికి తగిన అర్హత ఉందా? లేదా? అనే అంశాన్ని పరిశీలించి మరీ దానం చేయండి.

ఇది మీకు అనుకూల కాలం కాబట్టి ఏమైనా ఎలాగైనా చేయచ్చనుకోండి. బండి ఎప్పుడూ పల్లానికి వెళ్తున్నప్పుడే తగిన జాగరూకతతో ఉండి తీరాలి. రుణమియ్యడం, మాట సహాయం వంటివన్నీ ఒకటికి రెండు మార్లు ఆలోచించుకుని చేయదగిన కార్యాలు. భార్య/ భర్త ఆరోగ్యం కొంత తాత్కాలికంగా దెబ్బతినే అవకాశముంది కాబట్టి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ప్రయాణాలని మానండి.


మీరంటే గిట్టనివారు మిమ్మల్ని గురించి మంచిగా ఎన్నడూ చెప్పరు కాబట్టి, వారి దృష్టిలో మంచిగా ఉండాలనే ఊహతో వ్యర్థ ప్రయత్నాలని చేయకండి. మీదైన శైలిలో వెళ్లిపోతూ ఉండండి. వృత్తి, ఉద్యోగ వ్యాపారాల్లో సానుకూల ధోరణి ఉంటుంది. ఉద్యోగాన్నీ వ్యాపారాన్నీ మార్చాలనే దృష్టి గాని, మరో వ్యాపారం కూడా ప్రారంభిద్దామనే ఊహ గాని ప్రస్తుతానికి సరికాదు.

విదేశాలకి వెళ్లాలనే మీ అభిప్రాయం మంచిదే కావచ్చునేమో గాని, ప్రస్తుతం వెళ్లినట్లయితే సంతానపు చదువూ ఉద్యోగ విధులూ, ఇక్కడి పరిస్థితులూ... ఇవన్నీ ప్రతిష్ఠంభనకి గురయ్యే అవకాశముంది కాబట్టీ, మీకు రావలసిన మంచి మీరు వెళ్లకున్నా కలుగుతుంది కాబట్టీ, ప్రస్తుతానికి ఆ ఆలోచనని వాయిదా వేయడం మంచిది. క్రయ విక్రయాలు ప్రస్తుతానికి మంచిది కాదు.

లౌకిక పరిష్కారం: మీరంటే గిట్టనివారిని మంచి చేసుకునేందుకు ప్రయత్నించద్దు. మీదైన హాని తలపెట్టని శైలిలో సాగిపోండి.

అలౌకిక పరిష్కారం: ఆంజనేయునికి తమలపాకు పూజని చేసుకోండి.

చిట్టి ఆన్ ది వే


● రజనీకాంత్

దీపావళికి(గతేడాది) వస్తున్నాం... జనవరి 25న వస్తున్నాం... అని '2.0'కి రెండు ముహూర్తాలు ఫిక్స్ చేశారు. రాలేదు. ఏప్రిల్‌లో మూడో ముహూర్తం ఉంది. ఈసారి రావడం పక్కా అని రజనీకాంత్ అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వచ్చే అవకాశం ఉందని '2.0' యూనిట్ స్పీడ్ చూస్తే అనిపిస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల స్పీడు పెంచారట. ''2.0 సినిమా టీజర్ పనులు లాస్ ఏంజెల్స్‌లో ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి. సినిమాలో ఎక్కువ శాతం సీజీ వర్క్ ఉండటం మూలాన ఎక్కువ టైమ్ పడుతోంది. కంప్లీట్ అవ్వగానే టీజర్ విడుదల తేదీ చెబుతాం'' అని చిత్రదర్శకుడు శంకర్ పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రం ఆడియో వేడుకను దుబాయ్‌లో ఘనంగా నిర్వహించారు. టీజర్‌ను హైదరాబాద్‌లో, ఆ తర్వాత చెన్నైలో ట్రైలర్‌ను విడుదల చేయాలనుకుంటున్నారట. అత్యంత భారీ బడ్జెట్‌తో 'రోబో'కి సీక్వెల్‌గా లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రంలో అక్షయ్ కుమార్ విలన్‌గా కనిపిస్తారు. అమీ జాక్సన్ కథానాయిక. ఏప్రిల్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. మరి.. వస్తుందా? అదే రోజు తమిళ సంవత్సరాది. తమిళ ప్రేక్షకులు రెండు పండగలు చేసుకుంటారా? వేచి చూద్దాం.


● శ్రుతీహాసన్

స్పెషల్ బర్త్‌డే

'ఇవాళ నా బర్త్‌డే, హ్యాపీ బర్త్‌డే టూ మీ...' అంటూ తనకూ తానే విషెష్ చెప్పుకుంటూ ప్రతీ సంవత్సరం సరదాగా తన ఆత్మీయులతో కలిసి బర్త్‌డే పార్టీలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటారు శ్రుతీహాసన్. 2016లో తండ్రి కమల్‌హాసన్‌తో చెన్నైలో తన బర్త్‌డేను సెలబ్రేట్ చేసుకున్నారు. గతేడాది తన క్లోజ్ ఫ్రెండ్స్, హీరోయిన్ తమన్నాతో కలిసి జరుపుకున్నారు. మరి ఈ ఏడాది శ్రుతీహాసన్ బర్త్‌డేను ఎక్కడ? ఎవరితో జరుపుకుంటారో అని ఔత్సాహికరాయుళ్లు ఎదురు చూస్తున్నారు. ఆ ఆసక్తికి కారణం మైఖేల్ కోర్సెల్. లండన్‌కి చెందిన ఈ థియేటర్ ఆర్టిస్ట్‌తో శ్రుతి లవ్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి కూడా చేసుకోబోతున్నారని వార్తలు వస్తున్నాయి. పెళ్లి గురించి క్లారిటీ ఇవ్వలేదు కానీ 'నా మనసులో మైఖేల్‌కి స్పెషల్ ప్లేస్ ఉంది' అని మాత్రం అన్నారు. ఈసారి ఈ స్పెషల్ మేన్‌తోనే శ్రుతి తన బర్త్‌డే సెలబ్రేషన్స్‌ని ప్లాన్ చేశారట. అందుకే తన పాత స్నేహితులు కొంతమంది, మైఖేల్‌తో కలిసి ఆమె లాస్ ఏంజెల్స్ వెళ్లారని సమాచారం. శ్రుతి ఫ్యాన్స్ ఆల్రెడీ ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో అడ్వాన్స్ విషెస్‌తో సందడి చేస్తున్నారు. ''నా బర్త్‌డేకు మెసేజ్‌ల వర్షం కురిపిస్తున్న అభిమానులందరికీ చాలా పెద్ద హగ్. ఈ ప్రేమాభిమానాలే మీరు నాకు ఇచ్చే బెస్ట్ గిఫ్ట్'' అని సోషల్ మీడియా ద్వారా శ్రుతి పేర్కొన్నారు. అన్నట్లు శ్రుతీహాసన్ బర్త్‌డే ఎప్పుడో చెప్పలేదు కదూ.. రేపే.

30 రోజులకే కెమెరా ముందుకి...

ఓ వైపు హాస్యనటుడిగా నవ్విస్తూనే.. అప్పుడప్పుడు హీరోగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు శ్రీనివాసరెడ్డి. 'గీతాంజలి, జయమ్ము నిశ్చయమ్మురా' సినిమా తర్వాత ఆయన కథానాయకునిగా తెరకెక్కుతోన్న చిత్రం 'జంబలకిడి పంబ'. జె.బి. మురళీకృష్ణ దర్శకత్వంలో రవి, జోజో జోస్, శ్రీనివాసరెడ్డి. ఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీనివాసరెడ్డి కూతురు నటిస్తోంది. ఈ చిన్నారి వయసెంతో తెలుసా? జస్ట్ 30 రోజులు. ఇంకా నామకరణం కూడా చేయలేదు. కానీ కెమెరా ముందుకు వచ్చేసింది శ్రీనివాసరెడ్డి కుమార్తె. ''నెల వయసు ఉన్న మా పాప 'జంబలకిడి పంబ' సినిమాతో కెమెరా ముందుకొచ్చింది. చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ సినిమా తప్పకుండా సూపర్‌హిట్ అవుతుంది'' అని సంబరపడిపోయారు శ్రీనివాసరెడ్డి. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. ఇందులో సిద్ధి ఇద్నాని కథానాయిక. పోసాని కృష్ణమురళి, 'వెన్నెల' కిశోర్, 'సత్యం' రాజేష్, ధన్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం: గోపీసుందర్, కెమెరా: సతీశ్ ముత్యాల, సహ నిర్మాత: బి.సురేశ్ రెడ్డి.


● భార్య స్వాతి, కుమార్తె, కథానాయికతో శ్రీనివాసరెడ్డి

ఆ సక్సెస్‌ని తెలుసుకోలేకపోయా

''నా తొలి చిత్రం 'రన్ రాజా రన్' మంచి హిట్. అంత మంచి సక్సెస్‌ఫుల్ సినిమా చేశానని నేను రియలైజ్ కాలేకపోయా. ఆ తర్వాత చేసిన కొన్ని సినిమాలు కూడా అంతే. అవి నా కెరీర్‌కు ఎంత ఉపయోగపడతాయని చూడలేదు. 'ఒక్క క్షణం' సినిమాలాగా 'టచ్ చేసి చూడు' నా కెరీర్‌కి హెల్ప్ అవుతుందనుకుంటున్నా'' అని సీరత్ కపూర్ అన్నారు. రవితేజ హీరోగా, రాశీఖన్నా, సీరత్ కపూర్ హీరోయిన్లుగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టచ్ చేసి చూడు'. నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సీరత్ కపూర్ చెప్పిన విశేషాలు.

- 'టచ్ చేసి చూడు'లో నా పాత్ర రొటీన్‌గా కాకుండా వైవిధ్యంగా ఉంటుంది. హీరోని డామినేట్ చేస్తుంటా. సినిమా మొత్తం ఉండను. ఇంటర్వెల్ తర్వాత వస్తా. నాకు, రాశీఖన్నాకు కాంబినేషన్ సీన్స్ లేవు. నేనింకా పూర్తి సినిమా చూడలేదు. అందుకే కథాంశం ఏంటని క్లారిటీగా చెప్పలేను. రవితేజగారు పోలీసాఫీసర్‌గా కనిపిస్తారు.
- రవితేజగారు వంటి పెద్ద హీరోతో సినిమా చేయడం హ్యాపీగా ఉంది. ఆయన చాలా సింపుల్. సెట్స్‌లో సరదాగా ఉంటారు. ఇండస్ట్రీలో ఇన్నేళ్లు అలా ఉండటం మామూలు విషయంకాదు. ఎప్పుడూ ఎనర్జీగా, లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు.
- 'రన్ రాజా రన్' సక్సెస్ తర్వాత నా సినిమాలు కొన్ని సరిగ్గా ఆడలేదు. అందుకు పెద్దగా బాధపడను. 'రాజుగారి గది–2' నుంచి మంచి సినిమాలు చేస్తున్నాను. 'టచ్ చేసి చూడు'లో నేను సెకండ్ హీరోయిన్‌ని కాదు. ఓ ముఖ్యమైన పాత్ర చేశా. అయినా.. ఫస్ట్ హీరోయిన్.. సెకండ్ హీరోయిన్ అని ఆలోచించను. పాత్రలోని ప్రాముఖ్యత చూసి, నచ్చితే చేస్తా.
- సురేశ్ ప్రొడక్షన్‌లో రానాతో ఓ సినిమా, 'గుంటూరు టాకీస్' ఫేమ్ సిద్ధు హీరోగా రవికాంత్ పేరెపు దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నా. వీటితో పాటు మరో సినిమా ఒప్పుకున్నా. త్వరలో పూర్తి వివరాలు చెబుతా.


● సీరత్ కపూర్


చేతిలో చెయ్యేసి చెప్పు బావ


● అరుణ్, అంజన

అరుణ్ రాహుల్, అంజన జంటగా కట్ల రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో కేజే రాజేశ్ నిర్మిస్తున్న చిత్రం 'చేతిలోన చెయ్యేసి చెప్పు బావా'. ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అరుణ్ రాహుల్ మాట్లాడుతూ – ''తమిళ, మలయాళ భాషల్లో సినిమాలు చేశాను. ఈ సినిమా ద్వారా తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నాను. తెలుగు పరిశ్రమలో నా ప్రయత్నాన్ని సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు. ''నిర్మాతగా నా తొలి సినిమా ఇది. కథ కూడా నేనే అందిస్తున్నాను. కచ్చితంగా మంచి సినిమాను అందిస్తాం అనే నమ్మకముంది'' అన్నారు నిర్మాత. ''రాజేశ్ మంచి కథను అందించారు. ప్రేమను దక్కించుకోలేని జంట మరో జన్మలో ఎలా విజయం సాధించారన్నది కథాంశం. సమ్మర్‌లో విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు దర్శకులు. ఈ సినిమాకు సంగీతం: పార్థసారధి, కెమెరా: వేణు మురళీధరన్.

నథింగ్ కాదు సమ్‌థింగ్...

నిల్ బటే సన్నాటా



ఓడిపోవడం తప్పుకాదు. కాని ప్రయత్నించకుండా ఓటమిని అంగీకరించడం తప్పు. కలలు ఉండాలి.. సాకారం చేసుకోవడానికి సాహసమూ కావాలి.. అని చెప్పే సినిమా నిల్ బటే సన్నాటా! నిల్ ఇంగ్లిష్ పదం.. బటే ఉత్తరప్రదేశ్ హిందీ పదం. సన్నాటా.. హిందీ! బటే అంటే డివైడెడ్ బై, సన్నాటా అంటే నిశ్శబ్దం.. శూన్యం! సున్నాను దేనితో భాగించినా సున్నానే వస్తుంది. అదే సినిమా పేరు. అంటే నథింగ్ అని! ఈ సినిమా కూడా ఇక్కడే మొదలవుతుంది. ఆర్థికంగా ఏమీ లేనితనంతో.. లెక్కలు రానితనంతో.. భవిష్యత్ పట్ల ఆశలేని తనంతో!

చందా.. కూతురి జీవితం పట్ల ఎన్నో కలలున్న తల్లి. సింగిల్ మదర్. ఓ పనిమనిషి. కూతురు అపేక్ష.. చాలా నిరాసక్తంగా, ఎలాంటి ఆశలు, కలలు లేక మొండిగా ఉంటుంది. టెన్త్‌క్లాస్ చదువుతుంటుంది. లెక్కల్లో వెనకబడుతుంది. చదవడం పట్ల పెద్దగా ఆసక్తి కూడా చూపదు. చందాకేమో తన బిడ్డ మంచి చదువులు చదివి గొప్ప ఉద్యోగం సంపాదించాలనే ఆశయం. అందుకోసం తనెంతైనా కష్టపడ్డానికి సిద్ధమవుతుంది. ఆ ఉత్సాహం బిడ్డలో నింపాలని తాపత్రయపడుతుంటుంది. మార్కులు తక్కువ వచ్చినప్పుడల్లా బాధపడి.. ''బాగా చదువు, ట్యూషన్ కూడా పెట్టిస్తా' అనడమే కాదు పెట్టిస్తుంది కూడా. అయినా చదువులో రాణించదు. ఎందుకు అశ్రద్ధ చేస్తున్నావ్ అని తల్లి అడిగితే ''పనిమనిషిగా సెటిల్ కావడానికి అంత చదువు అవసరం లేదు'' అని సమాధానమిస్తుంది నిర్లక్ష్యంగా. ''పనిమనిషి అవడమేంటి?'' అన్న అమ్మ ప్రశ్నకు ''మరి? డ్రైవర్ కొడుకు డ్రైవర్ అయినప్పుడు పనిమనిషి కూతురు పనిమనిషి కాక ఐఏఎస్ అవుతుందా?'' అని వెటకారం చేస్తుంది తల్లిని అపేక్ష. కూతురి ప్రవర్తనతో బాధపడుతుంది చందా. ఆ పిల్ల పెడసరం మాటలకు తల్లడిల్లుతుంది. ఆమె ఆలోచనాధోరణిని మార్చాలనుకుంటుంది.

> **ఒకసారి కలెక్టర్ బంగ్లాకు వెళ్లి అతనిని కలిసి తన గురించి, కూతురి పట్ల ఉన్న తన ఆశయం గురించీ చెప్తుంది చందా. చదువుకు ఆకాశమే హద్దు. పనిమనిషి కూతురు పనిమనిషే కావాలని లేదు. ఐఏఎస్‌కూడా కావచ్చు అని చెప్తాడు. ఎలా అని అడుగుతుంది. ఆప్షన్స్ చెప్తాడు. ఆ లక్ష్యం ఆమె మనసులో నాటుకుంటుంది.**

కూతురు చదివే స్కూల్లో..

అపేక్ష తీరు గురించి ఒకసారి తన యజమానురాలి (రత్న పాఠక్ షా)తో చెప్తుంది చందా. ఆమెను దీదీ అని పిలుస్తూ తనకో పెద్దదిక్కుగా భావిస్తుంటుంది చందా. కూతురి తరహాతో తాను పడుతున్న బాధను పంచుకుంటుంది. వింటున్న రత్నాపాఠక్ తనదైన శైలిలో చాలా తెలివిగా చందాలో చదువుకునే ఆలోచనను రేకెత్తిస్తుంది. కూతురికి చదువు మీద ఉత్సాహం, భవిష్యత్ పట్ల ఆశ కలగాలంటే ఆమెకు పోటీగా నువ్వుండాలన్నట్టుగా చెప్తుంది. ఆలోచనల్లో పడ్తుంది చందా. తను చదువుకోవాలి.. పిల్లకు చదువు విలువ తెలియజెప్పాలి అని నిర్ణయించుకుంటుంది. చేరాలని కూతురు చదివే స్కూల్‌కి వెళ్తుంది. చందా ఆలోచన విని విస్తుపోతాడు ప్రిన్సిపల్. అవును అంటూ నిశ్చయంగా తలూపుతుంది. జాయిన్ అయిపోతుంది... కూతురి క్లాస్‌లోనే.


● 'నిల్ బటే సన్నాటా'లో ఓ దృశ్యం

బిడ్డకు పోటీగా..

అపేక్షకు తల్లిగా కాకుండా ఓ స్టూడెంట్‌గానే అందరికీ పరిచయం అవుతుంది చందా. తరగతిలో తల్లీబిడ్డలు ఎవరికి ఎవరో అన్నట్టుగానే ఉంటారు. లెక్కల పట్ల చాలా శ్రద్ధ పెడ్తుంది. క్లాస్‌మేట్ అబ్బాయితో స్కూల్లోనే లెక్కలు చెప్పించుకుంటుంది. జీవితానికి, లెక్కలకు లంకె పెట్టి.. లాజిక్ చూపించి ఆ సబ్జెక్ట్‌ను ఈజీగా అర్థమయ్యేలా చేస్తాడు ఆ అబ్బాయి. ఆసక్తి పెరుగుతుంది చందాకు. ఉదయమే లేచి వంట చేసి, ఇళ్లల్లో పని చేసుకొని స్కూల్‌కి వెళ్తుంది. మళ్లీ సాయంకాలం ఇళ్లల్లో పని చేసుకొని ఇంటికెళ్లి చదువుకుంటుంది. తల్లి కష్టాన్ని చూసి ఈ వయసులో ఇవి అవసరమా అన్నట్టుగా నవ్వుకుంటుంది అపేక్ష. యూనిట్ టెస్ట్‌లో కూతురికన్నా తల్లికే ఎక్కువ మార్కులు వస్తాయి. ముఖ్యంగా మ్యాథ్స్‌లో. కూతురు ఫెయిలవుతుంది. చందాను చూసి బుద్ధి తెచ్చుకొమ్మని కోప్పడ్తాడు మాస్టర్. కూతురిని అలా తిట్టేసరికి తల్లి మనసు చివుక్కుమంటుంది. ఇంటికొచ్చాక బిడ్డను సముదాయిస్తుంటే అపేక్ష వినదు. క్లాస్‌లో ఆమె ప్రగతి కూతురికి మింగుడు పడదు. నెమ్మదిగా అపేక్షలోనూ పోటీతత్వం మేలుకొంటుంటుంది. తల్లికి లెక్కలు చెప్తున్న అబ్బాయితోనే తనూ లెక్కలు చెప్పించుకుంటుంది. తర్వాత జరిగిన పరీక్షలో అపేక్షకూ మంచి మార్కులు వస్తాయి. తల్లిని లెక్కచేయదు. నీకు చదువు అవసరమా అన్నట్టు ఇన్‌సల్ట్ చేస్తుంది. బాధపడ్డ చందా స్కూల్‌కి వెళ్లడం మానేస్తుంది. హోటల్‌లో, ఇళ్లల్లో పనిచేస్తూ డబ్బులు పోగేస్తుంటుంది. ఓసారి బిడ్డ మాటలకు చింత చెందుతూ రోడ్డు మీద అనాలోచితంగా కలెక్టర్ (సంజయ్ సూరి) కారుకు అడ్డం వస్తుంది. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆమెను తిడుతుంటే అతను కారు దిగి ''ఆడవాళ్లతో మర్యాదగా మాట్లాడండి'' అని కానిస్టేబుల్‌ను మందలిస్తాడు. ఆ ఐఏఎస్ అంటే గౌరవం పెరుగుతుంది చందాకు. ఒకసారి కలెక్టర్ బంగ్లాకు వెళ్లి అతనిని కలిసి తన గురించి, కూతురి పట్ల ఉన్న తన ఆశయం గురించీ చెప్తుంది. చదువుకు ఆకాశమే హద్దు. పనిమనిషి కూతురు పనిమనిషే కావాలని లేదు. ఐఏఎస్‌కూడా కావచ్చు అని చెప్తాడు. ఎలా అని అడుగుతుంది. ఆప్షన్స్ చెప్తాడు. ఆ లక్ష్యం ఆమె మనసులో నాటుకుంటుంది.

అందరికీ తెలుస్తుంది...

ఓసారి హోటల్ నుంచి ఇంటికి రావడం ఆలస్యం కావడంతో తనతో పాటు పనిచేసే ఓ వ్యక్తి చందాను ఇంటి దగ్గర దింపుతాడు. అది చూసిన అపేక్ష అమ్మను అపార్థం చేసుకొని అనకూడని మాట అంటుంది. చెంప చెళ్లుమనిపిస్తుంది చందా. స్కూల్లో అందరికీ తెలిసిపోతుంది అపేక్ష వాళ్లమ్మే చందా అని. చందా పట్ల అపేక్ష విసురు ప్రవర్తన గురించి కూడా తెలుస్తుంది. క్లాస్‌మేట్స్ అపేక్షకు చీవాట్లు పెడ్తారు. అప్పుడర్థం అవుతుంది తల్లి విలువ కూతురికి. తెల్లవారి నుంచి స్కూల్‌కి రమ్మని అమ్మను బతిమాలుతుంది. వస్తుంది. టెన్త్ మెయిన్ ఎగ్జామ్స్ మొదలవుతాయి. ఇద్దరూ కష్టపడి చదువుతారు. చందాకు కూతురి ఫలితాల మీదే ఆందోళన ఉంటుంది. ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయి తన మీద తల్లికి నమ్మకాన్ని పెంచుతుంది. అప్పుడు చెప్తుంది చందా కూతురితో.. 'ప్రతి మనిషికి కల ఉండాలి. ఆ కల సాకారం చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి... సాహసం ఉండాలి'' అని. ఆ పాఠం ఆ పిల్ల జీవననేస్తం అవుతుంది.

కట్‌చేస్తే..

చందా కూతురు అపేక్ష.. సివిల్స్ పాసయి ఇంటర్వ్యూకి వెళ్తుంది. ఇంటర్వ్యూలో అడుగుతారు.. 'ఐఏఎస్ ఎందుకు కావాలనుకుంటున్నావ్?'' అని. ''ఎందుకంటే నేను పనిమనిషిని కాదల్చుకోలేదు కాబట్టి'' అని సమాధానమిస్తుంది. అపేక్ష ఐఏఎస్ అవుతుంది. సున్నాను దేనితో భాగించినా శూన్యమే. కాని సున్నాకు ఎడమవైపున ఎన్ని అంకెలు చేరిస్తే అంత విలువ పెరుగుతుంది. జీవితమూ అంతే. ఏమీ లేదనుకుని సాగితే ఏమీ కనపడదు. ఏదో కావాలని నడిస్తేనే ఏదో ఒకటి దొరుకుతుంది. ఈ పాఠమే 'నిల్ బటే సన్నాటా'. ఇది ఓ ఒంటరి స్త్రీ జీవన పోరాటం. కూతుర్ని ఆశలపల్లకీలో ఎక్కించడానికి ఆమె పడిన ప్రయాస. కలల ప్రపంచంలో తిప్పడానికి ఆమె చేసిన ప్రయాణం. ప్రతి అమ్మాయికి చదువు ఎంత అవసరమో అని కూడా చూపిన సినిమా. తల్లిదండ్రుల పరిమితులు పిల్లలను ఆపకూడదు అని చాటే సినిమా! చిన్న లైన్‌ను అద్భుతంగా తెరకెక్కించారు సినిమా దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారి. ఇది ఆమె మొదటి సినిమా. చందాగా స్వరా భాస్కర్ నటనకు మాటల్లేవ్. అపేక్షగా రియా శుక్లా సింప్లీసూపర్బ్. 'నిల్ బటే సన్నాటా' చూడాలనుకునేవాళ్లు యూట్యూబ్‌లో చూడొచ్చు.

ఎస్వీయూలో దూర విద్య ప్రవేశాలు

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) దూర విద్య విభాగం.. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఓపెన్ యూనివర్సిటీ సిస్టమ్(ఓయూఎస్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. డిగ్రీ కోర్సులకు ఇంటర్; పీజీ, పీజీ డిప్లొమా కోర్సులకు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓయూఎస్‌లోని బీఏ, బీకామ్ కోర్సుల్లో చేరడానికి ఏ విద్యార్హతా లేకున్నా 18 ఏళ్లు నిండి, ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైతే చాలు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 28, 2018 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.500 అపరాధ రుసుంతో మార్చి 12 వరకు, రూ.1,000తో మార్చి 19 వరకు, రూ.2,000 అపరాధ రుసుంతో మార్చి 31 వరకు గడువు ఉంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.svuniversity.edu.in

అడ్మిషన్స్ ఇన్ఫో..



ఇఫ్లూలో ప్రవేశాలు..

హైదరాబాద్‌లోని 'ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)'.. వివిధ విదేశీ భాషలతోపాటు, ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు అందించే వర్సిటీగా పేరొందింది. ఇక్కడ అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) మొదలు పీహెచ్‌డీ వరకూ.. విభిన్న కోర్సులు అందుబాటులో ఉంటాయి. ఏటా హైదరాబాద్ క్యాంపస్‌తోపాటు లక్నో, షిల్లాంగ్‌లోని ఇఫ్లూ సెంటర్లలో అడ్మిషన్‌లను ప్రవేశ పరీక్ష ద్వారా నిర్వహిస్తారు. 2018-19 విద్యా సంవత్సరానికి వివిధ యూజీ, పీజీ, టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

యూజీ కోర్సులు

కోర్సు	సీట్లు	క్యాంపస్
బీఏ (ఆనర్స్): ఇంగ్లిష్	40	హైదరాబాద్
	40	లక్నో
	20	షిల్లాంగ్

- బీఏ (ఆనర్స్): అరబిక్, జర్మన్, జపనీస్, రష్యన్, స్పానిష్ కోర్సులు హైదరాబాద్ క్యాంపస్‌లో మాత్రమే ఉన్నాయి. ఒక్కో కోర్సులో 20 సీట్లు ఉన్నాయి.
- బీఏ (జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (జేఎంసీ)): షిల్లాంగ్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హతలు

యూజీ కోర్సుల్లో ప్రవేశానికి ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీలకు 45 శాతం) మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎంపిక: ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు.

పీజీ కోర్సులు

కోర్సు	సీట్ల సంఖ్య	క్యాంపస్
ఎంఏ (ఇంగ్లిష్)	90	హైదరాబాద్
	40	లక్నో
	30	షిల్లాంగ్
ఎంఏ (ఇంగ్లిష్ లిటరేచర్)	20	హైదరాబాద్
	30	షిల్లాంగ్

- వీటితో పాటు ఎంఏ (జేఎంసీ), ఎంఏ (లింగ్విస్టిక్స్), బీఎడ్ (ఇంగ్లిష్), పీజీడీటీఈ (ఇంగ్లిష్), పీజీడీటీఈ (అరబిక్), ఎంఏ-లిటరేచర్స్ ఇన్ ఇంగ్లిష్, కంపారి టివ్ లిటరేచర్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, హిందీ, కంప్యూటేషనల్ లింగ్వి స్టిక్స్, అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ తదితర కోర్సులు ఉన్నాయి.

అర్హతలు

ఎంఏ కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్ కోర్సులకు లింగ్విస్టిక్స్/ఇంగ్లిష్/కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/మ్యాథమెటిక్స్ అండ్ ఫిజిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీరులు అర్హులు. విదేశీ భాషల కోర్సులు మినహా మిగతా కోర్సులకు కనీసం 55 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. హిందీ, ఫారెన్ భాషల్లో కోర్సులకు సంబంధిత సబ్జెక్టుల్లో ప్రావీణ్యం ఉండాలి. ప్రొఫిషియెన్సీ సర్టిఫికెట్ అవసరం.

ఎంపిక విధానం

ఇంగ్లిష్, హిందీ, పీజీడీటీఈ, లింగ్విస్టిక్స్ సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలకు 100 మార్కులకు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష; మిగతా వాటికి 40 మార్కులకు కంప్యూటర్ ఆధారిత, 30 మార్కులకు పెన్-పేపర్ విధానంలో.. మరో 30 మార్కులకు ఓరల్ టెస్టులు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు.

ఫీజులు అత్యల్పం

ఇఫ్లూలో ఫీజులు అత్యల్పంగా ఉంటాయి. యూజీ కోర్సులకు సెమిస్టర్‌కు సగటున రూ.2 వేలు, పీజీ కోర్సులకు సెమిస్టర్‌కు సగటున రూ.2,500గా ఉంది. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలూ అందుబాటులో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2018.
- ప్రవేశ పరీక్ష తేదీలు: ఫిబ్రవరి 24, 25, 2018.
- దరఖాస్తు రుసుం (ఒక్కో ప్రోగ్రామ్‌కు): రూ.500 (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.250).
- పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
- వెబ్‌సైట్: www.efluniversity.ac.in

ఎగ్జామ్ టిప్స్

ఎస్‌బీఐ..

'కొలువు'దీరే మార్గాలు..



అసోసియేట్ బ్యాంకుల విలీనం తర్వాత చాలా రోజులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి ఉద్యోగ ప్రకటన వెలువడింది. మొత్తం 8,301 క్లరికల్ స్థాయి ఉద్యోగాలకు ప్రకటన వచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తంగా 655 ఖాళీలు ఉండటం అభ్యర్థులకు శుభవార్తే. పైగా ఎలాంటి మౌఖిక పరీక్షలు లేకుండా ఆన్‌లైన్ పరీక్షలో కనబర్చే ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఉండటం గ్రామీణ విద్యార్థులకు చక్కటి అవకాశం. ఎంపికలో కీలకం కానున్న ప్రిలిమ్స్ మార్చి/ఏప్రిల్‌లో జరగనుంది. మెయిన్ పరీక్ష మే 12న ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ కొలువు సాధించేందుకు ఎలా సన్నద్ధమవ్వాలో తెలుసుకుందాం..

బ్యాంకింగ్ ఉద్యోగాల్లో వేతనాలు, కెరీర్‌పరంగా పెద్దన్నగా వెలుగొందుతున్న ఎస్‌బీఐలో చేరే అవకాశం ఇప్పుడు తలుపుతట్టింది. జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి.

అర్హత: ఏదైనా డిగ్రీ. వయసు: 20-28 ఏళ్లు (01.01.2018), రిజర్వేషన్ వర్గాలకు సడలింపు ఉంటుంది.

- వేతనం: ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుకు ఎంపికయ్యే అభ్యర్థులకు మెట్రో నగరాల్లో నెలకు రూ.23,600 వేతనం అందుతుంది. పనిచేసే ప్రాంతాన్ని బట్టి వేతనాల్లో వ్యత్యాసం ఉంటుంది. ఇతర అలవెన్సులు ఉంటాయి. అయితే క్లర్క్ స్థాయిలో మూడేళ్ల పాటు పనిచేసిన తర్వాత డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఆధారంగా పీఓ కేడర్ స్థాయికి చేరుకోవచ్చు.



దరఖాస్తు ప్రక్రియ: జనవరి 20-ఫిబ్రవరి 10, 2018.

ఎంపిక ప్రక్రియ

- ఎంపిక ప్రక్రియలో మూడు దశలుంటాయి. ఇందులో భాగంగా ఆన్‌లైన్ టెస్ట్ (ప్రిలిమినరీ, మెయిన్-ఎంసీక్యూస్), అఫీషియల్/లోకల్ లాంగ్వేజ్ సంబంధిత పరీక్ష నిర్వహిస్తారు.

తొలిదశ (ప్రిలిమినరీ)- 60 నిమిషాలు

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30
న్యూమరికల్ ఎబిలిటీ	35	35
రీజనింగ్ ఎబిలిటీ	35	35
మొత్తం	100	100

- ప్రతి విభాగానికి 20 ని. కేటాయించారు. మూడు విభాగాల్లోనూ బ్యాంకు నిర్దేశించిన కటాఫ్ మార్కులు సాధించాల్సి ఉంటుంది. ప్రతి కేటగిరీ నుంచి మొత్తం ఖాళీలకు పది రెట్ల మందిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

రెండోదశ (మెయిన్)

విభాగం	ప్రశ్నలు	మార్కులు	సమయం
జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50	50	35 ని.
జనరల్ ఇంగ్లిష్	40	40	35 ని.
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50	45 ని.
రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50	60	45 ని.
మొత్తం	190	200	2.40 గం.

సన్నద్ధత

ఇంగ్లిష్ లాంగ్వేజ్

- ఇంగ్లిష్‌లో మంచి స్కోర్ సాధించాలంటే బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. కొత్త పదాలను తెలుసుకోవడం, వాటిని ఉపయోగించే విధానంపై అవగాహన పెంపొందించుకోవాలి. రీడింగ్ కాంప్రెహెన్షన్‌లో వొకాబ్యులరీ ఆధారిత ప్రశ్నలుంటాయి. వీటికి తప్పనిసరిగా సమాధానాలు గుర్తించాలి. క్లోజ్ టెస్ట్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్ సెక్షన్లను ఒకేసారి ప్రాక్టీస్ చేయాలి. ఈ రెండింటికీ ఒకే టెక్నిక్ ఉంటుంది. దీనివల్ల ప్రిపరేషన్ సులువవుతుంది. స్పాటింగ్ ఎర్రర్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్ విభాగాలకూ ఏకకాలంలో సాధన చేయాలి. ఈ రెండింటిలో గ్రామర్‌దే ముఖ్య భూమిక.

న్యూమరికల్ / క్వాంటిటేటివ్ ఎబిలిటీ



ప్రిలిమ్స్‌లో ఉన్న న్యూమరికల్ ఎబిలిటీని మెయిన్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌గా పేర్కొన్నారు. తొలుత బేసిక్ కాన్సెప్టులను క్షుణ్నంగా తెలుసుకోవాలి. కూడికలు, తీసివేతలు, భాగహారాలు, గుణకారాలపై ప్రావీణ్యం సంపాదించాలి. 30 వరకు ఎక్కాలు, 50 వరకు వర్గాలు-వర్గమూలాలు, 30 వరకు ఘన మూలాలను కంఠతా చేయాలి. అర్థమెటిక్‌లో రేషియో, పర్సంటేజ్, యావరేజెస్ చాప్టర్లు ముఖ్యమైనవి. వీటిని బాగా నేర్చుకోవడం ద్వారా తేలిగ్గా కటాఫ్ మార్కులను దాటొచ్చు.

- సింప్లిఫికేషన్/అప్రాక్షిమేషన్ ప్రాబ్లమ్స్ (5 ప్రశ్నలు) తప్పనిసరిగా కనిపిస్తున్నాయి. వీటిని తక్కువ సమయంలో సాధించొచ్చు. నంబర్ సిరీస్ (5 ప్రశ్నలు) కూడా తప్పనిసరి విభాగంగా మారింది. ఇందులో తేలిగ్గా స్కోరు చేయడానికి ప్రాక్టీస్ ముఖ్యం. ఎక్కువ వెయిటేజీ ఉన్న విభాగం.. డేటా ఇంటర్‌ప్రెటేషన్ (10-15 ప్రశ్నలు). ఈ సెక్షన్ రేషియో, పర్సంటేజ్, యావరేజెస్ చాప్టర్ల సమ్మిళితంగా ఉంటుంది. అందువల్ల ఆయా చాప్టర్లపై పట్టుంటే తేలిగ్గా డీఐ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించొచ్చు.
- అర్థమెటిక్ అంశాల్లో పార్టనర్‌షిప్స్, పర్సంటేజెస్ దాని అనువర్తనాలు, రేషియో అండ్ ప్రపోర్షన్, టైమ్ అండ్ వర్క్, ఇంట్రెస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, యావరేజెస్ చాప్టర్లు ముఖ్యమైనవి.

రీజనింగ్

- లాజికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్‌ను పరీక్షించేందుకు ఉద్దేశించిన విభాగమిది. పజిల్స్ ప్రశ్నలు సమస్య పరిష్కారంలో అభ్యర్థుల వేగాన్ని పరీక్షిస్తాయి. సరైన ప్రాక్టీస్‌తోనే ఈ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడం సాధ్యం. కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, ఆర్డరింగ్ అండ్ ర్యాంకింగ్ అంశాలు కాఠిన్యత విషయంలో మధ్యస్తంగా ఉంటాయి.
- మెయిన్‌లో కోడెడ్ ఇనీక్వాలిటీస్/ఇన్‌పుట్ ఔట్‌పుట్ 3-5 ప్రశ్నలు; సిలాయిజమ్స్/కోడింగ్ అండ్ డీకోడింగ్ 3-5 ప్రశ్నలు; సీటింగ్ అరెంజ్‌మెంట్స్ అండ్ పజిల్స్ (సర్క్యులర్, లీనియర్ అరెంజ్‌మెంట్స్, ఫ్లోర్ టెస్ట్స్) 10-15 ప్రశ్నలు; బ్లడ్ రిలేషన్స్ 1-2 ప్రశ్నలు; డైరెక్షన్స్ అండ్ డిస్టెన్సెస్ 1-2 ప్రశ్నలు; ఆర్డరింగ్ అండ్ ర్యాంకింగ్ 1-2 ప్రశ్నలు; ఆల్ఫా న్యూమరికల్ సిరీస్ 3-4 ప్రశ్నలు వచ్చే అవకాశముంది.
- మెయిన్‌లో కంప్యూటర్ నాలెడ్జ్ సెక్షన్ కూడా రీజనింగ్‌లోనే ఉంది. ఇది స్కోరింగ్‌కు అవకాశమున్న విభాగం. ప్రధానంగా కంప్యూటర్ సిస్టమ్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్క్ లేయర్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టిసారించాలి.

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

పరీక్షలో విజయానికి జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ కీలకం. దీనికి మెయిన్‌లో 50 మార్కులు కేటాయించారు. ఆర్థిక పదజాలం, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలు, బ్యాంకింగ్ విధానాలపై ప్రత్యేకంగా దృష్టిసారించడం ద్వారా మంచి స్కోరు సాధించొచ్చు. కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నల వరకు వస్తాయి. వివిధ దేశాల కరెన్సీలు, రాజధానులు, నేషనల్ పార్కులు, ముఖ్య తేదీలు తదితర వివరాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు సంబంధించి మానిటరీ పాలసీ, ఎన్‌పీఏలు, ఎంసీఎల్ఆర్, డిజిటల్ పేమెంట్స్ తదితరాలపై అవగాహన పెంపొందించుకోవాలి. కరెంట్ అఫైర్స్‌లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలను తెలుసుకోవాలి.

ప్రాక్టీస్‌తోనే విజయం..

దాదాపు ఏడాదిన్నర తర్వాత ఎస్‌బీఐ నుంచి వెలువడిన నోటిఫికేషన్ ఇది. క్లర్క్ లెవల్ పోస్టులైనా కొన్నేళ్లలోనే మంచి స్థాయికి చేరుకోవచ్చు. ఇంటర్వ్యూలు, డిస్క్రిప్టివ్ టెస్టులు లేకపోవడం సానుకూల అంశం. ఈ పరీక్షలో విజయం సాధించాలంటే.. ప్రాక్టీస్‌కి మించిన ఫార్ములా మరొకటి లేదు. బలహీనంగా ఉన్న సెక్షన్లపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ సిలబస్‌లు ఒకే విధంగా ఉన్నా.. మెయిన్స్ ప్రశ్నల క్లిష్టత కొంచెం పెరుగుతుంది. మెయిన్స్‌లో పేర్కొన్న జనరల్ అవేర్‌నెస్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ విభాగం స్కోరింగ్‌కు వీలున్న విభాగం.

– ఎస్.వినయ్‌కుమార్ రెడ్డి, ఐఏసీఈ, హైదరాబాద్.

India to grow at 7.4 per cent in 2018: IMF

INTERNATIONAL

US shutdown ends as Congress strikes deal

The US government partial shutdown is ending after Republicans and Democrats voted to approve a temporary funding bill. The Deal was made on 22nd January, to end the three-day shut down.

Officially shutdowns in 5 years: The US government officially shutdown on 20th January for the first time in five years after lawmakers failed to agree on a spending deal.

Unemployment to rise: ILO

Report on India: In India, the number of jobless is expected to increase to 18.6 million in 2018 and 18.9 million in 2019, against 18.3 million in 2017, as per the ILO report. The unemployment rate is estimated at 3.5 per cent for all three years.

As Asia-Pacific continues to create jobs at a very fast rate, unemployment in the region is expected to remain low by worldwide standards, at around 4.2% in 2018, said the report. The International Labour Organization projects that the number of employed persons in Asia-Pacific region will grow by some 23 million (or 1.2 per cent) between 2017 and 2019. Projections indicate that 72% of workers in Southern Asia, 46% in South-Eastern Asia and the Pacific, and 31% in Eastern Asia will be in vulnerable employment by 2019, showing very little change from 2017.

NATIONAL

Cyber Surakshit Bharat Yojna launched

Union Government has launched the Cyber Surakshit Bharat Yojna to strengthen cyber security. It will be operated on the three principles of awareness, education and enablement. The Government has launched this initiative with a primary objective to keep the country data safe and protected. The initiative is the first public-private partnership of its kind and will leverage the expertise of the IT industry in cyber security.





Special websites launched for Divyangs

Social Justice and Empowerment Minister Thaawarchand Gehlot on 19th January launched 100 accessible websites for Divyangs. These 100 government websites are now divyang friendly.The divyang-friendly websites, especially for visually impaired, use features such as screen readers and screen magnifiers, which can relay website content to the user in audio format.

BILATERAL

India joins Australia Group export control regime

India, on 19th January, joined the Australia Group export control regime, an informal forum which seeks to ensure that exports do not contribute to the development of chemical or biological weapons. India is 43rd member in this group.

ECONOMY

Govt announces the names of nine new smart cities

Nine more smart cities were declared by the Union Urban Development Minister Hardeep Singh Puri on 19th January. With this the total number of cities had gone to 99. The new cities selected under Smart Cities are Silvassa in Union Territory of Dadra and Nagar Haveli, Erode in Tamil Nadu, Diu in Union Territory of Daman and Diu, Biharsharif in Bihar, Bareilly, Saharanpur and Moradabad in Uttar Pradesh, Itanagar in Arunachal Pradesh and Kavaratti in Lakshadweep.

India at 62 among emerging economies

According to World Economic Forum Inclusive Development Index, India is ranked at 62nd place among emerging economies. The ranks were released by the World Economic Forum before the start of its 48th annual meeting. Norway remains the world's most inclusive advanced economy, while Lithuania again tops the list of emerging economies. The Inclusive Development Index is an annual assessment economic performance of 103 countries.

India to grow at 7.4 per cent in 2018: IMF

International Monetary Fund (IMF) said India is projected to grow at 7.4 per cent in 2018 as against China's 6.8 per cent, making it the fastest growing country among emerging economies following last year's slowdown due to demonetization and the implementation of the GST.

In its latest World Economic Outlook (WEO) update released on 22nd January in Davos, Switzerland.

Inequality increases in India

The richest 1 per cent in India cornered 73 per cent of the wealth generated in the country last year, a new survey showed on 21st January. Besides, 67 crore Indians

Current Affairs

comprising the population's poorest half saw their wealth rise by just 1 per cent, as per the survey released by the international rights group Oxfam hours before the start of the annual congregation of the rich and powerful from across the world in this resort town. Last year's survey had showed that India's richest 1 per cent held a huge 58 per cent of the country's total wealth, higher than the global figure of about 50 per cent.

This year's survey also showed that the wealth of India's richest 1 per cent increased by over Rs 20.9 lakh crore during 2017, an amount equivalent to total budget of the central government in 2017-18, according to Oxfam India

SPORTS

India wins world cup cricket

India has retained the World Cup for the Blind. In the final on 20th January, India defeated Pakistan by at Sharjah in UAE. The tourney was held from 8-20 January 2018 in Pakistan and the United Arab Emirates

AWARDS

Padma Awards Announced

The President of India Ram Nath Kovind approved Padma Awards for 85 individuals, which includes 3 Padma Vibhushan, 9 Padma Bhushan and 73 Padma Shri. Fourteen of the awardees are women and 3 persons have been awarded posthumously.

Padma Vibhushan: Classical singer Ustad Ghulam Mustafa Khan, Music composer Ilayaraja and Litterateur P Parameswaran.



Rajendra Sharma
Current Affairs Faculty, Hyderabad.

బులెటిన్ బోర్డ్

బెల్‌లో 27 ఖాళీలు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్:బెల్).. 27 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: డిప్యూటీ ఇంజనీర్ (డీఈ).
- విభాగాల వారీ ఖాళీలు: ఎలక్ట్రానిక్స్-18, మెకానికల్-3, కంప్యూటర్ సైన్స్-4, మార్కెటింగ్-2.
- వేతనశ్రేణి: రూ.40,000-రూ.1,40,000.
- అర్హతలు: సంబంధిత విభాగాలను బట్టి బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఎంబీఏ ప్రథమశ్రేణి (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-పాస్ క్లాస్)లో ఉత్తీర్ణత. అలాగే సంబంధిత రంగంలో కనీసం ఏడాది ఉద్యోగానుభవం.
- వయసు: 2017, డిసెంబర్ 1 నాటికి 26 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2018.
- వెబ్‌సైట్: www.bel-india.com

సుప్రీంకోర్టులో 15 ఖాళీలు



సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా.. 15 కోర్ట్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: కోర్ట్ అసిస్టెంట్ (టెక్నికల్ అసిస్టెంట్ కమ్ ప్రోగ్రామర్).
- వేతనం: బేసిక్ పే-రూ44,900.
- అర్హతలు: కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీఈ/బీటెక్+మూడేళ్ల ఉద్యోగానుభవం లేదా ఎంఈ/ఎంటెక్ (కంప్యూటర్ అప్లికేషన్స్)/ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్)+ మూడేళ్ల ఉద్యోగానుభవం లేదా బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)/బీసీఏ+నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. వీటితోపాటు లా డిగ్రీని అదనపు అర్హతగా పరిగణించి, ప్రాధాన్యం ఇస్తారు.
- వయసు: 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: రాతపరీక్ష (ఆబ్జెక్టివ్), టెక్నికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్), ప్రాక్టికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 20, 2018.
- వెబ్‌సైట్: www.supremecourtofindia.nic.in

గుడుంబా సొమ్ము గుటుక్కు!



ఇచ్చింది తీసుకో..

ఈ ఫొటోలో ఆవుకు నీళ్లు తాగిస్తున్న వ్యక్తి మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటకు చెందిన ప్రభాకర్. ఆయనకు గుడుంబా పునరావాస పథకం కింద రూ.2 లక్షలతో యూనిట్ మంజూరు చేశారు. మూడు పాడి ఆవులు ఇప్పిస్తామని చెప్పారు. ఏడాదిపాటు తిరిగాక.. చిత్తూరు జిల్లా పులమనూర్‌లో మధ్యవర్తి ద్వారా ఆవులు ఇప్పించారు. ఇవి బలహీనంగా ఉన్నాయంటే.. 'ఉచితంగా వస్తున్నప్పుడు ఏదో ఒకటి తీసుకో'అంటూ దబాయించారు.

పునరావాస పథకంలో అధికారుల చేతివాటం ● లబ్ధిదారులకు అందాల్సిన సొమ్ము పక్కదారి
రూ.2 లక్షల్లో అందుతోంది సగమే ● ఇదేంటని అడిగితే 'జాబితా నుంచి తొలగిస్తాం' అంటూ బెదిరింపులు
'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగుచూసిన చేదు వాస్తవాలు

సాక్షి, నెట్‌వర్క్: వారందరికీ గుడుంబా తయారీనే ఉపాధి.. చట్ట వ్యతిరేకమని తెలిసినా చేసేదేమీ లేక దానితోనే పొట్టబోసుకోవాల్సిన పరిస్థితి.. పట్టుబడినప్పుడల్లా కేసులు.. పోలీస్ స్టేషన్లు.. జరిమానాలు.. జైలుశిక్షలు మామూలే..! ఎన్నో ఏళ్లుగా ఇలా దుర్భర జీవితాలు గడుపుతున్న వారి బతుకుల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పథకానికి అక్రమాల చీడ పట్టుకుంది. అధికారుల ఆమ్యామ్యాలతో లబ్ధిదారులకు అందాల్సిన సొమ్ము పక్కదారి పడుతోంది. గుడుంబా ఆధారిత కుటుంబాల పునరావాస పథకం (జీఈపీఆర్ఎస్) లబ్ధిదారులను 'సాక్షి' పలకరించగా విస్మయకర అంశాలు వెలుగుచూశాయి.

ఎక్కువ మాట్లాడితే.. పేరు తీసేస్తాం..

గుడుంబా తయారీదారులకు జీఈపీఆర్ఎస్ కింద రూ.2 లక్షలతో ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. అందులో అధికారులే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏ జిల్లాలో చూసినా లబ్ధిదారులకు రూ.2 లక్షల లబ్ధి చేకూరిన దాఖలాలు కనిపించడం లేదు. రూ.లక్ష లేదా లక్షన్నర వరకు మాత్రమే ఇస్తున్నారు. ఇదేంటని అడిగితే.. 'అదంతే.. ఎక్కువగా మాట్లాడితే జాబితా నుంచి పేర్లు తొలగిస్తాం. ఉన్న సామగ్రి రికవరీ చేసి వేరే వారిని ఎంపిక చేస్తాం'అని దబాయిస్తున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. పలు జిల్లాల్లో సామగ్రిని అధికారులే కొనుగోలు చేసి దొంగ బిల్లులు ఇచ్చిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పలువురు లబ్ధిదారులు సాయం కోసం ఇంకా నిరీక్షిస్తున్నారు.

అవినీతికి తెరలేచిందిలా..

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లేమి కారణంగా పథకంలో అవినీతి చోటుచేసుకుంది. ఫలితంగా లబ్ధిదారులకు రుణాలు సరైన రీతిలో అందడం లేదు. ఎక్సైజ్ అధికారులతోపాటు ఎంపీడీవో జాయింట్ సర్వే చేసి రుణాలు అందించాల్సి ఉంది. రుణ లబ్ధిదారుల ఎంపిక, ఆయా కార్పొరేషన్ల నుంచి వచ్చిన చెక్కుల అందజేత వంటి అంశాలు ఎక్సైజ్ సీఐ స్థాయి అధికారితోపాటు ఎంపీడీవోలు పర్యవేక్షించాల్సి ఉంది. రుణాల మంజూరుకు చెందిన గ్రౌండింగ్‌పై ఎంపీడీవో, ఎక్సైజ్ అధికారులు ఎప్పటికప్పుడు జాయింట్ సర్వేలు చేయాలి. కానీ కొందరు ఎంపీడీవోలు నామమాత్రంగా వ్యవహరించడంతో ఎక్సైజ్ అధికారులు కమీషన్ల దందాలకు తెరలేపారు. ఫలితంగా రుణాల మంజూరులో అవకతవకలు చోటుచేసుకున్నాయి.

ఇదిగో మరకలు..

పథకం కింద జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్‌కు 46 యూనిట్లను కేటాయించారు. ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షల చొప్పున రూ.92 లక్షలు విడుదల చేశారు. దీంతో లబ్ధిదారులు కిరాణం, బ్రిక్స్, కూల్‌డ్రింక్స్, గొర్రెలు, గేదెల పెంపకం తదితర వ్యాపారాలను ఏర్పాటు చేసుకున్నారు. వీటిలో 17 కిరాణా దుకాణాలకు సంబంధించి ఎక్సైజ్ సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారుల విచారణలో బయటపడింది. స్థానిక సీఐ, ఎస్సైలు అవినీతికి పాల్పడ్డారని తేలడంతో వారిపై వేటు వేశారు.

ఇదీ పథకం..

రాష్ట్రంలో సారా/గుడుంబా వాసన లేకుండా చేసేందుకు సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా గతేడాది మార్చిలో జీఈపీఆర్ఎస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ప్రకారం గుడుంబా తయారీదారులు చిన్న తరహా వ్యాపారాలు చేసుకునేలా రూ.2 లక్షలు మంజూరు చేస్తారు. ఆ మొత్తంతో కిరాణా దుకాణాలు, టెంట్‌హౌస్‌లు, చికెన్ షాపులు, బట్టల వ్యాపారం, సూపర్ మార్కెట్లు వంటివి ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల వారిని లబ్ధిదారులుగా గుర్తించి బ్యాంకుల నుంచి కాకుండా ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందజేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఉంటుంది. ఇందులో ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్పీ, డీఆర్‌డీవో, జిల్లా బీసీ, గిరిజన సంక్షేమశాఖ అధికారి, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి, స్త్రీ, శిశు సంక్షేమం, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖల అధికారులు ఉంటారు.



జీఎస్టీ కింద రూ.36 వేలు కట్..!

ఈయన పేరు బల్వీందర్‌సింగ్. రాజన్న సిరిసిల్ల సిక్కువాడి. ఏడుగురు పిల్లలు. జీవనోపాధి కోసం 15 ఏళ్లుగా సారా అమ్ముతున్న బల్వీందర్‌పై ఐదారు సార్లు కేసులు నమోదయ్యాయి. సారా అమ్మడం మానేయడంతో రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దాంతో అధికారులు రెండు వెల్డింగ్ మిషన్లు, డ్రిల్లింగ్, గ్రైండర్, షెటర్ ఫిటింగ్ మిషన్లు కొనివ్వగా.. బల్వీందర్ మరో రూ.50 వేలు ఫైనాన్స్‌లో తెచ్చుకుని ఇతర పరికరాలు కొనుక్కున్నాడు. కానీ అధికారులు రెండు లక్షల సాయంలో జీఎస్టీ అని రూ.36 వేలు కట్ చేసుకున్నారని వాపోతున్నాడు.

అడిగితే స్కీం రద్దు చేస్తామన్నారు

ఈయన పేరు దోరి ఐలయ్య. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం. జీవనోపాధి కల్పిస్తామని అధికారులు చెబితే గుడుంబా అమ్మడం మానేశాడు. పిండి గిర్ని నడుపుకొంటానంటే ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసింది. కానీ అధికారులు ఇచ్చిన సామగ్రి విలువ రూ.60 వేలకు మించి ఉండదు. ఇదేమిటని అడిగితే స్కీం రద్దు చేసి వేరే వారికి ఇస్తామని అధికారులు బెదిరించారని ఐలయ్య వాపోతున్నాడు.





చికెన్ సెంటర్‌కు రూ.2 లక్షలా?

పై చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కుందారపు చంద్రయ్య. గోదావరిఖనిలోని జీఎం కాలనీ. ప్రభుత్వం గుడుంబా పునరావాసం కింద చికెన్ సెంటర్ పెట్టుకోవాలని నిర్ణయించాడు. చంద్రయ్యకు రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దీంతో అధికారులు కోళ్లను ఉంచే ఇనుప జాలి, ఈకలు పీకే యంత్రం, చికెన్ కొట్టే కర్ర మొద్దు, కత్తులు, ఫ్రిడ్జ్ కొనిచ్చారు. కానీ తర్వాత లెక్కలు వేస్తే అన్నీ కలిపి రూ.60 వేలకు మించవని తేలింది. మిగతా డబ్బుల కోసం అధికారుల వద్దకు వెళితే.. మొత్తం సొమ్ము ఆ సామగ్రికే ఖర్చయిందని చెప్పి పంపేశారు.

ఉమ్మడి జిల్లాల వారీగా లబ్ధిదారుల సంఖ్య, కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

జిల్లా	గుర్తించినది	లబ్ధిపొందినది	నిధులు
ఆదిలాబాద్	325	269	7.14
కరీంనగర్	407	400	9
మహబూబ్‌నగర్	1,147	1,141	22.82
ఖమ్మం	732	727	15.26
వరంగల్	1,038	997	19.94
నల్లగొండ	704	696	14.8
నిజామాబాద్	193	180	3.50
మెదక్	901	366	7.32

ఎన్నెన్నో అక్రమాలు

➡ పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన పి.శ్రీనివాస్‌కు టెంట్‌హౌస్ పెట్టుకోవడానికి ఎక్సైజ్ పోలీసులు రూ.2 లక్షల విలువైన సామగ్రి ఇప్పించారు. 2017 ఆగస్టు 28న హైదరాబాద్ నుంచి సామగ్రి తీసుకొచ్చి టెంట్‌హౌజ్ ప్రారంభించారు. కానీ ఆ సామగ్రి అంతా కలిపి రూ.1.20 లక్షలు మాత్రమే విలువ చేస్తుందని, అధిక రేట్లు వేసి సొమ్ము చేసుకున్నారని శ్రీనివాస్ చెబుతున్నాడు.

➡ కుమ్రం భీం జిల్లాలో నలభై మంది లబ్ధిదారులను గుర్తించారు. అందులో తొలివిడతగా గతేడాది జూలైలో 19 మందికి యూనిట్లు అందజేశారు. 15 మందికి రూ.లక్ష చొప్పున, నలుగురికి రూ.2 లక్షల చొప్పున అందించారు. అయితే ఇందులో మేకలు, గొర్రెల యూనిట్ల పంపిణీలో అవకతవకలు జరిగాయి. రూ.లక్ష విలువైన 20 గొర్రెలు/మేకలు పంపిణీ చేయగా.. కొద్దిరోజుల్లోనే వాటిల్లో సగానికిపైగా మృత్యువాత పడ్డాయి. ఇన్సూరెన్స్ కోసమని రూ.ఐదు వేలు వసూలు చేసినా.. ఇన్సూరెన్స్ చేయించలేదు.

ఈసీనగర్‌లో కాల్పుల కలకలం

హైదరాబాద్: చర్లపల్లిలోని ఈసీనగర్‌లో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న స్థల వివాదంలో స్థానికులతో ఘర్షణ పడ్డ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు తుపాకీతో బెదిరింపులకు పాల్పడిన సంఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాల్పులకు పాల్పడ్డ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ సీపీ మహేశ్ భగవత్, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, కుషాయిగూడ ఏసీపీ కృష్ణమూర్తి మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు.

సంతలో స్థలంకోసం...

సహానగర్‌కు చెందిన దండు తులసీదాస్, మరో ముగ్గురు వ్యక్తులు, మల్రిగూడలో నివసించే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బబ్లూ, ధర్మేంద్ర అనే సోదరులు చర్లపల్లి ఈసీనగర్ మెయిన్‌రోడ్డులో వ్యాపారం చేసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం సంతలో స్థలంకోసం ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మాటా మాటా పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. బబ్లూ, ధర్మేంద్రలు ఘర్షణ విషయాన్ని తండ్రి గజరాజ్‌సింగ్‌కు ఫోన్‌లో తెలిపారు. దీంతో ఆగ్రహంతో ఈసీనగర్ చేరుకున్న గజరాజ్‌సింగ్ తన వెంట తీసుకువచ్చిన నాటు తుపాకీతో తులసీదాస్ వర్గీయులను కాల్చేందుకు సిద్ధపడ్డాడు. అప్పటికే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది ఇరు పక్షాలను చెదరగొట్టారు. అదే సమయంలో గజరాజ్‌సింగ్ తన తుపాకీని తులసీదాసుకు గురిపెట్టడాన్ని పసిగట్టిన కానిస్టేబుల్ చక్రపాణి చాకచక్యంగా వ్యవహరించి తుపాకీని పక్కకు తోయడంతో అది గాలిలోకి పేలింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు గజరాజ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత గజరాజ్‌సింగ్ ఇంటికి వెళ్లి సోదా చేయగా రెండు బుల్లెట్లు, ఓ తల్వార్ లభ్యమయ్యాయి. ఈ సంఘటనలో గాయపడ్డ తులసీదాస్‌తో పాటు శంకర్, చంద్రశేఖర్, పవన్‌లను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైకోర్టు అదనపు పీపీలుగా శ్రీదేవి, జయరాజ్

నియామకపు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో తమ తరఫున ప్రాసిక్యూషన్లు, అప్పీళ్లు, ఇతర ప్రొసీడింగ్స్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇద్దరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించింది. జువ్వాడి శ్రీదేవి, ఏఎస్.జయరాజ్‌లను అదనపు పీపీలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు అదనపు పీపీలుగా ఉన్న డి.రామిరెడ్డి, పి.వినోద్‌కుమార్‌ల స్థానంలో వీరిని నియమించింది. కొత్త పీపీలు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఆ పోస్టుల్లో కొనసాగుతారు. వీరిద్దరూ హైకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ కొత్త నియామకాలపై హైకోర్టు న్యాయవాద వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో పాటు టీఆర్ఎస్ నాయకులపై నమోదైన కేసుల్లో వారి తరఫున బెయిల్ పిటిషన్లు దాఖలు చేసి, వాదనలు వినిపించిన రామిరెడ్డిని పక్కన పెట్టడం చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ సొంత మనిషిగా ముద్రపడిన రామిరెడ్డికి పొడిగింపు రాకపోవడం, సీఎం వద్ద పలుకుబడి ఉన్న వ్యక్తికి అత్యంత సన్నిహితుడైన వినోద్‌కుమార్‌కు ఉద్వాసన పలకడం విస్మయానికి గురి చేసింది.

అర్ధరాత్రి మావోయిస్టుల హల్‌చల్

ఒకరిపై కాల్పులు ● మరొకరిని గొడ్డలితో నరికి చంపారు..
8 వాహనాలు దహనం ● భద్రాద్రి జిల్లా పినపాకలో ఘాతుకం

పినపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపతిరావుపేట సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి మావోయిస్టులు హల్‌చల్ చేశారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో ఒకరిపై కాల్పులు జరపగా, మరొకరిని గొడ్డలితో నరికి చంపారు. గ్రామ శివారు గోదావరి ఒడ్డున గిరిజన సొసైటీ పేరుతో ఇసుక క్వారీ నడుస్తోంది. ఇక్కడికి వచ్చిన మావోయిస్టులు నాలుగు లారీలు, మూడు జేసీబీలు, ఒక డోజర్, ఒక ట్రాక్టర్‌ను దహనం చేశారు. అనంతరం జానంపేట పంచాయతీ సుందరయ్యనగర్‌కు (వలస గొత్తికోయ గ్రామం) చెందిన మడివి రమేశ్, జోగయ్యలను పోలీస్‌ఇన్‌ఫార్మర్లుగా రమేశ్‌పై కాల్పులు జరిపారు. జోగయ్య(42)ను గొడ్డలితో నరికి చంపారు. ఈ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ మణుగూరు కమిటీ పేరుతో లేఖలు వదిలారు. 45 మంది మావోయిస్టులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు సమాచారం. ఘటన జరిగిన విషయం తెలిసిన వెంటనే మణుగూరు డీఎస్పీ సాయిబాబా ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సమాచారాన్ని సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

దూర విద్య.. అంతా మిథ్య!

- రాష్ట్రంలో విచ్చలవిడిగా ఇతర రాష్ట్ర యూనివర్సిటీల స్టడీ సెంటర్లు
- 2013 తర్వాత వాటి ద్వారా పొందిన సర్టిఫికెట్ల తిరస్కరణ
- విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల్లో నిరాకరణ
- ఆందోళనలో లక్షలాది మంది విద్యార్థులు, అభ్యర్థులు


ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన హైదరాబాద్‌లోని దూర విద్యా కేంద్రం ద్వారా శ్రీనివాస్‌రెడ్డి డిగ్రీ చేశాడు. తెలంగాణ ఐసెట్ రాసి మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీఏలో చేరాడు. ర్యాటిఫికేషన్ కోసం అతని సర్టిఫికెట్లు ఉన్నత విద్యామండలికి వెళ్లగా పరిశీలించిన అధికారులు అతని సర్టిఫికెట్ చెల్లదని ప్రవేశాన్ని తిరస్కరించారు.

సిక్కిం మణిపాల్ యూనివర్సిటీకి చెందిన హైదరాబాద్‌లోని దూర విద్యా కేంద్రం ద్వారా వెంకటేశ్వర్లు డిగ్రీ చదివాడు. తెలంగాణ లాసెట్ రాసి న్యాయ విద్య కోర్సులో చేరాడు. అయితే అతని ప్రవేశాన్నీ ఉన్నత విద్యామండలి తిరస్కరించింది.

ఇలా ఒకరు.. ఇద్దరు కాదు వందలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లు తిరస్కరణకు గురవుతున్నాయి. విద్యలోనే కాదు ఉద్యోగాల్లోనూ ఇలాంటి సర్టిఫికెట్లను ఉన్నత విద్యామండలి తిరస్కరిస్తోంది. సుప్రీం కోర్టు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) దూర విద్యా కేంద్రాల టెరిటోరియల్ జూరిస్‌డిక్షన్–2013 నిబంధనల ప్రకారం ఒక రాష్ట్రంలోని రాష్ట్ర యూనివర్సిటీ లేదా డీమ్డ్ యూనివర్సిటీ లేదా ప్రైవేటు యూనివర్సిటీ ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లను పెట్టడానికి.. వాటి ద్వారా కోర్సులను నిర్వహించడానికి వీల్లేదు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లకు 2013 ఆగస్టు 23న యూజీసీ పాలన డైరెక్టర్ విక్రమ్ సాహే లేఖ(ఎఫ్ఎన్‌ఓ డీఈబీ/క్యూఎంపీ/2013) రాశారు. ఈ నిబంధనను తెలంగాణ ఉన్నత విద్యామండలి పక్కాగా అమలు చేస్తోంది. ఫలితంగా అనేక మంది విద్యార్థులు వివిధ కోర్సుల ప్రవేశాల్లో తిరస్కరణకు గురవుతున్నారు. దీంతో ఇతర రాష్ట్ర యూనివర్సిటీలకు చెందిన రాష్ట్రంలోని స్టడీ సెంటర్ల ద్వారా 2013 తర్వాత చదివిన చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులు ఇప్పుడు ఆందోళనలో పడ్డారు.

– సాక్షి, హైదరాబాద్

50 ఇతర రాష్ట్ర యూనివర్సిటీల స్టడీ సెంటర్లు



ఇతర రాష్ట్రాలకు చెందిన 50 వరకు రాష్ట్ర వర్సిటీలు, డీమ్డ్, ప్రైవేటు వర్సిటీలు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో స్టడీ సెంటర్లను ఏర్పాటు చేశాయి. డిప్లొమా, డిగ్రీ, పీజీ, వృత్తి విద్య వంటి కోర్సులను దూర విద్య ద్వారా అందిస్తున్నాయి. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే వేల కాలేజీల్లో ఆయా విద్యా సంస్థలు 150 కోర్సులను నిర్వహిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి భావిస్తోంది. వాటిల్లో 2 లక్షల మంది విద్యార్థులు వేలకు వేలు ఫీజులు చెల్లించి చదువుతున్నారు. ఏపీలోని ఓ స్టడీ సెంటర్ ద్వారా అక్కడి వర్సిటీలో చదివితే ఆ సర్టిఫికెట్ చెల్లుతుంది.. అదే వర్సిటీకి చెందిన హైదరాబాద్‌లోని దూర విద్య స్టడీ సెంటర్ ద్వారా చదివితే ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు కాదు. దీనిపై ప్రచారం లేకపోవడంతో విద్యార్థులకు తెలియడం లేదు. ఇతర రాష్ట్ర వర్సిటీలు ఆదాయం కోసం ఈ విషయాన్ని దాచిపెట్టి విద్యా వ్యాపారం చేస్తున్నాయి. దీంతో రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉద్యోగాల్లోనూ తిరస్కరణ!

ఇలాంటి సర్టిఫికెట్లను విద్యా ప్రవేశాల్లోనే కాకుండా ఉద్యోగాల్లోనూ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆ సర్టిఫికెట్లను ఉద్యోగ నియామకాల విభాగాలు తిరస్కరిస్తున్నాయి. ఉన్నత విద్యామండలి అధికారులతో చర్చించి మరీ నిర్ణయం తీసుకుంటుండటంతో పలువురు అభ్యర్థులు ఉద్యోగాల్లోనూ తిరస్కరణకు గురి కావాల్సివస్తోంది.

యూజీసీ నిబంధనల ప్రకారమే..

యూజీసీ దూర విద్య, ఆఫ్ క్యాంపస్‌ల టెరిటోరియల్ జ్యూరిస్‌డిక్షన్ నిబంధనల ప్రకారం ఒక రాష్ట్ర వర్సిటీ మరో రాష్ట్రంలో దూర విద్య కేంద్రాలను ఏర్పాటు చేసి కోర్సులను నిర్వహించడానికి వీల్లేదు. అందుకే అలా వచ్చే విద్యార్థుల సర్టిఫికెట్లను తిరస్కరిస్తున్నాం. ఇప్పటికైనా అలాంటి వాటిల్లో విద్యార్థులు చేరవద్దు. రెగ్యులర్‌గా చదువుకునే అవకాశం లేని వారు తెలంగాణ రాష్ట్ర వర్సిటీల దూర విద్యా కేంద్రాల ద్వారా చదువుకోవాలి.– తుమ్మల పాపిరెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

భారత మాతకు దివ్య హారతి

1,500 మంది విద్యార్థులతో త్రివర్ణ పతాక ఆకృతి

- హైదరాబాద్‌లో భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

హైదరాబాద్: భారతమాత వేషధారణలో 1,500 మంది విద్యార్థులు.. 3 రంగుల వస్త్రధారణతో త్రివర్ణ పతాక ఆకృతి.. గంభీరంగా భారతమాత విగ్రహం.. దేశ ఔన్నత్యాన్ని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు.. ఇవన్నీ భారత మాతకు దివ్య హారతినిచ్చాయి. దేశంలోనే తొలిసారిగా శుక్రవారం హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో భారత మాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్‌మాత ఫౌండేషన్ చైర్మన్ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి పరిపూర్ణానంద స్వామి ఆశీస్సులతో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగగా... రాత్రి 9.15 భారత్‌మాతకు హారతి, త్రివర్ణ పతాక హారతి, గంగా హారతి, గోప్రకృతి హారతి, మహనీయుల హారతి, భారతరత్న హారతి నిర్వహించారు.

గర్వంగా చెప్పుకుందాం..

భారతీయులమని సగర్వంగా చెప్పుకుందామని.. విశ్వగురువుగా అడుగులు వేసే శక్తి దేశానికి ఉందని స్వామి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. స్త్రీజాతికి ప్రథమ స్థానం ఇచ్చిన దేశం మనదని, మానవత్వమనే సందేశాన్ని పంచి.. మంచి, మర్యాదలను పెంచిందని చెప్పారు. భారతదేశం విలువ తెలియాలంటే.. దేశం దాటి ఇతర దేశాలకు వెళ్లాలన్నారు. స్వామి వివేకానంద ఎన్ని దేశాలు చుట్టినా.. చివరికి భారత గడ్డ మీద విమానం దిగగానే భూమిని ముద్దాడారని గుర్తుచేశారు. కార్యక్రమం అనంతరం పలువురు ప్రముఖులను కిషన్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, 'భారత్‌మాతకు హారతి' కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది.

పద్మ పురస్కారాల్లో అన్యాయం

ప్రధానికి ఎంపీ వినోద్ లేఖ



సాక్షి, హైదరాబాద్: పద్మ పురస్కారాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని టీఆర్ఎస్ ఎంపీ వినోద్ ఆరోపించారు. కొన్ని రాష్ట్రాలకే ప్రాధాన్యమిచ్చి తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాలను పట్టించుకోకపోవడం సరికాదని శుక్రవారం ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇది మంచి పరిణామం కాదని, పద్మ పురస్కారాలకు అర్హులైన ఎంతోమంది తెలంగాణలో ఉన్నా వారిని గుర్తించకపోవటం ఏమిటని ప్రశ్నించారు. పద్మ పురస్కారాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అసమతుల్యం లేకుండా చూడాలని కోరారు.

'నీళ్ల శాఖ' మెయిల్ హ్యాక్

- 'వి నీడ్ ఏ ఫేవర్' అంటూ ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు మెయిల్
- పోలీసులకు ఫిర్యాదు, నైజీరియన్ల పనిగా గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: ఫేస్‌బుక్, ట్వీటర్‌లను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ఏకంగా నీటిపారుదల శాఖనే టార్గెట్ చేశారు. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) పరిధిలోని నాగార్జునసాగర్ ఆధునీకరణ పనులకు సంబంధించి వినియోగిస్తున్న మెయిల్‌నే హ్యాక్ చేశారు. హ్యాక్ చేసిన మెయిల్ నుంచే ఏకంగా ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు 'వి నీడ్ ఏ ఫేవర్'అంటూ మెయిళ్లు పంపారు. మెయిల్‌ను రిసీవ్ చేసుకున్న కొందరు ఎలాంటి ఫేవర్ కావాలంటూ శాఖ అధికారులకే ఫోన్‌లు చేయడంతో హ్యాక్ విషయం బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వం 2008లో ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనులకు 'కాడా' అధికారులు అప్పట్లోనే ఆంధ్రప్రదేశ్ వాటర్ సెక్టార్ ఇంప్లిమెంట్ ప్లాన్‌ను తయారు చేశారు. అదే అర్థం వచ్చేలా ఏపీడబ్ల్యూఎస్ఐపీ పేరుతో మెయిల్ అడ్రస్‌ను క్రియేట్ చేసి దాని నుంచే ప్రపంచబ్యాంకు ప్రతినిధులు, ఇతర శాఖల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ మెయిల్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, దాన్నుంచి ప్రధాన మెయిల్ అడ్రస్‌లన్నింటికీ 'వి నీడ్ ఏ ఫేవర్' అంటూ మెయిల్ పంపారు. 50–60 మందికి ఇదే మెయిల్ వెళ్లింది. రాత్రిపూట పంపడంతో దీన్ని శాఖ అధికారులెవరూ గుర్తించలేదు. ఉదయం ఈ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్, 'కాడా' కమిషనర్‌గా ఉన్న మల్సూర్‌కు ప్రపంచ బ్యాంకు ప్రతినిధి నుంచి ఫోన్ వచ్చింది. 'రాత్రి మెయిల్ పంపారు. మీకు ఎలాంటి ఫేవర్ కావాలి' అని అడగడంతో ఆయన అవాక్కయ్యారు. ఎలాంటి మెయిల్ పంపలేదని చెప్పడంతో ఫోన్ చేసిన ప్రతినిధి కంగుతిన్నారు. 'ఏపీలో సెక్రటరీ స్థాయి ఐఏఎస్ అధికారి నుంచి ఇదే మెయిల్ గురించి ఫోన్ వచ్చింది. వెంటనే మా సిబ్బందిని అప్రమత్తం చేయడంతో విషయం బయటపడింది' అని మల్సూర్ 'సాక్షి'కి తెలిపారు. బషీర్‌బాగ్‌లోని సైబర్ సెల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణలో దీన్ని నైజీరియన్‌కు చెందిన సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లుగా గుర్తించినట్లు తెలిసింది.

సాక్షి బిజినెస్
శనివారం 27-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్	నిఫ్టీ
111 ▼	16 ▼
36,050	11,070

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,458	▲	47
డోజోన్స్	26,488	▲	96
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,666	▲	50
డాక్స్	13,340	▲	42
షాంఘై	3,559	▲	11
నికాయ్	23,632	▼	38

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.25	64.38
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.20	92.39
€	యూరో	ఎస్‌బీఐ	80.15	80.31
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.19	59.31
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.36	52.47
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.42	49.52
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.36	18.21
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.72	18.38
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.08	11.51

ప్రజాస్వామ్యానికి 'సోషల్' ముప్పు

- గూగుల్, ఫేస్‌బుక్‌లతో చేటు...
- ప్రముఖ ఇన్వెస్టరు జార్జ్ సొరోస్



దావోస్: ఇంటర్నెట్ మాధ్యమంలో గుత్తాధిపత్యం సాగిస్తున్న గూగుల్, ఫేస్‌బుక్ లాంటివి నవకల్పనలకు అవరోధాలని ప్రముఖ ఇన్వెస్టరు జార్జ్ సొరోస్ వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా సంస్థలు.. ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశమున్నట్లు ఆయన పేర్కొన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కేంద్రంగా పనిచేసే ఐటీ దిగ్గజాల ఆధిపత్యానికి గండి పడే రోజులు దగ్గరపడుతున్నాయని సొరోస్ పేర్కొన్నారు. ''యూజర్లకు తెలియకుండానే వారి ఆలోచన ధోరణులను, ప్రవర్తనను సోషల్ మీడియా కంపెనీలు ప్రభావితం చేస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థపైనా, ముఖ్యంగా ఎన్నికలపైనా ఈ తీరు తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముంది'' అన్నారాయన. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రభావంతో పనిచేశాయంటూ ఫేస్‌బుక్, ట్వీటర్ వంటి పలు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో సొరోస్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఫ్యూచర్ చేతికి 'వల్కన్ ఎక్స్‌ప్రెస్'!

డీల్ విలువ రూ.35 కోట్లు



న్యూఢిల్లీ: కిశోర్ బియానీకి చెందిన ఫ్యూచర్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ కంపెనీ ప్రముఖ ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ స్నాప్‌డీల్‌కు చెందిన లాజిస్టిక్స్ విభాగం వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు చేసింది. పూర్తిగా నగదు చెల్లించి వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు చేశామని, ఈ డీల్ విలువ రూ.35 కోట్లని ఫ్యూచర్ గ్రూప్ చైర్మన్ కిశోర్ బియానీ తెలిపారు. వల్కన్ చేరికతో ఈ కామర్స్, రిటైల్ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలందించగలమని చెప్పారాయన. కాగా పూర్తిగా ఈ–కామర్స్ వ్యాపారంపైననే దృష్టి సారించే వ్యూహంలో భాగంగా స్నాప్‌డీల్ కంపెనీ వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను విక్రయించిందని స్నాప్‌డీల్ చీఫ్ స్ట్రాటజీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ జేసన్ కొఠారి పేర్కొన్నారు. ఫ్యూచర్ సప్లై చెయిన్‌కు దేశవ్యాప్తంగా 44 గిడ్డంగులు, 14 లాజిస్టిక్స్ కేంద్రాలు, 106 బ్రాంచ్‌లు ఉన్నాయి.

ఫ్యూచర్ జోరు..: ఇటీవల కాలంలో ఫ్యూచర్ కంపెనీ జోరుగా కంపెనీలను కొనుగోలు చేస్తోంది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ కంపెనీ షాపర్స్ స్టాప్‌కు చెందిన హైపర్ సిటీ రిటైల్‌ను రూ.655 కోట్లకు కొనుగోలు చేసింది. గత వారమే ట్రావెల్ న్యూస్ సర్వీసెస్ ఇండియాను (టీఎన్ఎస్ఐ) రూ.100 కోట్లకు కొనుగోలు చేసింది.

ఎన్ఈసీ క్షేత్రం నుంచి నికో ఔట్..

10% వాటా ఆర్ఐఎల్, బీపీ చేతికి...



న్యూఢిల్లీ: బంగాళాఖాతంలోని 'ఎన్ఈసీ(నార్త్ ఈస్ట్ కోస్ట్)– 25' చమురు క్షేత్రంలో నికో రిసోర్సెస్ సంస్థకున్న వాటాను రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్), బ్రిటిష్ పెట్రోలియం(బీపీ)లు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిలో నికో రిసోర్సెస్‌కు 10 శాతం వాటా ఉంది. ఈ విషయాన్ని తన క్యూ3 ఫలితాల వెల్లడి సందర్భంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలియజేసింది. ఈ చమురు క్షేత్రంలో ప్రస్తుతం ఆర్ఐఎల్‌కు 60 శాతం, బీపీ పీఎల్‌సీకి 30 శాతం చొప్పున వాటాలున్నాయి. ఈ వాటాల నిష్పత్తి ఆధారంగా నికో 10 శాతం వాటాను ఈ రెండు కంపెనీలు కొనుగోలు చేస్తాయి.

ఈ చమురు క్షేత్రంలో 1.032 ట్రిలియన్ ఘనపుటడుగుల నిక్షేపాలున్నాయని అంచనా. కెనడాకు చెందిన నికో కంపెనీ నగదు సమస్యలతో సతమతమవుతోంది. అందుకే ఎన్ఈసీ–25లో వాటాను విక్రయిస్తోంది. కేజీ బేసిన్‌లో తనకున్న 10 శాతం వాటాను కూడా విక్రయానికి పెట్టింది. అయితే ఇంత వరకూ సరైన కొనుగోలుదారు దొరకలేదు.

జియో ఫోన్ యూజర్లకు రూ.49 ప్లాన్



న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే సందర్భంగా రిలయన్స్ జియో తన 4జీ ఫీచర్ ఫోన్ యూజర్ల కోసం రూ.49 ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఇందులో ఉచిత అపరిమిత కాల్స్, 1 జీబీ 4జీ డేటా వంటి ప్రత్యేకతలున్నాయి. ఈ ప్లాన్ వాలిడిటీ 28 రోజులు. కంపెనీ అలాగే వీరి కోసం రూ.11, రూ.21, రూ.51, రూ.101 ధరల్లో డేటా యాడ్–ఆన్ ప్లాన్‌లను ప్రకటించింది. మరొకవైపు రిలయన్స్ జియో తన నాన్ జియో ఫోన్ ప్రిపెయిడ్ ప్రైమ్ యూజర్లకు 500 ఎంబీ డేటాను అధికంగా అందించనుంది. రోజుకు 1 జీబీ డేటా, 1.5 జీబీ డేటా అందించే ప్లాన్‌లను ఉపయోగిస్తున్న వారికి ఈ డేటా అందనుంది. అంటే రోజుకు 1 జీబీ డేటా పొందేవారికి 1.5 జీబీ, 1.5 జీబీ డేటా పొందే వారికి 2 జీబీ డేటా వస్తుంది. ఉదాహరణకు అప్‌గ్రేడ్ చేసిన రూ.399 ప్లాన్‌లో కస్టమర్లకు రోజుకు 1.5 జీబీ 4జీ డేటా వస్తుంది. ఇక అపరిమిత కాల్స్, ప్రీమియం యాప్స్ సబ్‌స్క్రిప్షన్ ఉచితం. ఈ ప్లాన్ వాలిడిటీ 84 రోజులు.

'ఆక్సియో బయో'లో రతన్ టాటా పెట్టుబడి



న్యూఢిల్లీ: మెడికల్ టెక్నాలజీ స్టార్టప్ ఆక్సియో బయోసొల్యూషన్స్‌లో రతన్ టాటా పెట్టుబడులు పెట్టారు. సిరీస్ బి నిధుల సమీకరణలో భాగంగా రతన్ టాటాకు చెందిన ఆర్ఎన్‌టీ క్యాపిటల్‌తో పాటు యాక్సెల్ పార్ట్‌నర్స్, ఐడీజీ వెంచర్స్ ఇండియా నుంచి 74 లక్షల డాలర్ల పెట్టుబడులను సమీకరించినట్లు సదరు స్టార్టప్ తెలిపింది. కొత్త మార్కెట్లలో విస్తరణ కోసం ఈ నిధులు వినియోగిస్తామని పేర్కొంది. ఆక్సియో బయో బోస్టన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 27-1-2018

విశాఖ	402-00
చిత్తూరు	388-00
వరంగల్	382-00
ముంబై	425-00
చెన్నై	395-00
విజయవాడ	397-00
గోదావరి	397-00
నమక్కల్	380-00
26-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	380-00
రిటైల్ (ఒక గుడ్డు)	4.40
బెంగళూరు	390-00
ఢిల్లీ	410-00
కోల్‌కతా	446-00

పల్లెల్లోనూ స్కూటర్ల హవా!

పెరుగుతున్న విక్రయాలు

- గతంతో పోలిస్తే పెరిగిన ప్రాధాన్యం
- డ్రైవింగ్ సౌలభ్యం, తగ్గిన ధరలే కారణం
- మున్ముందు గ్రామాలదే మెజారిటీ వాటా

(సాక్షి, బిజినెస్ విభాగం)



గ్రామాల్లో స్కూటర్లకు ఆదరణ పెరుగుతోంది. గ్రామీణులు మెల్లగా రోజువారీ అవసరాల కోసం కూడా స్కూటర్లపై ఆధారపడుతుండటంతో స్కూటర్ల విక్రయాల్లో పల్లెల వాటా పెరుగుతోంది. ద్విచక్ర వాహన పరిశ్రమ విక్రయాల్లో మిగిలిన మోడళ్లతో పోలిస్తే స్కూటర్ల వృద్ధి ఎంతో అధికంగా ఉంటుండగా... ఇటీవలి కాలంలో పల్లెలు, సెమీ అర్బన్ (చిన్న పట్టణాలు) ప్రాంతాల్లోనూ వీటికి డిమాండ్ పుంజుకుందని ఆటో మొబైల్ సంస్థలు చెబుతున్నాయి. గేర్లు లేకపోవడం, ఎవరైనా నడిపేందుకు అనుకూలంగా ఉండటం, బైక్ ధరకే స్కూటర్ కూడా వస్తుండడం, ఆర్జించే మహిళలు పెరుగుతుండడం వెరసి స్కూటర్ల మార్కెట్ వేగం పుంజుకుంటోంది.

హోండా... ప్రతి ఏడింట్లో మూడు

స్కూటర్ విక్రయాల్లో పరిశ్రమలోనే నంబర్ 1 స్థానంలో ఉన్న హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తాను విక్రయించే ప్రతి 7 మోటారు సైకిళ్లకు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 3 స్కూటర్లుంటున్నాయి. ఐదేళ్ల క్రితం ఈ మార్కెట్లలో ప్రతి 9 బైకులకు ఒక్క స్కూటరే అమ్ముడయ్యేది. స్కూటర్ల విక్రయాలు వేగాన్ని అందుకున్నాయనేందుకు ఈ గణాంకాలే నిదర్శనం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల విక్రయాల్లో (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) స్కూటర్ల విక్రయాలు 18.5 శాతం అధికంగా నమోదైతే, ఇదే కాలంలో బైకుల విక్రయాల వృద్ధి 11.5 శాతంగానే ఉంది. ముఖ్యంగా ప్రారంభ స్థాయి మోటారు బైకుల మార్కెట్ స్కూటర్లకు మళ్లిపోతోంది. 100–110సీసీ బైకుల వినియోగదారులు స్కూటర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో బైకులు, స్కూటర్ల మధ్య మార్కెట్ వాటా పరంగా ఉన్న అంతరం తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ప్రారంభ స్థాయి మార్కెట్‌కు గండి

2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు చూస్తే మొత్తం ద్విచక్ర వాహనాల విక్రయాల్లో స్కూటర్ల వాటా 33.7 శాతంగా ఉంది. 100–110సీసీ బైకుల వాటా 36.5 శాతం. ఈ రెండింటి మధ్య అంతరం 2.8 శాతానికి తగ్గిపోయింది. ఏడేళ్ల క్రితం ఈ రెండింటి మధ్య అమ్మకాల్లో వ్యత్యాసం 28–30 శాతం స్థాయిలో ఉన్నట్టు పరిశ్రమ వర్గాల సమాచారం. స్కూటర్ల మార్కెట్లో లీడర్‌గా ఉన్న హోండా ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ఆ అవకాశాలను సొంతం చేసుకునేందుకు అవసరమైన విధానాలను ఆచరణలో పెట్టింది. 2017లో గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ప్రత్యేకంగా క్లిక్ పేరుతో ఓ స్కూటర్‌ను కూడా హోండా ప్రవేశపెట్టింది. అంతేకాదు, 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రారంభమైన కొత్త సబ్ డీలర్‌షిప్ నెట్‌వర్క్‌లో 70 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండడం కంపెనీ ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. హోండాకు గ్రామీణ ప్రాంతాల్లో వాటా 15 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. ఐదేళ్ల క్రితం ఈ వృద్ధి రేటు ఒక్క అంకె స్థాయిలోనే ఉంది. పట్టణ, నగర మార్కెట్లో మాత్రం హోండా వేగంగా 25 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేస్తోంది. టీవీఎస్ ద్విచక్ర వాహన విక్రయాల్లో స్కూటర్ల వాటా 38 శాతంగా ఉంటే, సుజుకి మోటార్ సైకిల్ ఇండియా విక్రయాల్లో 84 శాతం స్కూటర్లే కావడం గమనార్హం.

నడపడంలో వెసులుబాటు

110సీసీ సామర్థ్యం కలిగిన హోండా క్లిక్ స్కూటర్ ఇప్పటి వరకు 12,000 యూనిట్లు అమ్ముడుపోయి ఉండొచ్చని అంచనా. దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.42,000 స్థాయిలో ఉంది. దీని టైర్లు అదనపు గ్రిప్‌తో, గతుకుల రోడ్లలోనూ మరింత నియంత్రణకు, గ్రామీణ రోడ్లపై ప్రయాణానికి అనువుగా ఉంటాయని కంపెనీ చెబుతోంది. ''మరింత మంది మహిళలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల నుంచి పనుల్లో చేరుతుండటంతో వాహనాలకు డిమాండ్ పెరిగింది'' అని హెచ్ఎంఎస్ఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వైఎస్ గులేరియా తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది రెండు వాహనాలను (పురుషులకు బైక్, స్త్రీలకు స్కూటర్) భరించలేరని, దీంతో స్కూటర్ వారి ఎంపికగా ఉంటోందని చెప్పారాయన. గతంలో ఆటోమేటిక్ స్కూటర్ (రూ.48,000)కు 100–110 సీసీ బైక్‌కు (రూ.44,000) మధ్య ధరల పరంగా వ్యత్యాసం ఉండడంతో స్కూటర్ల కొనుగోలుకు ముందుకొచ్చేవారు కాదని, దీన్ని తాము గుర్తించి రూ.42,000 స్థాయిలో క్లిక్ స్కూటర్‌ను తీసుకొచ్చినట్టు గులేరియా తెలిపారు.

భవిష్యత్‌లో మరిన్ని వృద్ధి అవకాశాలు

టైర్–3 పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలనుంచి మరింత మంది మహిళలు ఉద్యోగాల్లో చేరుతుండడంతో స్కూటర్ల వృద్ధికి అవకాశాలు ఏర్పడినట్టు యమహా మోటార్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాయ్‌కురియన్ చెప్పారు. 2020 నుంచి అమల్లోకి రానున్న బీఎస్–6 కాలుష్య ప్రమాణాలు 100–110సీసీ బైక్ మార్కెట్‌కు మరింత విఘాతం కలిగిస్తుందన్నారు. దీన్నుంచి స్కూటర్ మార్కెట్ లబ్ధి పొందుతుందని, ధరల పరంగా మరింత పోటీగా మారడం, గేర్లు లేకపోవడం ఇందుకు కారణాలుగా పేర్కొన్నారు. ముఖ్యంగా అధిక మైలేజీనిచ్చే 100 సీసీ స్కూటర్లకు డిమాండ్ పెరుగుతుందన్నారు.

ట్రాయ్ యాక్షన్ ప్లాన్ అవసరం

కాల్ డ్రాప్స్‌పై సీఓఏఐ వ్యాఖ్య



న్యూఢిల్లీ: కాల్ డ్రాప్స్, మొబైల్ సేవల నాణ్యత వంటి సమస్యలను పరిష్కరించేలా టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ ఒక యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) పేర్కొంది. సమస్యకు పరిష్కారం చూపే యాక్షన్ ప్లాన్ వల్ల పరిశ్రమ దైహిక సమస్యలను అధిగమించగలదని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ తెలిపారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు, నెట్‌వర్క్ విస్తరణకు సంబంధించి టెలికం కంపెనీలు సంస్థాగతంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అందుకే వీటన్నింటి పరిష్కారానికి ట్రాయ్ సమగ్రమైన యాక్షన్ ప్లాన్ తీసుకురావడంపై కసరత్తు చేయాలన్నారు. కాగా కాల్ డ్రాప్స్ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం త్వరలో కాల్ నాణ్యత అంశమై టెలికం ఆపరేటర్లతో భేటీ కానుంది.

బిట్‌కాయిన్స్‌పై ఐసీఏఐ అధ్యయనం



కోల్‌కతా: బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టోకరెన్సీలకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వీటిపై అధ్యయనం చేయనుంది. క్రిప్టో కరెన్సీలపై అభిప్రాయం చెప్పాలని కేంద్రం సూచించడంతో ఈ సమగ్ర అధ్యయనం చేపడుతున్నట్లు ఐసీఏఐ సభ్యుడు (డిజిటల్ అకౌంటింగ్ అండ్ అష్యూరెన్స్ స్టాండర్డ్ బోర్డ్) దెబాశిష్ మిత్రా తెలిపారు. ''ఈ ఏడాది మార్చికల్లా కంపెనీ వ్యవహారాల శాఖకు దీనిపై నివేదిక సమర్పించే అవకాశముంది. దీనికోసం ఆయా అంశాలపై పట్టు ఉన్న సంస్థల అభిప్రాయాలు కూడా తీసుకుంటాం'' అని మిత్రా వివరించారు. కార్పొరేట్ గవర్నెన్స్, కంపెనీల చట్టంపై సీఐఐ నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్న సందర్భంగా మిత్రా ఈ విషయాలు చెప్పారు.

అర్హులకు సులభంగా బ్యాంకు రుణాలు

- బ్యాంకింగ్ సంస్కరణల ప్రధాన లక్ష్యమిదే
- నిజాయితీగల రుణగ్రహీతలకు పెద్ద పీట
- కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్



న్యూఢిల్లీ: ప్రస్తుతం అమలు చేస్తున్న సంస్కరణలతో నిజాయితీగల రుణగ్రహీతలు.. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) నుంచి రుణాలు పొందడం సులభం కాగలదని కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. నిజాయితీకి పెద్ద పీట వేయడమనేది ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ప్రక్రియ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఆయన చెప్పారు. కచ్చితంగా అవసరం ఉండి, నిజాయితీగా వ్యవహరించే రుణగ్రహీతలకు ఏ ఆటంకాలూ లేకుండా రుణాలు లభించేలా చూడటం ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ''జీఎస్‌టీ రిటర్నులు, వివిధ ఫైనాన్షియల్ టెక్నాలజీ సాధనాలు రుణగ్రహీతల ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. వీటిని ఉపయోగించుకోవడం ద్వారా రుణమివ్వటంపై బ్యాంకులు నిర్ణయం తీసుకోవచ్చునన్నారు. మదింపు ప్రక్రియ కఠినతరం చేయడం వల్ల రుణాలను రాబట్టుకునే ప్రక్రియ మెరుగుపడుతుంది'' అని కుమార్ వివరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఏకంగా రూ. 8 లక్షల కోట్ల మేర మొండిబాకీలు పేరుకుపోయిన నేపథ్యంలో రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మొండిబాకీలతో కుదేలైన పీఎస్‌బీలను గట్టెక్కించేందుకు కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరం రూ. 88,139 కోట్ల మేర అదనపు మూలధనాన్ని అందిస్తోంది. అయితే, నిర్దేశిత సంస్కరణలు అమలు చేయడాన్ని బట్టి కేటాయింపులు ఉంటాయంటూ షరతు విధించిన సంగతి తెలిసిందే.

టాటా టెలీ ఫైబర్ ఆస్తుల కోసం బిడ్

టాటా ఇంటర్నేషనల్ హెడ్ ముకుందరాజన్ ఆసక్తి..



ముంబై: టాటా టెలీసర్వీసెస్‌కు చెందిన ఎంటర్‌ప్రైజ్ బిజినెస్‌ను(ఫైబర్ టెలికం నెట్‌వర్క్) కొనుగోలు చేయటానికి టాటా టెలీ సర్వీసెస్‌కు చెందిన ఉన్నతాధికారులే బిడ్ వేసినట్లు తెలిసింది. టాటా గ్రూప్‌కు చెందిన అంతర్జాతీయ కార్యకలాపాల అధినేత, గతంలో బ్రాండ్ కస్టోడియన్‌గా వ్యవహరించిన ముకుందరాజన్ నేతృత్వంలో టాటా టెలీ సర్వీసెస్‌కు చెందిన కొందరు ఉన్నతాధికారులు ఈ బిడ్‌ను దాఖలు చేశారని ఈ విషయంతో నేరుగా సంబంధం ఉన్న ఒక వ్యక్తి వెల్లడించారు. వీరికి టీపీజీ క్యాపిటల్ నేతృత్వంలోని కన్సార్షియమ్ తోడ్పాటునందిస్తోంది. ఈ కన్సార్షియమ్ ఈ ఆస్తుల కోసం వంద కోట్ల డాలర్లపైనే కోట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ డీల్ కుదిరితే ఈ రంగంలో ఇదే అతి పెద్ద డీల్ కానుంది. టాటా గ్రూప్‌కు చెందిన టాటా కమ్యూనికేషన్స్ కూడా ఈ ఆస్తుల కొనుగోళ్ల రేసులో ఉంది. 1,25,000 రూట్ కిలోమీటర్ల ఫైబర్ నెట్‌వర్క్, ఇతర ఆస్తులను ఈ కన్సార్షియమ్ దక్కించుకుంటే ఈ వ్యాపారాన్ని చూసుకోవడం కోసం ముకుందరాజన్ టాటా గ్రూప్ నుంచి బయటకొస్తారని ఆ వ్యక్తి పేర్కొన్నారు. గతంలో టాటా టెలీసర్వీసెస్‌కు ఎమ్‌డీగా రాజన్ పనిచేశారని, దీంతో ఈ వ్యాపారాన్ని నిర్వహించే అనుభవం అయనకుందని, అంతేకాకుండా కొన్ని ప్రైవేట్ ఈక్విటీ సంస్థలతో ఆయనకు సన్నిహిత సంబంధాలు కూడా ఉన్నాయని ఆ వ్యక్తి పేర్కొన్నారు. ఈ వార్తలపై టాటా సన్స్, టీపీజీ క్యాపిటల్ ప్రతినిధులు వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. టాటాటెలి సర్వీసెస్ తన మొబైల్ ఫోన్ వ్యాపారాన్ని గత ఏడాది అక్టోబర్‌లో భారతీ ఎయిర్‌టెల్‌కు విక్రయించిన విషయం తెలిసిందే.

ఫెస్టివ్యా.. హస్తకళ ఆభరణాల వేదిక!

హ్యాండ్‌మేడ్ జువెలరీ విక్రయం

- భారత్ సహా ఆరేడు దేశాల్లో అమ్మకాలు
- వారంలో వైజాగ్, హైదరాబాద్ ఆభరణాల జోడింపు
- ఏప్రిల్ నాటికి రూ.2 కోట్ల నిధుల సమీకరణ పూర్తి
- 'స్టార్టప్ డైరీ'తో ఫెస్టివ్యా సీఈఓ సురేష్


ఫెస్టివ్యా సీఈఓ సురేష్





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్‌లో దొరకనిదంటూ లేని ఈ రోజుల్లో ఎంతో విలువైన భారతీయ హస్తకళలు మాత్రం ఆమడ దూరంలోనే ఉండిపోయాయి. ఈ అవకాశాన్ని వ్యాపార సూత్రంగా మలుచుకుంది ఫెస్టివ్యా. మన దేశ హస్తకళలకు విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను గుర్తించి ఫెస్టివ్యా.ఇన్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ వేదికగా స్థానిక హ్యాండ్‌మేడ్ జువెలరీని విక్రయించడమే దీని పని. మన దేశంతో పాటూ అమెరికా, యూకే, సింగపూర్, మలేషియా వంటి ఆరేడు దేశాల్లో విక్రయాలు సాగిస్తోంది. మరిన్ని వివరాలు ఫెస్టివ్యా సీఈఓ సురేష్ రాధాకృష్ణన్ నాయర్, మాటల్లోనే..

37 మంది డిజైనర్స్; 3,700 ఉత్పత్తులు..

''2016 మేలో రూ.20 లక్షల పెట్టుబడితో మాథ్యూ అబ్రహం రాయ్, రాహుల్ ఆర్, నిక్కీ జోసెఫ్‌తో కలిసి దీన్ని ప్రారంభించాం. ప్రస్తుతం తమిళనాడు, కేరళ, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన 37 మంది డిజైనర్ వర్తకులతో ఒప్పందం ఉంది. ఇందులో ఆనోకి, ఆరాధ్య, దిశా, అవతరణ, ఎత్నిక్ మ్యాజిక్స్, మీరా, కళాధర్ వంటి డిజైనర్స్‌కు చెందిన 3,700 రకాల ఆభరణాలున్నాయి. నగలు, గాజులు, చెవిదిద్దులు, ముక్కుపుడకలు, పట్టీలు వంటి ఉన్నాయి. ధరలు రూ.250 నుంచి రూ.6 వేల వరకున్నాయి.

కనీస ఆర్డర్ విలువ రూ.1,500..

ప్రస్తుతం 3 వేల మంది రిజిస్టర్ కస్టమర్లున్నారు. ఇందులో మిస్ ఇండియా యూనివర్స్ 2017 శ్రేయా కృష్ణన్‌తో పాటూ పలువురు వ్యాపార ప్రముఖులున్నారు. ఫెస్టివ్యా వెబ్‌సైట్‌తో పాటూ ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌ల ద్వారా ఆర్డర్ బుక్ చేయవచ్చు. ఆర్డర్ రాగానే వర్తకుడికి ఉత్పత్తుల ప్యాకింగ్ కోసం బాక్స్‌లు, లేబుల్స్ ఇస్తాం. ఉత్పత్తి తయారీ పూర్తవ్వగానే వాటిని ప్యాకింగ్ చేయగానే స్థానిక లాజిస్టిక్ సంస్థ వాటిని సేకరించి కస్టమర్‌కు పంపిస్తుంది. ఫెడెక్స్, డీటీడీసీ, గతి వంటి ఆరేడు సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం. ప్రస్తుతం నెలకు 250కి పైగా ఆర్డర్లొస్తున్నాయి. కనీస ఆర్డర్ విలువ రూ.1,500.

వారం రోజుల్లో వైజాగ్, హైదరాబాద్ డిజైన్స్..

వారం రోజుల్లో విశాఖపట్నం, హైదరాబాద్‌కు హస్తకళ ఆభరణాలను జోడించనున్నాం. వైజాగ్ నుంచి టెర్రకోట, హైదరాబాద్ నుంచి పట్టుదారంతో చేసే గాజులు, నగలు తయారు చేసే 10 మంది వర్తకులను ఎంపిక చేశాం. తొలిదశలో నలుగురితో ప్రారంభిస్తాం. డిజైనర్స్ పేరు మీదే ఉత్పత్తులను విక్రయించడం మా ప్రత్యేకత.

రూ.2 కోట్ల నిధుల సమీకరణ..

వర్తకుడి నుంచి అమ్మకం విలువలో 30 శాతం కమీషన్‌గా తీసుకుంటాం. ఈ ఏడాది ముగిసే నాటికి 200 మంది వర్తకులు, కోటి రూపాయల ఆదాయాన్ని లక్ష్యించాం. ప్రస్తుతం 9 మంది ఉద్యోగులున్నారు. ఏప్రిల్ నాటికి రూ.2 కోట్ల నిధులను సమీకరించనున్నాం. అమెరికా నుంచి పలువురు ఇన్వెస్టర్లు రెడీగా ఉన్నారు. కానీ, దేశీయంగానే నిధులు సమీకరించాలని నిర్ణయించాం. ఒకరిద్దరు ఇన్వెస్టర్లతో చర్చిస్తున్నాం'' అని సురేశ్ వివరించారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే **startups@sakshi.com** కు మెయిల్ చేయండి...

బ్యాంకులకు సానుకూల రేటింగ్

- 18 పీఎస్‌బీల అంచనాలు 'స్థిర' స్థాయికి
- అదనపు మూలధనమివ్వడం వల్లే: క్రిసిల్
- లిస్టులో ఆంధ్రా బ్యాంక్, బీవోబీ తదితరాలు



ముంబై: మొండి బాకీల సమస్య నుంచి గట్టెక్కే దిశగా అదనపు మూలధనం లభించనున్న 18 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) రేటింగ్‌పై క్రిసిల్ సంస్థ సానుకూలంగా స్పందించింది. వాటి అంచనాలను నెగటివ్ నుంచి స్టేబుల్ (స్థిర) స్థాయికి పెంచింది. ఆయా బ్యాంకులు పటిష్టంగా మారడానికి అదనపు మూలధనం ఉపయోగపడగలదని క్రిసిల్ ఒక నివేదికలో తెలిపింది. రుణాలకు డిమాండ్ కూడా పుంజుకుంటే బ్యాంకుల మొత్తం పనితీరు కూడా మెరుగుపడగలదని పేర్కొంది. ఈ ఏడాది మార్చి నాటికి 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ. 88,139 కోట్ల మేర అదనపు మూలధనం సమకూర్చాలని కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పీఎస్‌బీల అంచనాలపై క్రిసిల్ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రా బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర 18 బ్యాంకుల అంచనాలను స్థిర స్థాయికి క్రిసిల్ పెంచింది. అయితే, ప్రభుత్వం నుంచి ఏకంగా రూ. 8,800 కోట్లు అందుకోనున్న దిగ్గజం ఎస్‌బీఐ గురించి మాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హం. ఆంధ్రా బ్యాంక్, బీవోబీ సహా తొమ్మిది పీఎస్‌బీల బాసెల్ త్రీ టైర్ 1 బాండ్ల రేటింగ్స్‌ను, అంచనాలను (నెగటివ్) యధాతథంగా కొనసాగిస్తున్నట్లు క్రిసిల్ తెలిపింది. రీక్యాపిటలైజేషన్ ప్రక్రియ.. ప్రభుత్వ మద్దతును సూచించడంతో పాటు పీఎస్‌బీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నది కూడా గుర్తు చేస్తుందని క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ కృష్ణన్ సీతారామన్ తెలిపారు.



జనసంద్రంగా 'జాన్ పహాడ్' దర్శించుకున్న ఉత్తమ్

సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంధానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పలువురు ప్రముఖులు దర్గాను దర్శిం చుకున్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోదాడ డీఎస్పీ రమణారెడ్డి, హుజూర్‌నగర్ సీఐ నర్సింహారెడ్డిలు బందోబస్తు నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. *–నేరేడుచర్ల(హుజూర్‌నగర్)*



సింహ వాహనంపై నారసింహుడు ఘనంగా ఎదుర్కోళ్లు

శ్రీ లక్ష్మీనారసింహ దేవస్థానంలోని పాతగుట్టలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామిని సింహవాహనంపై లక్ష్మీనారసింహుడి అలంకారం చేశారు. ప్రత్యేక సేవలో అధిష్ఠింపజేసి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారిని పెళ్లి కుమారు డు, పెళ్లి కూతురుగా అలంకారం చేసి అశ్వవాహనంపై ఎదుర్కోలు మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చా రు. స్వామి, అమ్మవారి సేవలను ఎదురెదురుగా ఉంచి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. *–యాదగిరికొండ*



ప్రధానిని కలిసిన వనజీవి గణతంత్ర వేడుకలకు హాజరు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన ఎట్ హోం, రిపబ్లిక్ వేడుకల్లో ఖమ్మం జిల్లా రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య పాల్గొన్నారు. రాష్ట్రపతి భవన్ నుంచి అందిన ఆహ్వానం మేరకు ఢిల్లీ వెళ్లిన రామయ్య ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీలను కలుసుకున్నారు. *–ఖమ్మం రూరల్*

భూమి కోసం తిరిగి అలసిపోయా..

మల్లోజుల మధురమ్మ: గణతంత్ర దినోత్సవ వేళ సన్మానం



పెద్దపల్లి: స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుండగా, తనకు 1988లో రామగుండం మండలంలో ఇచ్చిన భూమి దస్త్రాలు ఇప్పటికీ చేతికందలేదని మల్లోజుల మధురమ్మ వాపోయారు. స్వాతంత్ర్య సమరయోధుడైన మల్లోజుల వెంకటయ్య భార్య, మావోయిస్టు పార్టీ అగ్రనేతలు కిషన్‌జీ, వేణుగోపాల్‌ల తల్లి మధురమ్మను గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధురమ్మ మాట్లాడుతూ 'భూమి కోసం 25 ఏళ్లుగా తిరుగుతూ అలసిపోయా.. రామగుండం మండలం ముర్మూర్‌లో సర్వే నం. 126లో 8 ఎకరాల స్థలం కేటాయించి కాగితాలు అప్పగించారు. ఓ ఏడాది వ్యవసాయం చేసుకున్నాం. ఆ తర్వాత పట్టా సర్టిఫికెట్‌ల కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ఆశలు వదులుకున్నా. ఇంటికి వచ్చిన ఎస్పీలకు ఈ విషయాన్ని తెలిపితే వెంటనే ఆర్డీవోలతో మాట్లాడిన వారెందరో ఉన్నారు. అయినా సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. 50 ఏళ్లలో వందలసార్లు స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వాన పత్రాలు అందాయి, ఉద్యమంలో పని చేసిన కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇచ్చిన భూమి చేతికి దక్కకుండా పోయింది.' అన్నారు. కనీసం 69వ గణతంత్ర వేడుకల సందర్భంగానైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన భూమికి పట్టా సర్టిఫికెట్ల అధికారాలు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐదు సబ్ జైళ్ల మూసివేత

ఆర్మూర్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఐదు సబ్ జైళ్లను తాత్కాలికంగా మూసి వేస్తున్నారు. ఈ మేరకు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవో నంబర్ 6158ని విడుదల చేశారు. నిర్వహణ భారం కారణంగా నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్ సబ్ జైళ్లతో పాటు వరంగల్ జిల్లాలోని నర్సంపేట, పరకాల, ఖమ్మం జిల్లాలోని మధిర సబ్ జైళ్లను మూసి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమైక్య పాలకుల హయాంలోనే ఆర్మూర్ సబ్ జైలును మూసి వేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డప్పటికీ స్థానికులు, న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు ఆ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆర్మూర్ సబ్ జైలులో పది మంది రిమాండ్ ఖైదీలను ఉంచడానికి సరిపడా సౌకర్యాలు ఉండగా, 20 నుంచి 25 మంది రిమాండ్ ఖైదీలను ఇక్కడ ఉంచడానికి అవకాశం ఉంది. కానీ, జైళ్ల శాఖకు నిర్వహణ భారం అధికం అవుతుండటంతో తాత్కాలికంగా సబ్ జైలును మూసి వేస్తున్నట్లు ప్రకటించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువుకు చెందిన రైతు నేరడి అనిల్‌కుమార్(28) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన రెండున్నర ఎకరాలతో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి వేశాడు. గతేడాది మిర్చికి గిట్టుబాటు రాలేదు. పత్తికి తెగుళ్లు సోకాయి. పెట్టుబడుల కోసం రూ. 5 లక్షల అప్పు చేశాడు. అప్పు తీరే మార్గం కనిపించక మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు.

గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి

జాతీయజెండా ఏర్పాట్లలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కోహెడ(హుస్నాబాద్): గణతంత్ర వేడుకల కోసం జాతీయ జెండా ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతిచెందాడు. సిద్దిపేట మండలంలోని కోహెడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. జిల్లాలోని బస్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరెపల్లికి చెందిన గొట్టె చంద్రయ్య(42) కోహెడ వ్యవసాయ మార్కెట్‌లో అంటెండర్‌గా పనిచేస్తున్నాడు. మార్కెట్ కార్యాలయం ఎదుట జెండా కోసం చంద్రయ్య ఇనుప పైపును సిద్ధం చేస్తుండగా ప్రమాదవశాత్తు పైపుకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో పైపును పట్టుకున్న చంద్రయ్యకు విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

వీరేశమే సూత్రధారి

ఇదిగో.. నిందితులు ఎమ్మెల్యేతో దిగిన ఫొటోలు

- ఇంతకంటే సాక్ష్యం ఇంకేం కావాలి?: ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- ఇప్పుడైనా ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకుంటుందా?
- కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్
- నయీమ్‌లా వీరేశంను ఎన్‌కౌంటర్ చేయాలి: వీహెచ్
- శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు ప్రధాన సూత్రధారి టీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల వీరేశం అని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. పార్టీ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ, వీహెచ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులతో కలసి శుక్రవారం ఆయన శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్ హత్య కేసులో ప్రధాన నిందితులైన రాంబాబు, మల్లేశ్‌యాదవ్‌లు ఎమ్మెల్యేతో దిగిన ఫొటోలను మీడియాకు చూపించారు. ప్రభుత్వానికి ఇంతకన్నా ఆధారాలు ఏం కావాలన్నారు. ఇప్పుడైనా ప్రభుత్వం ఎమ్మెల్యే వీరేశంపై చర్యలు తీసుకుంటుందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్రిమినల్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని, అతని సోదరుడు ఏకే 47 గన్స్ రవాణా చేస్తూ రెండుసార్లు జైలుకు వెళ్లాడని ఉత్తమ్ వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎవరి అండ చూసుకొని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేను ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహిస్తున్నారని ఉత్తమ్ ఆరోపించారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే అయ్యాడని, మారుతాడనుకుంటే నేరాలు ఇంకా ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌ను టీఆర్ఎస్‌లో చేరాలని వీరేశం పలుమార్లు ఒత్తిడి తెచ్చాడని, ఫలితం లేకపోవడంతో అంతమొందించారని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఆమె భర్త శ్రీనివాస్‌ను కోమటిరెడ్డి.. ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి వీరికి రక్షణ కల్పించాలని.. గన్‌మన్ ఇవ్వాలని అడిగినా పట్టించుకోలేదని విమర్శించారు. ఈ హత్యకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, సిగ్గుతో తలదించుకోవాలన్నారు. శ్రీనివాస్ హత్య విషయంలో పోలీసుల వ్యవహారశైలి చూస్తుంటే విచారణ పారదర్శకంగా జరిగేలా కనిపించడం లేదన్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని, ఈ కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

హత్యలే మార్గం అంటే మీ పార్టీలో ఎవ్వరూ ఉండరు : కోమటిరెడ్డి

హత్యలే మార్గమంటే టీఆర్ఎస్‌లో ఎవరూ ఉండరని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ గాంధీ చూపిన శాంతియుత మార్గంలో పోరాటం చేస్తుందన్నారు. ఈ హత్య.. వీరేశం వెంట ఉన్న రౌడీలు చేశారని, దీనికి డీఎస్పీ సుధాకర్ పథకం వేశారని ఆరోపించారు. హత్య కేసులో ఉన్న సూత్రధారులు, పాత్రధారులపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. అంతకుముందు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు.



నిందితులు రాంబాబు, మల్లేశ్‌యాదవ్‌లు ఎమ్మెల్యే వీరేశంతో దిగిన ఫొటోను చూపిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో షబ్బీర్, జానారెడ్డి, వీహెచ్, కోమటిరెడ్డి తదితరులు

టీఆర్ఎస్‌వి హత్యారాజకీయాలు: జానా

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతాన్ని చూసి టీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని, అందుకే ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని సీఎల్పీ నేత జానారెడ్డి విమర్శించారు. శ్రీనివాస్ కాల్‌డేటా తీస్తే ఎమ్మెల్యే వీరేశం కాల్స్ ఉన్నాయో లేదో తెలుతుందని చెప్పారు. ఈ కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నయీమ్ లాగానే వీరేశం హత్యలకు పాల్పడుతున్నాడని, అతన్ని ఎన్‌కౌంటర్ చేయాలని వీహెచ్ డిమాండ్ చేశారు.

తెలంగాణలో పులులు 20





ఆదిలాబాద్‌లో 6, అమ్రాబాద్‌లో 14 పైగా...

- కాలి అడుగులు, విసర్జితాల ఆధారంగా ప్రాథమిక అంచనా
- ముగిసిన మాంసాహార వన్యప్రాణుల గణన
- తదుపరి దశల లెక్కింపు తర్వాత కచ్చితమైన సంఖ్య

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణలో పెద్దపులులు 20కి పైగానే ఉన్నాయి. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలో ఆరు, అమ్రాబాద్ అడవుల్లో 14 వరకు ఉన్నట్లు భావిస్తున్నారు. అయితే, లభించిన పులి అడుగులను బట్టి ఈ సంఖ్య కొంత ఎక్కువగానే ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 2014లో జరిగిన వన్యప్రాణుల గణనతో పోలిస్తే పులుల సంఖ్యలో పెద్దగా తేడా లేకపోయినప్పటికీ.. ఇతర రాష్ట్రాల్లోని అడవులకు రాకపోకలు పెరిగినట్లు తేలింది. నాలుగేళ్ల క్రితం ఉన్న కొన్ని పులుల స్థానంలో కొత్తవి వచ్చి చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి నాలుగేళ్లకోసారి జరిగే వన్యప్రాణుల గణన ఈనెల 22 నుంచి దేశవ్యాప్తంగా మొదలైంది. ఇందులో భాగంగా 22 నుంచి 24 వరకు మాంసాహార జంతువుల గణన జరిగింది. 27 నుంచి 29 వరకు శాకాహార జంతువుల గణన జరగనుంది. తొలివిడత మాంసాహార జంతుగణనలో పులులను లెక్కించేందుకు 'ఎం–స్ట్రైప్స్' సాఫ్ట్ వేర్‌ను వినియోగించారు. ఈ సందర్భంగా పులి కాలి అడుగులు (పగ్‌మార్క్స్), విసర్జితాలను సేకరించారు. సేకరించిన అడుగుల ఆధారంగా ఆదిలాబాద్, అమ్రాబాద్ (నల్లమల) అడవుల్లో 20కి పైగానే పులులు ఉన్నట్లు అంచనాకు వచ్చారు.

విసర్జితాలు, పగ్‌మార్క్స్ ఆధారంగానే...

వన్యప్రాణుల గణనలో పులుల విసర్జితాలు, కాలి అడుగుల గుర్తులను సేకరించారు. వైల్డ్ లైఫ్ ఆఫ్ ఇండియా ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా పులుల జాడలకు సంబంధించి, ఆన్‌లైన్‌లో ఫారాలను భర్తీ చేసి పంపుతారు. వాటికి పులి పగ్‌మార్క్స్ ఫొటోలను, విసర్జితాల ఫొటోలను జత చేస్తారు. విసర్జితాలను హైదరాబాద్‌లోని సీసీఎంబీకి పంపించనున్నారు. సీసీఎంబీ నివేదికలో పులి విసర్జితాలా లేదా అనేది తేలనుంది. ఈ ప్రక్రియ తరువాత రెండో దశలో వైల్డ్‌లైఫ్ ఆఫ్ ఇండియా ద్వారా అడవుల్లో కెమెరాలను ఏర్పాటు చేసి వాటి ఫొటోలను తీయనున్నారు. పులులు సంచరిస్తున్నట్లు తేలితే ఆయా ప్రాంతాలు వాటి ఆవాసానికి అనుకూలంగా ఉన్నాయో లేదో తేల్చి, తదనుగుణంగా పులులకు నీరు, ఆహారం కల్పించే ఏర్పాట్లు చేస్తారు.

కాగజ్‌నగర్‌లో రోడ్డు దాటిన పులి

ఈ నెల 23న కాగజ్‌నగర్ డివిజన్‌లో బస్సులోని ప్రయాణికులకు పులి రోడ్డు దాటుతూ కనిపించింది. పెంచికల్‌పేట ప్రాంతంలోని అడవుల్లో ఓ ఆర్టీసీ బస్సు వెళ్తుండగా, పులి రోడ్డు దాటుతున్న దృశ్యం కనిపించిందని అటవీశాఖ సిబ్బంది చెపుతున్నారు. ఈ విషయాన్ని ఆసిఫాబాద్ డీఎఫ్‌వో 'సాక్షి'కి ధ్రువీకరించారు. కాగజ్‌నగర్ రేంజ్‌లోనే ఇక్కడ వేర్వేరు ప్రాంతాల్లో 10 పులి అడుగులు లభించాయని ఆయన చెప్పారు. వాటి ఆధారంగా ఇక్కడ నాలుగు పులులు తిరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. నీల్వాయి, కృష్ణపల్లి రేంజ్‌లలో మరో పులి గానీ, రెండు పులులు గానీ ఉండొచ్చని అంచనా. అలాగే ఖానాపూర్ బీట్‌లో మరో పులి అడుగులు కనిపించాయి. ఈ లెక్కన పాత ఆదిలాబాద్ జిల్లా పరిధిలోనే ఆరు నుంచి ఏడు వరకు పులులు సంచరిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌తో పాటు తెలంగాణ పరిధిలోని నల్లమల అడవుల్లో 14 పులులకు పైగా సంచరిస్తున్నట్లు పగ్‌మార్క్స్, విసర్జితాల ఆధారంగా అటవీశాఖ అధికారులు లెక్కలేస్తున్నారు. ఇక్కడి పులులు కొన్ని ఆంధ్రప్రదేశ్ పరిధిలోని మార్కాపురం, ఆత్మకూరు రేంజ్‌ల వెళ్లి, రావడం జరుగుతోందని వైల్డ్‌లైఫ్ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి వివరించారు.

ఏపీలో రాక్షస పాలన

వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి కొండా రాఘవరెడ్డి ధ్వజం

యాదాద్రికి చేరుకున్న పాదయాత్ర

యాదగిరిగుట్ట: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాక్షస పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొండా రాఘవరెడ్డి విమర్శించారు. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర విజయవంతం కావాలని కోరుతూ ఈనెల 25న హైదరాబాద్‌లో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఆరొందల అబద్ధాలతో అధికారంలోకి వచ్చారని, నాలుగేళ్లయినా ఇంకా అబద్ధాలతోనే ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. టీడీపీ అప్రజాస్వామిక పాలనకు వ్యతిరేకంగా వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారని గుర్తు చేశారు. కాగా, యాదాద్రిలో జగన్ పేరు మీద పూజలు చేయించామని, 2019లో ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నట్లు రాఘవరెడ్డి తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరాంరెడ్డి, విజయప్రసాద్, చెరుకు శ్రీనివాస్, సీఈసీ సభ్యులు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుమ్మ అప్పిరెడ్డి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్, ఆయా జిల్లాల అధ్యక్షులు నాడం శాంత, వడ్లోజు వెంకటేశ్,, భగవంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అప్పం కిషన్, బాన్సువాడ కో ఆర్డినేటర్ రామ్మోహన్, యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి సతీష్‌రాజ్ తదితరులు ఉన్నారు.



శుక్రవారం యాదాద్రికి చేరుకున్న పాదయాత్రలో కొండా రాఘవరెడ్డి తదితరులు

జేఏసీ రైతుబాట!

- పన్నెండు అంశాలు, ముప్పై ప్రశ్నలు
- వ్యవసాయ పరిస్థితులపై అధ్యయనం
- రాష్ట్ర వ్యాప్తంగా రైతుల అభిప్రాయ సేకరణ

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన టీ–జేఏసీ అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించింది. రాష్ట్రం ఏర్పాటుతోనే తమ పని పూర్తి కాలేదని, ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరుతున్నాయన్న దానిపై నిరంతరం పని చేయాలన్న భావనతో జేఏసీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. నిరంతర పోరాటాలతో ప్రజల్లోకి వెళుతున్న జేఏసీ తాజాగా వ్యవసాయ పరిస్థితులపై అధ్యయనానికి రైతు బాట పట్టింది. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో నియోజకవర్గానికి మూడు గ్రామాల చొప్పున ఎంచుకుని సర్వే నిర్వహిస్తోంది.

పన్నెండు అంశాలు.. ముప్పై ప్రశ్నలు..

జేఏసీ కమిటీ పేరుతో వ్యవసాయ పరిస్థితుల అధ్యాయనానికి ప్రశ్నావళిని ముద్రించారు. ఇందులో 12 అంశాలు, మొత్తం 30 ప్రశ్నలు ఉంటాయి. రైతు పేరు, కులం, వయస్సు, గ్రామం, మండలం వంటి వివరాలతో పాటు.. పట్టాభూమా.. కౌలుకు తీసుకున్నారా వంటి వివరాలను సేకరిస్తున్నారు. గతేడాది వేసిన పంట.. ఈ ఏడాది వేసిన పంట.. పెట్టుబడుల వివరాలు.. అప్పుల వివరాలు తెలుసుకుంటున్నారు. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు, నష్టపరిహారం.. నీటి వసతి, పంట దిగుబడి వంటి కారణాలను అడిగి ప్రశ్నావళిని పూరిస్తున్నారు. ఇలా సమస్త అంశాలను రైతుల నుంచి సేకరించే దిశగా ప్రశ్నావళిని రూపొందించారు. మొత్తం రెండు పేజీల్లో ముద్రించిన ప్రశ్నావళితో జిల్లాల జేఏసీ నేతలు రైతుల చెంతకు వెళ్తున్నారు. తాము ఎంచుకున్న గ్రామంలో రోజంతా రైతులను కలసి ప్రశ్నావళిలో పేర్కొన్న ఆయా అంశాలపై రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

ఊరు ఊరంతా భూ వివాదం!

మక్తల్ మండలం తిరుమలాపూర్‌లో చిత్రమైన పరిస్థితి

- భూముల వివరాలు ఒకరివి... పొజిషన్‌లో మరొకరు
- వివాదాస్పదంగా ఉండటంతో తలలు పట్టుకుంటున్న అధికారులు
- రీ సర్వే చేసి కొత్త సర్వే నంబర్లు ఇవ్వాలని ఆదేశించిన కలెక్టర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూప్రక్షాళనలో భాగంగా భూ వివాదాల్లో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం చందాపూర్ గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉండే తిరుమలాపురంలో వింత పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వ్యవసాయ భూములకు సంబంధించి అంతా అయోమయం నెలకొంది. రెవెన్యూ రికార్డుల్లో పేరు ఒకరిది ఉంటే... పొజిషన్‌లో సాగు చేస్తున్నవారు మరొకరు ఉన్నారు. ఇలా ఏ ఒక్కరో ఇద్దరో కాదు... ఊరు, ఊరంతా కూడా ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం. దీంతో ఏం చేయోలో అర్థంకాక రెవెన్యూ అధికారులు పెండింగ్‌లో పెట్టేశారు. విషయాన్ని కాస్త జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఊరు, ఊరంతా ఇలా ఉండడమేంటని ఆయన ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇప్పటికైనా ఈ వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. కొత్తగా సర్వే చేసి పొజిషన్‌లో ఉన్న వారిని, రికార్డుల్లో ఉన్నవారిని సరిచేయాలని ఆదేశించారు.

రైల్వేలైన్‌తో వెలుగులోకి..

మహబూబ్‌నగర్ జిల్లా మీదుగా రాయచూరుకు కొత్తగా రైల్వేలైన్ మంజూరైంది. అందుకు అనుగుణంగా రైల్వేశాఖ భూసేకరణ చేపట్టింది. ఈ రైల్వే లైన్ మక్తల్ మండలం చందాపూర్ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న తిరుమలాపురం గుండా వెళ్లనుంది. దీంతో అధికారులు గ్రామంలో సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం అందించాలని నిర్ణయించారు. అయితే గ్రామ నక్షా ప్రకారం సర్వే చేయగా.. రికార్డుల్లో పేర్లు ఒకరివి ఉండగా.. సాగు చేసే పొజిషన్‌లో మరొకరు ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో పరిహారం ఎవరికి చెల్లించాలనే అంశంలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. తాజాగా ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన భూరికార్డుల ప్యూరిఫికేషన్‌లో అసలు విషయం వెలుగు చూసింది. ఊరు, ఊరంతా కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు అధికారుల విచారణలో వెలుగు చూసింది.

చిక్కుముడి వీడేనా..

తిరుమలాపురం గ్రామంలో మొత్తం 152 మంది రైతులున్నారు. వీరికి 1 నుంచి 66 వరకు సర్వే నంబర్లలో మొత్తం 534 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రికార్డులన్నింటినీ సరిచేయాలని కలెక్టర్ రొనాల్డ్‌రోస్ రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వ సర్వేయర్లను తీసుకెళ్లి గ్రామ నక్షా ప్రకారం సర్వే చేపట్టాలని ఆదేశించారు. పొజిషన్‌లో ఎవరుంటే వారికి సదరు సర్వే నంబర్ కేటాయించాలని సూచించారు. ప్రభుత్వం మార్చిలో ఇవ్వనున్న కొత్త పాస్ పుస్తకాల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఈ చర్యల కారణంగా ఇన్నాళ్లు నెలకొన్న చిక్కుముడికి పరిష్కారం లభిస్తుందేమోనని గ్రామస్తులు ఆశిస్తున్నారు.



సర్వే చేసి సరిచేస్తాం

తిరుమలాపురం గ్రామంలోని భూముల వివరాల విషయంలో తప్పొప్పులు ఉన్న విషయం వాస్తవమే. రికార్డుల్లో ఉన్న భూమి, సాగయ్యే భూమిలో ఎలాంటి తేడా లేదు. ఉన్నదల్లా రికార్డుల్లో ఉన్న పేర్లకు, పొజిషన్‌లో ఉన్న వారు వేరు వేరుగా ఉన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించమని ఆదేశించారు. ప్రక్రియను మొత్తం పూర్తి చేసి కొత్త నంబర్లు కేటాయిస్తాం. కొత్త పాస్ పుస్తకాలలో ఎలాంటి వివాదాలు లేకుండా చూస్తాం.

– ఓంప్రకాశ్, తహసీల్దార్

సాక్షి స్పోర్ట్స్

శనివారం 27-1-2018

సింధుపై సైనాదే పైచేయి




జకార్తా: ఇద్దరు భారత మేటి క్రీడాకారిణుల మధ్య జరిగిన సమరంలో అనుభవజ్ఞురాలినే విజయం వరించింది. ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భాగంగా ప్రపంచ మూడో ర్యాంకర్ పీవీ సింధుతో జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సైనా నెహ్వాల్ గెలిచి సెమీస్‌కు చేరింది. 37 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా 21–13, 21–19తో సింధును ఓడించింది. ఈ విజయంతో ముఖాముఖి రికార్డులో సైనా 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. శనివారం జరిగే సెమీఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్)తో సైనా తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సైనా 8–5తో ఆధిక్యంలో ఉంది.

సాత్విక్ జంట సంచలనం

పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 23–21, 15–21, 21–19తో నాలుగో సీడ్, ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీ మాడ్స్ పీటర్సన్–మాడ్స్ కోల్డింగ్ (డెన్మార్క్)పై సంచలన విజయం సాధించి సెమీస్‌లోకి అడుగు పెట్టింది. శనివారం జరిగే సెమీఫైనల్లో టాప్ సీడ్ గిడియోన్–సుకముల్జో (ఇండోనేసియా) జంటతో సాత్విక్–చిరాగ్ జంట ఆడుతుంది.

అగ్రశ్రేణి ఆటగాళ్లందరూ ఇంటిముఖం పట్టిన వేళ... డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ మాత్రం తన జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. రికార్డుస్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన ఈ స్విట్జర్లాండ్ దిగ్గజం ఓవరాల్‌గా 30వసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు.



ఫెడరర్ ఫటాఫట్

- ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో స్విస్ దిగ్గజం
- సెమీస్‌లో గాయంతో వైదొలిగిన హైన్ చుంగ్
- రేపు మారిన్ సిలిచ్‌తో టైటిల్ పోరు

మెల్‌బోర్న్: కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సాధించేందుకు స్విట్జర్లాండ్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెడరర్ మరో విజయం దూరంలో ఉన్నాడు. కొరియా యువతార హైన్ చుంగ్‌తో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో సెమీఫైనల్లో రెండో సీడ్ ఫెడరర్ 6–1, 5–2తో ఆధిక్యంలో ఉన్నదశలో చుంగ్ గాయం కారణంగా తప్పుకున్నాడు. దాంతో డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ రికార్డుస్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. 62 నిమిషాలపాటు సాగిన ఆటలో ఫెడరర్ తొమ్మిది ఏస్‌లు సంధించి, చుంగ్ సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. ఫైనల్ చేరే క్రమంలో ఫెడరర్ ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆరుసార్లు చాంపియన్, మాజీ నంబర్‌వన్ జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి పెను సంచలనం సృష్టించిన చుంగ్‌పై ఫెడరర్ పూర్తి ఆధిపత్యం చలాయించాడు. ఈ కొరియా కుర్రాడికి ఏదశలోనూ పట్టు సంపాదించే అవకాశం ఇవ్వలేదు. ఆదివారం జరిగే ఫైనల్లో ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో ఫెడరర్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ఫెడరర్ 8–1తో ఆధిక్యంలో ఉన్నాడు.

మిక్స్‌డ్ ఫైనల్లో బోపన్న జంట



భారత స్టార్ రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తన భాగస్వామి తిమియా బాబోస్ (హంగేరి)తో కలిసి ఫైనల్లోకి ప్రవేశించాడు. సెమీఫైనల్లో బోపన్న–బాబోస్ జంట 7–5, 5–7, 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో డెమోలైనర్ (బ్రెజిల్)–మరియా (స్పెయిన్) జోడీపై గెలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో గాబ్రియేలా దబ్రోవ్‌స్కీ (కెనడా)–మ్యాట్ పావిక్ (క్రొయేషియా) జంటతో బోపన్న–బాబోస్ ద్వయం ఆడుతుంది.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్

హాలెప్ X వొజ్నియాకి

మధ్యాహ్నం గం. 2.00 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మొగ్గు మనవైపే..!



- దక్షిణాఫ్రికా లక్ష్యం 241
- ప్రస్తుతం 17/1
- రాణించిన రహానే, కోహ్లి, భువీ
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 247

జొహన్నెస్‌బర్గ్: మ్యాచ్‌లో ఇరు జట్లూ సమఉజ్జీగా నిలిచిన వేళ... అత్యంత కఠిన పరిస్థితుల్లో, అదీ రెండో ఇన్నింగ్స్‌లో, ఆపై విదేశీ గడ్డపై భారత్ బ్యాట్స్‌మెన్ అసాధారణంగా ఆడారు. మిడిలార్డర్‌లో అజింక్య రహానే (68 బంతుల్లో 48; 6 ఫోర్లు), కెప్టెన్ కోహ్లి (79 బంతుల్లో 41; 6 ఫోర్లు)లకు తోడు లోయరార్డర్‌లో భువనేశ్వర్ (76 బంతుల్లో 33; 2 ఫోర్లు), షమీ (28 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు) బ్యాట్ ఝుళిపించడంతో మూడో రోజు టీమిండియా 247 పరుగులకు ఆలౌటైంది. ప్రొటీస్‌కు 241 పరుగుల లక్ష్యం విధించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఫిలాండర్ (3/61), మోర్కెల్ (3/47), రబడ (3/69) రాణించారు. బంతి అసహజంగా బౌన్స్ అవుతున్న వాండరర్స్ పిచ్‌పై కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలో దిగిన సఫారీ జట్టు... పిచ్ పరిస్థితి రీత్యా ఆట నిలిపివేసే సమయానికి వికెట్ నష్టపోయి 17 పరుగులు చేసింది. ఓపెనర్ డీన్ ఎల్గర్ (11 బ్యాటింగ్), ఆమ్లా (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. జట్టు చేతిలో 9 వికెట్లుండగా... మరో 224 పరుగులు చేయాల్సి ఉంది. రెండు రోజుల ఆట మిగిలి ఉన్న నేపథ్యంలో... ప్రత్యర్థి అసాధారణ పోరాటం చేస్తే తప్ప ప్రస్తుతానికి జొహన్నెస్‌బర్గ్ టెస్టులో మన జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

> అరుదైన సందర్భం... అద్భుత అవకాశం... కావాల్సినంత సమయం... ఆత్మరక్షణలో ప్రత్యర్థి... ఊరిస్తున్న విజయం! మూడో టెస్టు ఇప్పుడు పూర్తిగా భారత్ చేతుల్లో! తొలి ఇన్నింగ్స్‌లోలాగా బౌలర్లు చెలరేగితే చాలు... గెలుపు మన ఖాతాలో పడిపోతుంది! సిరీస్‌కు మంచి ముగింపునిచ్చినట్లు అవుతుంది.

విజయ్ ఓర్పు... కోహ్లి నేర్పు...

ఓవర్‌నైట్ స్కోరు 49/1తో శుక్రవారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియాను తొలి సెషన్‌లో కెప్టెన్ కోహ్లి, ఓపెనర్ మురళీ విజయ్ (127 బంతుల్లో 25) నిలబెట్టారు. ముఖ్యంగా విజయ్ బంతి పాతబడేలా అత్యంత ఓర్పు చూపాడు. అవతలివైపు కోహ్లి చక్కటి డ్రైవ్‌లతో ఆకట్టుకున్నాడు. కేఎల్ రాహుల్ (16), డిపెండబుల్ పుజారా (1) త్వరగానే వెనుదిరగడంతో 57/3తో కష్టాల్లో పడిన జట్టును వీరిద్దరూ 43 పరుగులు భాగస్వామ్యంతో ఆదుకున్నారు. అయితే... లంచ్‌కు ముందు ఓవర్లో రబడ యార్కర్‌కు విజయ్ బౌల్డయ్యాడు.

రహానే, భువీ మెరుపులు...

లంచ్ తర్వాత కెప్టెన్‌తో కలిసిన రహానే అచ్చమైన టెస్టు షాట్లు ఆడుతూ తన విలువేంటో చూపాడు. అవతలి వైపు కోహ్లి పట్టుదలగా కనిపించాడు. అయిదో వికెట్‌కు 34 పరుగులు జతయ్యాక... అతడిని రబడ అద్భుత బంతితో అవుట్ చేశాడు. వెంటనే హార్దిక్ పాండ్యా (4) మరోసారి పేలవ షాట్‌కు వెనుదిరిగాడు. అప్పటికి స్కోరు 148/6. ఆధిక్యం 141 మాత్రమే. ఈ సమయంలో భువీ తోడుగా రహానే ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరు ప్రొటీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. డీప్ పాయింట్‌లో ఎల్గర్ క్యాచ్ వదిలేయడంతో రహానే బతికిపోయాడు. ఈ ఇద్దరూ బంతిని ఖాళీల్లోకి కొడుతూ ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోయారు. భువీ అయితే తడబాటు అనేదే లేకుండా టాపార్డర్ బ్యాట్స్‌మన్‌ను తలపించాడు. తొలి ఇన్నింగ్స్‌లోలానే కీలకమైన పరుగులు జోడించాడు. టీ వరకు వీరు మరో వికెట్ పడకుండా చూసుకున్నారు.

షమీ దూకుడు...

విరామం అనంతరం జట్టు స్కోరు 200 దాటించాక మోర్కెల్ ఓవర్లో లెగ్ సైడ్ ఆడబోయిన రహానే... కీపర్ డికాక్ పట్టిన ఫుల్ లెంగ్త్ డైవ్ క్యాచ్‌కు పెవిలియన్ చేరాడు. దీంతో 53 పరుగుల ఏడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇన్నింగ్స్‌కు తెరపడేందుకు మరెంతో సేపు పట్టదనుకుంటుండగా షమీ మెరుపులు మెరిపించాడు. దూకుడుగా కనిపించిన అతడు రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ కొట్టాడు. ఈ టెస్టులో తొలి సిక్స్ షమీదే కావడం విశేషం. అయితే స్క్వేర్‌లెగ్ మీద డివిలియర్స్‌ను ఉంచి ఇన్‌గిడి షమీని బుట్టలో పడేశాడు. భువీ... మోర్కెల్ షార్ట్ పిచ్ బంతికి కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా, బుమ్రా (0)ను ఫిలాండర్ అవుట్ చేయడంతో ఇన్నింగ్స్ ముగిసింది. ఇషాంత్ (7) నాటౌట్‌గా మిగిలాడు. ఈసారి ప్రొటీస్ బౌలర్లు 29 అదనపు పరుగులు ఇచ్చారు. భారత ఇన్నింగ్స్‌లో ఇది నాలుగో అత్యధిక స్కోరు కావడం విశేషం.

వికెట్ పడింది... ఆట ముందే ఆగింది...

పిచ్ పరిస్థితి దృష్ట్యా నాలుగో ఇన్నింగ్స్‌లో కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టుకు ఆదిలోనే దెబ్బ తగిలింది. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీకి పంపిన ఓపెనర్ మార్క్‌రమ్ (4) మరెంతో సేపు నిలవలేదు. రెండో ఓవర్లో షమీ బౌలింగ్‌లో పార్థివ్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం 6 ఓవర్లపైగా ఆట సాగింది. ఈ నేపథ్యంలో అర గంట పైగా ఆట ఉండి... అంతా మరో వికెట్ గురించి ఆలోచిస్తుండగా 8వ ఓవర్లో ఛేంజ్ బౌలర్‌గా బుమ్రా వచ్చాడు. అతడు వేసిన తొలి మూడు బంతులు అనూహ్యంగా పైకి లేచాయి. మూడో బంతి ఏకంగా ఎల్గర్ హెల్మెట్‌ను బలంగా తాకింది. దీంతో అతడు ఐస్ పెట్టుకోవాల్సి వచ్చింది. పరిస్థితిని గమనించి మ్యాచ్ రిఫరీ పైక్రాఫ్ట్ మైదానంలోకి వచ్చి అంపైర్లతో చర్చించాడు. అనంతరం ఆటను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

వామ్మో పిచ్

పచ్చికతో కళకళలాడే వాండరర్స్ పిచ్ అంటే పేసర్లు పండుగ చేసుకుంటారు. దీనికి తగ్గట్లే తొలి రెండు రోజులు ఒకటి రెండు బంతులు భారీగా బౌన్స్ అయినా సహజమని భావించారు. కానీ... శుక్రవారం పిచ్ మరీ ప్రమాదకరంగా కనిపించింది. గుడ్ లెంగ్త్, షార్ట్ లెంగ్త్ ప్రదేశాల్లో నెర్రెలు బారి అసహజ బౌన్స్‌తో తొలి సెషన్ నుంచే బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపింది. రబడ బౌలింగ్‌లో ఇన్నింగ్స్ 31వ ఓవర్లో కోహ్లి కుడి చేతిని, 35వ ఓవర్లో విజయ్ ఎడమ చేతిని బంతులు గట్టిగా తాకాయి. దీనిపై కోహ్లి, అంపైర్లు ఒకసారి చర్చించారు కూడా. మళ్లీ ఇలాగే జరగడంతో ఇరు జట్ల కెప్టెన్లు, అంపైర్లు సుదీర్ఘంగా సంభాషించుకున్నారు. తర్వాత కూడా రహానే మోచేయి, గ్లోవ్స్‌కు తగిలింది. చివరకు ఎల్గర్ హెల్మెట్ గ్రిల్స్‌ను బంతి తాకిన పరిస్థితి చూసి తీవ్రత తెలిసింది. విండీస్ మాజీ ఫాస్ట్ బౌలర్ మైకేల్ హోల్డింగ్ అయితే... బ్యాట్స్‌మెన్ తీవ్రంగా గాయపడే ఇలాంటి పిచ్‌కు 2 మార్కులు కూడా ఇవ్వనని ప్రకటించాడు. మరోవైపు రెండు జట్ల ఆటగాళ్లకు తక్షణ వైద్యం అందించేందుకు తరచూ ఫిజియోలు రావడంతో... వాండరర్స్‌లో వారికి పని దొరికిందనే వెటకారం వ్యాఖ్యలు వచ్చాయి. శుక్రవారం ఆటను తొందరగానే ముగించడంతో మ్యాచ్ కొనసాగుతుందా లేదా అనే సస్పెన్స్ కొంచెం సేపు కొనసాగింది. అయితే రిఫరీ, అంపైర్లు, రెండు జట్ల కెప్టెన్‌ల మధ్య చర్చల అనంతరం శనివారం యథావిధిగా ఆటను కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికార ప్రకటన విడుదలైంది.

వికెట్ స్పోర్టివ్‌గా ఉంది...



ఇది రెండు జట్లకూ అవకాశాలున్న చాలెంజింగ్ పిచ్. బౌన్స్ ప్రమాదకరంగా ఏమీ లేదు. ఈ తరహాలో రూపొందించాలని మేమైతే కోరలేదు. ఆట సాగాలనే అనుకున్నాం. ఎల్గర్‌కు తగిలిన బంతి బ్యాక్ ఆఫ్ లెంగ్త్‌లో పడింది. అందుకని అదనపు బౌన్స్ కంటే కొంచెం ఎక్కువగా స్పందించింది. మా టెయిలెండర్లు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ప్రత్యర్థి బౌలర్లు బౌన్సర్లు వేశారు కదా? కొత్త బంతితో ఆడటం సవాలే కానీ ప్రమాదకరం కాదు.

–భారత వైస్ కెప్టెన్ రహానే

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 194; **భారత్ రెండో ఇన్నింగ్స్:** విజయ్ (బి) రబడ 25; పార్థివ్ పటేల్ (సి) మార్క్‌రమ్ (బి) ఫిలాండర్ 16; రాహుల్ (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 16; పుజారా (సి) డు ప్లెసిస్ (బి) మోర్కెల్ 1; కోహ్లి (బి) రబడ 41; రహానే (సి) డికాక్ (బి) మోర్కెల్ 48; పాండ్యా (సి అండ్ బి) రబడ 4; భువనేశ్వర్ (సి)డికాక్ (బి) మోర్కెల్ 33; షమీ (సి) డివిలియర్స్ (బి) ఇన్‌గిడి 27; ఇషాంత్ (నాటౌట్) 7; బుమ్రా (సి) రబడ (బి) ఫిలాండర్ 0; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (80.1 ఓవర్లలో ఆలౌట్)** 247.

వికెట్ల పతనం: 1–17, 2–51, 3–57, 4–100, 5–134, 6–148, 7–203, 8–238, 9–240, 10–247.

బౌలింగ్: ఫిలాండర్ 21.1–5–61–3, రబడ 23–5–69–3, మోర్కెల్ 21–6–47–3, ఇన్‌గిడి 12–2–38–1, ఫెలుక్‌వాయో 3–0–15–0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) పార్థివ్ పటేల్ (బి) షమీ 4; ఎల్గర్ (బ్యాటింగ్) 11; ఆమ్లా (బ్యాటింగ్) 2; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (8.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) 17.**

వికెట్ల పతనం: 1–5. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–8–0, షమీ 4–1–7–1, బుమ్రా 0.3–0–2–0.

వేలానికి వేళాయె...

నేడు, రేపు ఐపీఎల్-11 వేలం



- బరిలో 578 మంది ఆటగాళ్లు
- 182 మందికే అవకాశం
- భారత ఆటగాళ్లు 361
- ఉ. గం.9.00 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: పది సీజన్‌లుగా అలరించిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పదకొండో ఏడాదిలోకి ప్రవేశించింది. ఐపీఎల్–11 సీజన్ కోసం ఆటగాళ్లను ఎంచుకునేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమయ్యాయి. నేడు, రేపు జరిగే వేలం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని, ఉత్కంఠను రేకెత్తించనుంది. తమ అభిమాన ఆటగాడు ఏ జట్టు సొంతం అవుతాడో, తమ అభిమాన జట్టు కొత్త స్వరూపం ఎలా ఉండబోతోందో అన్న ఆలోచన రాక మానదు. మరోవైపు ఫ్రాంచైజీలు కూడా పూర్తి స్థాయిలో జట్టును ఎంచుకోవాల్సి ఉండటంతో నాణ్యమైన, మేటి ఆటగాళ్లను చేజిక్కించుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలతో బరిలో దిగనున్నాయి. ఈ వేలంలో ఏమైనా జరగొచ్చు. ఎన్నాళ్ల నుంచో తమ దృష్టి ఉన్న ప్రత్యర్థి జట్టులోని కీలక ఆటగాళ్లను తన్నుకుపోయేందుకు ఫ్రాంచైజీలకు ఇదే మంచి అవకాశం. పదేళ్ల తొలి అంకం తర్వాత ఈ సీజన్ ఐపీఎల్ కొత్త మజాను చూపించనుంది. తాజా విధివిధానాల ప్రకారం ప్రతీ జట్టు ఐదుగురు ప్రధాన ఆటగాళ్లను (రిటెయిన్+ఆర్‌టీఎం) అట్టిపెట్టుకోవచ్చు. దీనిప్రకారం ఇప్పటికే 18 మంది ఆటగాళ్లను ఆయా జట్లు రిటెయిన్ చేసుకోవడంతో మిగతా 182 స్థానాల కోసం వేలం జరుగనుంది. ఇందులో 578 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత్ నుంచి 361 మంది వేలంలో పాల్గొననున్నారు. ఇంగ్లండ్‌కు చెందిన 25 మంది ఆటగాళ్లు వేలానికి అందుబాటులో ఉన్నారు. ప్రతీ జట్టుకు రూ. 80 కోట్లను బడ్జెట్‌గా కేటాయించారు. దీనిలో కొంత రిటెయిన్ పాలసీ ద్వారా ఇప్పటికే ఆయా ఫ్రాంచైజీలు ఖర్చు చేశాయి. ప్రతీజట్టు గరిష్టంగా 25 మందిని, కనిష్టంగా 18 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక జట్టులో కేవలం 8 మంది విదేశీ ఆటగాళ్లు మాత్రమే ఉండాలి.

మార్క్యూ ఆటగాళ్లు: స్టోక్స్, అశ్విన్, శిఖర్ ధావన్, మిచెల్ స్టార్క్, క్రిస్ గేల్, డ్వేన్ బ్రేవో, డు ప్లెసిస్, పొలార్డ్, రహానే, గంభీర్, షకీబుల్ హసన్, మ్యాక్స్‌వెల్, జో రూట్, హర్భజన్, యువరాజ్, విలియమ్సన్.



క్రిస్‌గేల్ · స్టోక్స్ · బ్రేవో · పొలార్డ్ · ధావన్ · అశ్విన్

రిటెయిన్ తర్వాత ఫ్రాంచైజీల వద్ద మిగిలిన బడ్జెట్

- చెన్నై సూపర్ కింగ్స్: రూ. 47 కోట్లు. (ధోని, రైనా, జడేజా)
- ఢిల్లీ డేర్ డెవిల్స్: రూ. 47 కోట్లు (శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, క్రిస్ మోరిస్)
- కోల్‌కతా నైట్ రైడర్స్: రూ. 59 కోట్లు (రసెల్, సునీల్ నరైన్)
- కింగ్స్ ఎలెవన్ పంజాబ్: రూ. 67.5 కోట్లు (అక్షర్ పటేల్)
- ముంబై ఇండియన్స్: రూ. 47 కోట్లు (రోహిత్, హార్దిక్, బుమ్రా)
- రాజస్తాన్ రాయల్స్: రూ. 67.5 కోట్లు (స్టీవ్ స్మిత్)
- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రూ. 49 కోట్లు (కోహ్లి, సర్ఫరాజ్ ఖాన్, డివిలియర్స్)
- సన్‌రైజర్స్ హైదరాబాద్: రూ. 59 కోట్లు (వార్నర్, భువనేశ్వర్)

ఇతర విశేషాలు...

- **36** రూ. 2 కోట్ల కనీస ధరలో వేలంలోకి రానున్న ఆటగాళ్లు.
- **32** రూ. 1.5 కోట్ల కనీస ధరతో వేలంలోకి వచ్చే ఆటగాళ్లు.
- **31** రూ. 1 కోటి కనీస ధరతో వేలంలో ఉన్న ఆటగాళ్లు.
- **298** భారత్‌కు చెందిన అన్‌క్యాప్డ్ (జాతీయ జట్టుకు ఆడనివారు) క్రికెటర్లు.
- **34** ఇతర దేశాలకు చెందిన అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు.
- **2** అసోసియేట్ దేశాలకు చెందిన క్రికెటర్లు

ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఖరీదైన ఆటగాళ్లు

ప్లేయర్	జట్టు	ఏడాది	మొత్తం
కోహ్లి	బెంగళూరు	2018	రూ. 17 కోట్లు
యువరాజ్	ఢిల్లీ	2015	రూ. 16 కోట్లు
రోహిత్ శర్మ	ముంబై	2018	రూ. 15 కోట్లు
ధోని	చెన్నై	2018	రూ. 15 కోట్లు
రిషభ్ పంత్	ఢిల్లీ	2018	రూ. 15 కోట్లు
బెన్ స్టోక్స్	పుణే	2017	రూ. 14.5 కోట్లు
యువరాజ్	బెంగళూరు	2014	రూ. 14 కోట్లు
దినేశ్ కార్తీక్	ఢిల్లీ	2014	రూ. 12.5 కోట్లు
ధోని	పుణే	2016	రూ. 12.5 కోట్లు
వార్నర్	హైదరాబాద్	2018	రూ. 12.5 కోట్లు
స్టీవ్ స్మిత్	రాజస్తాన్	2018	రూ. 12.5 కోట్లు

డిమాండ్ ఉన్న టాప్-5 ఆటగాళ్లు

విదేశీ: బెన్ స్టోక్స్, క్రిస్ లిన్, జో రూట్, స్టార్క్, పొలార్డ్, మున్రో
భారత్: అశ్విన్, రహానే, కేదార్ జాదవ్, కుల్దీప్ యాదవ్, చహల్
అండర్–19 భారత ఆటగాళ్లు: పృథ్వీ షా, శుభ్‌మాన్ గిల్, అభిషేక్ వర్మ, శివమ్ మావి, నాగర్‌కోటి.

యువ భారత్ జోరు

క్వార్టర్స్‌లో 131 పరుగులతో బంగ్లాదేశ్‌పై భారీ విజయం

ఈ నెల 30న పాకిస్తాన్‌తో సెమీస్ పోరు ● అండర్–19 ప్రపంచ కప్




శుభ్‌మాన్

క్వీన్స్‌టౌన్: ఏదశలోనూ ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకోకుండా... నిర్లక్ష్యానికి తావివ్వకుండా... సమష్టి ప్రదర్శన కనబరిచిన యువ భారత జట్టు అండర్–19 ప్రపంచ కప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌తో శుక్రవారం జరిగిన చివరి క్వార్టర్ ఫైనల్లో భారత్ 131 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటవ్వగా... బంగ్లాదేశ్ 42.1 ఓవర్లలో 134 పరుగులకు కుప్పకూలింది. ఈనెల 30న జరిగే రెండో సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది. 29న జరిగే తొలి సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్‌తో ఆస్ట్రేలియా ఆడుతుంది.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ కెప్టెన్ పృథ్వీ షా (54 బంతుల్లో 40; 5 ఫోర్లు), 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' శుభ్‌మాన్ గిల్ (94 బంతుల్లో 86; 9 ఫోర్లు), హార్విక్ దేశాయ్ (34), ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మ (49 బంతుల్లో 50; 6 ఫోర్లు) రాణించడంతో ఒక దశలో 215/4తో పటిష్ట స్థితిలో కనిపించింది. కానీ... చివర్లో బంగ్లా బౌలర్లు చెలరేగడంతో 50 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన టీమిండియా 265 పరుగులకే పరిమితమైంది. అనంతరం కష్టసాధ్యంకాని లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత్ బౌలర్లు బెంబేలెత్తించారు. కమలేశ్ నాగర్‌కోటి (3/18), శివమ్ మావి (2/27), అభిషేక్ శర్మ (2/11) రాణించి బంగ్లాదేశ్ పతనాన్ని శాసించారు.

ఆసీస్‌ను గెలిపించిన బౌలర్లు

నాలుగో వన్డేలో ఇంగ్లండ్ ఓటమి



కమిన్స్

అడిలైడ్: ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా ...ఇంగ్లండ్‌తో శుక్రవారం జరిగిన నాలుగో వన్డేలో మూడు వికెట్ల తేడాతో నెగ్గింది. ఆసీస్ పేసర్లు కమిన్స్ (4/24), హాజల్‌వుడ్ (3/39), టై (3/33) ధాటికి ఇంగ్లండ్ 44.5 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. వోక్స్ (78; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం ఓపెనర్ ట్రావిస్ హెడ్ (107 బంతుల్లో 96; 15 ఫోర్లు) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా 37 ఓవర్లలో ఏడు వికెట్లకు 197 పరుగులు చేసి గెలుపొందింది. చివరి వన్డే ఆదివారం పెర్త్‌లో జరుగనుంది.

విజేత పంజాబ్ రాయల్స్

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్–3లో డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ రాయల్స్ టైటిల్ నిలబెట్టుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో పంజాబ్ రాయల్స్ 6–3తో హరియాణా హ్యామర్స్‌ను చిత్తు చేసింది. ఏకపక్షంగా సాగిన పోరులో మరో రెండు బౌట్లు మిగిలి ఉండగానే పంజాబ్ విజయం సాధించింది.

ముస్తాక్ అలీ ట్రోఫీ విజేత ఢిల్లీ

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ దేశవాళీ టి20 ట్రోఫీని ఢిల్లీ జట్టు సొంతం చేసుకుంది. ఫైనల్లో ఢిల్లీ 41 పరుగులతో రాజస్తాన్‌పై నెగ్గింది. తొలుత ఢిల్లీ 6 వికెట్లకు 156 పరుగులు చేసింది. ఉన్ముక్త్ చంద్ (49 బంతుల్లో 53; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), గంభీర్ (23 బంతుల్లో 27; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం రాజస్తాన్ 19.1 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌటైంది.

స్వేచ్ఛా భారత్ దిశగా కదలండి

భావవ్యక్తీకరణ స్వేచ్ఛను కాపాడుకోవాలి

- కన్నడ సాహిత్యం గొప్ప సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించింది
- హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో కన్నడ రచయిత్రి ప్రతిభానందకుమార్
- భిన్న సంస్కృతుల సమ్మేళనం హైదరాబాద్: సీఎస్ ఎస్పీసింగ్



సదస్సులో మాట్లాడుతున్న ప్రతిభా నందకుమార్

సాక్షి, హైదరాబాద్: స్వేచ్ఛా భారత్ దిశగా సాహితీవేత్తలు, కవులు, రచయితలు ముందడుగు వేయాలని ప్రముఖ కన్నడ రచయిత్రి, సీనియర్ జర్నలిస్టు ప్రతిభా నందకుమార్ పిలుపునిచ్చారు. భిన్న ఆలోచనలను, విభిన్న సాహిత్యాలను సమాజం ప్రతిబింబించాలని, భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించే భావప్రకటనా స్వేచ్ఛను ఎప్పటికీ కోల్పోవద్దని ఆమె సూచించారు. శుక్రవారం బేగంపేట్ పబ్లిక్ స్కూల్‌లో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా 'కన్నడ సాహిత్యం అప్పుడు–ఇప్పుడు'అనే అంశంపై ప్రతిభా నంద కుమార్ కీలక ఉపన్యాసం చేశారు. సామాజిక పరిణామాలకు, మార్పులకు అనుగుణంగా కన్నడ సాహిత్యం ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఉందని, భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవడంలో కన్నడ సాహితీవేత్తలు మొదటి నుంచి ముందంజలో ఉన్నారని ఆమె చెప్పారు. ఇప్పుడు సమాజాన్ని ప్రతిబింబిస్తోన్న సోషల్ మీడియా కంటే బలమైన సాహిత్యాన్ని తాము దశాబ్దాల క్రితమే రాసినట్లు పేర్కొన్నారు.

కుచించుకుపోతున్న ప్రజాస్వామిక వాతావరణం

పద్మావత్ వంటి సినిమాను వ్యతిరేకించడం, అందులోని కథాంశాన్ని జీర్ణించుకోలేకపోవడం ఆశ్చర్యంగా ఉందని, ఇలాంటి అసహనం తాము ఎప్పుడూ ఎదుర్కోలేదని ఆమె విస్మయం వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాతావరణం రోజురోజుకూ కుచించుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు, వివక్ష కొనసాగుతున్న రోజుల్లోనే తాము స్వేచ్ఛగా సాహితీ సృజన చేశామని, 35 ఏళ్ల క్రితమే తాను ఎరోటిక్ పొయెట్రీ రాసినట్లు ఆమె గుర్తుచేశారు. కొంతమంది జ్యోతిష్య పండితులు మహిళల పట్ల చాలా చులకనగా మాట్లాడుతున్నారని, ఫలానా రాశి మహిళలు అత్యాచారాలకు గురయ్యే అవకాశం ఉందంటూ చేస్తోన్న ప్రకటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, దీనిపై తాను 'ఆగ్రహం'అనే కవిత రాసినట్లు గుర్తు చేశారు. సృజనాత్మక రచనలకు సోషల్‌మీడియా సరికొత్త వేదికగా మారుతోందని, స్వేచ్ఛాయుత వాతావరణం కోసం, వివక్ష, పురుషాధిపత్యం లేని సమాజం కోసం నేటితరం రచయితలు కృషి చేయాలని కోరారు.

భిన్న సంస్కృతులకు నిలయం..

లిటరరీ ఫెస్టివల్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఎస్పీ సింగ్ మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతులకు, కళలకు హైదరాబాద్ నిలయమని అన్నారు. మగ్దూం మొహియుద్దీన్, సరోజినీనాయుడు, డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి ఎందరో మహానుభావులు హైదరాబాద్ నుంచి తమ కలాన్ని, గళాన్ని ప్రపంచానికి వినిపించారని చెప్పారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ అంతర్జాతీయ సాహిత్యంతో పాటు, తెలంగాణ సాహిత్య సంస్కృతులకు వేదిక కావాలని ఆకాంక్షించారు. కొత్తతరం రచయితలు, కవులు, సాహితీవేత్తలు ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. స్పెయిన్ రాయబార కార్యాలయం డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్ ఎడ్యురో సాంచెజ్ మొరాకో మాట్లాడుతూ.. స్పానిష్ భాషకు తెలుగు భాషకు పోలికలున్నాయని, తెలుగులో ఉన్నట్లుగానే స్పానిష్‌లోనూ మాండలికాలు ఉన్నాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల రెండు ప్రాంతాల మధ్య ఒక చక్కటి సాంస్కృతిక వాతావరణం నెలకొంటుందని చెప్పారు. ప్రఖ్యాత నర్తకి సోనాల్‌మాన్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో మరెక్కడా లేని వైవిధ్యభరిత సంస్కృతి, అత్యున్నత సంప్రదాయాలు, విలువలు ఒక్క భారత్‌లోనే ఉన్నాయని, భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశం గొప్పదనమని చెప్పారు. పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రారంభోత్సవ సభలో కన్నడంలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు.





శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన లిటరరీ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న సీఎస్ ఎస్పీ సింగ్

చర్చాగోష్టులు.. సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం స్పెయిన్ మహిళా రచయిత్రుల సాహిత్యంపైనా, పలువురు రచయితలు రాసిన పుస్తకాలపైనా చర్చాగోష్టులు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన దళిత సామాజిక కార్యకర్త సరస్వతి వంట చేస్తూ చెప్పిన రామాయణం, దక్కనీ ఉర్దూలో సాగిన మిజాహియా ముషాయిరా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 70 మంది కళాకారులు నిర్వహించిన కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, సినీ దర్శకుడు డాక్టర్ కిన్నెరమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నరసింహన్ దంపతులు, సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎంలు కడియం, మహమూద్ అలీ, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఏపీ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

ఆహ్లాదంగా గవర్నర్ తేనీటి విందు

- హాజరైన సీఎం కేసీఆర్.. కదిలివచ్చిన తెలంగాణ కేబినెట్
- ఏపీ సీఎం చంద్రబాబు గైర్హాజరు
- పాల్గొన్న పలువురు ప్రముఖులు

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఇచ్చిన తేనీటి విందు ఆహ్లాదంగా సాగింది. శుక్రవారం సాయంత్రం గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో పాటు తెలంగాణ మంత్రులు, ఏపీ మంత్రులు, మాజీ సీఎంలు, ప్రముఖులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు హాజరు కాలేదు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో రాజ్‌భవన్‌లో సందడి నెలకొంది. తెలంగాణ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, బీజేపీఎల్పీ నేత కిషన్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఎంఐఎం నుంచి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ విందులో పాల్గొన్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రారంభమైన విందు.. రాత్రి ఏడు గంటల దాకా కొనసాగింది. గవర్నర్ నరసింహన్ దంపతులు మంత్రులతో పాటు దాదాపు అందరినీ పలకరిస్తూ కలియదిరిగారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు కేసీఆర్ ఉన్నారు. అనంతరం కొద్దిసేపు గవర్నర్‌తో భేటీ అయ్యారు.

తేనీటి విందుకు కాంగ్రెస్ దూరం..

సీఎల్పీ నేత జానారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విందుకు హాజరు కాలేదు. ఇటీవల గవర్నర్, కాంగ్రెస్ మధ్య జరిగిన వివాదం కారణంగానే వీరు హాజరు కాలేదని ప్రచారం జరిగింది. గవర్నర్ ఇచ్చే తేనీటి విందుకు హాజరు కాకూడదని పార్టీ అంతర్గతంగా చర్చించి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయినా, రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ మంత్రి దానం నాగేందర్ విందుకు వచ్చారు. పార్టీ నిర్ణయం తనకు తెలియదని, గాంధీభవన్ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతోనే హాజరయ్యానని, పార్టీ నిర్ణయం తెలిసి ఉంటే హాజరయ్యే వాడిని కాదని ఆనంద్ భాస్కర్ చెప్పారు. తేనీటి విందుకు తెలంగాణ మంత్రివర్గం దాదాపుగా కదిలి వచ్చింది. గణతంత్ర వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కచ్చితంగా హాజరు కావాలని పార్టీ నుంచి సమాచానమిచ్చారు. ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యేలు తిరిగి జిల్లాలకు వెళ్లిపోగా, మంత్రులు సాయంత్రం జరిగిన విందుకు హాజరయ్యారు. డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, హరీశ్ రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జూపల్లి కృష్ణారావుతో పాటు మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు వినోద్‌కుమార్, బాల్క సుమన్, రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏపీ నుంచీ..

ఏపీ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మంత్రులు కామినేని శ్రీనివాస్, ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రులు కె.రోశయ్య, నాదెండ్ల భాస్కర్‌రావు, మండలి మాజీ చైర్మన్ చక్రపాణి, యలమంచిలి శివాజీ, మాజీ ఎంపీ సుబ్బిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంతర్రాష్ట్ర వాణిజ్య ఆదాయానికి గండి

- ఆరు నెలలుగా ఐజీఎస్టీ ఆదాయంలో క్షీణత
- ఆగస్టులో రూ.931 కోట్లు.. జనవరిలో రూ.719 కోట్లు
- అంతర్రాష్ట్ర అమ్మకాలు తగ్గడమే కారణమంటున్న అధికారులు
- బ్లాక్ మార్కెట్ లావాదేవీలతోనూ తగ్గుతున్న ఆదాయం
- మొత్తం ఆదాయం చూస్తే రాష్ట్ర జీఎస్టీలో పెరుగుదల

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత అంతర్రాష్ట్ర వాణిజ్య ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. గత ఆరునెలల్లో పన్ను వసూళ్లను పరిశీలించగా తేలిన ఐజీఎస్టీ గణాంకాలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన జూలై నెల తర్వాత ఆగస్టులో ఏకంగా రూ.931.84 కోట్ల ఆదాయం ఐజీఎస్టీ కింద రాగా, జనవరిలో ఇప్పటివరకు కేవలం రూ. 719.36 కోట్లే వచ్చిందని పన్నుల శాఖ లెక్కలు చెబుతున్నాయి. నెలవారీ వసూళ్లను పరిశీలిస్తే అంతర్రాష్ట్ర అమ్మకాలు గత ఆరునెలల్లో పడిపోయాయని ఆ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కానీ, మొత్తం మీద రాష్ట్ర ఆదాయంలో మాత్రం తగ్గుదల కనిపించడం లేదు. ముఖ్యంగా రాష్ట్రానికి వచ్చే ఎస్‌జీఎస్టీ ఆదాయంలో వృద్ధి కనిపిస్తోంది. జనవరి నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం నమోదయ్యే అవకాశాలున్నాయని పన్నుల శాఖ అంచనా వేస్తోంది.

ప్రతి నెలా తగ్గుముఖమే

జీఎస్టీ చట్టం ప్రకారం వస్తువుల అమ్మకాలు లేదా సేవలకు గాను వచ్చే పన్నును రెండు భాగాలు చేశారు. అందులో రాష్ట్ర జీఎస్టీ(ఎస్‌జీఎస్టీ), కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ)ల కింద చెరిసగం పన్నును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటాయి. దీనికి తోడు ఒక రాష్ట్రంలో తయారయి ఇంకో రాష్ట్రంలో అమ్ముడయ్యే వస్తువులకు కట్టే పన్నును వినియోగం జరిగే రాష్ట్రాలకు పంపే విధంగా ఐజీఎస్టీ పేరుతో మూడో భాగం కూడా చేశారు. ఈ ఐజీఎస్టీ కింద రాష్ట్రానికి వస్తున్న పన్ను లెక్కలను పరిశీలిస్తే ఆగస్టు నుంచి జనవరి వరకు ప్రతి నెలా క్షీణతే కనిపించింది. ఆగస్టులో రూ.931.84 కోట్లు రాగా, జనవరి నెలలో రూ.719.36 కోట్లు వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. అదే సెప్టెంబర్‌లో రూ.863.30 కోట్లు, అక్టోబర్‌లో రూ.853.96 కోట్లు, నవంబర్‌లో 801.98 కోట్లు, డిసెంబర్‌లో మరీ తక్కువగా 697.40 కోట్లు ఐజీఎస్టీ కింద వసూలు కావడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అంతర్రాష్ట్ర అమ్మకాలు తగ్గాయని పన్నుల శాఖ అధికారులంటున్నారు. అయితే, మన రాష్ట్రంలో తయారయిన వస్తువులు ఇతర రాష్ట్రాలలో ఎక్కువగా అమ్ముడుపోయినా ఆ రాష్ట్రాలకు కట్టాల్సిన పన్ను మినహాయిస్తే కూడా ఐజీఎస్టీ ఆదాయం తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు ఇతర రాష్ట్రాల వ్యాపారులు మన రాష్ట్రంలోని బ్లాక్‌మార్కెట్ల ద్వారా అమ్మకాలు జరిపినా ఐజీఎస్టీ తగ్గిపోతుందని, దీనిపై పన్నుల శాఖ విశ్లేషణ జరుపుతోందని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

అక్టోబర్‌లో రికార్డు ఆదాయం

రాష్ట్రానికి వచ్చే ఎస్‌జీఎస్టీ లెక్కలను పరిశీలిస్తే మాత్రం ఆదాయంలో వృద్ధి కనిపిస్తోంది. ఎస్‌జీఎస్టీ కింద ఆగస్టులో రూ.840.79 కోట్లు రాగా, జనవరిలో ఇప్పటికే రూ.780.32 కోట్లు సమకూరాయి. కాగా, ఎస్‌జీఎస్టీ కింద అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో రూ.847.61 కోట్ల ఆదాయం వచ్చింది. జనవరిలో పన్ను వసూళ్లకు ఇంకా వారం రోజులు ఉన్నందున అక్టోబర్‌ను మించి ఎస్‌జీఎస్టీ ఆదాయం వచ్చే అవకాశం ఉందని పన్నుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక సెస్ కింద రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో కూడా ఎంతో కొంత మెరుగుదల కనిపిస్తుండడంతో పన్నుల శాఖ వర్గాలు ఊపిరి పీల్చుకుంటున్నాయి.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఎండగడతాం

పరుష పదజాలానికి కొలమానం ఏంటి: కోదండరాం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని కోర్టుల ప్రమేయం లేకుండా అరెస్టు చేసేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు చేసే వారిపైనా చర్యలు తీసుకోబోతున్నారని, 'పరుష పదజాలం'అంటే కొలమానమేంటని ప్రశ్నించారు. రాజకీయ కక్షతో తీసుకునే ఇలాంటి నిర్ణయాలను ఎండగడతామన్నారు. ఒంటేరు ప్రతాపరెడ్డి, మందకృష్ణ మాదిగ, అద్దంకి దయాకర్‌పై రాజకీయ కక్షతోనే కేసులు పెట్టారని ఆరోపించారు. శుక్రవారం టీజేఏసీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫిబ్రవరిలో పార్టీపై ప్రకటన చేస్తామన్నారు.

సందడిగా పశుసంక్రాంతి

వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన పశువులు
ప్రత్యేక ఆకర్షణగా కొంగనూరు మరుగుజ్జు ఎద్దు

హైదరాబాద్: పశుసంక్రాంతితో హైదరాబాద్ నగరశివారు గండిపేట మండలం నార్సింగి గ్రామం సందడిగా మారింది. సంక్రాంతి పండుగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం వివిధ రాష్ట్రాల నుంచి గేదెలను తెచ్చి వ్యాపారులు ఇక్కడ అమ్ముతారు. గుజరాత్, హరియాణా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ముర్రా, దులియా, ఆంధ్రా గుజ్జారీలతో పాటు దేశీ ఆవులు అమ్మకానికి తరలి వచ్చాయి. ఇందులో మూడు అడుగుల లోపు ఎత్తున్న కొంగనూరు మరుగుజ్జు ఎద్దు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడాది ఇక్కడ పొట్టేళ్లు జాడే కనిపించలేదు.

రికార్డు ధర

దులియా జాతి గేదె రూ.2.10 లక్షలు పలకగా ముర్రాజాతి గేదె రూ.2లక్షలు పలికింది. నార్సింగి సమీపంలో పాల వ్యాపారి బి.భరత్ వాటిని దక్కించుకున్నారు. పూటకు 20లీటర్ల వరకు పాలు ఇచ్చే గేదెలు కావడంతో వాటిని కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. వీటితో ఓ దున్నపోతు సైతం రూ.2లక్షల ధర పలికింది.

దేశవ్యాప్త గుర్తింపు : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగిలో జరిగే పశుసంక్రాంతికి దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఇబ్బందులు పడేకంటే స్థానికంగా కొనుగోలు చేస్తేనే నయమనే ఉద్దేశంతో ఇక్కడ కొనుగోలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ తలారి మల్లేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పత్తి ప్రవీణ్‌కుమార్, మంచర్ల మమత శ్రీనివాస్, డైరెక్టర్లు తదితరులు ఇక్కడకు వచ్చిన వారిలో ఉన్నారు.

పక్క రాష్ట్రాలనుంచి కంది పరవళ్లు

- రెండు జిల్లాల్లోనే దాదాపు పూర్తయిన కేంద్ర కోటా కొనుగోళ్లు
- ఇతర జిల్లాల రైతులకు ఎంఎస్పీ ఇవ్వలేని పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: కేంద్రం అనుమతిచ్చిన కందుల కొనుగోళ్ల లక్ష్యం ఒకట్రెండు జిల్లాలకే పరిమితమైందా? ఇలాగైతే మిగిలిన జిల్లాల రైతుల పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మన రాష్ట్ర రైతుల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సరిహద్దు జిల్లాల రైతులు పెద్దఎత్తున కంది తీసుకొస్తుండటంతో కేవలం రెండు జిల్లాల్లోనే కేంద్ర కోటా ప్రకారం కొనుగోళ్లు పూర్తయ్యాయంటున్నారు. దీనిపై ఇటీవల జరిగిన సమీక్షలో మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు సంబంధిత అధికారులపై మండిపడ్డట్లు సమాచారం.

మార్కెట్లో ధర లేకపోవడంతో...

రైతులు పండించిన కందినంతా కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడంలేదు. ఉత్పత్తిలో 20 శాతంలోపే కొనుగోలు చేస్తామని కేంద్రం ప్రకటించడంతో కంది రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రం ప్రకటించిన కంది ఎంఎస్పీ క్వింటాలుకు రూ.5,450 కాగా, ప్రస్తుతం మార్కెట్లో వెయ్యికిపైగా తక్కువ పలుకుతుంది. మహారాష్ట్ర, కర్ణాటకలో పరిస్థితి ఘోరంగా ఉంది. దీంతో అక్కడి రైతులు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు కందిని తరలిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాదికి రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల కంది ఉత్పత్తవుతోందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం మాత్రం 33,500 మెట్రిక్ టన్నులే ఎంఎస్పీకి కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో, పూర్వ జిల్లాల ప్రకారం రెండు చోట్లే దాదాపు 30 వేల మెట్రిక్ టన్నులు కొన్నట్లు తేలిందని మార్కెటింగ్‌శాఖ వర్గాలు తెలిపాయి. మిగిలిన జిల్లాల్లో మరో 18 వేల మెట్రిక్ టన్నుల వరకు కొన్నారు. కేంద్ర కోటా ప్రకారం 33,500 మెట్రిక్ టన్నులు కాకుండా మిగిలినదాన్ని రైతుల నుంచి తక్కువకే కొన్నట్లు చెబుతున్నారు. కొనుగోలు పరిమితిని లక్షన్నర మెట్రిక్ టన్నులకు పెంచాలని మంత్రి కోరినా, అదనంగా మరో 20 వేల మెట్రిక్ టన్నులు మాత్రం కొనుగోలు చేస్తానని కేంద్రం బుధవారం ప్రకటించింది.



Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911, RNI Regn No. TELTEL/2008/23792